శుక్రవారం 14-11-2025

‘తెలుగువారి గుండెచప్పుడు
వినగలిగే ఆత్మీయుడిగా ఉంటే
చాలు... నా జన్మ ధన్యమైనట్టే’

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 18
సంచిక: 233

SIMULTANEOUSLY PRINTED AT GUNTUR | MANGALAGIRI | VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

సురేఖ ‘డబుల్ ధమాకా’

ఆసియా ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో 2 స్వర్ణాలు గెలిచిన ఏపీ ప్లేయర్ - 13లో

కలలకు పది రంగులు

బాలల దినోత్సవం సందర్భంగా చాచా నెహ్రూ మెచ్చే పదిరకాల థీమ్స్ - 12లో



గుజరాత్ తీరంలో ‘త్రిశూల్’

భారత త్రివిధ దళాలు సంయుక్తంగా త్రిశూల్ పేరుతో గుజరాత్‌లోని సౌరాష్ట్ర సముద్ర తీరంలో విన్యాసాలు నిర్వహించాయి.

వివరాలు 6లో ▸

ముకుల్‌రాయ్‌పై అనర్హత వేటు

బీజేపీ నుంచి టీఎంసీలోకి ఫిరాయించిన ముకుల్ రాయ్‌ను ఎమ్మెల్యేగా అనర్హుడిగా ప్రకటిస్తూ కలకత్తా హైకోర్టు తీర్పు ఇచ్చింది.

వివరాలు 6లో ▸

నేడే బిహార్ తీర్పు

బిహార్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు నేడు వెలువడనున్నాయి. 38 జిల్లాల్లో 46 కౌంటింగ్ కేంద్రాలు సిద్ధం చేశారు.

వివరాలు 6లో ▸

అమెరికా షట్‌డౌన్‌కు తెర

అమెరికా చరిత్రలో ఎన్నడూ లేని విధంగా 43 రోజులపాటు కొనసాగిన షట్‌డౌన్ ఎట్టకేలకు ముగిసింది.

వివరాలు 6లో ▸

పెట్టుబడుల ‘కోత’లు..

ఇచ్చట పాత ఒప్పందాలు

మళ్లీ కుదుర్చుకోబడును!

2023లో వైఎస్ జగన్ ప్రభుత్వంలోనే ఏబీసీ, హీరో ఫ్యూచర్స్ ఎనర్జీస్, రెన్యూ పవర్ ఒప్పందాలు

రూ.97,500 కోట్ల పెట్టుబడికి నాడే ముందుకొచ్చిన రెన్యూ పవర్

ఏబీసీ లిమిటెడ్ రూ.1,20,000 కోట్లు, హీరో ఫ్యూచర్ ఎనర్జీస్ రూ.30,000 కోట్ల పెట్టుబడులు పెట్టేలా గత ప్రభుత్వం లోనే కుదిరిన ఒప్పందాలు

ఇప్పుడు వాటినే మరోసారి.. అది కూడా తక్కువకే కుదుర్చుకుని ఒక రోజు ముందే బాబు సర్కారు హడావుడి

రూ.3.65 లక్షల కోట్ల విలువైన 35 ఒప్పందాలంటూ ప్రచార గిమ్మిక్కులు

2 లో



Sumant Sinha
Founder, Chairman and CEO, ReNew | T...
2 ans

A favourable business environment, with a focus on attracting investments, promoting entrepreneurship, and creating job opportunities — Andhra Pradesh offers several advantages to investors.

The state has a vision to make itself a gateway to Southeast Asia by 2050 and emerge as a preferred global destination for investments.

Thank you, Chief Minister YS Jagan Mohan Reddy for a productive discussion yesterday at the curtain raiser of the Andhra Pradesh Global Investors Summit.

వైఎస్సార్‌సీపీ హయాంలో జరిగిన ఒప్పందంపై నాటి సీఎం వైఎస్ జగన్‌తో భేటీ అనంతరం రెన్యూ పవర్ చైర్మన్, సీఈవో సుమంత్ సిన్హా పోస్టు

ఉత్త ఒప్పందాలే

రూ.లక్షల కోట్ల పెట్టుబడులంటూ ప్రచారం.. నాడూ నేడూ అదే సినిమా!

టీడీపీ హయాంలో 2014-19 మధ్య రూ.19.6 లక్షల కోట్ల విలువైన 1,761 ఒప్పందాలు.. 3 సదస్సుల్లో అమల్లోకి వచ్చింది కేవలం 13 శాతమే

2 లో

క్రెడిట్ చోరీతో చిక్కిన చినబాబు!

3 లో



GOVERNMENT OF ANDHRA PRADESH
ABSTRACT

Energy Department – Proposal for setting up of 300 MW of Wind Power by M/s. ReNew Vyoman Power Private Limited, New Delhi -Allotment of 300 MW Wind Power Projects in Ananthapuramu and Sri Sathya Sai Districts – Orders – Issued.

ENERGY (POWER.II) DEPARTMENT

G.O.Ms.No.15 Dated:20.06.2023
Read the following

రెన్యూ పవర్‌కు 2023 జూన్ 20న 300 మెగావాట్ల పవన విద్యుత్ ప్రాజెక్ట్ స్థాపనకు అనుమతిస్తూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జారీ చేసిన జీవో 15

క్రెడిట్ చోరీలో మీకు మీరే సాటి

సీఎం చంద్రబాబుపై వైఎస్ జగన్ మండిపాటు

మా హయాంలో కట్టిన ఇళ్లను మీరు కట్టినట్లు చెప్పకుంటారా?

- 18 నెలల్లో ఒక్కరికి ఒక్క సెంటు స్థలమైనా ఇచ్చారా?
- ఒక్కరికి ఒక్క ఇల్లు అయినా మంజూరు చేశారా? పైసా ఖర్చు చేశారా?
- మా హయాంలో ఇంటి స్థలాలు ఇచ్చి, ఇళ్లు మంజూరు చేసి, నిర్మాణంలో ఉన్న ఇళ్లను మీరే కట్టేశామంటారా?
- ఇతరుల కష్టాన్ని తన గొప్పతనంగా చెప్పుకునేవాడు నాయకుడు కాదు.. నాటకాల రాయుడు అంటారు
- మీ కథ, మీ స్క్రీన్‌ప్లే, మీ దర్శకత్వంలో నడుస్తున్న క్రెడిట్ చోరీ స్కీం చాలా బాగుంది
- మా హయాంలో 71,800 ఎకరాల్లో 31.19 లక్షల ఇళ్ల పట్టాలు అక్కచెల్లెమ్మల పేరుతో రిజిస్ట్రేషన్
- 21.75 లక్షల ఇళ్లు మంజూరు.. కోవిడ్ సంక్షోభం ఎదుర్కొని 9 లక్షలకుపైగా ఇళ్ల నిర్మాణం పూర్తి
- 2023 అక్టోబర్ 12న ఒకే రోజు 7,43,396 ఇళ్లలో గృహ ప్రవేశాలతో చరిత్ర సృష్టించాం
- మీరు ప్రారంభించామని చెప్పుకుంటున్న 3,00,092 ఇళ్లలో ఒక్కటి కూడా మీరు మంజూరు చేయలేదు
- ఇవన్నీ మా హయాంలోనే పూర్తయ్యే దశలో, శ్లాబ్ లెవల్‌లో, శ్లాబ్ కింద స్థాయిలో ఉన్నవే

3 లో

వైఎస్సార్‌సీపీ నేతలపై

అక్రమ కేసులు

- ట్రాఫిక్‌కు అంతరాయం, నిబంధనలు ఉల్లంఘించారని నెపం
- గుంటూరులో మాజీ మంత్రి అంబటి, తాడిపత్రిలో మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి
- సంతనూతలపాడులో 77 మందిపై, శ్రీకాకుళంలో 200 మందిపై అక్రమ కేసు
- పలాసలో మాజీ మంత్రి సీదిరి అప్పలరాజుతో పాటు మరో 30 మందిపై..

14 లో

ఆందోళన బాటలో

అంగన్‌వాడీలు

నేడు సచివాలయాల్లో వినతి పత్రాలు

10 లో

32 చోట్ల మారణహోమం!

4 ప్రధాన నగరాలు సహా పలు ప్రాంతాల్లో భారీ పేలుళ్లకు పక్కా ప్రణాళిక

అల్–ఫలాహ్ వర్సిటీ బాయ్స్ హాస్టల్ 13వ నంబర్ గదిలో పథక రచన

గదిలో డైరీలు లభ్యం... నవంబర్ 8 నుంచి 12 వరకు మార్కింగ్

అందులో 25 మంది అనుమానిత ఆత్మాహుతి బాంబర్ల వివరాలు

సొంతంగా సిగ్నల్ యాప్ గ్రూప్ సృష్టించిన ఆత్మాహుతి బాంబర్ ఉమర్

బాంబుల తయారీ కోసం 26 క్వింటాళ్ల ఎన్‌పీకే ఎరువుల కొనుగోలు

రూ.26 లక్షల నిధుల సమీకరణ.. ఢిల్లీలో పేలుడు కేసులో మరో ఇద్దరు డాక్టర్ల అరెస్ట్.. ఉమర్‌కు చెందిన మూడో కారూ స్వాధీనం

6 లో

ఎన్నాళ్లకు నిజం మాట్లాడారు సార్! వేరెవరో చేయించిన వాటిని మీరు ప్రమోట్ చేసుకుంటున్నారన్నమాట!!

ఎన్‌కౌంటర్ చేసి

పాతరేస్తాం

నా తమ్ముడు సతీష్‌పై సీఎం కార్యాలయంలో ఫిర్యాదు చేస్తారా?

మాల.. లం.. అని దూషిస్తూ బెదిరించిన డీఐజీ కోయా ప్రవీణ్

- డీజీపీ కార్యాలయంలో టీడీపీ దళిత నేత సుధా మాధవి ఫిర్యాదు
- పోలీసులు నన్ను, నా భర్తను కిడ్నాప్ చేసి వేధించారు.. కులం పేరుతో దూషించారు.. తీవ్రంగా కొట్టారు
- బలవంతంగా వీడియో వాంగ్మూలం రికార్డు చేయించారు
- నా పవర్ చూశారా అంటూ టీడీపీ ఎన్‌ఆర్‌ఐ నేత వేమన సతీష్ బెదిరించారు
- డీఐజీ, సీఐ నాగార్జున, వేధించిన వారందరిపై చర్యలు తీసుకోవాలి

11 లో

డీజీపీ కార్యాలయం వద్ద మీడియాతో మాట్లాడుతున్న టీడీపీ దళిత నేత సుధామాధవి

● పెట్టుబడుల 'కోత'లు ..

ఇచ్చట పాత ఒప్పందాలు

మళ్లీ కుదుర్చుకోబడును!

2023లో వైఎస్ జగన్ ప్రభుత్వంలోనే ఏబీసీ, హీరో ఫ్యూచర్స్ ఎనర్జీస్, రెన్యూ పవర్ ఒప్పందాలు

రూ.97,500 కోట్ల పెట్టుబడికి నాడే ముందుకొచ్చిన రెన్యూ పవర్


File No. ENE01-APREOMISC/10/2022-POWER-II-Part(2)
GO MS/14/2024/ENE01-Energy

GOVERNMENT OF ANDHRA PRADESH
ABSTRACT

Energy Department – Proposal for setting up of 600 MW Wind Power Project by M/s ReNew Vikram Shakti Pvt. Ltd. – Allotment of 600 MW Wind Power Project in Sri Sathya Sai and Ananthapuramu Districts – Orders – Issued.

ENERGY (POWER.II) DEPARTMENT

G.O.Ms.No.16 | Dt:03-02.2024

Read the following:-

1. Proposal dated 14.03.2022 of M/s. ReNew Vikram Shakti Pvt. Ltd.
2. From the Vice Chairman & Managing Director, New and Renewable Energy Development Corporation of Andhra Pradesh (NREDCAP), vide letter No. NREDCAP/WE/APREEP-202/RVSPL/001704/2022 dated 29.06.2022.
3. Govt. Letter. No. ENE01-APREOMISC/10/2022-POWER-II, dated 07.07.2022

రెన్యూ పవర్‌కు 2024 ఫిబ్రవరి 5న 600 మెగావాట్ల పవన విద్యుత్ స్థాపనకు అంగీకరిస్తూ వైఎస్ జగన్ ప్రభుత్వం విడుదల చేసిన జీవో నం.16


GOVERNMENT OF ANDHRA PRADESH
ABSTRACT

Energy Department – Allocation of 600 MW Wind Power project at Dhone Wind area in Kurnool and Nandyal Districts by M/s ReNew Vikram Shakti Private Limited under AP Integrated Clean Energy Policy 2024 – Orders – Issued.

G.O.MS.No.56 | Dated 28.07.2025

Shakti Pvt. Ltd from the earlier sanctioned Government Order.

6. After detailed examination of the proposal of M/s. ReNew Vikram Shakti Pvt. Ltd in consultation with various stakeholders, Government hereby issue the following orders duly cancelling the orders issued in the G.O. 1st read above wherein orders issued allocating 600 MW Wind Power projects in Ananthapuramu and Sri Sathya Sai Districts to M/s. ReNew Vikram Shakti Pvt. Ltd.

రెన్యూ పవర్‌తో గత ప్రభుత్వం చేసుకున్న 600 మెగావాట్ల పవన విద్యుత్ ఒప్పందాన్ని 2025లో బాబు సర్కారు రద్దు చేసుకున్న జీఓ

సాక్షి, అమరావతి: అన్నీ పాత ఒప్పందాలే..! అందులోనూ గతంతో పోలిస్తే పెట్టుబడుల్లో భారీ కోతలు..! పెట్టుబడుల సదస్సుకు ఒకరోజు ముందుగానే గతంలో కుదిరిన ఒప్పందాలనే మళ్లీ మళ్లీ చేసుకుంటూ చంద్రబాబు సర్కారు సరికొత్త గారడీకి శ్రీకారం చుట్టింది. విశాఖలో శుక్ర, శనివారాల్లో సీఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్ నిర్వహిస్తుండగా.. ఒక రోజు ముందే గురువారమే పాత ఒప్పందాలే మరోసారి చేసుకుని రాష్ట్రానికి భారీ పెట్టుబడులు తెస్తున్నట్లు చంద్రబాబు సర్కారు ప్రచారం చేసుకోవడంపై పారిశ్రామిక వర్గాల్లో తీవ్ర విస్మయం వ్యక్తమవుతోంది. వైఎస్సార్ సీపీ హయాంలో 2023లో విశాఖలో జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో కుదిరిన ఒప్పందాలనే తిరిగి చేసుకుంటూ రాష్ట్రానికి కొత్తగా పెట్టుబడులను తెచ్చినట్లు చెప్పుకునేందుకు చంద్రబాబు సర్కారు ఆపసోపాలు పడింది. పాత ఒప్పందాలనే మళ్లీ మళ్లీ కుదుర్చుకుంటూ చంద్రబాబు సర్కారు చేస్తున్న హడావుడిని చూసి పారిశ్రామికవేత్తలు విస్తుపోతున్నారు. ఈ ప్రభుత్వం తమపై ఒత్తిడి చేయడంతో కాదనలేక తిరిగి ఒప్పందాలు చేసుకుంటున్నట్లు చెబుతున్నారు. సీఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్ కంటే ఒక రోజు ముందుగానే రూ.3.65 లక్షల కోట్ల విలువైన 35 ఒప్పందాలు చేసుకున్నట్లు అధికారులు వెల్లడించారు.

మూడూ పాత ఒప్పందాలే..
గతంతో పోలిస్తే పెట్టుబడుల్లో కోతలు

- 2023లో వైఎస్సార్ సీపీ అధికారంలో ఉండగా రాష్ట్రంలో రూ.2.35 లక్షల కోట్ల ఎన్టీపీసీ పెట్టుబడుల ఒప్పందం తర్వాత ఏబీసీ లిమిటెడ్‌తో రూ.1,20,000 కోట్ల ఒప్పందం అతి పెద్దదిగా నిలిచింది. ఇప్పుడు అదే సంస్థతో మళ్లీ ఒప్పందం కుదుర్చుకుని అదేదో కొత్త ఒప్పందంగా తాజాగా చంద్రబాబు సర్కారు ప్రచారం చేసుకుంది. ఏబీసీ గ్రూప్‌నకు చెందిన ఏబీసీ క్లీన్‌టెక్ ప్రైవేట్ లిమిటెడ్ (ఎవ్రెన్), యాక్సిస్ ఎనర్జీ వెంచర్స్ రూ.1,10,250 కోట్ల పెట్టుబడులు పెట్టేలా ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో తాజాగా గురువారం న్యూ అండ్ రెన్యూవబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ లిమిటెడ్ (నెడ్‌క్యాప్)తో ఒప్పందం కుదుర్చుకుంది.
- ఇదే తరహాలో వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రెన్యూ పవర్ రాష్ట్రంలో రూ.97,500 కోట్ల పెట్టుబడులు పెట్టేలా ఒప్పందం చేసుకుంటే ఇప్పుడు చంద్రబాబు ప్రభుత్వం అదే ఒప్పందాన్ని రూ.82,000 కోట్లకు తగ్గిస్తూ తిరిగి ఒప్పందం చేసుకోవడం గమనార్హం. రెన్యూ పవర్ చైర్మన్, సీఈవో సుమంత్ సిన్హాతో ముఖ్యమంత్రి చంద్రబాబు సమావేశం అనంతరం ఈ ఒప్పందం చేసుకున్నట్లు ప్రకటించారు.

కంపెనీ పేరు	వైఎస్సార్‌సీపీ హయాంలో పెట్టుబడి	ఒప్పందం తేదీ	ఇప్పుడు అదే సంస్థతో బాబు ప్రభుత్వం ఒప్పందం మొత్తం
ఏబీసీ లిమిటెడ్	రూ.1,20,000 కోట్లు	2023 మార్చి 3	రూ.1,10,250 కోట్లు
రెన్యూ పవర్	రూ.97,500 కోట్లు	2023 మార్చి 3	రూ.82,000 కోట్లు
హీరో ఫ్యూచర్ ఎనర్జీస్	రూ.30,000 కోట్లు	2023 మార్చి 3	రూ.15,000 కోట్లు

ఎంవోయూల మాయ

సాక్షి, విశాఖపట్నం: టీడీపీ హయాంలో 3సార్లు విశాఖ వేదికగా నిర్వహించిన పెట్టుబడుల సదస్సులో ఒప్పందాలు కుదుర్చుకున్న కొన్ని కంపెనీలు ఆ తరువాత పత్తా లేకుండాపోయాయి. వాటిలో మచ్చుకు కొన్ని..

- రూ.234 కోట్లతో 300 మందికి ఉపాధి కల్పించేలా వజ్ర రిసార్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్‌తో ఒప్పందం.
- రూ.300 కోట్లతో ఎకో రిసార్ట్ అండ్ వుడ్ కాటేజీ నిర్మాణానికి వాటర్ స్పోర్ట్స్ సింపిల్ సంస్థతో ఎంవోయూ
- రూ.153 కోట్ల పెట్టుబడులు పెట్టేలా స్కైవాల్ట్జ్ మెరీనా సంస్థతో ఒప్పందం
- రూ.100 కోట్లతో ఎంఐసీఈ సెంటర్ ఏర్పాటుకు వైబ్ గ్రూప్స్‌తో ఎంవోయూ
- రూ.2 వేల కోట్లతో గోల్డ్‌ఫిష్ అబాడ్ సంస్థతో గోల్ఫ్ కోర్స్ నిర్మాణ ఒప్పందం.
- రూ.7 వేల కోట్లతో మైత్రా మొబిలిటీ సంస్థ ఎలక్ట్రానిక్ వాహనాల తయారీ యూనిట్ ఏర్పాటు ఒప్పందం.
- రూ.550 కోట్లతో మాగ్నమ్ పైరెక్స్ సంస్థతో ఎలక్ట్రిక్ వాహనాల తయారీ ఒప్పందం.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో హీరో ఫ్యూచర్స్‌తో ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న దృశ్యం(ఫైల్)

- వైఎస్సార్‌సీపీ హయాంలో రూ.30,000 కోట్ల పెట్టుబడులు పెట్టేలా ఒప్పందం చేసుకున్న హీరో ఫ్యూచర్ ఎనర్జీస్ ఇప్పుడు ఆ పెట్టుబడిని ఏకంగా రూ.15,000 కోట్లకు తగ్గిస్తూ చంద్రబాబు ప్రభుత్వంతో ఒప్పందం చేసుకోవడం గమనార్హం.

హీరో ఫ్యూచర్ ఎనర్జీస్ సంస్థ సీఎండీ రాహుల్ ముంజాల్‌తో తాజాగా మళ్లీ విశాఖపట్నంలో ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న సీఎం చంద్రబాబు

క్లుప్తంగా...

నేడు విశాఖకు ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్

సాక్షి, న్యూఢిల్లీ: ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ఏపీలో పర్యటించనున్నారు. శుక్రవారం నుంచి రెండు రోజుల పాటు విశాఖపట్నంలో జరగనున్న 30వ భారతీయ పరిశ్రమల సమాఖ్య భాగస్వామ్య సదస్సు ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరు కానున్నారని ఉప రాష్ట్రపతి కార్యాలయం గురువారం ఒక ప్రకటనలో పేర్కొంది.

ఏపీ బలం పోర్టులే : సీఎం

సాక్షి, అమరావతి/విశాఖపట్నం: సుదీర్ఘ తీర ప్రాంతం కలిగిన ఆంధ్రప్రదేశ్‌కు పోర్టులే బలమని.. అందుకే పెద్ద ఎత్తున పోర్టులను నిర్మిస్తున్నామని సీఎం చంద్రబాబు తెలిపారు. రైల్వే, ఎయిర్‌పోర్టులతో పాటు దేశంలోని వివిధ ప్రధాన నగరాలకు ఏపీలోని పోర్టులతో అనుసంధానించేలా ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు. గురువారం విశాఖలో ఇండియా–యూరప్ బిజినెస్ పార్టనర్‌షిప్ రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. సమావేశానికి ఆర్మేనియా ఆర్థిక వ్యవహారాల మంత్రి గివార్గ్ పాపాయాన్, నెదర్లాండ్స్, ఫ్రాన్స్, జర్మనీ, ఆర్మేనియా తదితర దేశాలకు చెందిన ప్రతినిధులు, భారత్ ఫోర్జ్ వైస్ చైర్మన్ అమిత్‌కళ్యాణి సహా వివిధ కంపెనీలకు చెందిన చైర్మన్లు, సీఈఓలు, సీఐఐ ప్రతినిధులు హాజరయ్యారు. సుస్థిరాభివృద్ధిలో భారత్–యూరప్ దేశాల మధ్య సహకార భాగస్వామ్యంపై సమావేశంలో చర్చించారు.

అత్యంత నివాస యోగ్యమైన నగరంగా విశాఖ

అత్యంత నివాస యోగ్యమైన నగరం(మోస్ట్ లివబుల్ సిటీ)గా విశాఖను తీర్చిదిద్దుతున్నట్టు సీఎం చంద్రబాబు ప్రకటించారు. గురువారం విశాఖ ఎకనామిక్ రీజియన్ డెవలప్‌మెంట్ డాక్యుమెంట్‌ను నీతిఆయోగ్ సీఈఓ సుబ్రహ్మణ్యంతో కలిసి ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. తూర్పు తీరంలో విశాఖ దేశ ఆర్థిక ప్రగతికి గేట్‌వే అని, ఇందుకోసం విశాఖ ఇండస్ట్రియల్ రీజియన్ మాస్టర్ ప్లాన్–2040కి రూపకల్పన చేశామని చెప్పారు.

సీఎంతో నౌకాదళాధిపతి భేటీ

భాగస్వామ్య సదస్సులో పాల్గొనేందుకు విశాఖ వచ్చిన సీఎం చంద్రబాబుతో తూర్పు నౌకాదళాధిపతి వైస్ అడ్మిరల్ సంజయ్ భల్లా మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈస్టర్న్ నావల్ కమాండ్ కార్యకలాపాలపై చంద్రబాబుకు వివరించారు. కాగా.. రెన్యూ సంస్థ చైర్మన్ సుమంత్ సిన్హా సీఎం చంద్రబాబుతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా.. ఏపీ ఆర్థిక మండలితో రూ.60 వేల కోట్ల పెట్టుబడులలో భాగంగా పునరుత్పాదక శక్తి, సౌర ఇంధన తయారీ, బ్యాటరీ నిల్వ, గ్రీన్ అమోనియా వంటి వేర్వేరు రంగాలకు సంబంధించి నాలుగు ఒప్పందాలు జరిగాయి.

నేటి నుంచి సదరం స్లాట్ బుకింగ్స్

సాక్షి, అమరావతి: దివ్యాంగులకు సర్టిఫికెట్ల జారీ కోసం సదరం స్లాట్ బుకింగ్‌లను శుక్రవారం ప్రారంభిస్తున్నట్లు వైద్య శాఖ గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. డిసెంబర్ నెలాఖరు వరకు స్లాట్‌లను అందుబాటులో ఉంచినట్టు పేర్కొంది. ఫీజులు వసూలు చేయట్లేదని తెలిపింది. ఇప్పటికే స్లాట్‌ల కోసం దాదాపు 10 వేల మంది వెయిటింగ్‌లో ఉన్నారు. వీరికి కేటాయించిన తర్వాత మిగిలిపోయిన స్లాట్‌లు మాత్రమే కొత్త వారికి దక్కుతాయి. వారంలో రెండు రోజులే స్లాట్‌లు ఉంటాయి. సీహెచ్‌సీల్లో ప్రతి సోమవారం.. ప్రాంతీయ, జిల్లా, బోధనాస్పత్రుల్లో ప్రతి మంగళవారం దివ్యాంగులకు వైకల్య నిర్ధారణ పరీక్షలు చేస్తారు.

చంద్రబాబు సమర్పించు పెట్టుబడుల సినిమా..

ఉత్త ఒప్పందాలే

రాష్ట్రానికి రూ.లక్షల కోట్ల పెట్టుబడులంటూ ప్రచారం.. నాడూ నేడూ అదే డ్రామా!

టీడీపీ హయాంలో 2014-19 మధ్య రూ.19.6 లక్షల కోట్ల విలువైన 1,761 ఒప్పందాలు

మూడు సదస్సుల్లో అమల్లోకి వచ్చింది కేవలం 13%మాత్రమే

17 ఎస్ఐపీబీ సమావేశాల్లో రూ.1.7 లక్షల కోట్ల విలువైన 91 ప్రాజెక్టులకు ఆమోదం

అందులో వాస్తవ రూపం దాల్చింది కేవలం 5.69 శాతం మాత్రమే

హైపర్‌లూప్, నెక్ట్స్ ఆర్బిట్, బీఆర్ షెట్టి, గుడియాన్ టెక్నాలజీ, టైటాన్ ఏవియేషన్, సోలార్‌గైజ్ ఇండియా కంపెనీల పేర్లైనా కనీసం గుర్తున్నాయా బాబూ?

వైఎస్సార్ సీపీ హయాంలోనే వచ్చిన ఎన్టీపీసీ, రెన్యూ పవర్, సెంచురీయన్, ఏటీసీ టైర్స్, రిలయన్స్ ప్రాజెక్టులతో తాజాగా బాబు సర్కారు తిరిగి ఒప్పందాలు

అందుకోసం ఆర్నెల్లుగా పెట్టుబడుల పేరుతో సీఎం, పలువురు మంత్రుల విదేశీ పర్యటనలు

వైఎస్ జగన్ హయాంలో విశాఖ వేదికగా 2023 గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్

మొత్తం రూ.13.11 లక్షల కోట్ల విలువైన 386 ఒప్పందాలు

వాస్తవ రూపం దాల్చిన 91 శాతానికిపైగా ప్రాజెక్టులు



సాక్షి, అమరావతి: రెడీ.. యాక్షన్.. కెమెరా..! అంటూ విశాఖలో ప్రివ్యూ షోలు, ప్రీ రిలీజ్ ఈవెంట్ల తరహాలో.. క్రెడిట్ చోరీతో ప్రజలకు మరోమారు పెట్టుబడుల సినిమా చూపించేందుకు చంద్రబాబు సర్కారు సిద్ధమైంది! శుక్ర, శనివారాల్లో విశాఖ వేదికగా సీఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్ పేరిట ముఖ్యమంత్రి చంద్రబాబు సినిమా చూపించనున్నారు. 2014–19 మధ్య అధికారంలో ఉన్నప్పుడు కూడా ఆయన ఇదే తరహా సినిమాలను రాష్ట్ర ప్రజలకు చూపించారు. 2016, 2017, 2018లో వరుసగా మూడేళ్లు సీఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్స్ పేరిట విశాఖలో సమావేశాలు నిర్వహించి భారీగా ప్రచారం చేసుకున్నారు. ఆ మూడు సమావేశాల్లో 1,761 ఒప్పందాలు కుదుర్చుకోవడం ద్వారా రాష్ట్రానికి ఏకంగా రూ.19.6 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చినట్లు పత్రికల్లో ప్రధాన శీర్షికల్లో పేర్కొన్నారు. ఈ ఒప్పందాల ద్వారా 34 లక్షల మందికి ఉపాధి లభిస్తుందని ఊదరగొట్టారు. రూ.19.6 లక్షల కోట్ల ఒప్పందాల సంగతి దేవుడెరుగు.. ఆఖరికి పరిశ్రమల శాఖ స్వయంగా కుదుర్చుకున్న రూ.7.68 లక్షల కోట్ల విలువైన 327 ఒప్పందాల్లో వాస్తవంగా అమల్లోకి వచ్చింది 45 మాత్రమే. అంటే 13 శాతమే కార్యరూపం దాల్చాయి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే వచ్చిన పలు కంపెనీలతో తాజాగా విశాఖ వేదికగా మళ్లీమళ్లీ ఒప్పందాలు చేసుకుంటూ అందుకోసం ఆర్నెల్లుగా సీఎం, పలువురు మంత్రులు విదేశీ పర్యటనలు చేసి రావడం గమనార్హం.

ఎస్ఐబీపీలకూ దిక్కులేదు..

పార్టనర్‌షిప్ సమ్మిట్ ఒప్పందాలే కాదు.. ముఖ్యమంత్రి అధ్యక్షత వహించే పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (ఎస్ఐపీబీ) ఆమోదం పొందిన ప్రాజెక్టులకు సైతం 2014–19 మధ్య టీడీపీ హయాంలో దిక్కు లేకుండా పోయింది. ఎక్కడైనా ఎస్ఐపీబీ ఆమోదం లభించిందంటే ప్రాజెక్టులు పరుగులు పెట్టాల్సిందే. 2014–19 మధ్య చంద్రబాబు అధ్యక్షతన మొత్తం 17 సార్లు ఎస్ఐపీబీ సమావేశాలు జరిగాయి. అందులో మొత్తం రూ.1,70,036 కోట్ల విలువైన 91 మెగా ప్రాజెక్టులకు ఆమోదం తెలిపారు. వీటి ద్వారా 2,04,183 మందికి ఉపాధి లభిస్తుందని ప్రకటించారు. అయితే నాడు టీడీపీ ప్రభుత్వం గద్దె దిగిపోయే నాటికి ఎస్ఐపీబీ సమావేశాల్లో ఆమోదం పొందిన వాటిలో 5.69 శాతం మాత్రమే అమల్లోకి వచ్చాయి. రూ.9,681 కోట్ల విలువైన ఒప్పందాలు మాత్రమే వాస్తవ రూపంలోకి వచ్చాయి. వీటి ద్వారా ఉపాధి లభించింది 36,140 మందికి మాత్రమే.

2014 -19 కితకితలే కితకితలు..!

చంద్రబాబు గతంలో అధికారంలో ఉన్నప్పుడు హైపర్ లూప్ దగ్గర నుంచి సుఖోయ్ యుద్ధవిమానాల వరకు రాష్ట్రంలోకి వచ్చేస్తున్నట్లు పెద్ద ఎత్తున ప్రచారం చేసుకున్నారు. అసలు ప్రపంచంలోనే అమల్లోకి రాని హైపర్‌లూప్ కాన్సెప్ట్‌తో అమరావతి నుంచి విశాఖ నిమిషాల్లో చేరుకోవచ్చంటూ ఆయన చేసిన ప్రచారం ఇప్పటికీ అందరికీ గుర్తుండే ఉంటుంది. అలాగే దొనకొండ వద్ద డ్రోన్ డిఫెన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్, సుఖోయ్ ఎయిర్‌క్రాఫ్ట్ సైంటిఫిక్ ఇండస్ట్రియల్ కలిపి రూ.14,000 కోట్లతో యూనిట్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రచారం చేశారు. సెమీ కండక్టర్స్ విభాగంలో ఎటువంటి అనుభవం లేని నెక్ట్స్ ఆర్బిట్ వెంచర్స్ రాష్ట్రంలో రూ.50,000 కోట్ల పెట్టుబడితో సెమీ కండక్టర్ ఫ్యాబ్రికేషన్స్ యూనిట్ ఏర్పాటు చేస్తోందని ప్రచారం చేశారు. ఆ కంపెనీ ద్వారా 1,10,000 మందికి ఉపాధి లభిస్తుందని చెప్పుకొచ్చారు. అలాగే హల్దియా రూ.62,714 కోట్లతో కాకినాడ వద్ద పెట్రో కెమికల్ యూనిట్ నెలకొల్పుతోందంటూ ఎటువంటి అనుమతులు లేకుండానే ఎన్నికల ముందు హడావుడిగా 2019 జనవరిలో శంకుస్థాపన చేశారు. గుడియాన్ టెక్నాలజీస్ రూ.40,000 కోట్లతో రెన్యువబుల్ ఎనర్జీ ప్లాంట్, రూ.23,285 కోట్లతో సోలార్‌గైజ్ ఇండియా, రూ.22,500 కోట్లతో టైటాన్ ఏవియేషన్ విమానాల తయారీ యూనిట్ ఏర్పాటు చేస్తోందంటూ టీడీపీ హయాంలో ఒప్పందాలు చేసుకున్నారు. ఇవికాకుండా హెచ్‌పీసీఎల్ గెయిల్ క్రాకర్ కాంప్లెక్స్ (రూ.40,000 కోట్లు), అనంత్ టెక్నాలజీస్ (రూ.4,500 కోట్లు), సిరీన్ డ్రగ్స్ (రూ.8,200 కోట్లు), రాయల విండ్ పవర్ (రూ.16,500 కోట్లు) తదితర సంస్థలు టీడీపీ హయాంలో ఒప్పందం చేసుకున్న తర్వాత మొహం చాటేశాయి. 2018లో ఒప్పందం చేసుకున్న వాటిలో ఎస్‌బీ ఎనర్జీ (రూ.13,200 కోట్లు), మైత్ర మొబైల్ (రూ.7,000 కోట్లు), కోనసీమ ఫెర్టిలైజర్స్ (రూ.5,000 కోట్లు), బద్వే ఇంజనీరింగ్ (రూ.4,200 కోట్లు) లాంటి సంస్థలు అనంతరం పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపలేదు. స్విట్జర్లాండ్‌కు చెందిన ఏరోస్పేస్ వెంచర్స్ రూ.9,600 కోట్ల పెట్టుబడికి ఒప్పందం చేసుకోగా భూమి కేటాయించినా ఇప్పటికీ పనులు మొదలు కాలేదు.


The Department of Industries & Commerce was the nodal department responsible for organizing the "Partnership Summit and Sunrise Andhra Pradesh Investment Meet", for 3 consecutive years – 2016, 2017 & 2018 - at Visakhapatnam. During these summits, various departments have signed MoUs with a total of 1,338 investment projects amounting to committed investment of Rs 12.51 Lakh Crore.

The Industries & Commerce Departmententered into 327 MoUs to establish multiplelarge and megaprojects. Out of these, only 45 projects, i.e. 13% of the projects, have started operations. Another 92 projects are in advanced stages of implementation. However as many as 190 projects are either dropped or delayed. The status of MoUs signed by the Industries & Commerce department during all the 3 Summits is provided below.

2014-2019 మధ్య చంద్రబాబు హయాంలో మొత్తం 327 ప్రాజెక్టులకు ఒప్పందాలు జరగ్గా వాటిలో కేవలం 13శాతం మాత్రమే సాకారమైనట్టు పరిశ్రమల శాఖ డాక్యుమెంట్‌లో పేర్కొన్న భాగం

ఎన్టీపీసీ ఒప్పందం అప్పటిదే.. పాతవాటికి కొత్తవిగా కలరింగ్

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన పథకాలను తమ ఖాతాల్లో వేసుకోవడమే కాకుండా ఇప్పుడు కొత్తగా విస్తరణ ఒప్పందాలు కుదుర్చుకుంటూ చంద్రబాబు వాటిని తమ ఖాతాలో వేసుకుంటున్నారు. 2023 మార్చి4న నాటి సీఎం వైఎస్ జగన్ సమక్షంలో విశాఖ జీఐఎస్ సదస్సులో ఎన్టీపీసీతో ఒప్పందం కుదిరిన రూ.1.85 లక్షల కోట్ల గ్రీన్ హైడ్రోజన్ యూనిట్ (అనకాపల్లి వద్ద)ను ఇప్పుడు చంద్రబాబు నిస్సిగ్గుగా తన ఖాతాలో వేసుకున్నారు. అలాగే రూ.69,000 కోట్లతో ఇండోసోల్ ప్రాజెక్టు, తిరుపతిలో రూ.7,500 కోట్లతో జిందాల్ స్టీల్, రూ.3,700 కోట్లతో రెన్యూ ఎనర్జీ, రూ.4,500 కోట్లతో సత్యసాయి జిల్లాలో ఉత్కర్ష అల్యూమినియం ధాతు నిగం లిమిటెడ్ లాంటి కంపెనీలన్నీ గత ప్రభుత్వ హయాంలోనే ఒప్పందాలు చేసుకోగా, ఇప్పుడు బాబు సర్కారు వాటిని తన ఖాతాలో వేసుకుంటున్నారు. గత ప్రభుత్వంలోనే వచ్చిన ఎన్టీపీసీ, రెన్యూ పవర్, సెంచురీయన్, ఏటీసీ టైర్స్, రిలయన్స్ ప్రాజెక్టులతో తాజాగా విశాఖ సదస్సులో తిరిగి కొత్త ఒప్పందాలకు బాబు ప్రభుత్వం సిద్ధమైంది.

2014-19 టీడీపీ హయాంలో 3 సీఐఐ భాగస్వామ్య సదస్సులు ఇలా...

ఏడాది	ఒప్పందాల సంఖ్య	పెట్టుబడుల విలువ
2016	362	రూ.4.67 లక్షల కోట్లు
2017	665	రూ.10.54 లక్షల కోట్లు
2018	734	రూ.4.39 లక్షల కోట్లు
మొత్తం	1,761	రూ.19.6 లక్షల కోట్లు

జగన్ ప్రభుత్వ హయాంలో ఇలా...

	సంవత్సరం	ఒప్పందాల సంఖ్య	పెట్టుబడి విలువ	ఉపాధి లక్ష్యం
జగన్ ప్రభుత్వ హయాంలో ఇలా...	2023	99	రూ.6,60,068.72 కోట్లు	7,56,455
	వచ్చినవి	90	రూ.6,01,071.72 కోట్లు	7,26,245
	శాతాల్లో	90.90%	91.06%	96.01%

2014 –19 టీడీపీ హయాంలో..

మొత్తం ఒప్పందాల విలువ రూ.19 లక్షల కోట్లు	అందులో పరిశ్రమల శాఖ ఒప్పందాలు రూ.7.68 లక్షల కోట్లు
పరిశ్రమల శాఖ ఒప్పందాల సంఖ్య 327	కార్యరూపం దాల్చిన ఒప్పందాలు 45 (13 శాతం)

2014– 19 టీడీపీ హయాంలో ఎస్ఐపీబీ ద్వారా ఒప్పందాలు ఇలా..

ఎస్ఐపీబీలో ఆమోదించిన మెగా ప్రాజెక్టులు 91	అమలులోకి వచ్చిన ప్రాజెక్టుల విలువ: రూ.9,681 కోట్లు
ఆమోదించిన పెట్టుబడుల విలువ రూ.1,70,036 కోట్లు	ఎంతమందికి ఉపాధి కల్పిస్తామన్నారు? 2,04,183
	వాస్తవంగా ఎంతమందికి ఉపాధి లభించింది? 36,140

జగన్ హయాంలో 91 శాతానికి పైనే..

వైఎస్సార్‌సీపీ హయాంలో విశాఖ వేదికగా నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సదస్సు ద్వారా పరిశ్రమల శాఖ నుంచి 99 ఒప్పందాలు జరిగాయి. వీటి ద్వారా రూ.6,60,068.72 కోట్ల విలువైన పెట్టుబడులతోపాటు 7,56,455 మందికి ఉపాధి లభించనుంది. ఆ ఒప్పందాలు జరిగిన రెండేళ్లలోపే 90కిపైగా యూనిట్లు నిర్మాణ పనులు ప్రారంభించగా.. అందులో 39 కంపెనీలు ఇప్పటికే ఉత్పత్తిని కూడా ప్రారంభించి వాణిజ్య కార్యకలాపాలు ఆరంభించాయి. మొత్తం పెట్టుబడుల్లో 91.06 శాతం అంటే రూ.6,01,071.72 కోట్ల పెట్టుబడులు వాస్తవ రూపంలోకి వచ్చినట్లు తాజాగా చంద్రబాబు ప్రభుత్వమే లిఖితపూర్వకంగా తెలియచేసింది. ఇప్పటికే ఉత్పత్తి ప్రారంభించిన వాటిలో ఏజీపీ సిటీ గ్యాస్ (రూ.10,000 కోట్లు) ఐవోసీ (రూ,4,300), ఇండోసోల్ (రూ.69,000 కోట్లు), జిందాల్ స్టీల్ ఆంధ్రా (రూ.7,500 కోట్లు), జేఎస్‌డబ్ల్యూ స్టీల్ (రూ.16,350), ఎన్టీపీసీ (రూ.1,85,000 కోట్లు), అల్ట్రాటెక్ సిమెంట్ (రూ.4,000 కోట్లు), ఉత్కర్ష (రూ.4,500 కోట్లు), శ్రీసిమెంట్స్ (రూ.5,500 కోట్లు), అలయన్స్ టైర్స్ విస్తరణ (రూ.1,100 కోట్లు), బ్లూస్టార్ (రూ.550 కోట్లు), కలర్‌షైన్ ఇండియా (రూ.510 కోట్లు), దాల్మియా సిమెంట్స్ (రూ.650 కోట్లు), దివీస్ ల్యాబ్ (రూ.790 కోట్లు), ఎలక్ట్రో స్టీల్ కాస్టింగ్స్ (రూ.1,113 కోట్లు), ఇగులా స్టెర్‌లెస్ (రూ.600 కోట్లు), గ్రీన్‌లామ్‌సౌత్ (రూ.825 కోట్లు), జేఎస్‌డబ్ల్యూ సిమెంట్ (రూ.550 కోట్లు), కింబెర్లీ క్లార్క్ ఇండియా (రూ.700 కోట్లు), లైఫస్ ఫార్మా (రూ.2,319 కోట్లు), లారస్ (రూ.1200 కోట్లు), ఎల్జీ పాలిమర్స్ (రూ.240 కోట్లు), శ్రీసిమెంట్స్ (రూ.2,500 కోట్లు), టీసీఎల్ (రూ.500 కోట్లు) లాంటి పలు ప్రధాన కంపెనీలున్నాయి.


Assistant Director of Industries
O/o. The Commissioner of Industries

గత ప్రభుత్వం 2023లో కుదుర్చుకున్న ఒప్పందాలలో 91 శాతం వాస్తవరూపం దాల్చినట్టుగా పరిశ్రమల శాఖ అధికారులు లిఖితపూర్వకంగా ఇచ్చిన సమాధానం

సాక్షి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్నా..
మా టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ.7.00 గం.ల నుండి రా.8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగిన చర్యలు తీసుకుంటాం.
టోల్ ఫ్రీ నెం. 1800 425 9899

క్రెడిట్ చోరీలో మీకు మీరే సాటి

సీఎం చంద్రబాబుపై వైఎస్ జగన్ మండిపాటు

సాక్షి, అమరావతి : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇచ్చిన ఇంటి స్థలాల్లో.. అప్పట్లోనే మంజూరై నిర్మాణంలో ఉన్న ఇళ్లను పట్టుకుని 'ఈ ఇళ్లన్నీ మేమే కట్టేశాం' అంటూ మీరు చేస్తున్న క్రెడిట్ చోరీ స్కీం హేయంగా ఉందని సీఎం చంద్రబాబుపై వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇతరుల కష్టాన్ని తన గొప్పతనంగా చెప్పుకునేవాడు నాయకుడు కాదని.. నాటకాల రాయుడు అని అంటారని చురకలు వేశారు. ఒకరి కష్టాన్ని కొట్టేయడంలో, ఒకరి ఐడియాను తనదిగా చెప్పుకోవడంలో.. ఆ పేదల ఇళ్ల స్థలాలను సైతం లాక్కునే ప్రయత్నం చేయడంలో.. అసలు ఆ క్రెడిట్ చోరీలో మీకు మీరే సాటి అంటూ సీఎం చంద్రబాబుపై వ్యంగ్యోక్తులు విసిరారు. ఈ మేరకు గురువారం ఆయన సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో క్రెడిట్ చోర్ బాబు హ్యాష్‌ట్యాగ్‌తో పోస్టు చేశారు. ఆ పోస్టులో వైఎస్ జగన్ ఏమన్నారంటే..

- చంద్రబాబు గారూ.. మీ కథ, స్క్రీన్ ప్లే, దర్శకత్వంలో విజయవంతంగా నడుస్తున్న ''క్రెడిట్ చోరీ స్కీం'' చాలా బాగుంది. పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడానికి ఈ 18 నెలల కాలంలో ఒక్క గజం స్థలం కూడా సేకరించలేదు. ఒక్కరికి ఒక్క సెంటు స్థలం కూడా ఇవ్వలేదు. దీనికోసం ఒక్కపైసా కూడా ఖర్చు చేయలేదు. ఒక్కరికి ఒక్క ఇల్లు కూడా మంజూరు చేయలేదు. గత ప్రభుత్వం.. అంటే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇచ్చిన ఇంటి స్థలాల్లోనే, వైఎస్సార్‌సీపీ గతంలో శాంక్షన్ చేయించిన ఇళ్లను, మా ప్రభుత్వ హయాంలోనే నిర్మాణంలో ఉన్న వాటిని పట్టుకుని ''ఇళ్లన్నీ మేమే కట్టేశాం'' అంటున్నారు. కళ్లార్పకుండా, ఏ మాత్రం సిగ్గు పడకుండా పచ్చి అబద్ధాలను బల్లగుద్ది మరీ చెబుతూ ఆ క్రెడిట్ మాదేనంటూ మీరు చేస్తున్న క్రెడిట్ చోరీ స్కీం హేయంగా ఉంది. ఇతరుల కష్టాన్ని తన గొప్పతనంగా చెప్పుకునేవాడు నాయకుడు కాదు.. నాటకాల రాయుడు అంటారు.
- మీరు ప్రారంభించామని చెప్పుకుంటున్న 3,00,092 ఇళ్లల్లో ఒక్క ఇంటి పట్టా కూడా మీరు ఇవ్వలేదు. ఒక్క ఇల్లు కూడా మీరు మంజూరు చేయించ లేదు. ఆ 3,00,092 ఇళ్లలో 1,40,010 ఇళ్లు మా హయాంలోనే పూర్తయ్యే దశలో ఉన్నవే. మరో 87,380 ఇళ్లు శ్లాబ్ లెవల్ వరకు మా హయాంలోనే కట్టించినవే. శ్లాబ్ కంటే కింద స్థాయిలో మరో 66,845 ఇళ్లు మా హయాంలో నిర్మాణంలో ఉన్నవే.
- ఇవికాక 2023 అక్టోబర్ 12న ఒకేసారి 7,43,396 ఇళ్లల్లో ఒకే రోజు గృహ ప్రవేశాలతో మా ప్రభుత్వం చరిత్ర సృష్టించింది. ఇన్ని వాస్తవాలు కళ్ల ముందే ఉన్నాం అసలు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏమీ చేయనట్టుగా, మీరే అన్నీ చేసినట్టుగా పచ్చి అబద్ధాలను ప్రచారం చేస్తున్న మీ స్కీం చాలా హేయం! మా హయాంలో 71,800 ఎకరాల్లో 31.19 లక్షల ఇళ్ల పట్టాలను అక్కచెల్లెమ్మలకు ఉచితంగా ఇచ్చి, వారి పేరు మీదే రిజిస్ట్రేషన్ చేయించాం. 21.75 లక్షల ఇళ్లను శాంక్షన్ చేయించి, ంకోవిడ్ లాంటి మహమ్మారి ద్వారా తలెత్తిన సంక్షోభాన్ని ఎదుర్కొంటూ 9 లక్షలకుపైగా ఇళ్లను మా హయాంలోనే పూర్తి చేశాం.
- అయినా అన్నీ మీరే చేశారన్నట్టుగా మీరు చెప్పడమే కాకుండా, మీ ఎల్లో మీడియా ద్వారా ప్రచారం చేయించుకుని, ఆ క్రెడిట్‌ను కొట్టేయాలనుకుంటున్న మీ స్కీం చాలా హేయం చంద్రబాబు గారూ! మేము 31.19 లక్షల ఇళ్ల పట్టాలను ఇచ్చి, అందులో 21.75 లక్షల ఇళ్లు శాంక్షన్ చేయించి కట్టడం మొదలుపెట్టాం. మిగిలిన ఆ 10 లక్షల ఇళ్ల స్థలాల్లో పేదలకు ఇళ్లు కట్టించి ఇచ్చే కార్యక్రమానికి పూనుకోకుండా, ఆ ఖాళీ స్థలాలను లాక్కునే కార్యక్రమం చేస్తున్న మీరు సిగ్గుతో తలదించుకోవాల్సింది పోయి, నిస్సిగ్గుగా క్రెడిట్ చోరీకి పాల్పడ్డం అత్యంత హేయం! ఒకరి కష్టాన్ని కొట్టేయడంలో, ఒకరి ఐడియాను మీదిగా చెప్పుకోవడంలో, ఆ పేదల ఇళ్ల స్థలాలను సైతం లాక్కునే ప్రయత్నం చేయడంలో.. అసలు ఆ క్రెడిట్ చోరీలో మీకు మీరే సాటి.

నేటి ఎస్‌ఏ–1 పరీక్షలు వాయిదా

సాక్షి, అమరావతి: సమ్మేటివ్ అసెస్‌మెంట్(ఎస్‌ఏ)–1 పరీక్షల నిర్వహణలో పాఠశాల విద్యా శాఖ మార్పులు చేసింది. శుక్రవారం 1 నుంచి 5 తరగతులకు పరిసరాల విజ్ఞానం, 6, 7 తరగతులకు జనరల్ సైన్స్, 8, 9, 10 తరగతులకు ఫిజిక్స్ పరీక్ష నిర్వహించాల్సి ఉంది. కానీ, బాలల దినోత్సవం సందర్భంగా ఈ పరీక్షలను వాయిదా వేసినట్లు తెలిపింది. ఈనెల 17న ప్రాథమిక తరగతుల విద్యార్థులకు హైస్కూల్ విద్యార్థులకు ఈ పరీక్షలు నిర్వహించాలని డీఈవోలు, ఆర్జేడీలను ఆదేశించింది. పాఠశాలలకు శుక్రవారం సెలవు లేదని స్పష్టం చేసింది. బాలల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని సూచించింది.

విదేశాలకు అక్రమంగా నగదు బదిలీ?

వేటపాలెం : బాపట్ల జిల్లా చీరాలకు చెందిన కాంచన చంద్రశేఖర్ అనే యువకుడు రెండు నెలలుగా ఎస్‌బీఐలోని తన అకౌంటు నుంచి పెద్ద మొత్తంలో విదేశాల్లోని ప్రైవేట్ కంపెనీలకు బదిలీ చేశాడు. అలాగే, ఇతనితోపాటు మరికొందరు యువకులకు నగదు ఇచ్చి వారి ఖాతాల్లో కూడా రూ.లక్షల్లో జమచేయిస్తున్నాడు. ఇలా ఇప్పటివరకు రూ.30 లక్షల వరకు జమచేసినట్లు సమాచారం. ఆ తర్వాత వీరి ఖాతాల నుంచి నగదును ఇతర దేశాల ఖాతాలకు అక్రమంగా బదిలీ అవుతున్నట్లు బ్యాంకు సిబ్బంది గుర్తించారు. ఏదో సైబర్ క్రైమ్ జరుగుతున్నట్లుగా అనుమానిస్తూ బ్యాంకు సిబ్బంది చంద్రశేఖర్‌తో వచ్చిన వారిని వాకబు చేశారు. తమ ఖాతాల్లో పెద్దమొత్తంలో నగదు వేయించుకుని తమకు రూ.రెండువేల వరకు ఇస్తుంటాడని వారు చెప్పారు. అంత పెద్ద మొత్తంలో నగదు ఎక్కడి నుంచి వస్తోందో చెప్పాలని చంద్రశేఖర్‌ను బ్యాంకు అధికారులు నిలదీయడంతో కొంత కాలం బ్యాంకుకు రాలేదు. తిరిగి గురువారం వచ్చి సిబ్బందిని బెదిరించాడు. దీంతో.. బ్యాంకు మేనేజర్, సిబ్బంది పోలీసులకు సమాచారమిచ్చి చంద్రశేఖర్‌ను వారికి అప్పగించారు. మరోవైపు.. బ్యాంకు సిబ్బంది అతని ఖాతాలను పరిశీలించగా విదేశాల్లోని కంపెనీలకు రూ.లక్షల్లో బదిలీ అవుతున్నట్లు గుర్తించారు. యువకుడిపై 2022లో సైబర్ క్రైమ్ కింద కేసు నమోదు అయినట్లు తెలిసింది.

క్రెడిట్ చోరీతో చిక్కిన చినబాబు!

వైఎస్ జగన్ ప్రభుత్వంలోనే రాష్ట్రానికి రెన్యూ పవర్ ప్రైవేట్ లిమిటెడ్

విశాఖ సమ్మిట్‌లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం, రెన్యూ ఎనర్జీ మధ్య ఒప్పందాలు

గత ప్రభుత్వంలోనే పెట్టుబడుల ఒప్పందాలు, జీవోలపై సంతకాలు చేసిన ప్రస్తుత సీఎస్

అదే కంపెనీతో మళ్లీ ఇప్పుడు చంద్రబాబు ప్రభుత్వం ఎంవోయూ

రెన్యూ పెట్టుబడులు తామే రప్పించినట్లు ట్వీట్ చేసి అభాసుపాలైన లోకేశ్

సోషల్ మీడియాలో నెటిజన్ల ట్రోల్స్

సాక్షి, అమరావతి: రాష్ట్రానికి పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులు తరలి వచ్చేందుకు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన కృషిని 2023లో విశాఖలో జరిగిన పెట్టుబడుల సదస్సు సాక్షిగా రెన్యూ పవర్ చైర్మన్, సీఈవో సుమంత్ సిన్హా ప్రశంసించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాల కారణంగానే తాము ఏపీలో భారీగా పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చినట్లు నాడు లింక్డిన్‌లోనూ స్వయంగా వెల్లడించారు. వాస్తవం ఇలా ఉంటే.. రెన్యూ పవర్‌ని తామే రప్పించి రాష్ట్రానికి పెట్టుబడులు తెస్తున్నామంటూ సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ నిస్సిగ్గుగా అబద్ధాలు చెబుతున్నారు. విశాఖలో అదానీ డేటా సెంటర్ పేరు మార్చి క్రెడిట్ చోరీకి పాల్పడ్డ టీడీపీ ప్రభుత్వ పెద్దలు.. పేదలకు ఒక్క ఇల్లు కూడా ఇవ్వకపోగా, వైఎస్ జగన్ కట్టించిన ఇళ్లలోకి మళ్లీ కొత్తగా గృహ ప్రవేశాలు చేయించి, తామే కట్టించినట్లు డ్రామాలాడారు. ఇప్పుడు విశాఖలో సీఐఐ సమ్మిట్ వేదికగా మరో క్రెడిట్ చోరీకి శ్రీకారం చుట్టారు. క్రెడిట్ చోరీలో తండ్రితో పోటీ పడుతున్న నారా లోకేశ్ రెన్యూ పవర్ విషయంలో సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పోస్టు చేసి అడ్డంగా దొరికిపోయారు.

తరిమేసింది బాబు సర్కారే..!

విచిత్రంగా అదే రెన్యూ పవర్ సంస్థతో తాజాగా విశాఖ సదస్సుకు ఒకరోజు ముందే చంద్రబాబు సర్కార్ ఒప్పందం కుదుర్చుకుంది. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల నుంచి రెన్యూ పవర్‌ను తరిమేసింది చంద్రబాబు ప్రభుత్వమే. గత ప్రభుత్వం ఇచ్చిన జీవోలను రద్దు చేసి 600 మెగావాట్ల పవన విద్యుత్ ప్రాజెక్టులను కర్నూలు జిల్లాకు తరలిస్తూ ఈ ఏడాది జూలై 28న బాబు సర్కార్ జీఓ నెం.56 జారీ చేసింది. ఈ నిజాలను వెలుగులోకి తెచ్చిన నెటిజన్లు.. లోకేశ్ క్రెడిట్ చోరీకి పాల్పడ్డారంటూ మీమ్స్‌తో దుమ్మెత్తిపోస్తున్నారు.

లోకేశ్ క్రెడిట్ చోరీపై సామాజిక మాధ్యమాల్లో వెల్లువెత్తుతున్న విమర్శల మీమ్

వైఎస్ జగన్ ప్రభుత్వంలోనే రెన్యూ పవర్‌తో పెట్టుబడుల ఒప్పందం జరిగింది. 2023 జూన్ 20న 300 మెగావాట్ల పవన విద్యుత్ ప్రాజెక్టును అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల్లో స్థాపించేందుకు రెన్యూ పవర్‌కు అనుమతిస్తూ జీవో నెం.15ను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జారీ చేసింది. అనంతరం 2024 ఫిబ్రవరి 5న అదే సంస్థను మరో 600 మెగా వాట్ల పవన విద్యుత్ ప్రాజెక్టు ఏర్పాటుకు అనుమతిస్తూ జీవో నెం .16ను వైఎస్ జగన్ ప్రభుత్వం విడుదల చేసింది. అంతేకాదు రెన్యూ సంస్థ ప్రాజెక్టులకు అవసరమైన భూములు ఆ రెండు జిల్లాల్లో కేటాయించేందుకు కూడా స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డ్ నాడే అంగీకారం తెలిపింది. ఈ జీఓలపై నాటి ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి హోదాలో ప్రస్తుతం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా ఉన్న కె.విజయానంద్ సంతకాలు చేశారు. దీన్నిబట్టి రెన్యూ పవర్ ప్రాజెక్టులకు వైఎస్ జగన్ హయాంలోనే అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల్లో భూ కేటాయింపులతో సహా 600 మెగా వాట్లు, 300 మెగావాట్ల సామర్థ్యంతో గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులు మంజూరయ్యాయనేది సుస్పష్టం.

రెన్యూ పవర్‌ను తెచ్చిందే వైఎస్ జగన్..

SAATCHI & SAATCHI

తూర్పు దిశకు గానీ, లేక పశ్చిమ దిశకు గానీ ముఖమును తిప్పుట మాత్రమే పవిత్రత అనిపించుకొన జాలదు. సహాయము నర్థించు వారిని ఆదుకొనువారే దేవుని యందు భయభక్తులు గలవారు.

– ఇస్లాం ధర్మం

సాక్షి

శుక్రవారం, 14 నవంబర్ 2025

సిరియా దశ మారుతుందా?

అమెరికా అధ్యక్ష పీఠాన్ని డోనాల్డ్ ట్రంప్ దాదాపు పది నెలల క్రితం అధిరోహించాక ఎన్నో వింతలు చోటుచేసుకుంటున్నాయి. ఆ వరసలో సిరియా తాత్కాలిక అధ్యక్షుడు అహ్మద్ అల్ షరా రాక కూడా ఒకటి. ఒక దేశాధ్యక్షుణ్ణి మీడియా సాక్షిగా తీవ్రంగా మందలించటం, ఆయనతో వాదులాటకు దిగటంతో ట్రంప్ ఏలుబడి మొదలైంది. కానీ ఆ 'సత్కారం' అందుకున్న ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ దాన్నంతటినీ దిగమింగుకుని అనంతర కాలంలో ట్రంప్‌తో చేతులు కలిపి, తమ ఖనిజ సంపద అప్పగించేందుకు ఒప్పందం కుదుర్చుకుని ఆయన మెప్పు పొందారు. ఇప్పుడు షరాకు రెడ్ కార్పెట్ పరచటంలోని అంతరార్థం ఏమిటో ముమ్ముందు తెలుస్తుంది. పైకి చెబుతున్న కారణమైతే ఉగ్రవాద సంస్థ ఇస్లామిక్ స్టేట్ (ఐఎస్)పై పోరాటానికి సంఘటితమైన 88 దేశాలతో సిరియా చేతులు కలపటానికి సిద్ధపడటం. తాము ఏమనుకుంటే మిగతా ప్రపంచం కూడా అలాగే అనుకోవాలని అమెరికా భావిస్తుంటుంది. ఏడేళ్ల క్రితం అమెరికా దృష్టిలో అల్ షరా కరుడుగట్టిన ఉగ్రవాది. అతన్ని పట్టిస్తే కోటి డాలర్లు ఇస్తామంటూ ప్రకటించింది. నిరుడు డిసెంబర్‌లో జో బైడెన్ అధ్యక్షుడిగా ఉన్నప్పుడే ఆ నజరానాను ఉపసంహరించుకున్నారు. మొన్న జూలైలో షరా ఆధ్వర్యంలోని హయత్ తహ్రీర్ అల్ షామ్ (హెచ్‌టీఎస్)పై ఉగ్రవాద సంస్థ ముద్రను రద్దుచేశారు. సిరియాపై ఉన్న ఆర్థిక ఆంక్షలను రద్దు చేస్తామని మే నెలలో ప్రకటించటంతోపాటు సౌదీ అరేబియాలో ట్రంప్ ఆయన్ను కలుసుకున్నారు. మరో నాలుగు రోజుల్లో షరా అధ్యక్ష హోదాలో అమెరికా సందర్శిస్తారనగా మొన్న గురువారం ఆదరాబాదరాగా భద్రతా మండలి సమావేశమై నిషేధిత ఉగ్రవాదుల జాబితా నుంచి ఆయన పేరును తొలగించింది. చైనా మినహా మిగిలిన 14 సభ్య దేశాలూ మరో మాట లేకుండా ఆ తీర్మానానికి అనుకూలంగా ఓటేశాయి.

అమెరికా తాజా నిర్ణయాలు తప్పని, గత వైఖరే సరైందని ఎవరూ అనరు. కానీ తల్చుకున్నదే తడవుగా ఇష్టానుసారం నిర్ణయాలు తీసుకోవటం, వాటికి భద్రతా మండలి వంటి సంస్థలు సైతం ఎలాంటి ప్రశ్నలూ లేవనెత్తకుండా అంగీకరించటం ఆందోళన కలిగించే అంశం. అమెరికా ఆగ్రహించినంత కాలమూ ఆ దేశంతో సంబంధాలు కలిగి ఉన్నందుకు అమెరికా తీసుకున్న చర్యలతో నష్టపోయిన దేశాల మాటేమిటి? ఇప్పుడు ఇరాన్‌పైనా, రష్యాపైనా ఆంక్షలున్నాయి. వాటితో వాణిజ్య సంబంధాలు నెరపుతున్నందుకు మన దేశంపై ట్రంప్ ఇష్టానుసారం మాట్లాడుతున్నారు. హెచ్చరికలు జారీ చేస్తున్నారు. అందరూ తమకు తోకల్లా ఉండాలన్నది అమెరికా విధానం.

సిరియాపై అమెరికా ఆంక్షలు ఈనాటివి కాదు. గత ఎనభైయ్యేళ్లుగా... అంటే 1946లో ఆ దేశం ఫ్రాన్స్ నుంచి స్వాతంత్ర్యం పొందినప్పటినుంచి కొనసాగుతున్నాయి. 1979లో రీగన్, అటుతర్వాత జార్జి బుష్, ఒబామా వాటిని మరింత పెంచారు. 2003లో అమెరికా ఇరాక్‌ను దురాక్రమించినప్పుడు షరా పట్టుబడ్డారు. ఆయన్ను 2011 వరకూ అమెరికా జైల్లో నిర్బంధించారు. అక్కడ పరివర్తన పొంది విడుదలయ్యాక సిరియా వెళ్లి అల్ కాయిదాతో, అటుతర్వాత ఐఎస్‌తో చేతులు కలపటం, హెచ్‌టీఎస్ స్థాపించటం, 2013లో అమెరికా ఆయనను ఉగ్రవాదిగా ప్రకటించటం చరిత్ర. షరా పలుకుబడి ఉన్న ఉత్తర సిరియా ప్రాంతంలో ఐఎస్ చీఫ్ అబూ బకర్ బగ్దాదీని 2019లో అమెరికా దళాలు మట్టుబెట్టాయి. ఆ మాటెలా ఉన్నా ప్రస్తుతం ఆయన ఏలుబడిలో గత పది నెలలుగా సిరియాలోని మైనారిటీ వర్గాలైన అలావైట్‌లు, డ్రూజ్‌లు, క్రైస్తవులు తీవ్ర అగచాట్లు పడుతున్నారు. షరా అనుకూల మిలిటెంట్ సంస్థలు ఇళ్లల్లోకి చొరబడి కాల్చిచంపటం, ఎత్తయిన భవంతుల నుంచి దూకమని హుకుం జారీచేసి ప్రాణాలు తీయటం కొనసాగుతోంది. మొన్న మార్చిలో దాదాపు 2,000 మంది ఆ హింసాకాండకు బలయ్యారు. వాటి నివారణపై ట్రంప్, షరా ఏం మాట్లాడుకున్నారో తెలియదు. కానీ శిథిలాల దిబ్బగా ఉన్న సిరియాలో 90 శాతంమంది పౌరులు తీవ్ర దారిద్ర్యంలో మగ్గుతున్నారు. దేశ పునర్నిర్మాణానికి కనీసం 20,000 కోట్ల డాలర్లు అవసరమవుతాయని ప్రపంచ బ్యాంకు అంచనా. ట్రంప్–షరా సమావేశం తర్వాతైనా సిరియాలో సాధారణ పరిస్థితులు నెలకొని, అది ఆర్థికంగా పుంజుకుంటే మంచిదే.

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు కార్తిక మాసం, **తిథి:** బ.దశమి రా.3.23 వరకు, తదుపరి ఏకాదశి, **నక్షత్రం:** పుబ్బ రా.12.47 వరకు, తదుపరి ఉత్తర, **వర్జ్యం:** ఉ.8.26 నుండి 10.04 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.22 నుండి 9.07 వరకు తదుపరి ప.12.06 నుండి 12.51 వరకు, **అమృత ఘడియలు:** సా.6.23 నుండి 8.01 వరకు.

సూర్యోదయం : 6.08
సూర్యాస్తమయం : 5.21
రాహుకాలం : ఉ.10.30 నుండి 12.00 వరకు
యమగండం : ప.3.00 నుండి 4.30 వరకు

ఇండియాకు మునీర్ బెడద తప్పదా?

విశ్లేషణ

హ్యాపీమ్యాన్ జాకబ్

పాకిస్తాన్ పార్లమెంట్ ప్రస్తుతం ప్రతిపాదిత 27వ రాజ్యాంగ సవరణపై చర్చిస్తోంది. ఈ సవరణ 243వ అధికరణాన్ని పూర్తిగా మార్చేసి దేశ సాయుధ దళాలపై నియంత్రణ, ఆధిపత్యానికి సంబంధించి మౌలికంగా కొత్త రూపు నివ్వనుంది. దేశ రాజకీయ రంగస్థలంపై సైన్యానికున్న పట్టును దృష్టిలో పెట్టుకుని చూసినపుడు, ఆ చర్చ చాలావరకు నిరుపయోగమైనదే అవుతుంది. ఎందుకంటే ఈ ఏడాది మొదట్లో భారత్–పాకిస్తాన్ మధ్య ప్రతిష్టంభన తర్వాత, పాకిస్తాన్ సైనిక ప్రధానాధికారి అసీమ్ మునీర్‌కు ఫీల్డ్ మార్షల్‌గా పదోన్నతి కల్పించారు. అమెరికా అధ్యక్షుడి నుంచి లభిస్తున్న వ్యక్తిగత మద్దతు ధీమాతో ఆయన సాయుధ దళాలపై తన అధికారాన్ని మరింత పటిష్ఠపరచుకుంటున్నారు. పౌర ప్రభుత్వ–సైనిక సంబంధాలలో ఇప్పటికే మొగ్గు సైన్యం వైపు ఎక్కువగా ఉంది. తక్కెడలో సైన్యం వైపు బరువు మరింత పెరిగేటట్లు మునీర్ చూసుకుంటున్నారు.

పదాతి దళానికే పెద్ద పీట

ప్రతిపాదిత రాజ్యాంగ సవరణ పౌర–సైనిక సంబంధాలలో, సైన్యం పాత్రలో గణనీయమైన మార్పులను ప్రవేశపెట్టే లక్ష్యాలతో ఉంది. త్రివిధ దళాలపైన పెత్తనం వహించేటట్లుగా రక్షణ దళాల ప్రధానాధికారి (సీడీఎఫ్) పదవిని సృష్టించాలని ప్రతిపాదిస్తోంది. సీడీఎఫ్‌గా ఎప్పుడూ పదాతి దళాల ప్రధానాధికారే ఉండాలని పేర్కొంటోంది. ఆయన పదవీ కాలాన్ని ఐదేళ్ళకు పెంచుతోంది. సీడీఎఫ్‌కు వీలు కల్పించేందుకు, చిరకాలంగా ఉన్న త్రివిధ దళాల సంయుక్త కమిటీ చైర్మన్ (సి.జె.సి.ఎస్.సి.) పదవిని త్వరలో రద్దు చేయనున్నారు. సంయుక్త కమిటీకి ప్రస్తుతం చైర్మన్‌గా ఉన్న జనరల్ సాహిర్ షంషాద్ మీర్జా రిటైరవడం, ఆ పదవి రద్దవడం ఒకేసారి జరగనున్నాయి. ఐదు నక్షత్రాల ర్యాంకులు పొందిన సైనిక అధికారులకు ఫీల్డ్ మార్షల్, మార్షల్ ఆఫ్ ఎయిర్ ఫోర్స్, అడ్మిరల్ ఆఫ్ ద ఫ్లీట్ వంటి సైనిక బిరుదులను ప్రదానం చేయడం అసాధారణం ఏమీ కాదుకానీ, అటువంటివారిని అభిశంసన ద్వారా తప్ప వేరే విధంగా తొలగించడానికి వీలు లేకపోవడం పాక్‌లో కనిపించే విచిత్రమైన అంశం.

అన్ని అణు, వ్యూహాత్మక సంపత్తులను పర్యవేక్షించే విధంగా జాతీయ వ్యూహాత్మక దళ కమాండర్ (సి.ఎన్.ఎస్.సి.)గా ఒకరిని నియమించాలని కూడా ఆ సవరణ ప్రతిపాదిస్తోంది. ఆర్మీ చీఫ్ సిఫార్సు మేరకు, సైన్యం నుంచే ఒకరిని ఆ పదవిలో ప్రధాన మంత్రి నియమిస్తారు. సూటిగా చెప్పాలంటే, దానిపై నియంత్రణ పౌర ప్రభుత్వం నుంచి చేజారిపోతోంది. వీసమెత్తు ప్రతిఘటన లేకుండా, పాక్‌లో బాహాటంగా, ఇలా అధికారం కేంద్రీకృతం కావడం, పర్వేజ్ ముషారఫ్ హయాంతో సహా, ఇంతకు ముందెన్నడూ చూడలేదు. ఈ పరిణామాలు పాక్, భారత్ రెండింటిపైనా గణనీయమైన ప్రభావాన్ని చూపనున్నాయి.

◆ పాకిస్తాన్‌లో ప్రతిపాదిత రాజ్యాంగ సవరణతో, అసీమ్ మునీర్ పదవీ కాలాన్ని ఐదేళ్ళకు పొడిగించినట్లవుతుంది. అణ్వాయుధాల నియంత్రణతో సహా త్రివిధ దళాలు ఆయన కనుసన్నల్లోనే మెలుగుతాయి. ఈ మార్పులకు పౌర సమాజం నుంచి ప్రతిఘటన రావొచ్చు. అందువల్ల ప్రజల దృష్టిని మళ్ళించే వ్యూహంలో భాగంగా, భారత్‌పై యుద్ధానికి, లేదా ఘర్షణకు దిగవచ్చు.

అనూహ్యంగా ఎదిగిన మునీర్

పాక్‌ను 1977 నుంచి 1988 వరకు పాలించిన సైనిక పాలకుడు జియా–ఉల్–హక్ తర్వాత, తిరిగి అంత ప్రాభవాన్ని అనుభవిస్తున్న వ్యక్తి మునీర్ కానున్నారు. జియా కంటే కూడా మునీరే నాలుగు ఆకులు ఎక్కువ చదివాడనుకోవాలి. సైనిక తిరుగుబాటు మాట లేకుండానే ఆయన మొత్తం అధికారాన్ని తన గుప్పిట్లోకి తెచ్చుకున్నారు. అసీమ్ అధికారాన్ని పటిష్ఠపరచుకున్న తీరు ఆసక్తి కలిగిస్తుంది. ఆయన 2022 నవంబర్‌లో ఆర్మీ చీఫ్ అయ్యారు. హిందువులు, ముస్లింలు కలసి ఎన్నడూ సహజీవనం సాగించలేరంటూ వ్యాఖ్యానించి, హిందూ వ్యతిరేక ధోరణితో ఈ ఏడాది మొదట్లో వార్తల కెక్కారు. ఘోరమైన పహల్‌గామ్ దాడికి సరిగ్గా ఒక నెల ముందు ఆయన నోటి నుంచి ఆ ప్రేలాపనలు వెలువడ్డాయి.

పాక్‌లో అడుగుజాడలున్న ఉగ్రవాదులు పహల్‌గామ్‌లో పౌరులను పొట్టనబెట్టుకోవడంతో, పాక్‌పై భారత్ దాడులను నిర్వహించింది. ఆ స్వల్పకాలిక సమరంలో, తాను 1971 మాదిరి విజయాన్ని సాధించినట్లుగా పాక్ నిస్సిగ్గుగా ఒక ప్రాపగాండా ప్రారంభించింది. దాన్ని ఊతంగా చేసుకునే మునీర్ దేశంలో తన స్థితిని పటిష్ఠపరచుకుని, ఫీల్డ్ మార్షల్‌గా ప్రమోషన్ గడించారు. పాక్‌ను ట్రంప్‌కు చేరువ చేసే పనిని యుక్తితో నిర్వహించారు. సౌదీ అరేబియాతో రక్షణ ఒప్పందాన్ని అధికారికం చేసుకోవడంతో సహా పశ్చిమాసియాకు స్నేహహస్తాన్ని చాచే వ్యూహాత్మక ప్రణాళికను రచించడంలో కృతకృత్యులయ్యారు.

ప్రతిపాదిత రాజ్యాంగ సవరణతో, మునీర్ పదవీ కాలాన్ని ఐదేళ్ళకు పొడిగించినట్లవుతుంది. త్రివిధ దళాలు ఆయన కనుసన్నల్లోనే మెలుగుతాయి. పాకిస్తాన్ ఆర్థిక వ్యవస్థ పరమ అధ్వాన్నంగా తయారైన పరిస్థితుల్లో, తెలివిగా పావులు కదుపుతూ, కేవలం ఎనిమిది నెలల్లో ఆయన ఈ స్థాయికి చేరుకున్నారు. కార్యనిర్వాహక అధికారాన్ని హస్తగతం చేసుకోకపోయినా నేడు పాక్‌లో ఆయనకు ఎదురు చెప్పగలవారు లేరు.

ప్రస్తుత సవరణ, వైమానిక, నౌకా దళాలను కూడా ఆర్మీ చీఫ్ పరిధిలోకి తీసుకొస్తుంది. ఇది ఆ రెండు దళాలకు రుచించకపోవచ్చు. సైనిక ప్రధానాధికారే ఎల్లప్పుడూ సి.ఎన్.ఎస్.సి.గా ఉంటాడని నిర్దేశించడాన్ని అవి వ్యతిరేకించవచ్చు. క్షిపణులు సాధారణంగా నౌకాదళం వద్ద ఉంటాయి. ఇపుడీ సవరణతో మొత్తం పాక్ అణ్వాయుధాలన్నీ పూర్తిగా సైన్యం నియంత్రణలోకి వస్తాయి. సైన్యానికి ప్రస్తుతం ఉన్న పైచేయిని ధ్రువపరచే ప్రయత్నం మాత్రమే మునీర్ చేస్తూ ఉండవచ్చు. కానీ, ఇది కార్యనిర్వాహక వ్యవస్థ ఆదేశంగా కాకుండా, రాజ్యాంగ సవరణ రూపం పొందుతోంది. కనుక, భవిష్యత్ నాయకులకు, దీన్ని తిరగదిప్పడం అసాధ్యంగా పరిణమించవచ్చు.

భారత్ ద్వేషమే ఆయుధం

భారత్ పట్ల మునీర్ విద్వేష వైఖరి సుస్పష్టం. ఇపుడు మరిన్ని అధికారాలున్న మునీర్ కింద పనిచేసే సైన్యం, భారత్‌కు గణనీయమైన సవాల్‌గా పరిణమిస్తుందనడంలో సందేహం లేదు. చిరకాలంగా, పాక్ సైన్యం దృష్టంతా భారతదేశంపైనే ఉంటూ వస్తోంది. అది ఇపుడు మరింత కేంద్రీకృతమవుతుంది. సాధారణ ప్రజానీకం, ఇమ్రాన్ ఖాన్ మద్దతుదారులు, పాకిస్తానీ పౌర సమాజం ఈ మార్పులను ప్రతిఘటించే అవకాశం ఉంది. అటువంటి పరిస్థితి తలెత్తడం సైన్యానికే వాటంగా ఉంటుంది. ప్రజల దృష్టిని మళ్ళించే అత్యంత ప్రభావయుక్తమైన వ్యూహంగా, అది భారతదేశంపై యుద్ధానికి, లేదా ఘర్షణకు దిగవచ్చు. భారత్‌కు వ్యతిరేకంగా సైన్యం చెప్పే కాకమ్మ కథలను నమ్మడానికే సహజంగా జనం మొగ్గు చూపు తారు. అది వారిని ఏకం చేసే ఆయుధంగానూ పనికొస్తుంది. కనుక, మునీర్ ఎత్తుగడలను భారత్ తప్పనిసరిగా ఒక కంట కనిపెడుతూ ఉండాలి.

వ్యాసకర్త 'కౌన్సిల్ ఫర్ స్ట్రాటజిక్ అండ్ డిఫెన్స్ రిసెర్చ్' ఫౌండర్–డైరెక్టర్ ('ద హిందూస్థాన్ టైమ్స్' సౌజన్యంతో)

పాఠశాల లోపలా, బయటా మార్పు రావాలి!

ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాలలు నిజమైన సామాజిక సమానత్వ కేంద్రాలుగా ఉండేవి. కానీ ఆ తర్వాత పరిస్థితి వేరు. కార్పొరేట్ స్కూల్స్ ధనవంతులకు, ప్రభుత్వ స్కూల్స్ పేదలకు అనే విభజన స్పష్టంగా ఏర్పడింది. ఈ విభజన విద్యావిధానంలో మార్పులు తీసుకొచ్చింది. కేవలం మార్కులు, ర్యాంకుల చుట్టూ తిరిగి విద్యార్థులకు అవసరమైన ఇతర కార్యక్రమాలను పూర్తిగా నిర్లక్ష్యం చేయడం మామూలయ్యింది. పాఠశాల స్థాయిలో జరగవలసిన సామూహిక ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాలు, పిక్నిక్‌లు, వివిధ ప్రాంతాల సందర్శనలు, జాతీయ పండుగలు వంటివి పూర్తిగా మిస్ అవుతున్నారు పిల్లలు. అప్పట్లో పాఠశాల కల్పించిన వాతావరణంతో ప్రతి ఒక్కరూ ఏదో ఒక అంశాన్ని ఇష్టంగా ఎంచుకునేవారు. అదే వారికి హాబీగా ఒత్తిడి నుంచి బయటకు తీసుకొని వచ్చేది.

ఇప్పుడు పిల్లలు 'హాయ్ ఫ్రెండ్స్' అని ఫోన్‌లో మెసేజ్ పంపుతారు కానీ పక్కన నిజమైన స్నేహితుడు ఉండడు. స్క్రీన్‌పై ఎమోజీల వెనుక ఒక లోతైన ఏకాంతం దాగి ఉంటుంది. స్నేహం చాట్ బాక్స్‌లో, ఆనందం నోటిఫికేషన్‌లలో... ఇదే నేటి బాల్యం! పాఠశాలల్లో ఉన్న శూన్యాన్ని నివాస ప్రాంతాల్లో పూరించే కృషి చేయాలి. అప్పుడే నేటి తరం సామాజిక మాధ్యమాల్లోనే కాకుండా తమ చుట్టూ ఉన్న వారితో కలిసి మెలిసి స్నేహం చేస్తారు. ఆట వస్తువులు, ఆట స్థలాలు, పార్కులు, మ్యూజియంలు, గ్రంథాలయాలు వంటివి

అందుబాటులో ఉంచితే మేలవుతుంది. ప్రతి గ్రామంలో, వాడలో, కాలనీలో పిల్లల కోసం పని చేసే పెద్దలు ఉండాలి.

పిల్లల మానసిక స్థితి

ఎన్సీఈఆర్టీ (2022) సర్వే ప్రకారం, 81% మంది పిల్లలు అకడమిక్ ఒత్తిడితో బాధపడుతున్నారు. 50% మంది పరీక్షల భయంతో ఆందోళనకు గురవుతున్నారు. 'గేమ్స్ వర్క్ షాప్ ఇంటరాక్టివ్ సర్వే' ప్రకారం జెన్ జెడ్ యువతలో 80% ఒంటరితనం అనుభవిస్తున్నారు. భారతదేశంలో ఈ పరిస్థితి మరింత తీవ్రమైంది. 'లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్' రిపోర్ట్ ప్రకారం ఒంటరితనమే డిప్రెషన్‌కు ప్రధాన కారణం.

విజ్ఞాన పాఠ్యాంశాల నుంచి పరిణామ క్రమం, మూలకాల పట్టికలను తీసేసి, 'పురాణాల్లో అన్నీ ఉన్నాయి' అంటున్నారు. ఈ మార్పులు పిల్లలలో శాస్త్రీయ ఆలోచనకు కాకుండా మూఢ విశ్వాసాలకు దారితీస్తున్నాయి. ఇంకోవైపు మత సంస్థలు పిల్లలను ఆటపాటలతో ఆకర్షిస్తూ నెమ్మదిగా వారిలో పరమత విద్వేషాలను పెంచుతున్నాయి. 'ఇండియా హేట్ ల్యాబ్' (2025) రిపోర్ట్ ప్రకారం, హేట్ స్పీచ్ 74% పెరిగింది. మత ద్వేషం పెరిగిన చోట స్నేహాలు తగ్గిపోతాయి. ఇది మన సమాజం భవిష్యత్తుకు ప్రమాద సూచిక.

ఏ చట్టం, ఏ టెక్నాలజీ ఈ సమస్యను పరిష్కరించ లేవు. మార్పు సమష్టి ప్రయత్నాల ద్వారానే సాధ్యం. గ్రూప్ యాక్టివిటీలు పెంచాలి. ఆ ప్రోగ్రాం కోసం 10 నుంచి 15 రోజులు కలిసి ప్రాక్టీస్ చేయాలి. అదే వారి మధ్య స్నేహానికి దారి తీస్తుంది. ప్రతి పాఠశాలలో ఆటలు, డిబేట్స్, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలి. ఇది స్నేహానికి తొలి అడుగు. ఆలోచనలు పంచుకునే సెషన్‌లు పెట్టాలి. తల్లితండ్రులు ఇంట్లో 'ఫ్యామిలీ షేర్ టైమ్', 'ఫ్యామిలీ గెట్ టుగెదర్' వంటివి ఏర్పాటు చేయాలి. స్థానిక ఉత్సవాలలో పిల్లల భాగస్వామ్యాన్ని పెంచాలి. సైన్స్ క్లబ్బులు, రీడింగ్ క్లబ్బులు పెట్టాలి. ఆన్ లైన్ హ్యాబిట్స్, సైబర్ బుల్లీయింగ్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. మార్పు చేయగల శక్తి మన చేతుల్లోనే ఉంది.

– డా॥ కె. రమాప్రభ । సామాజిక కార్యకర్త

సోషల్ టాక్

తాత్కాలికమే!

ఆందోళనను మీపై స్వారీ చేయనివ్వకండి. భయంతో నిర్ణయాలు తీసుకోకండి. అప్పటికప్పుడు తీసుకున్న నిర్ణయాలు మీ ఆందోళనను తొలగించి, తాత్కాలికమైన ఉపశమనాన్ని చేకూర్చవచ్చు. కానీ దీర్ఘకాలిక స్థిరత్వానికి తోడ్పడవు. ఆందోళనలో ఆలోచించండి.

– అమియా మల్లిక్, స్ప్రింటర్

మొదటి అడుగు

అసాధ్యం అన్నది ఒక అభిప్రాయం మాత్రమే! అభిప్రాయాలతో లక్ష్యాలను ఏర్పరచుకోండి. అభిప్రాయాలనే అంతిమ తీర్పులుగా భావించి మీ ప్రయాణ మార్గాన్ని మార్చుకోకండి. ప్రపంచానికి ఒక కొత్త దారిని అలవాటు చేయాలనుకున్నప్పుడు మీదే మొదటి అడుగు అవ్వాలి.

– వికాస్ ఖన్నా, సెలబ్రిటీ షెఫ్

ఆస్తి-ఐశ్వర్యం

ఆస్తి మనం అనుభవించేది. ఐశ్వర్యం మనకు ఆస్తిని సంపాదించి పెట్టేది. తెలివైన వారు మొదట ఐశ్వర్యం సంపాదిస్తారు. అవసరాలను దాటి సౌకర్యాల్లోకి, సౌకర్యాలను దాటి విలాసాల్లోకి ఎప్పుడు వెళ్లాలో తెలుసుకున్న వారే ఆర్థికంగా జీవితంలో రాణిస్తారు.

– యండమూరి వీరేంద్రనాథ్, రచయిత

ధ్యాస మళ్లింపు



ప్రతి ఒక్కరికీ జీవితంలో ఒక లక్ష్యం ఉంటుంది. కానీ మనల్ని మన అంతిమ గమ్యస్థానానికి తీసుకెళ్లే, మన లక్ష్యాన్ని నెరవేర్చే ఆ మార్గంలో మధ్యలోనే ఎక్కడో తప్పిపోతాం. ఇది వైఫల్యం కాదు. ధ్యాసను మళ్లించే శక్తులు మనపై చూపే తాత్కాలిక ప్రభావం.

– పుష్కర్ లేలే, సంగీతకారుడు

వెను వెంటనే...

చిన్న అబద్ధాలు మరిన్ని అబద్ధాలకు దారితీస్తాయి. ఆ చక్రం అలా కొనసాగుతూనే ఉంటుంది. మీరు నిజాయతీగా ఉంటే అది మీకు హాయిగా నిద్ర పట్టడానికి సహాయపడుతుంది. మన తప్పులకు మనం 'వెను వెంటనే' బాధ్యత వహించకపోవటం కూడా అబద్ధం చెప్పటమే!

– జియా మోదీ, ఎ.జడ్.బి. సహ–వ్యవస్థాపకురాలు

స్వీయ సందేశం

తరచూ నాకు నేను పంపుకునే సందేశం: "నేను మొదట నన్ను మార్చుకునే వరకు ప్రపంచాన్ని మార్చ లేను." అద్దంలో చూసుకుంటూ నాకు నేను చెప్పుకునేది: "నేను నాలాగే ఉండాలి. చుట్టూ ఎందరు ఏం చేస్తున్నా, వాళ్లను చూసి నేను మారిపోకూడదు."

– కెండ్రిక్ లామార్, అమెరికన్ ర్యాపర్

సృజనతోనే భవితకు పునాది

బాలలు కేవలం కాబోయే పౌరులు కాదు, వాళ్ళు భవిష్యత్తు సృష్టికర్తలు. బాలల్లో సృజనాత్మకత అంటే... కేవలం కథలు, కవిత్వం కళలు కాదు; అది ఒక జీవన శిక్షణ. సృజనాత్మకత బాలల మన సుల్లో వెలిగే దీపమై, వారిని విజ్ఞానంతో, విలువలతో, చైతన్యంతో నింపుతూ ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేది. సృజనాత్మకత ఒక శిక్షణ కాదు. అది ఒక సంస్కారం. ఆ సంస్కారం బాల్యంలోనే మొదల వుతుంది. ప్రతి బాలుడు/బాలిక ఒక కొత్త ప్రపంచం వైపు అడుగులు వేస్తున్న శిల్పిగా ఎదగాలంటే... పెద్దలుగా మనం ఇవ్వాల్సినవి ప్రేమ, స్వేచ్ఛ, ప్రోత్సాహం.

బాలల్లో సృజనాత్మకత అంటే వెలుగుతున్న ఒక దీపశిఖ. అది ఒకసారి వారి మనసుల్లో వెలిగితే, సమాజం మొత్తానికి వెలుగును పంచుతుంది. ఆ వెలుగులో అతడు కేవలం విజ్ఞానవంతుడిగానే కాదు; మానవత్వం, విలువలతో కూడిన సమగ్ర మనిషిగా ఎదుగుతాడు. నిజానికి మనిషిలో బాల్యంలోనే సరికొత్త ఆలోచనలకు విత్తనం పడుతుంది. ఆ చిన్న మనసుల్లో మెరుస్తున్న ఆలోచనలు పెద్ద పెద్ద ప్రపంచాలను నిర్మించగలవు. కానీ ఆ కాంతిని మసక బారనీయకుండా దానికి ఒక అందమైన అర్థ వంతమైన దిశ చూపడం పెద్దల బాధ్యత.

సృజనాత్మకత ఒక నది లాంటిది. దాన్ని అడ్డుకుంటే నిలిచిపోతుంది. దారి ఇస్తే మొత్తం సమాజాన్నే సారవంతం చేస్తుంది. ఒక బాలుడు కాగితపు పడవను వర్షపు నీటిలో వదిలినప్పుడు అది కేవలం ఆట కాదు; అందులో ప్రకృతిని, ప్రవాహాన్ని, గమ్యాన్ని తెలుసుకోవాలనే జిజ్ఞాస ఉంటుంది.

ఈనాటి విద్యావ్యవస్థలో 'పుస్తకాలు', 'బోధన' కేవలం మార్కులు, ర్యాంకులు సాధించడానికి మాత్రమే కాకుండా బాలల్లో ఊహాశక్తిని పెంచే సాధనాలుగా ఉండాల్సిన అవసరం ఉంది. పాఠశాలలు బాలల నుంచి 'సరైన సమాధానం' రాబట్టడం కన్నా, 'సరైన ప్రశ్న' వేయగలిగిన ధైర్యాన్ని పెంపొందించాలి. కథలు చెప్పడం, చిత్రకళ, నాటకాలు, శాస్త్రీయ ప్రయోగాలు ఇవన్నీ బాలల్ని విభిన్నంగా ఆలోచించడానికీ, ప్రపంచాన్ని కొత్త కోణంలో చూడటానికీ ప్రేరేపిస్తాయి. తప్పులు చేయడం, విఫలమవడం కూడా సృజనలో భాగమే. తల్లితండ్రులు, ఉపాధ్యాయులు బాలల వైఫల్యాలను విమర్శించకుండా వాటిని ఒక అనుభవంగా చూడాలి.

వర్తమాన ఏఐ కాలంలో స్మార్ట్ ఫోన్‌లు, ట్యాబ్‌లు, గేమ్‌లు, రీళ్ళు బాలల జీవన గతిలో భాగమైపోయాయి. ఆ స్థితిని ఆపలేం. వాటిని బాలలకు సృజనాత్మక మిత్రులుగా మార్చడం పెద్దల చేతిలో ఉంది.

– వారాల ఆనంద్ । కవి – కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు గ్రహీత

(నేడు బాలల దినోత్సవం)

డేటా పాయింట్



మనమేంటో గుర్తు చేసేది...

జ్యోతిర్మయం

అది మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని సాంచీ పట్టణంలోని ఒక కొండపై ఉన్న బౌద్ధ కట్టడాల సముదాయం. ఇక్కడ ఉన్న స్తూపం ప్రపంచ ప్రసిద్ధి చెందింది. రాజధాని భోపాల్‌కు ఈశాన్యంగా 46 కిలోమీటర్ల దూరంలో ఇది ఉంది. ఇక్కడికి ప్రపంచం నలుమూలల నుంచి యాత్రికులు వస్తుంటారు. అలా వచ్చిన ఒక యాత్రికుడు ఒకానొక బౌద్ధ సాధువును కలిశాడు. ఆ సాధువు నేపాల్ నుండి కాలినడకన సాంచీకి వచ్చినవాడు. సాధువు చేతిలో బౌద్ధ మత గ్రంథం ఒకటుంది. దాన్ని ఒకసారి పరికించడానికి ఆ యాత్రికుడు దాన్ని తన చేతిలోకి తీసుకున్నాడు. అందులో ఒక ఆకు ఉండటాన్ని చూసి 'ఈ ఆకు దేనికీ?' అన్నాడు.

అప్పుడు బౌద్ధ సాధువు ప్రశాంత వదనంతో ఇలా అన్నాడు:

'ఒకే చెట్టుపై వేల ఆకులు ఉంటాయి. అన్ని ఆకులూ ఒకేలా ఉండవు. కొన్ని పెద్దవిగా ఉంటాయి. మరికొన్ని చిన్నవిగా ఉంటాయి. కొన్ని ఆకులు లేతగా ఉంటాయి. అంతేకాదు, వాటి ఆకారం చూసేందుకు ఒకేలా అనిపించినా ఎంతో కొంత తేడా ఉంటుంది. కొన్నిసార్లు అవి కదులుతాయి. ఇంకొన్నిసార్లు అవి కదలవు. గాలికి ఆకు తొలుత ఏ వైపు కదులుతుందో ఎవరికీ తెలీదు. చెప్పలేరు కూడా! అలాగే ఏ ఆకు ఎప్పుడు రాలిపోతుందో కూడా ఎవరికీ తెలీదు. నిజానికి ఆకు చెట్టు మీద ఉన్నప్పుడు కూడా ఒంటరిగానే ఉంటుంది. కానీ చూసీ చూడగానే అది అర్థం కాదు. చెట్టు నుండి నేల రాలిపోయిన తర్వాత కూడా అది ఒంటరిగానే ఉంటుంది. ఇలాంటి ఆకు బతుకే ప్రపంచంలో ప్రతి ఒక్కరిదీనూ! ఈ ఆకు ఈ విషయాన్ని గుర్తు చేసుకోవడానికే ఈ పుస్తకంలో పెట్టుకున్నాను' అన్నారు సాధువు.

ఒంటరితనాన్ని ఇంతకన్నా సులభంగా ఎవరు వివరించగలరు? చెట్టు కింద నుంచి తెలుసుకునే వాస్తవ పరిస్థితి ఇదే. అదే జ్ఞానం కూడా!

– యామిజాల జగదీశ్

ఏనుగు దాడిలో రైతు దుర్మరణం

క్రిష్ణప్ప (ఫైల్)

కుప్పం రూరల్: ఒంటరి ఏనుగు దాడిలో రైతు దుర్మరణం పాలైన ఘటన గురువారం వేకువ జామున చిత్తూరు జిల్లా కుప్పం మండలం, మల్లెకుంట వద్ద చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. మండలంలోని కూర్మానుపల్లికి చెందిన క్రిష్ణప్ప(70) మల్లెకుంట వద్ద ఉన్న పొలంలోని రాగి పంటను అడవి జంతువుల నుంచి కాపాడుకోవడానికి కాపలాగా వెళ్లేవాడు. బుధవారం రాత్రి సైతం వెళ్లి పొలం గట్టున ఉన్న పాకలో పడుకున్నాడు. ఈ క్రమంలో తమిళనాడు నుంచి ఆంధ్ర వైపు వస్తున్న ఏనుగుల గుంపు నుంచి తప్పిపోయిన ఒంటరి ఏనుగు క్రిష్ణప్ప పొలం వైపు వచ్చి క్రిష్ణప్ప పడుకున్న పాకను ధ్వంసం చేసింది. క్రిష్ణప్పను సైతం తొక్కేయడంతో అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యాడు. సమాచారం అందుకున్న అటవీ అధికారులు ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కుప్పం ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబానికి రూ.10 లక్షలు నష్టపరిహారం ప్రకటించారు.

చెరకు రైతుల ఆందోళన హింసాత్మకం

50 చెరకు ట్రాక్టర్లకు నిప్పు

మంటల్లో కాలిపోతున్న చెరకు ట్రాక్టర్లు

రాయచూరు: చెరకు టన్నుకు రూ.3,500 ధర ఇవ్వాలని కోరుతూ ఉత్తర కర్ణాటకలో రైతులు సాగిస్తున్న ఆందోళన గురువారం సాయంత్రం హింసాత్మకమైంది. కొందరు రైతులు ధర్నాలో పాల్గొనకుండా చెరకును ఫ్యాక్టరీకి తరలిస్తున్నారనే కోపంతో మరో వర్గానికి చెందిన రైతులు 50 చెరకు ట్రాక్టర్లకు నిప్పు పెట్టినట్లు సమాచారం. బాగల్‌కోట సమీర్‌వాడిలోని గోదావరి చక్కెర ఫ్యాక్టరీ వద్ద ఈ ఉదంతం చోటుచేసుకుంది. ఈ ఘటనలో చెరకుతోపాటు ట్రాక్టర్లు మంటల్లో కాలిపోయాయి. ఘటనాస్థలిలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి.

29 మంది గిరిజన విద్యార్థులకు అస్వస్థత

కడుపునొప్పితో ఆస్పత్రిపాలు

ముగ్గురి పరిస్థితి విషమం

అల్లూరి జిల్లా జర్రెల ఆశ్రమ పాఠశాలలో ఘటన

చికిత్స పొందుతున్న గిరిజన విద్యార్థులు

సాక్షి, పాడేరు : అల్లూరి సీతారామరాజు జిల్లాలోని గూడెంకొత్తవీధి మండలం మారుమూల జర్రెల గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో బుధవారం దుంపల కూర, పెరుగు తిన్న 29 మంది గిరిజన విద్యార్థులు కడుపునొప్పితో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వీరికి గురువారం ఉదయాన్నే నిద్రలేచిన కొద్దిసేపటి తరువాత ఒక్కసారిగా కడుపునొప్పి మొదలైంది. దీంతో.. పాఠశాలకు ఎదురుగా ఉన్న జర్రెల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. సకాలంలో వైద్యసేవలు అందించడంతో ప్రమాదం తప్పింది. మధ్యాహ్నానికి 26 మంది కోలుకోవడంతో వారు పాఠశాలకు వచ్చి విశ్రాంతి తీసుకుంటున్నారు. కానీ, అరుణ్‌కుమార్ (10వ తరగతి), శామ్యూల్ (5వ తరగతి), కె. రవి (3వ తరగతి)కి బీపీ అధికంగా ఉండడంతో పరిస్థితి విషమంగా మారింది. మెరుగైన వైద్యం నిమిత్తం ఈ ముగ్గుర్నీ చింతపల్లి కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. ఈ పాఠశాలలో మొత్తం 240 మంది గిరిజన విద్యార్థులు ఉన్నారు.

కలుషిత పెరుగే కారణమా!?..

ఈ ఆశ్రమ పాఠశాలకు పెరుగు సరఫరా లేకపోవడంతో నిర్వాహకులు పాలను తోడుపెడుతున్నారు. కానీ, పాలు తోడుకోలేదని బుధవారం మధ్యాహ్నం ఎండలో పెట్టడంతో పెరుగు కలుషితమై ఉంటుందని భావిస్తున్నారు. సమాచారం అందుకున్న చింతపల్లి సహాయ గిరిజన సంక్షేమాధికారి జయనాగలక్ష్మి ఉదయాన్నే జర్రెల ఆశ్రమ పాఠశాల, ఆస్పత్రిని సందర్శించి బాధిత విద్యార్థులను పరామర్శించి ఘటనపై విచారణ జరిపారు. పెరుగు కలుషితంపై వివరాలు సేకరించారు. అలాగే, ఈ ఘటనపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరపాలని సీఐటీయూ నేత చిలకల రవికుమార్, ఏబీవీపీ నేత తిరుపల్లి యోగిలు గురువారం వేర్వేరు ప్రకటనల్లో డిమాండ్ చేశారు. గిరిజన విద్యార్థులకు నాణ్యమైన ఆహారం ఇవ్వకపోవడంవల్లే ఇలాంటి సంఘటనలు చోటుచేసుకుంటున్నాయని వారు ఆరోపించారు.

శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో ఉద్రిక్తత

దళిత విద్యార్థి ఆత్మహత్యతో ఆందోళనకు దిగిన 3 వేల మంది విద్యార్థులు

తమ కుమారుణ్ని అన్యాయంగా చంపేశారంటూ తల్లిదండ్రుల ఆవేదన

8 మంది విద్యార్థులను సస్పెండ్ చేసిన డైరెక్టర్

శ్రీకాకుళం క్రైమ్: శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలం ఎస్ఎంపురంలోని శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో బుధవారం దళిత విద్యార్థి ప్రత్తిపాటి సృజన్ ఆత్మహత్య ఘటనతో విద్యార్థులు ఆందోళనకు దిగారు. గుంటూరుకు చెందిన సృజన్‌కు మద్దతుగా కళాశాలలోని 3 వేల మంది విద్యార్థులు గురువారం ఉదయం ధర్నాకు దిగారు. యాజమాన్యం తీరుపై నిరసన గళం వినిపించారు. సృజన్ ఆత్మహత్య చేసుకునేలా సీనియర్లు ప్రవర్తించారని, బుధవారం రాత్రి 11 గంటల నుంచి 3 గంటల వరకు చిత్రహింసలకు గురిచేశారని మండిపడ్డారు. బ్యాక్‌లాగ్స్ ఉంచేశాడని, సరిగా చదవడని ఒత్తిడితోనే చనిపోయాడంటూ యాజమాన్యం చెప్పడం దుర్మార్గమన్నారు. తమ బిడ్డను అన్యాయంగా నాలుగు గంటలపాటు కొట్టి చంపేశారని, అనంతరం ఫ్యాన్‌కు వేలాడదీశారని, సమాచారం కూడా ఆలస్యంగా ఇచ్చారని సృజన్ తల్లిదండ్రులు వాపోయారు. ఎస్ఎఫ్ఐ సభ్యులు సైతం కళాశాల డైరెక్టర్ కె.వి.జి.డి.బాలాజీ, రిజిస్ట్రార్ అమరేంద్రలతో వాగ్వాదానికి దిగారు. చివరికి శ్రీకాకుళం డీఎస్పీ సీహెచ్ వివేకానంద ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న 9 మంది విద్యార్థుల్లో 8 మందిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. అనంతరం క్యాంపస్ డైరెక్టర్ ఉత్తర్వుల మేరకు 8 మందిని సస్పెండ్ చేశారు.

భోజనం సరిగా పెట్టడం లేదు

వారానికి ఆరు సార్లకు బదులుగా రెండు సార్లే గుడ్లు ఇస్తున్నారు

ఏపీ ఫుడ్ కమిషన్ సభ్యురాలికి విద్యార్థుల ఫిర్యాదు

మాట్లాడుతున్న గంజిమాల దేవి

మార్కాపురం టౌన్: ప్రకాశం జిల్లా మార్కాపురం పట్టణంలోని నాగులవరం రోడ్డులో ఉన్న ఎస్టీ హాస్టల్‌లో విద్యార్థులకు ఆహారాన్ని మెనూ ప్రకారం అందించడం లేదని ఏపీ ఫుడ్ కమిషన్ మెంబర్ గంజిమాల దేవి ఎదుట విద్యార్థినులు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం ఆమె హాస్టల్‌ను సందర్శించారు. విద్యార్థినులతో మాట్లాడి హాస్టల్లో సౌకర్యాలు, మెనూ అమలు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులు మాట్లాడుతూ వారానికి ఆరు సార్లు కోడిగుడ్లు ఇవ్వాల్సి ఉండగా, రెండుసార్లు మాత్రమే ఇస్తున్నారని వాపోయారు. సాయంత్రం పండ్లు ఇవ్వడం లేదని, 301 మంది విద్యార్థినులు ఉండగా, రెండు లీటర్ల పాలు మాత్రమే ఇస్తున్నారని, తాగునీరు సరిగా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. 15 మంది పిల్లలతో చపాతీలు తయారు చేయిస్తున్నారని, అన్నం కూడా సరిగ్గా పెట్టడం లేదని, మళ్లీ అన్నం కోసం వెళితే తిడుతున్నారని తమ గోడు వెళ్లబోసుకున్నారు. స్పందించిన ఫుడ్ కమిషన్ సభ్యురాలు అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వార్డెన్‌ను విధుల నుంచి తొలగించేలా ఉన్నతాధికారులకు నివేదిక పంపాలని జిల్లా గిరిజన సంక్షేమ శాఖాధికారిని ఆదేశించారు. అలాగే వంట సిబ్బందిని కూడా తొలగించాలన్నారు. విద్యార్థుల విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సహించనని, కమిషన్ తరపున కూడా సుమోటోగా తీసుకుంటామని తెలిపారు.

భీమేశ్వరస్వామి సేవలో జస్టిస్ మల్లికార్జునరావు

సామర్లకోట: కాకినాడ జిల్లా సామర్లకోట పంచారామ క్షేత్రంలో వేంచేసి ఉన్న బాలాత్రిపుర సుందరి సమేత కుమార రామ భీమేశ్వరస్వామిని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జునరావు దంపతులు గురువారం దర్శించుకున్నారు. వారికి ఈవో బళ్ల నీలకంఠం, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం జస్టిస్ మల్లికార్జునరావు దంపతులు పూజలు చేసి.. ఆలయ ప్రాంగణంలోని శివలింగానికి అభిషేకాలు చేశారు. వారికి వేద పండితులు ఆశీర్వచనాలు అందజేయగా.. ఈవో నీలకంఠం చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

ఏలూరు కలెక్టరేట్ వద్ద కొల్లేరు వాసుల ధర్నా

కొల్లేరు భూముల్లో వరి సాగును అడ్డుకుంటున్నారని ఆందోళన

ఏలూరు (టూటౌన్): కొల్లేరు భూముల్లో వరి పంట సాగును అటవీ శాఖ అధికారులు అడ్డుకుంటున్నారని, దీనిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఏలూరు జిల్లా ఉంగుటూరు నియోజకవర్గానికి చెందిన కొల్లేరు గ్రామాల ప్రజలు గురువారం ఏలూరు కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. నిడమర్రు మండలంలోని తోకలపల్లి, బైనేపల్లి, డి.గోపవరం, అడవికొలను, పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడు గ్రామాల్లోని 1,500 కుటుంబాలకు చెందిన వారు 50 ఏళ్లుగా కొల్లేరులో వరి సాగు చేస్తూ జీవనం పొందుతున్నారు. అయితే అటవీ అధికారులు ఇక్కడ వరి సాగును అడ్డుకుంటున్నారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు తమకు న్యాయం చేయాలని గురువారం ఏలూరు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. అనంతరం వారి సమస్యలపై జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వికి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల సొసైటీల ప్రతినిధులు కూడా విడివిడిగా కలెక్టర్‌కు వినతిపత్రాలు అందజేశారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ కొల్లేరు భూముల్లో కలుషిత రసాయనాలు వినియోగించి పర్యావరణాన్ని పాడుచేయవద్దని సూచించారు. కొల్లేరు భూములు కోర్టు పరిధిలో ఉన్నాయని, ఆ భూముల విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని తెలిపారు.

హాస్టల్ విద్యార్థిని బ్యాగ్‌లో ప్రెగ్నెన్సీ టెస్ట్ కిట్, మంగళసూత్రం

అధికారులు గోప్యంగా ఉంచడంతో ఆలస్యంగా వెలుగులోకి

నెహ్రూనగర్: గుంటూరు నగరం నడిబొడ్డున ఉన్న పరివర్తన భవన్ (ఎస్సీ వెల్ఫేర్ కాలేజీ బాలికల హాస్టల్)లో ఓ విద్యార్థిని బ్యాగ్‌లో ప్రెగ్నెన్సీ టెస్ట్ కిట్, మంగళసూత్రం, మెట్టెలు ఉన్న విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సంక్షేమ హాస్టల్స్‌లో ఉండే విద్యార్థినుల బ్యాగులు చెక్ చేసే క్రమంలో వారం రోజుల కిందట పరివర్తన భవన్‌లోని ఓ విద్యార్థిని బ్యాగులో ఇవి బయటపడ్డాయి. వెంటనే సిబ్బంది వార్డెన్‌కి చెప్పగా, వార్డెన్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. ఈ విషయాన్ని అధికారులు గోప్యంగా ఉంచారు. బయటకు పొక్కడంతో బుధవారం రాత్రి సోషల్ వెల్ఫేర్ డైరెక్టర్ లావణ్యవేణి హాస్టల్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. హాస్టల్‌లో అపరిశుభ్ర వాతావరణం చూసి నివ్వెరపోయారు. ముగ్గురు వార్డెన్లు ఉన్నప్పటికీ హాస్టల్‌ను ఈ విధంగా గాలికి వదిలేస్తారా అంటూ వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వారం రోజుల్లో మళ్లీ వస్తానని హెచ్చరించి, అక్కడి నుంచి వెళ్లినట్లు సమాచారం. విద్యార్థిని బ్యాగ్‌లో దొరికిన ప్రెగ్నెన్సీ టెస్ట్ కిట్ వ్యవహారంపై ఏఎస్‌డబ్ల్యూఓ శైలజను వివరణ కోరగా అటువంటి ఘటనలు గాని, ఫిర్యాదులు రాలేదని చెప్పారు. ఈ ఘటనకు బాధ్యులైన ఏఎస్‌డబ్ల్యూఓ(అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్), హాస్టల్ వార్డెన్‌కు షోకాజ్ నోటీసులు ఇవ్వాలని ఆ శాఖ డీడీ(డిప్యూటీ డైరెక్టర్)ను ఆదేశించినట్లు తెలుస్తోంది. నెల కిందట ఇదే హాస్టల్‌కు చెందిన ఓ విద్యార్థినిని ఓ ఆకతాయి హైదరాబాద్‌కు తీసుకువెళ్లాడు. 3 రోజులపాటు పోలీసులు శ్రమించి ఆ విద్యార్థినిని హాస్టల్ అధికారులకు అప్పగించారు. ఈ విషయంలో విద్యార్థిని తల్లిదండ్రులు హాస్టల్ వద్దకు వచ్చి అధికారులపై మండిపడ్డారు. గతేడాది డిసెంబర్‌లో ఇదే పరివర్తన భవన్‌లో ఓ విద్యార్థిని ప్రసవించిన విషయం తెలిసిందే. ఈ విషయం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించడంతో అప్పటి వార్డెన్‌ను సస్పెండ్ చేశారు. హాస్టల్ నిర్వహణపై పాలకులు, అధికారులు ఎంత నిర్లక్ష్యంగా ఉన్నారో చెప్పేందుకు ఈ వరుస ఘటనలే నిదర్శనం.

జీకేవీకేలో వ్యవసాయ ప్రదర్శన

బనశంకరి: బెంగళూరులోని గాంధీ వ్యవసాయ విశ్వవిద్యాలయం(జీకేవీకే) ఆవరణలో గురువారం నుంచి వికసిత్ భారత్–రైతు జాతర పేరిట వ్యవసాయ ప్రదర్శన ఆరంభమైంది. కేంద్ర సహాయ మంత్రి శోభా కరంద్లాజె, ఆ రాష్ట్ర మంత్రి చెలువరాయస్వామి ప్రారంభించారు. వైవిధ్యమైన వ్యవసాయ ఉపకరణాలు, ఉత్పత్తులు ఇందులో ఆకట్టుకున్నాయి.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
AP పోలీస్ శాఖ
రీ–టెండరు నోటిఫికేషన్

రీ–టెండరు ప్రకటన నం. EAGLE/IT-PROC/2025-26/003, టెండరు ఐడి నం. 863612, ఎలైట్ యాంటీ – నార్కోటిక్స్ గ్రూప్ ఫర్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్ (EAGLE), ఆంధ్రప్రదేశ్, మంగళగిరి కోసం బిజినెస్–క్లాస్ ఆల్–ఇన్–వన్ డెస్క్‌టాప్స్ మరియు Intel® EVO™ సర్టిఫైడ్ ల్యాప్‌టాప్స్ సేకరణ కొరకు రీ–టెండరు కోరబడుతుంది. రీ–టెండరు వివరాలు వెబ్‌సైట్ https://tender.apeprocurement.gov.inపై 12.11.2025న సా. 5.30 గం॥ నుండి 27.11.2025న సా. 5.00 గం॥వరకు లభిస్తాయి. సంప్రదించాల్సిన అధికారి: DSP, Tech, EAGLE, AP, మంగళగిరి, ఫోన్: 8686068888

సం/- ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్, ఎలైట్ యాంటీ–నార్కోటిక్స్ గ్రూప్ ఫర్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్ (EAGLE), A.P., మంగళగిరి
DIPR RO No. 18036/CL/ADVT/1/1/2021-22, Dt: 13.11.2025

DHARMAVARAM MUNICIPALITY
IFB Tender Notice No. 54 / AHUDA & Municipal General Funds / 2025-26/E1.

'e' procurement Tender Notice No. 54 / AHUDA & Municipal General Funds /2025-26/E1 under General Funds With value of work Rs. 2.55 Crores Details of name of work, Tender document, Eligibility Criteria, Bid Submission & Price bid opening date and EMD details etc., may be seen on 'e'procurement website - https://tender.apeprocurement.gov.in.

Sd/- Commissioner (FAC), Dharmavaram Municipality

దక్షిణ మధ్య రైల్వే
మమ్మల్ని అనుసరించండి @SCRailwayindia ద.మ. రైల్వే టెండరు ప్రకటనల వివరాలను మా వెబ్‌సైట్: www.scr.indianrailways.gov.inలో చూడవచ్చును

నం. GNT/C. E AUCTION CATALOGUE/2025-26 తేది: 13-11-2025.
'ఇ' వేలం లీజింగ్ ద్వారా ఇచ్చే కమర్షియల్ ఎర్నింగ్ కాంట్రాక్ట్స్ కోసం గుంటూరు డివిజన్‌లో మంత్లీ కేటలాగ్

భారత రాష్ట్రపతి తరఫున సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్, దక్షిణ మధ్య రైల్వే, గుంటూరు డివిజన్, గుంటూరు వారు ireps వెబ్ పోర్టల్‌లోని ఇ–వేలం లీజింగ్ మాడ్యూల్ ద్వారా ఇ–బిడ్లు కోరుతున్నారు. ప్రచురించిన కేటలాగ్స్ వివరాలు దిగువ విధంగా ఉన్నాయి.
పే అండ్ యూజ్ టాయిలెట్స్ మరియు క్లోక్ రూమ్ యొక్క ఆపరేషన్ మరియు నిర్వహణ కాంట్రాక్టు.

క్ర. సం.	కాంట్రాక్ట్ రకం	స్టేషన్	కాంట్రాక్ట్ కాలవ్యవధి	బయానా విలువ	వేలం ప్రారంభ తేది మరియు సమయం
1.	పే అండ్ యూజ్ టాయిలెట్స్	గుంటూరు	3 సంవత్సరాలు	బిడ్ విలువలో 10%	28-11-2025న 11.00 గం.లు
2.	క్లోక్ రూమ్	గుంటూరు	5 సంవత్సరాలు	బిడ్ విలువలో 10%	28-11-2025న 11.00 గం.లు

ఇ–టెండర్లలో పాల్గొనుటకు ireps ఇ–వేలం లీజింగ్‌లో డిజిటల్ సిగ్నేచర్ సర్టిఫికెట్ పొందుటకు మరియు తమంతటతాము నమోదు చేసుకొనుట టెండరుదారుదే బాధ్యతగా ఉంటుంది. ireps పోర్టల్ ద్వారా ఇ–వేలం లీజింగ్‌లో నమోదు చేసుకొనుటకు మరియు పాల్గొనుటకు ముందస్తు ఆవశ్యకతలు www.ireps.gov.in పోర్టల్‌లోని మాన్యువల్ మరియు మార్గదర్శకాల క్రింద లభిస్తాయి. దిగువ సంతకందారు కోరినపుడు టెండరుదారు అవసరమైన డాక్యుమెంట్లను కార్యాలయంలో దాఖలు చేయాలి. టెండరుకు సంబంధించి చెల్లింపు సమయంలో లేదా డాక్యుమెంట్ల అప్‌లోడింగ్ సమయంలో IREPS పోర్టల్‌లో సంభవించే ఏదేని అవాంతరానికి రైల్వే అడ్మినిస్ట్రేషన్ బాధ్యత వహించదు. టెండరు ఫారంలో నిర్దేశించిన నిబంధనలన్నింటినీ నెరవేర్చకుండా స్వీకరించిన టెండర్లు కచ్చితంగా తిరస్కరించబడును. పైన తెలిపిన టెండరు యొక్క పూర్తి వివరాలు www.ireps.gov.in పోర్టల్‌లోని ఇ–వేలం లీజింగ్ మాడ్యూల్‌లో లభిస్తాయి.

PUB/1437
A1829
సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్, గుంటూరు

సత్యసాయి శత జయంతి ఉత్సవాలు ప్రారంభం

ఈ నెల 23 వరకు వేడుకలు

ప్రశాంతి నిలయం: శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలోని ప్రశాంతి నిలయంలో సత్యసాయి బాబా శతజయంతి వేడుకలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఇందుకోసం ప్రశాంతి నిలయాన్ని ప్రత్యేకంగా ముస్తాబు చేశారు. సత్యసాయి మహాసమాధిని ప్రత్యేక ఫల, పుష్ప, దళాలతో దేదీప్యమానంగా అలంకరించారు. సాయంత్రం సాయికుల్వంత్ సభా మందిరంలోని సత్యసాయి మహాసమాధి చెంత వేదపఠనంతో శతజయంతి వేడుకలు ప్రారంభించారు. ఈ నెల 23 వరకు వేడుకలు జరుగుతాయి. ఇందులో భాగంగా ఈ నెల 19న అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి భారత ప్రధాని నరేంద్ర మోదీ హాజరవుతారని నిర్వాహకులు తెలిపారు. 22న నిర్వహించే సత్యసాయి విద్యాసంస్థల స్నాతకోత్సవంలో ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్ పాల్గొంటారు. ఈ నెల 23న సత్యసాయి శతజయంతి కార్యక్రమానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. కాగా.. సత్యసాయి శతజయంతి వేడుకలలో భాగంగా భక్తుల సౌకర్యార్థం సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మహానారాయణ సేవ(అన్నదానం)ను మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్‌రాజు ప్రారంభించారు. భక్తులకు మూడుపూటలా అన్న ప్రసాదాలు పంపిణీ చేయనున్నారు. తొలిరోజు సాయంత్రం ప్రముఖ ఫ్లూట్ వాద్యకారుడు అనిర్బన్ రాయ్ కచేరీ అలరించింది. వేడుకలకు దేశ, విదేశాల నుంచి భారీగా భక్తులు తరలిచ్చారు.

తిరుపతిలో ప్రారంభమైన నృత్యవాహిని

కాండియన్స్ డ్యాన్స్‌ను ఇక్కడి నృత్యకారులు నేర్చుకుంటున్న దృశ్యం

తిరుపతి రూరల్: తిరుపతిలోని శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో ప్రపంచ నృత్య సంప్రదాయాల సమ్మేళనం 'నృత్యవాహిని' గురువారం ఘనంగా ప్రారంభమైంది. మూడురోజులు జరిగే ఈ నృత్యవాహినిని వర్సిటీలోని ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో వైస్‌చాన్సలర్ ఆచార్య వి.ఉమ, మైసూరు విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ హెచ్.కె.శీలశ్రీధర్ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ ఉమ మాట్లాడుతూ నృత్యం దేశ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దంపడుతుందని చెప్పారు. నృత్యం చేయడం ద్వారా మానసిక ప్రశాంతత పొందవచ్చని, శారీరక రుగ్మతలను పోగొట్టుకోవచ్చని పేర్కొన్నారు. మైసూరు విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ హెచ్.కె.శీలశ్రీధర్ మాట్లాడుతూ నృత్య వారసత్వాన్ని సంరక్షించడం, పునరుద్ధరించడం, సరికొత్త నృత్యరూపకాలను ఆవిష్కరించడమే నృత్యవాహిని ముఖ్య ఉద్దేశమని చెప్పారు. అనంతరం శ్రీలంక యూనివర్సిటీ ఆఫ్ విజువల్ అండ్ పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ నుంచి వచ్చిన డాక్టర్ ఇండికా టిక్రి, బండార వీరకూన్ బృందం ప్రదర్శించిన కాండియన్స్ డ్యాన్స్ అందరినీ అలరించింది. వారు ఇక్కడి నృత్యకారులకు కూడా కాండియన్ డ్యాన్స్ నేర్పించారు. తరువాత మహారాష్ట్రలోని నాసిక్‌కు చెందిన అక్షయ్ సహానే, అనంత బృందం కథక్ నృత్యం ప్రదర్శించింది. ఈ కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య రజని, కన్వీనర్ పి.విజయలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

వక్ఫ్ ఆస్తుల 'ఆన్‌లైన్' నమోదులో సాంకేతిక సమస్యలు

రాష్ట్ర వక్ఫ్‌బోర్డు సీఈవోకు ముస్లిం సంఘాల ప్రతినిధుల వినతి



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో మసీదులు, దర్గాలు, మదర్సాలు, పంజాలు తదితర మొత్తం వక్ఫ్ ఆస్తులను ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేసేందుకు ఎదుర్కొంటున్న అనేక సాంకేతిక సమస్యలను ఏపీ ముస్లిం జేఏసీ ఆధ్వర్యంలో వివిధ జమాతుల ప్రతినిధి బృందం గురువారం విజయవాడలోని ప్రధాన కార్యాలయంలో ఏపీ వక్ఫ్ బోర్డు సీఈవో మొహమ్మద్ అలీ దృష్టికి తీసుకెళ్లింది. గడువులోగా ఆస్తుల ఆన్‌లైన్ అప్‌లోడ్ అసాధ్యమని, సాంకేతిక సమస్యలు గుర్తించి దిద్దుబాటు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేసింది. సీఈవోను కలిసిన వారిలో ఏపీ ముస్లిం జేఏసీ కన్వీనర్ షేక్ మునీర్ అహ్మద్ తదితరులున్నారు.

భార్య గొంతుకోసి హత్య

పట్టపగలు అందరూ చూస్తుండగానే భర్త దారుణం

పోలీసులు వచ్చేవరకు కత్తితో అక్కడే ఉన్న నిందితుడు

నిందితుడు

లబ్బీపేట (విజయవాడ తూర్పు): అనుమానం పెనుభూతమైన ఒక భర్త పట్టపగలు అందరూ చూస్తుండగానే గొంతుకోసి భార్యను హత్యచేశాడు. ఈ దారుణ ఘటన ఎన్టీఆర్ జిల్లా కేంద్రం విజయవాడలో గురువారం జరిగింది. ప్రేమించి పెళ్లిచేసుకున్న వారి కాపురం మూడేళ్లయినా సజావుగా సాగకముందే కలతలొచ్చాయి. ఈ నేపథ్యంలో ఆమెను హత్యచేశాడు. సూర్యారావుపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏలూరు జిల్లా నూజివీడుకు చెందిన మట్టకొయ్య సరస్వతి విజయవాడలోని ఒక ఆస్పత్రిలో నర్సుగా పనిచేస్తుండగా.. అదే ఆస్పత్రిలో ఆపరేషన్ థియేటర్ టెక్నీషియన్‌గా చేస్తున్న విజయవాడ దుర్గాపురానికి చెందిన దీపాల విజయ్‌తో పరిచయం ఏర్పడింది. వీరి పరిచయం ప్రేమగా మారింది. తరువాత విజయ్ పెళ్లికి నిరాకరించడంతో పెద్దలు మాట్లాడి 2022లో నూజివీడులోని బీఎస్పీ కార్యాలయంలో వివాహం చేశారు. వీరికి రెండేళ్ల కుమారుడున్నాడు. ప్రస్తుతం సరస్వతి విజయవాడ సూర్యారావుపేటలోని విన్స్ ఆస్పత్రిలో నర్సుగా పనిచేస్తుండగా, విజయ్ భవానీపురంలోని ఎస్‌వోఎస్ ఆస్పత్రిలో ఆపరేషన్ థియేటర్ టెక్నీషియన్‌గా చేస్తున్నాడు. విజయ్ భార్యను అనుమానిస్తున్న నేపథ్యంలో కలతలతో ఏడాదిగా విడిగా ఉంటున్నారు. అప్పటి నుంచి మరింత కక్ష పెంచుకున్న విజయ్ ఆమెను చంపేయాలనుకున్నాడు. సరస్వతి గురువారం మధ్యాహ్నం రెండుగంటలకు ఆస్పత్రిలో విధులు ముగించుకుని బయటకు వచ్చింది. అప్పటికే బైక్‌పై వచ్చి గేటు వద్ద ఉన్న విజయ్.. ఒక్కసారిగా పదునైన కత్తితో ఆమె గొంతు కోసేశాడు. దీంతో ఆమె అక్కడికక్కడే కుప్పకూలి ప్రాణాలు విడిచింది. ఈ సమాచారం తెలిసి పోలీసులు వచ్చేవరకు విజయ్ రక్తంతో తడిచిన కత్తిని పట్టుకుని అక్కడే నిలబడ్డాడు. నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు సరస్వతి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించాడు. కేసు నమోదు చేసి, పూర్తి వివరాలు సేకరించనున్నట్లు సీఐ అహ్మద్ అలీ తెలిపారు.

ఎన్టీటీపీఎస్ బాయిలర్‌లో పేలుడు

ఏడీఈ శేషుబాబుకు గాయాలు

ఇబ్రహీంపట్నం: ఎన్టీఆర్ జిల్లాలోని ఎన్టీటీపీఎస్ ఐదో యూనిట్ బాయిలర్‌లో గురువారం స్వల్పంగా పేలుడు సంభవించింది. రోజువారీ బాయిలర్ తనిఖీల్లో భాగంగా ఐదో యూనిట్ అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ శేషుబాబు బాయిలర్ తనిఖీ చేయడంలో భాగంలో పైప్‌లైన్ డోర్ ఓపెన్ చేశారు. ఆ సమయంలో పైపులో ఉన్న నీరు, బూడిద ఒక్కసారిగా చిమ్మడంతో పైపులైన్ జాయింట్ వద్ద ఒక్కసారిగా స్వల్ప పేలుడు సంభవించింది. దీంతో బూడిద కలిసిన వేడి నీరు ఏడీఈ శేషుబాబుపై పడటంతో వీపుపై చర్మం కాలిపోయింది. వెంటనే ఏడీఈని సమీపంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఆయన ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు అధికారులు తెలిపారు.

సాక్షి ఉద్యోగ అవకాశాలు

SBI
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
సెంట్రల్ రిక్రూట్‌మెంట్ & ప్రమోషన్ డిపార్ట్‌మెంట్
కార్పొరేట్ సెంటర్, ముంబై
ఇమెయిల్: crpd@sbi.co.in

కాంట్రాక్టు ప్రాతిపదికన స్పెషలిస్టు అధికారుల నియామకం

భారతీయ స్టేట్ బ్యాంకు కాంట్రాక్టు ప్రాతిపదికన క్రింద పేర్కొనిన స్పెషలిస్టు ఉద్యోగాల కొరకు భారత పౌరుల నుండి దరఖాస్తులు కోరుచున్నది:

ప్రకటన నం. CRPD/SCO/2025-26/15

పోస్టు పేరు	ఖాళీ
హెడ్ (ప్రొడక్ట్, ఇన్వెస్ట్‌మెంట్ & రీసెర్చ్)	01
జోనల్ హెడ్	04
రీజనల్ హెడ్	07
ఆర్ఎం – టీమ్ లీడ్	19
ఇన్వెస్ట్‌మెంట్ స్పెషలిస్ట్	22
ఇన్వెస్ట్‌మెంట్ ఆఫీసర్	46
ప్రాజెక్ట్ డెవలప్‌మెంట్ మేనేజర్ (బిజినెస్)	02
సెంట్రల్ రీసెర్చ్ టీం (సపోర్ట్)	02

అర్హతా ప్రమాణాలు (వయస్సు, అర్హతా, అనుభవం, ఉద్యోగ ప్రొఫైల్ మొదలైనవి), చెల్లించవలసిన ఫీజు మరియు ఇతర వివరాల కోసం బ్యాంక్ వెబ్‌సైట్ https://sbi.bank.in/web/careers/current-openings లో లాగిన్ అయ్యి, ఆన్‌లైన్‌లో దరఖాస్తును నింపి ఆన్‌లైన్ ఫీజు లింక్ ద్వారా దరఖాస్తు ఫీజును చెల్లించండి. దరఖాస్తు మరియు ఫీజు చెల్లింపు వివరాలతో పాటు అర్హతలని నిర్ధారించు కొనుటకు మరియు పూర్తి వివరాల కొరకు ప్రకటనను చూడండి. ఏవైనా సందేహాలు ఉన్నచో, దయచేసి మాకు – "CONTACT US" —> "Post Your Query" లింకు ద్వారా వ్రాసి పంపండి. ఈ లింకు మీకు బ్యాంకు వెబ్ సైట్ (https://sbi.bank.in/web/careers/post-your-query) లో లభించును.

* ఆన్ లైన్ లో దరఖాస్తు చేయుటకు మరియు ఫీజు చెల్లింపు తేదీ : 27.10.2025 నుండి 17.11.2025 వరకు.

స్థలం: ముంబై
తేదీ: 27.10.2025
మహానిర్వహణాధికారి (ఆర్‌పి & పీఎం)

ముకుల్‌రాయ్ సభ్యత్వం రద్దు

పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం ప్రకారం దోషిగా తేల్చిన కలకత్తా హైకోర్టు

కోల్‌కతా: తృణమూల్ కాంగ్రెస్ సీనియర్ నేత ముకుల్ రాయ్‌ను పశ్చిమబెంగాల్ శాసనసభ సభ్యునిగా అనర్హుడిగా ప్రకటిస్తూ కలకత్తా హైకోర్టు గురువారం కీలక తీర్పువెలువరిచింది. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టంలోని సెక్షన్ల ప్రకారం ఆయనను జస్టిస్ దేబాంగ్సు బసాక్, జస్టిస్ మొహమ్మద్ షబ్బార్ రషీదిల డివిజన్ బెంచ్ ఈ నిర్ణయం తీసుకుంది. భారత న్యాయశాస్త్ర చరిత్రలో హైకోర్టు ఇలా ఒక శాసనసభ్యుడిని అనర్హుడిగా ప్రకటించి అతని సభ్యత్వాన్ని రద్దుచేయడం ఇదే తొలిసారి అని కలకత్తా హైకోర్టు న్యాయవాదులు పేర్కొన్నారు. తృణమూల్ సీనియర్ నేత అయన ముకుల్ రాయ్ గతంలో టీఎంసీ చీఫ్ మమతా బెనర్జీతో విభేదాలొచ్చి పార్టీని వీడారు. తర్వాత బీజేపీలో చేరారు. దాంతో 2021 మేలో కృష్ణనగర్ ఉత్తర నియోజకవర్గం నుంచి బీజేపీ టికెట్‌పై పోటీచేసి గెలిచారు. అయితే కేవలం నెలరోజులకే ఆయన మళ్లీ టీఎంసీ గూటికి చేరుకున్నారు. దీంతో ఆయన సభ్యత్వాన్ని రద్దుచేయాలంటూ బీజేపీ నేత సువేంధు అధికారి హైకోర్టులో వేసిన పిటిషన్‌పై ధర్మాసనం గురువారం తీర్పు వెలువరించింది. తీర్పుపై సువేంధు సంతోషం వ్యక్తంచేశారు. ఇది రాజ్యాంగబద్ధ విజయమని వ్యాఖ్యానించారు. అసెంబ్లీలో ప్రజాపద్దుల కమిటీ చైర్మన్‌గా ఆయన తరఫున దాఖలైన నామినేషన్‌ను సైతం కోర్టు రద్దుచేసింది.

మంటల్లో చిక్కుకున్న కంటైనర్లు, కారు

- 8మంది మృతి.. 14 మందికి గాయాలు
- మహారాష్ట్రలో ఘోర ప్రమాదం

పుణే: మహారాష్ట్రలోని పుణే నగరంలో ముంబై–బెంగళూరు జాతీయ రహదారిపైనున్న వంతెనపై గురువారం సాయంత్రం ఘోర ప్రమాదం సంభవించింది. వేగంగా వెళ్తున్న రెండు భారీ కంటైనర్ వాహనాల మధ్య ఓ కారు చిక్కుకుపోయింది. రాపిడి కారణంగా అవి మంటల్లో చిక్కుకున్నాయి. ఈ ఘటనలో 8 మంది మరణించారని, 14 మంది గాయడ్డారని పోలీసులు వెల్లడించారు. ప్రమాదం ఎలా జరిగిందో గుర్తించినట్లు చెప్పారు. ముంబై వైపు వెళ్తున్న కంటైనర్ బ్రేక్ విఫలం కావడంతో అదుపు తప్పింది. ముందున్న మరో కంటైనర్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ రెండు వాహనాల మధ్య ఓ కారు వెళ్తోంది. అది ఆ రెండింటి మధ్య ఇరుక్కుపోయింది. వెంటనే మంటలు వ్యాపించాయి. క్షణాల్లోనే మూడు వాహనాలు దగ్ధమయ్యాయి. ఘటనా స్థలంలో సహాయక చర్యలు కొనసాగుతున్నట్లు పోలీసులు చెప్పారు.

32 చోట్ల మారణహోమానికి స్కెచ్

4 ప్రధాన నగరాలుసహా పలు ప్రాంతాల్లో భారీ పేలుళ్లకు పక్కా ప్రణాళిక

- అల్–ఫలాహ్ వర్సిటీ బాయ్స్ హాస్టల్ 13వ నంబర్ గదిలో పథక రచన
- గదిలో కీలక డైరీలు లభ్యం – డైరీలో నవంబర్ 8 నుంచి 12వ తేదీ వరకు మార్కింగ్
- అందులో పాతిక మంది అనుమానిత ఆత్మాహుతి బాంబర్‌ల వివరాలు
- స్విట్జర్లాండ్ యాప్‌లో రహస్య చాటింగ్
- సొంతంగా సిగ్నల్ యాప్ గ్రూప్ సృష్టించిన ఆత్మాహుతి బాంబర్ ఉమర్
- బాంబుల తయారీ కోసం 26 క్వింటాళ్ల ఎన్‌పీకే ఎరువుల కొనుగోలు
- మరో ఇద్దరు డాక్టర్ల అరెస్ట్ – రూ.26 లక్షల నిధులను సమీకరించిన ఉమర్
- తీగ లాగేకొద్దీ బయటపడుతున్న ఢిల్లీ పేలుడు కుట్ర రహస్యాలు
- వర్సిటీలో దొరికిన ఉమర్ మూడో కారు

న్యూఢిల్లీ: దశాబ్దాల క్రితం బాబ్రీ మసీదు కూల్చివేతకు ప్రతీకారంగా, తాజాగా ఆపరేషన్ సిందూర్ వేళ పాకిస్తాన్‌లో జైషే మొహమ్మద్ కీలక నేతల మరణాలకు కక్షసాధింపుగా నిద్రాణ ముష్కరమూకలు తలపెట్టిన మారణకాండ గుట్టు రట్టవుతోంది. ఎర్రకోట వద్ద కారును పేల్చేసిన ఆత్మాహుతి బాంబర్ డాక్టర్ ఉమర్ ఉన్ నబీ హాస్టల్ గది వేదికగా పేలుళ్ల కుట్రకు ఉగ్రవాదులు పథక రచన చేశారని జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్‌ఐఏ) అధికారులు గురువారం తేల్చారు. ఫరీదాబాద్‌లోని అల్–ఫలాహ్ విశ్వవిద్యాలయంలోని బాయ్స్ హాస్టల్ 17వ భవంతిలోని 13వ నంబర్ గదిని ఉగ్రవాదులు తమ రహస్య అడ్డాగా ఉపయోగించుకున్నారు. ఇక్కడి నుంచే అన్ని చోట్లా దాడులకు వ్యూహం పన్నారు. 32 పాత, కొత్త కార్లలో బాంబులను అమర్చి దేశంలోని నాలుగు ప్రధాన నగరాలతోపాటు 32 ప్రాంతాల్లో పేల్చేసి పెను విధ్వంసం సృష్టించాలనేది ఉగ్రవాదుల అసలు కుట్ర అని స్పష్టమైంది. ఇప్పటికే అరెస్టయిన డాక్టర్ ముజామిల్‌కు, ఉమర్‌కు మధ్య చివర్లో విబేధాలు పొడచూపాయి. ఈ కారణంగానే దాడి ప్రాంతాలు మారాయా? దాడి చేయాల్సిన తేదీలు మారాయా? అనేది తేలాల్సి ఉంది.

డైరీలో కోడ్ నేమ్‌లు, బాంబుల నిల్వ ప్రాంతాలు..

వర్సిటీ హాస్టల్‌లో ముజామిల్‌కు చెందిన 13వ నంబర్ గదితోపాటు ఉమర్ ఉండే నాలుగో నంబర్ గదిలో అధికారులు 3 డైరీలను స్వాధీనంచేసుకున్నారు. వీటిలో 25 మంది వ్యక్తుల పేర్లు ఉన్నాయి. వీరిలో చాలా మంది జమ్మూకశ్మీర్, ఫరీదాబాద్‌కు చెందిన వాళ్లే. కోడ్ భాషలో పలు ప్రాంతాల పేర్లు, కొన్ని నంబర్లు రాసి ఉన్నాయి. డైరీలో నవంబర్ 8 నుంచి 12వ తేదీ వరకు మార్కింగ్ చేసి ఉంది. చాలా చోట్ల 'ఆపరేషన్' అని రాసి ఉంది. దీంతో ఇది ఎంతో పకడ్బందీగా జరిగిన విద్రోహచర్య అని అర్థమైంది. పాతిక మంది సాయంతో తమ ప్రణాళికను ఆచరణలో పెట్టాలని ఉమర్, ముజామిల్ భావించారని దర్యాప్తు అధికారులు తెలిపారు. ధౌజ్ గ్రామంలో 360 కేజీల అమ్మోనియం నైట్రేట్‌ను స్వాధీనంచేసుకున్న లాడ్జ్ వివరాలను ముజామిల్ డైరీలో అధికారులు గుర్తించారు. అక్రమంగా పెద్ద ఎత్తున కొనుగోలుచేసిన ఎరువులను తమ యూనివర్సిటీ ల్యాబ్‌లోని రసాయనాల తో కలిపి అత్యంత వినాశకర, విస్ఫోటక అమ్మోనియం నైట్రేట్ ఫ్యూయల్ ఆయిల్(ఏఎన్‌ఎఫ్‌ఓ)ను తయారుచేసినట్లు అధికారులు భావిస్తున్నారు. ఇందుకు బలం చేకూర్చేలా హాస్టల్ గదిలో పలు రకాల రసాయనాల జాడను ఫోరెన్సిక్ నిపుణులు గుర్తించారు.

భారీ ఎత్తున ఎరువుల కొనుగోలు

ఉమర్ ఏకంగా రూ.26 లక్షల నిధులను సమీకరించాడు. ఇందులో రూ.3 లక్షలు ఖర్చుపెట్టి 26 క్వింటాళ్ల ఎన్‌పీకే(నైట్రోజన్, ఫాస్పరస్, పొటాషియం) ఫెర్టిలైజర్‌ను కొనుగోలుచేశాడు. గురుగ్రామ్, నూహ్, సమీప పట్టణాలకు చెందిన సప్లయర్ల ద్వారా వీటిని తెప్పించాడు. ఈ ఎరువులను ల్యాబ్‌లో తీసుకొచ్చిన రసాయనాలతో తొలుత సూక్ష్మస్థాయిలో అత్యంతపేలుడు పదార్థం(ఐఈడీ) తయారుచేశాడు. అది విజయవంతమయ్యాకే పేలుడు పదార్థాలను సొంత కార్లలో ధౌజ్, తాగా గ్రామాల్లోని తమ స్థావరాలకు తరలించారు. అక్కడే కార్లకు బాంబు సర్క్యూట్‌లను బిగించి లక్షిత ప్రాంతాలకు తరలించాలని ప్లాన్ చేశారు.

థ్రీమా మెసేజింగ్ యాప్‌లో చాటింగ్

తమ ప్లాన్ ఎవరికీ తెలీకూడదనే ఉద్దేశంతో స్విట్జర్లాండ్‌కు చెందిన మెసేజింగ్ యాప్ 'థ్రీమా'లో ఉమర్, ముజామిల్ ఘనీ, వైద్యురాలు షాహీన్ సయీద్‌లు చాటింగ్ చేసుకునేవారు. ఫరీదాబాద్ ఉగ్ర మాడ్యూల్‌లోని కీలకమైన సభ్యులతో చర్చించేందుకు ఉమర్ విడిగా సిగ్నల్ యాప్ గ్రూప్‌ను క్రియేట్ చేశాడు. 4 నగరాల్లో పేలుళ్లకు సంబంధించిన ప్లాన్‌ను నేరుగా పర్యవేక్షించేందుకు ఒక్కో నగరానికి ఇద్దరు ఉగ్రవాదుల చొప్పున మొత్తం ఎనిమిది మంది కీలక సభ్యులను ఎంపికచేశాడు.

వర్సిటీని జల్లెడ పడుతున్న అధికారులు

ఒకే వర్సిటీలో ఒకే వృత్తిలోని వ్యక్తులు ఉగ్రభావజాలంలో మునిగిపోవడంతో ఈ విద్యాసంస్థ ఉగ్రఅడ్డాగా మారిందా? అనే కోణంలో దర్యాప్తు అధికారులు వర్సిటీని జల్లెడపడుతున్నారు. వర్సిటీకి సంబంధించిన అన్ని రకాల డాక్యుమెంట్లను ఫోరెన్సిక్ ఆడిట్‌కు పంపించారు. ఇప్పటికే దొరికిన ఆధారాలతో ఇక్కడి విద్యార్థుల ఫోన్ నంబర్లు, సామాజిక మాధ్యమ ఖాతాలు, సొంత గ్రామాల చిరునామాలు సరిపోలుతాయో లేదోనని చెక్ చేస్తున్నారు. ఈ క్రమంలోనే అరెస్టయిన వైద్యురాలు షాహీన్‌తో సత్సంబంధాలున్న 32 ఏళ్ల వైద్య విద్యార్థి మొహమ్మద్ ఆరిఫ్ మిర్‌ను పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. ఆరిఫ్ ప్రస్తుతం కాన్పూర్‌లోని లక్ష్మీపత్ సింఘానియా కార్డియాలజీ, కార్డియాక్ సర్జరీ కాలేజీలో ఎండీ వైద్య విద్యనభ్యసిస్తున్నాడు. కశ్మీర్‌లోని ఖాగూర్ సాదవారీ ప్రాంతం ఆరిఫ్ స్వస్థలం. నజీరాబాద్‌లో ఆరిఫ్ ఇంట్లోంచి పోలీసులు ఒక ల్యాప్‌టాప్‌ను స్వాధీనంచేసుకున్నారు. ఏటీఎస్ బృందం వచ్చే సమయానికి ఆరిఫ్ తన ఫోన్ డేటాను తొలగిస్తూ కనిపించాడు. ఆరిఫ్‌కు గతంలో నీట్ సూపర్ స్పెషాలిటీ ఎగ్జామినేషన్‌లో ఆలిండియా 1608 ర్యాంక్ రావడం విశేషం. ఇంతటి ప్రతిభావంతుడు ఉగ్రవాదులతో చేతులు కలపడం ఆశ్చర్యంగా ఉందని కాలేజీ ప్రిన్సిపల్ అన్నారు. ఉత్తరప్రదేశ్‌లోని హాపూర్ పట్టణంలోని జీఎస్ మెడికల్ కాలేజీ అధ్యాపకుడు డాక్టర్ ఫారూఖ్‌ను ఢిల్లీ పోలీసులు ఇదే కేసులో గురువారం అరెస్ట్ చేశారు. ఇతను కూడా గతంలో అల్–ఫలాహ్ కాలేజీలోనే విద్యనభ్యసించాడు. వీళ్లంతా ఒకే ఈ–మెయిల్ ఐడీని వాడుతున్నట్లు గుర్తించారు.

పంజాబ్‌లో ఉగ్ర కుట్ర భగ్నం

10 మంది అరెస్టు

చండీగఢ్: పంజాబ్‌లో మరో ఉగ్రవాద కుట్రను పోలీసులు భగ్నం చేశారు. పాకిస్తాన్ నిఘా సంస్థ ఐఎస్‌ఐ అండదండలతో గ్రెనేడ్ దాడికి ముష్కరులు పథకం వేయగా, పోలీసులు ముందుగానే గుర్తించి అడ్డుకున్నారు. ఈ కుట్రకు సంబంధించి 10 మందిని అరెస్టు చేశారు. పంజాబ్‌లో గ్రెనేడ్ దాడి చేసి, అశాంతి సృష్టించాలన్నదే వారి అసలు లక్ష్యమని విచారణలో పోలీసులు తేల్చారు. పాకిస్తాన్‌లోని హ్యాండ్లర్స్‌తో వారు ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరుపుతూనే ఉన్నారని చెప్పారు. ముగ్గురు నిందితులను కులదీప్ సింగ్, శేఖర్ సింగ్, అజయ్ సింగ్‌గా గుర్తించారు. వారు పంజాబ్‌లోని శ్రీముక్తార్ సాహిబ్‌కు చెందినవారేనని డీజీపీ గౌరవ్ యాదవ్ వెల్లడించారు. చైనాలో తయారైన హ్యాండ్ గ్రెనేడ్‌ను నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దర్యాప్తు కొనసాగుతోందని, పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామని ప్రకటించారు.

ఎట్టి పరిస్థితుల్లోనూ చిక్కకుండా చిక్కుముడి రూట్

ఢిల్లీకి వచ్చేటప్పుడు మార్గమధ్యంలో పోలీసులకు చిక్కకుండా ఫరీదాబాద్ నుంచి ఉమర్ ప్రయాణించిన మార్గాన్ని పోలీసులు గుర్తించారు. డజన్లకొద్దీ సీసీటీవీ ఫుటేజీలను జల్లెడపట్టాక అతని ప్రయాణరూట్‌పై ఒక స్పష్టత వచ్చింది. ఆదివారం అతను ఫరీదాబాద్ నుంచి బయల్దేరి ఢిల్లీ–ముంబై ఎక్స్‌ప్రెస్‌వేపై ప్రయాణించాడు. నూహ్ జిల్లాలోని ఫిరోజ్‌పూర్ ఝిర్కాకు రాగానే రోడ్డు పక్కన ధాబా వద్ద ఆగాడు. వెనక సీట్లో పెద్ద బ్యాగులో బాంబు ఉండటంతో ఎటూ పోకుండా కారులోనే కూర్చున్నాడు. రాత్రంతా కారులోనే నిద్రపోయాడు. మార్గమధ్యంలో పట్టణాల మీదుగా వెళ్లకుండా గ్రామాలమీదుగా వెళ్లాడు. పెద్ద హోటళ్లలో తినకుండా రోడ్డు పక్కన చిన్న హోటళ్లలో భోజనాలు కానిచ్చాడు. బదార్‌పూర్ బోర్డర్ గుండా ఢిల్లీకి చేరుకున్నాడు. సరళరేఖ మార్గంలో వెళ్లకుండా గజిబిజి ప్రయాణాల చేశాడు. తూర్పు ఢిల్లీ, ఓఖ్లా, పారిశ్రామిక నడువా, కన్నాట్ ప్లేస్ ఇలా వేర్వేరు చోట్ల తిరిగి చివరకు ఎర్రకోట వద్దకు చేరుకున్నాడు. ఎక్కువ రద్దీ ఉంటే చోట్ల తనిఖీలు, ట్రాఫిక్ పోలీసుల నిఘా ఉండదనే ఉద్దేశ్యంతో ఆ మార్గాల్లో ప్రయాణించాడు.

ఉమర్ మూడో కారు లభ్యం

వర్సిటీ పార్కింగ్ ప్రదేశంలో ఉమర్ మూడో కారును పోలీసులు గుర్తించారు. ఇది ఇప్పటికే అరెస్టయిన వైద్యురాలి పేరిట ఉంది. దీనిని ఉమర్ పేలుడు పదార్థాల రవాణా కోసం ఉపయోగించినట్లు అనుమానిస్తున్నారు. మొత్తం పేలుళ్లకు 32 కార్లు అవసరమని, వాటిల్లో కొన్నింటిని కొత్తగా కొనుగోలుచేయాలని పథక రచనచేశారు. పలువురిచేతులు మారి మూలాలు కనిపెట్టలేని పాత కార్లను దాడుల కోసం ఎంచుకున్నారు. మరోవైపు అల్–ఫలాహ్ వర్సిటీ సభ్యత్వాన్ని రద్దు చేస్తున్నట్లు 'ది అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్'(ఏఐయూ) గురువారం ప్రకటించింది. విద్యాప్రమాణాల మేరకు సంస్థను నడపని ఈ వర్సిటీకి సంఘంలో ఉండే అర్హతలేదని ఏఐయూ తెలిపింది

అల్–ఫలాహ్ వర్సిటీకి న్యాక్ నోటీసులు

న్యూఢిల్లీ: వివాదాస్పద అల్–ఫలాహ్ స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్, టెక్నాలజీకి, అల్–ఫలాహ్ స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ విభాగాలకు న్యాక్ నుంచి 'ఏ' గ్రేడ్ గుర్తింపు ఉందని ఆ విశ్వ విద్యాలయం చేసిన స్వీయ ప్రకటనపై నేషనల్ అసెస్‌మెంట్, అక్రెడిటేషన్ కౌన్సిల్ (న్యాక్) తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేసింది. ఈ వర్సిటీ విభాగాలకు ప్రస్తుతం ఏవిధమైన గుర్తింపు లేదని న్యాక్ గురువారం ప్రకటించింది. ఈ వర్సిటీలో తమ పిల్లలను చేర్చే విషయంలో విద్యార్థుల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. ఇంజనీరింగ్ కాలేజీ గుర్తింపు కాలపరిమితి ఏడేళ్ల క్రితం ముగిసిందని, ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ విభాగ అక్రెడిటేషన్ 9 ఏళ్ల క్రితమే ముగిసిందని న్యాక్ పేర్కొంది. అక్రెడిటేషన్ రెన్యువల్ కోసం వర్సిటీ ఏనాడూ తమకు దరఖాస్తుచేసుకోలేదని, ఆ సంస్థకు గుర్తింపులేదని న్యాక్ వెల్లడించింది. లేని గుర్తింపును ఉందనడంపై సంజాయిషీ చెప్పాలంటూ వర్సిటీకి న్యాక్ షోకాజ్ నోటీసులు పంపించింది. ఫరీదాబాద్ సమీపంలోని ధౌజ్ గ్రామంలో 76 ఎకరాల విస్తీర్ణంలో అల్–ఫలాహ్ వర్సిటీని అల్–ఫలాహ్ చారిటబుల్ ట్రస్ట్ నిర్వహిస్తోంది. వర్సిటీలోని వైద్యులు ఉగ్రవాదులుగా మారినట్లు వెలుగుచూడటంతో విధులు మినహా తమ సిబ్బంది వ్యక్తిగత అంశాలతో తమకు సంబంధం లేదని వర్సిటీ పేర్కొంది.

నబీనే నడిపాడు

పేలిన కారులో శాంపిల్‌తో సరిపోలిన నబీ తల్లి డీఎన్‌ఏ

న్యూఢిల్లీ: చారిత్రక ఎర్రకోట వద్ద పేలుడు పదార్థాలున్న కారును డాక్టర్ ఉమర్ నబీ నడిపాడని శాస్త్రీయ ఆధారాలతో ఫోరెన్సిక్ విభాగం నిరూపించింది. పేలుడుకు డ్రైవర్ తునాతునకలైనా అతని శరీరం తాలూకు మాంసం ముద్దలు, రక్తం కారు శకలాల్లో లభించాయి. వీటిని డాక్టర్ ఉమర్ తల్లి నుంచి సేకరించిన డీఎన్‌ఏతో పోల్చిచూడగా రెండూ సరిపోలాయి. దీంతో ఇంతటి విధ్వంసానికి పాల్పడింది ఉమర్ అని రూఢీ అయింది.

13కు పెరిగిన మరణాలు

న్యూఢిల్లీ: పేలుడు ఘటనలో మరణాల సంఖ్య గురువారం 13కు పెరిగింది. ఢిల్లీలోని లోక్ నాయక్ జయప్రకాశ్(ఎల్ఎన్‌జేపీ) ఆస్పత్రిలో గత మూడ్రోజులుగా చికిత్స పొందుతున్న క్షతగాత్రుడు ప్రాణాలు కోల్పోవడంతో మరణాల సంఖ్య పెరిగింది. తీవ్ర గాయాలతో చనిపోయిన ఆ వ్యక్తిని బిలాల్‌గా పోలీసులు గుర్తించారు. 35 ఏళ్ల బిలాల్ స్వస్థలం జమ్మూకశ్మీర్. పోస్ట్‌మార్టమ్ తర్వాత మృతదేహాన్ని బాధితుని కుటుంబసభ్యులకు అప్పగిస్తామని దర్యాప్తు అధికారి ఒకరు వెల్లడించారు.

వందల అడుగుల దూరం ఎగిరిపడిన చేయి

న్యూఢిల్లీ: ఎర్రకోట వద్ద జరిగిన పేలుడు అత్యంత శక్తివంతమైందని అక్కడి భీతావహదృశ్యాలను చూస్తే తెలుస్తోంది. అయితే పేలుడు ధాటికి ఒక వ్యక్తి ఛిద్రమై చేయి వందల అడుగుల దూరంలోని ఒక దుకాణంపై పడిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సమీప ప్రాంతాల్లో ఇతర ఆధారాల కోసం పోలీసులు జల్లెడ పడుతున్న క్రమంలో ఈ చేతిని గురువారం ఉదయం గుర్తించారు. జైనదేవాలయం వెనుకవైపు ఉన్న ఒక దుకాణంపై చేయి ఉందన్న సమాచారం రాగానే పోలీసులు ఆ ప్రాంతాన్ని తమ అధీనంలోకి తీసుకుని చేతిని ఫోరెన్సిక్ బృందం స్వాధీనం చేసుకుంది. ఈ చేయి మృతుల్లో ఎవరికి సంబంధించినదో తేల్చేందుకు చేతిలోని డీఎన్‌ఏ శాంపిళ్లను తీసుకుని ఘటనాస్థలిలో సేకరించిన మృతుల శరీరభాగాలతో సరిపోల్చనున్నారు.

కలకలం రేపిన టైరు పేలుడు

న్యూఢిల్లీ: ఎర్రకోట వద్ద పెను విస్ఫోటనం తాలూకు భయానక ఘటన నుంచి ఢిల్లీవాసులు ఇంకా తేరుకోలేదు. ఎక్కడ ఏమాత్రం పెద్ద శబ్దం వినిపించినా అది బాంబు పేలుడేనని భ్రమించి భయపడిపోతున్నారు. ఈ తరహా ఘటన గురువారం ఉదయం మహిపాల్‌పూర్‌లోని ర్యాడి సన్ ప్రాంతంలో జరిగింది. ఢిల్లీ రవాణా కార్పొ రేషన్ బస్సు గురువారం ఉదయం ధౌలాఖాన్ వైపుగా వెళ్తున్నప్పుడు దాని టైరు పేలిపోయింది. దీంతో సమీప జనం భయంతో పరుగులుతీశారు. ఇది కాస్తంత దూరం నుంచి విన్న ఒకతను అక్కడ బాంబు పేలిందని పొరబడి వెంటనే అగ్నిమాపక సిబ్బందికి ఫోన్‌చేశారు. వెంటనే రంగంలోకి దిగిన అగ్నిమాపక సిబ్బంది వెంటనే సంబంధిత లొకేషన్‌కు చేరుకున్నారు. కానీ అక్కడ ఎలాంటి అగ్నికీలలు కనిపించలేదు. బస్సు వెనుక టైర్ ఒకటి పేలడంతో వచ్చిన శబ్దమని అక్కడి గార్డ్ ఒకరు చెప్పారు.

నరకం అనుభవిస్తున్న క్షతగాత్రులు

న్యూఢిల్లీ: పెను వినాశక పేలుడును అత్యంత సమీపం నుంచి చూసిన, శబ్దాన్ని విన్న బాధితులను ఇప్పుడు తీవ్రమైన అనారోగ్య సమస్యలు చుట్టుముట్టాయి. పేలుడు కారణంగా కొందరు తీవ్రగాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మరికొందరు దూరంగా ఎగిరిపడ్డారు. దీంతో స్వల్పస్థాయిలో దెబ్బలు తగిలాయి. మరికొందరు సమీప వాహనాలు, గోడలకు తగిలి కిందపడ్డారు. దీంతో గీసుకున్న గాయాలయ్యాయి. కాళ్లు, చేతులు, తలకు దెబ్బలు తగిలా యి. కొందరు కంటి సమస్యలు, మరీముఖ్యంగా కొందరికి వినికిడి సమస్యలు తలెత్తాయి. కర్ణభేరి దెబ్బతిని శాశ్వత వినికిడి లోపం బారిన పడే ప్రమాదకర స్థితిని ఎదుర్కొంటున్నారు. కొందరి చెవుల్లో గిల్లుమనే శబ్దం శాశ్వతంగా వినపడతూనే ఉండొచ్చని ఎల్ఎన్‌జేపీ ఆస్పత్రి సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ దేవేందర్ రాయ్ చెప్పారు. క్షతగాత్రుల్లో ఆరుగురు ఐసొలేషన్ వార్డ్‌లో, నలుగురు ఐసీయూలో, నలుగురి నరాల శస్త్ర చికిత్స విభాగంలో ఒకరు తీవ్రమైన ట్రామా విభాగంలో చికిత్సపొందుతున్నారు.

నేడే బిహార్ తీర్పు

- ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తి
- 38 జిల్లాల్లో 46 కౌంటింగ్ కేంద్రాలు సిద్ధం
- విజయంపై రెండు కూటముల ధీమా

పట్నా: బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటర్లు ఇవ్వబోయే తీర్పు కోసం దేశ ప్రజలంతా ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. వారి నిరీక్షణ ముగిసే సమయం వచ్చేసింది. శుక్రవారమే ఎన్నికల ఫలితాలు వెలువడనున్నాయి. సీనియర్ నేత, అనుభవజ్ఞుడు నితీశ్ కుమార్ మరోసారి ముఖ్యమంత్రి అవుతారా? లేక యువ నాయకుడు తేజస్వీ యాదవ్ అధికార పీఠం అధిరోహిస్తారా? అనేది మరికొన్ని గంటల్లోనే తేలిపోనుంది. బిహార్ ప్రజలు ఎవరిని ఎన్నుకుంటారన్నది ఆసక్తికరంగా మారింది. ఓట్ల లెక్కింపు కోసం ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లూ చేసింది. కౌంటింగ్ సిబ్బందికి శిక్షణ పూర్తయ్యింది. ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రారంభమవుతుంది. మధ్యాహ్నం కల్లా ఫలితాలపై స్పష్టత రానుంది. 38 జిల్లాల్లో మొత్తం 46 కౌంటింగ్ కేంద్రాలను సిద్ధం చేశారు. మొత్తం 243 అసెంబ్లీ స్థానాలకు గాను ఈసారి ఎన్నికల్లో ఏకంగా 2,616 మంది అభ్యర్థులు పోటీ చేశారు. ఈ నెల 6, 11న.. రెండు దశల్లో జరిగిన పోలింగ్‌లో రికార్డు స్థాయిలో 67.13 శాతం ఓటింగ్ నమోదయ్యింది. బిహార్ ఎన్నికల చరిత్రలో భారీగా ఓటింగ్ నమోదు కావడం ఇదే మొదటిసారి కావడం విశేషం. కేంద్ర పరిశీలకులు, అభ్యర్థుల తరపు ఏజెంట్ల సమక్షంలో మొత్తం ఓట్ల లెక్కింపు ప్రక్రియను వీడియోలో చిత్రీకరించనున్నట్లు ఎన్నికల సంఘం వర్గాలు వెల్లడించాయి. కౌంటింగ్ సెంటర్ల వద్ద రెండంచెల భద్రతను ఏర్పాటు చేశారు. నిరంతరం సీసీటీవీ కెమెరాల నిఘా ఉంటుంది.

ఎన్డీయేకే పట్టం కట్టిన ఎగ్జిట్ పోల్స్

బిహార్ ఎన్నికల్లో ప్రధానంగా ఎన్డీయే, మహాగఠ్‌బంధన్ మధ్య పోటీ నెలకొంది. విజయం తమదేనని రెండు కూటములు ధీమా వ్యక్తం చేస్తున్నాయి. అత్యధిక శాతం ఓటింగ్ నమోదు కావడానికి సొంత భాష్యం చెబుతున్నాయి. తమ పాలన పట్ల ప్రజల్లో సానుకూలతకు ఇది నిదర్శనమని ఎన్డీయే వాదిస్తుండగా, నితీశ్ కుమార్ ప్రభుత్వాన్ని గద్దె దించాలన్న లక్ష్యంతోనే ఓటర్లు భారీగా తరలివచ్చి ఓట్లు వేశారని మహాగఠ్‌బంధన్ వర్గాలు తేల్చిచెబుతున్నాయి. రాష్ట్రంలో మరోసారి ఎన్డీయే అధికారంలోకి రావడం తథ్యమని దాదాపు అన్ని ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు వెల్లడించాయి. మరోవైపు చివరి నిమిషంలో పార్టీలన్నీ ఫలితాల లెక్కల్లో మునిగితేలాయి. గురువారం చర్చోపచర్చలు సాగించాయి. ఎలాంటి అక్రమాలకు తావులేకుండా ఓట్ల లెక్కింపు చేపట్టాలని ఆర్జేడీ అగ్రనేత, విపక్ష కూటమి ముఖ్యమంత్రి అభ్యర్థి తేజస్వీ యాదవ్ విజ్ఞప్తిచేశారు. ఎవరైనా రాజ్యాంగ విరుద్ధమైన చర్యలకు పాల్పడితే సహించబోమని హెచ్చరించారు. ఓట్ల లెక్కింపులో అవాంఛనీయ ఘటనలు జరిగితే, అధికార కూటమిని అక్రమాలకు పాల్పడితే నేపాల్ తరహాలో బిహార్ ప్రజలు తిరుగుబాటు చేస్తారని ఆర్జేడీ నాయకుడు సుశీల్‌కుమార్ సింగ్ తేల్చిచెప్పారు. జనం ఈసారి మార్పు కోరుకున్నారని, తేజస్వీ యాదవ్ ప్రభుత్వం అధికారంలోకి రావడం తథ్యమని తేల్చిచెప్పారు.

ఓటర్లను కించపరుస్తున్నారు: బీజేపీ

ఎన్నికల ఫలితంపై మహాగఠ్‌బంధన్ పెద్దలకు ఇప్పటికే స్పష్టత వచ్చేసిందని, వారంతా నిరాశలో మునిగిపోయి ఓటర్లను కించపరుస్తూ అడ్డగోలుగా మాట్లాడుతున్నారని బీజేపీ బిహార్ అధ్యక్షుడు దిలీప్ జైస్వాల్ విమర్శించారు. ఎన్డీయే జనరంజక పాలనకు మరోసారి పట్టం కట్టాలని ప్రజలు ఎప్పుడో నిర్ణయించుకున్నారని స్పష్టంచేశారు. రెండు దశల పోలింగ్ ప్రశాంతంగా జరిగిందని, ఓట్ల లెక్కింపు కూడా అదేవిధంగా సాగుతుందని తాము ఆశిస్తున్నట్లు చెప్పారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని రక్షించుకొనేందుకు బిహార్ ప్రజలు కట్టబడి ఉన్నారని దిలీప్ జైస్వాల్ 'ఎక్స్'లో పోస్టుచేశారు. ఎన్డీయే మళ్లీ విజయం సాధించి, నితీశ్ కుమార్ మరోసారి ముఖ్యమంత్రి అయితే సరికొత్త ఘనత సాధిస్తారు. బిహార్‌కు ఐదుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన మొదటి నాయకుడిగా రికార్డుకెక్కుతారు. మరోవైపు ప్రశాంత్ కిశోర్ నేతృత్వంలోని జన సురాజ్ పార్టీ సైతం ఈసారి పోటీకి దిగింది. ఉనికి చాటుకొనేందుకు బాగానే కష్టపడింది. ఆ పార్టీ పెద్దగా ప్రభావం చూపే అవకాశం లేదని, సున్నా నుంచి రెండు మూడు సీట్ల దాకా రావొచ్చని ఎగ్జిట్ పోల్స్ అంచనా వేశాయి.

సౌరాష్ట్ర సముద్ర తీరంలో యుద్ధసన్నాహక డ్రిల్‌లో పాల్గొన్న సైనికులు

గుజరాత్ తీరంలో 'త్రిశూల్'

ఆకట్టుకున్న త్రివిధ దళాల అద్భుత విన్యాసాలు • అబ్బురపర్చిన సాహస కృత్యాలు

పోర్బందర్: భారత త్రివిధ దళాలు సంయుక్తంగా తమ శక్తి సామర్థ్యాలను ప్రదర్శించాయి. ఎక్సర్‌సైజ్ త్రిశూల్ పేరిట భారత సైన్యం, నావికా దళం, వైమానిక దళం గురువారం గుజరాత్‌లోని సౌరాష్ట్ర సముద్ర తీరంలో కలిసికట్టుగా విన్యాసాలు నిర్వహించాయి. దాదాపు గంటపాటు ఈ కార్యక్రమం కొనసాగింది. భూమిపై, ఆకాశంలో, సముద్రంలో త్రివిధ దళాల జవాన్ల సాహస కృత్యాలు అబ్బురపర్చాయి. భారత మిలటరీ శక్తిని ప్రపంచానికి చాటడమే లక్ష్యంగా త్రిశూల్ కొనసాగింది. 'అంఫెక్స్–2025'అనే కోడ్ పేరుతో జరిగిన విన్యాసాల్లో టీ–72 యుద్ధ ట్యాంకులు, అసాల్ట్ దళాలు, జాగ్వార్ ఫైటర్ ఎయిర్‌క్రాఫ్ట్, ఎస్–30 ఎంకేఐ యుద్ధ విమానాలతోపాటు మరికొన్ని నావికా దళం యుద్ధనౌకలు పాల్గొన్నాయి. నావికా దళం ఆధ్వర్యంలో గత రెండు వారాలుగా త్రివిధ దళాల విన్యాసాలు కొనసాగుతున్నాయి. అవి గురువారం ముగిశాయి. థార్ ఎడారి నుంచి కచ్ ప్రాంతం దాకా వేర్వేరు ప్రదేశాల్లో ఈ కార్యక్రమం జరిగింది.

ఉమ్మడి శక్తి, సమన్వయం

గుజరాత్ పోర్బందర్ సమీపంలోని మాధవ్‌పూర్ బీచ్‌లో జరిగిన విన్యాసాలకు త్రివిధ దళాల ఉన్నతాధికారులు హాజరయ్యారు. మూడు దళాల ఉమ్మడి శక్తికి, సమన్వయానికి త్రిశూల్ ఒక బెంచ్ మార్క్ అని వారు చెప్పారు. నూతన ఆయుధాలు, సైనిక పరికరాలను పరీక్షించినట్లు తెలిపారు. మన సైన్యం బలం పెరిగిందని అన్నారు. భవిష్యత్తులో ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నట్లు స్పష్టంచేశారు. 30 వేల మంది సైనికులు, యుద్ధ విమానాలు, దాదాపు 25 యుద్ధ నౌకలు, జలాంతర్గాములు ఈ ఎక్సర్‌సైజ్‌లో పాల్గొన్నట్లు వెల్లడించారు. యుద్ధక్షేత్రంలోని పరిస్థితులను సృష్టించి, విన్యాసాలు చేపట్టినట్లు తెలియజేశారు.

షట్‌డౌన్‌కు తెర

ప్రభుత్వ నిధుల బిల్లుకు అమెరికా ప్రతినిధుల సభలో ఆమోదం

వాషింగ్టన్: అగ్రరాజ్యం అమెరికా చరిత్రలో ఎన్నడూ లేని విధంగా 43 రోజులపాటు కొనసాగిన షట్‌డౌన్ ఎట్టకేలకు ముగిసింది. ప్రభుత్వ నిధుల బిల్లుపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బుధవారం రాత్రి సంతకం చేశారు. దాంతో ప్రభుత్వ ఉద్యోగులు, సామాన్యుల కష్టాలకు తెరపడింది. షట్‌డౌన్‌కు ముగింపు పలికే గవర్నర్‌మెంట్ ఫండింగ్ బిల్లు సోమవారం సెనేట్‌లో ఆమోదం పొందిన సంగతి తెలిసిందే. అనంతరం అమెరికా కాంగ్రెస్‌లో దిగువ సభ అయిన ప్రతినిధుల సభలో బిల్లును ప్రవేశపెట్టారు. బిల్లుకు అనుకూలంగా 222, వ్యతిరేకంగా 209 ఓట్లు వచ్చాయి. అధికార రిపబ్లికన్ పార్టీ సభ్యులు మద్దతు ఇవ్వగా, విపక్ష డెమొక్రాట్లు బిల్లులోని కొన్ని అంశాలపై అభ్యంతరం వ్యక్తంచేశారు. వ్యతిరేకంగా ఓటువేశారు. అయినప్పటికీ సభలో అధికార పార్టీకి మెజార్టీ ఉండడంతో బిల్లు గట్టెక్కింది. అనంతరం గంటల వ్యవధిలోనే అధ్యక్షుడి ఆమోదం కోసం బిల్లును పంపించడం, ఆయన సంతకం చేయడం చకచకా జరిగిపోయాయి.

వైట్‌హౌస్‌లో గవర్నమెంట్ ఫండింగ్ బిల్లుపై సంతకం చేస్తున్న ట్రంప్

దోపిడీకి అమెరికా లొంగదు: ట్రంప్

షట్‌డౌన్ కారణంగా ఉద్యోగులకు ఇన్నాళ్లూ వేతనాలు ఆగిపోయాయి. ఆఖరికి ఎయిర్‌పోర్టుల్లో విమానాల రాకపోకలపైనా భారీ ప్రభావం పడింది. ఆహారం కోసం ఫుడ్ బ్యాంకుల ఎదుట జనం బారులు తీరాల్సి వచ్చింది. షట్‌డౌన్ ఆగిపోవడంతో ఆ కష్టాలకు ఇక తెరపడినట్లే. ప్రజల కష్టాలకు డెమొక్రాట్లే కారణమని డొనాల్డ్ ట్రంప్ నిందించారు. వచ్చే ఏడాది జరిగే మధ్యంతర ఎన్నికల్లో ఆ పార్టీకి బుద్ధి చెప్పాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ విషయం మర్చిపోవద్దని కోరారు. విపక్ష సభ్యులు చేసిన అన్యాయాన్ని గుర్తుంచుకోవాలని కోరారు. అమెరికా ఎప్పటికీ దోపిడీకి లొంగిపోదన్న సందేశాన్ని పంపిస్తున్నామని ట్రంప్ చెప్పారు. అమెరికన్లకు రాయితీపై చౌకగా వైద్య సేవలందించే అంశంపై అధికార, విపక్షాల మధ్య మొదలైన ప్రతిష్టంభన చివరకు షట్‌డౌన్‌కు దారితీసింది. ఈ రాయితీ ఈ ఏడాది ఆఖర్లో ముగిసిపోనుండగా, దాన్ని ఇంకా పొడిగించాలని డెమొక్రటిక్ పార్టీ సభ్యులు డిమాండ్ చేశారు. ట్రంప్ ప్రభుత్వం అందుకు అంగీకరించలేదు. అక్టోబర్ 1న షట్‌డౌన్ మొదలైంది. అత్యవసరం కాని సాధారణ ప్రభుత్వ సేవలకు నిధుల విడుదల ఆగిపోయింది. విపక్షాలను దారికి తీసుకురావడానికి కొందరు ఉద్యోగులను ట్రంప్ బలవంతంగా తొలగించారు. ప్రభుత్వ నిధుల బిల్లు ప్రకారం.. తొలగింపుకు గురైన ఉద్యోగులను మళ్లీ విధుల్లో చేర్చుకుంటారు. ప్రభుత్వ సేవలకు యథావిధిగా నిధులు విడుదల చేస్తారు. మరోవైపు రాయితీపై ఆరోగ్య సేవలను కొనసాగించడంపై ఇంకా స్పష్టత రాలేదు. దీనిపై త్వరలో చర్చలు జరుగనున్నాయి.

'జాతీయ పార్కుల చుట్టూ మైనింగ్'పై నిషేధం

- కిలోమీటర్ పరిధి వరకు ఎలాంటి తవ్వకాలకు అనుమతి లేదు
- ఇదివరకు గోవాకే పరిమితమైన నిబంధన.. ఇకపై దేశమంతటా వర్తింపు
- కీలక ఉత్తర్వులు జారీ చేసిన సుప్రీంకోర్టు

సాక్షి, న్యూఢిల్లీ: వన్యప్రాణుల సంరక్షణ దిశగా సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. దేశవ్యాప్తంగా ఉన్న జాతీయ పార్కులు, వన్యప్రాణుల అభయారణ్యాల లోపల, అలాగే వాటి సరిహద్దుల నుంచి కిలోమీటర్ పరిధి వరకు ఎలాంటి మైనింగ్ కార్యకలాపాలు చేపట్టరాదని తేల్చిచెప్పింది. గతంలో 'గోవా ఫౌండేషన్' కేసులో ఈ రకమైన ఆంక్షలను కేవలం గోవా రాష్ట్రానికి మాత్రమే పరిమితం చేసిన ధర్మాసనం, ఇప్పుడు ఆ పరిధిని విస్తరింపజేసింది. దేశవ్యాప్తంగా ఆంక్షలు అమలవుతాయని పేర్కొంది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ కె.వినోద్‌చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం గురువారం ఈ మేరకు ఉత్తర్వులు వెలువరించింది. 'రక్షిత ప్రాంతాలకు కిలోమీటర్ పరిధిలో మైనింగ్ కార్యకలాపాలు నిర్వహించడం వన్యప్రాణులకు అత్యంత ప్రమాదకరం. ఇది ఈ కోర్టు స్థిరమైన అభిప్రాయం. గతంలో గోవా ఫౌండేషన్ కేసులో ఈ ఆదేశాలు గోవాకు మాత్రమే ఇచ్చినా, వీటిని దేశవ్యాప్తంగా జారీ చేయాల్సిన అవసరం ఉందని మేము భావిస్తున్నాం' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఈ కొత్త ఆదేశాలతో, 2022 జూన్ 3న జారీ చేసిన పాత ఆదేశాలను సుప్రీంకోర్టు సవరించినట్లయింది.

శరందా అడవులపై విచారణ సందర్భంగా..

ప్రఖ్యాత 'టి.ఎన్.గోదావర్మన్ తిరుమల్పాడ్' కేసులో భాగంగా దాఖలైన పలు పిటిషన్లపై విచారణ సందర్భంగా ధర్మాసనం ఈ ఆదేశాలను ఇచ్చింది. ముఖ్యంగా జార్ఖండ్‌లోని 'శరందా' ప్రాంతాన్ని వన్యప్రాణుల అభయారణ్యంగా ప్రకటించాలని కోరుతూ దాఖలైన వ్యాజ్యాలను కోర్టు పరిశీలించింది. ఈ విచారణలో, శరందా ప్రాంతాన్ని వెంటనే వన్యప్రాణుల అభయారణ్యంగా నోటిఫై చేయాలని జార్ఖండ్ ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది.



పోలీసు స్టేషన్ సందర్శన

తాడికొండ: తాడికొండ పోలీస్ స్టేషన్‌ను ఏఆర్ అడిషనల్ ఎస్పీ ఎ. హనుమంతు గురువారం పరిశీలించారు. ఆయన వెంట సీఐ కె.వాసు తదితరులు ఉన్నారు.



పులిచింతల ప్రాజెక్టు సమాచారం

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 10,600 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. దిగువకు 8 వేల క్యూసెక్కులు వదులుతున్నారు. ప్రాజెక్టులో ప్రస్తుత నిల్వ 43.0610 టీఎంసీలు.

పల్నాడు జేసీ సూరజ్ బదిలీ

నరసరావుపేట: పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ గనోరే ఆకస్మికంగా బదిలీ అయ్యారు. ఆయనను స్టేట్ ఫైనాన్స్ డిపార్టుమెంట్‌లో డెప్యూటీ సెక్రటరీగా బదిలీ చేస్తూ చీఫ్ సెక్రటరీ విజయానంద్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. తగిన ఏర్పాట్లకు కలెక్టర్‌ను ఆదేశించారు.

న్యూస్‌రీల్

మాతృ మరణాల నివారణకు ప్రాధాన్యం

జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా

గుంటూరు వెస్ట్: జిల్లాలో మాతృ మరణాలు సంభవించకుండా గర్భిణులకు మెరుగైన వైద్య సేవలు అందించేలా విధులు నిర్వర్తించాలని జిల్లా కలెక్టర్ ఎ. తమీమ్ అన్సారియా అన్నారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో జిల్లా స్థాయి సమీక్ష కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ హైరిస్కు గర్భిణులను డాక్టర్లు, సూపర్‌వైజర్లు, ఆరోగ్య కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు నిరంతరం పర్యవేక్షిస్తూ ఉండాలని చెప్పారు. ఆరోగ్య పరీక్షలు, పౌష్టికాహారం ప్రాధాన్యం, రక్తహీనత నివారణపై అవగాహన కల్పించాలన్నారు. రక్తపోటు విషయంలో గర్భవతులను చైతన్యం చేయాలని, సుఖ ప్రసవం అయ్యేవిధంగా చూడాలని సూచించారు. చికిత్సకు సంబంధించిన డాక్యుమెంట్లు సక్రమంగా నిర్వహణ, పర్యవేక్షణ చేయాలని, తప్పులు లేకుండా నివేదికలు రాయాలని ప్రైవేట్ హాస్పిటల్ నిర్వాహకులను ఆదేశించారు. జిల్లాలో ఈ ఏడాది మే నుంచి అక్టోబర్ వరకు జరిగిన 8 మాతృ మరణాలకు సంబంధించిన పూర్తి వివరాలను అధికారులు జిల్లా కలెక్టర్‌కు వివరించారు. సమావేశంలో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ విజయలక్ష్మి, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ రంగారావు, ఐసీడీఎస్ పీడీ ప్రసూన, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ ఏఎస్ శ్రావణ్‌బాబు, ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ రోహిణి రత్నశ్రీ, డాక్టర్ అన్నపూర్ణ, డాక్టర్ దాసరి శ్రీనివాసులు పాల్గొన్నారు.

గుంటూరు డివిజన్ మీదుగా ప్రత్యేక రైళ్లు

లక్ష్మీపురం: దక్షిణ మధ్య రైల్వే గుంటూరు డివిజన్ పరిధిలోని ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు డివిజన్ పీఆర్‌ఓ వినయ్‌కాంత్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సికింద్రాబాద్–కాకినాడ టౌన్(07619) వయా గుంటూరు డివిజన్ మీదుగా ఈనెల 16వ తేదీన ప్రత్యేక రైలు నడుపుతున్నట్లు తెలిపారు. ఈ రైలు చర్లపల్లి, నల్గొండ, మిర్యాలగూడ, నడికుడి, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, గుడివాడ, కైకలూరు, ఆకివీడు, భీమవరం టౌన్, తణుకు, రాజమండ్రి, సామర్లకోట స్టేషన్‌ల మీదుగా ప్రయాణిస్తుందని తెలిపారు. ఎస్ఎంవీటి బెంగళూరు–భాగల్‌పూర్(06565) రైలు విజయవాడ డివిజన్ మీదుగా ఈనెల 15వ తేదీన కేటాయించినట్లు తెలిపారు. ఈ రైలు కృష్ణరాజపురం, కాట్‌పడి, రేణిగుంట, గూడూరు, నెల్లూరు, ఒంగోలు, విజయవాడ, రాజమండ్రి, దువ్వాడ, విజయనగరం, పలాస, భరంపూర్, కూర్ద్ రోడ్, భువనేశ్వర్, కటక్, భద్రాక్, ఖరగ్‌పూర్, అన్‌దూల, భట్టానగర్, రామ్‌పూర్ హట్, బారహరవా, షిబన్‌జీ స్టేషన్‌ల మీదుగా ప్రయాణిస్తుందని తెలిపారు.

ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు పూర్తి చేయాలి

పొన్నూరు: వరి పంట కోతకు వస్తున్న నేపథ్యంలో ధాన్యం కొనుగోలుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ అన్నారు. గురువారం మండలంలోని మామిళ్లపల్లి గ్రామంలోని పంట పొలాలను పరిశీలించారు. ఈ పంట నమోదు వివరాలను తెలుసుకున్నారు. పంట దిగుబడిపై రైతులతో మాట్లాడారు. గత ఏడాది రైతులు ఎదుర్కొన్న నష్టాలు వాటికి కారణాలను తెలుసుకున్నారు. గత ఏడాది తడిసిన ధాన్యంలో తేమ శాతం ఎక్కువగా ఉండడంతో ఆరబెట్టేందుకు సరైన సౌకర్యాలు లేకపోవడంతో తక్కువ ధరకు విక్రయించి నష్టపోయామని రైతులు జేసీకి తెలిపారు. ప్రస్తుతం వరి పంట కోతకు వచ్చిన నేపథ్యంలో అన్నీ సిద్ధంగా ఉంచారా అని వ్యవసాయ అధికారి ఆర్. వెంకటేశ్వరరావును ప్రశ్నించారు. తహసీల్దారు, ఏఓ మండలంలోని అన్ని గ్రామాలను సందర్శించి రైతులకు ధాన్యం కొనుగోలుపై అవగాహన కల్పించాలని సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకే విక్రయించి నష్టపోకుండా ఉండాలని రైతులను సూచించారు. వెంటనే రైస్ మిల్లర్లతో మాట్లాడి గన్నీ బ్యాగ్స్ అందుబాటులో ఉంచాలని తహసీల్దార్ జియావుల్ హక్‌ను ఆదేశించారు.

రాజకీయ జోక్యంపై ఆగ్రహజ్వాలలు

గుంటూరు నగరంలోని పట్నంబజారులో వేంచేసియున్న శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయం, గీతామందిరం వ్యవహారాల్లో రాజకీయ జోక్యంపై ఆర్యవైశ్యుల్లో ఆగ్రజ్వాలలు రగులుతున్నాయి. వంద సంవత్సరాల ఆలయ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా చంద్రబాబు సర్కార్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి స్థానిక ఎమ్మెల్యేను అడ్డుపెట్టుకుని కొంతమంది టీడీపీ నేతలు వ్యవహరిస్తున్న తీరు సర్వత్రా విమర్శలకు తావిస్తోంది. టీడీపీ నాయకుల అడ్డగోలు పెత్తనంపై ఆర్యవైశ్యులు తీవ్రంగా మండిపడుతున్నారు.

గీతామందిరం వద్ద ఎమ్మెల్యే ఫ్లెక్సీ (ఫైల్)

- స్వయంప్రతిపత్తి కింద అమ్మవారి ఆలయం, గీతామందిరం వ్యవహారాలు
- చంద్రబాబు సర్కారు వచ్చిన నాటి నుంచి పెరిగిన అడ్డగోలు పెత్తనం
- స్థానిక ఎమ్మెల్యే అండదండలతో కొంత మంది వ్యక్తులు హల్‌చల్
- ప్రభుత్వం తీరుపై తీవ్రంగా మండిపడుతున్న ఆర్యవైశ్య వర్గీయులు

పట్నంబజారు: చంద్రబాబు ప్రభుత్వం ఏర్పాటైన నాటి నుంచి కన్యకాపరమేశ్వరి ఆలయంలో రాజకీయ నాయకుల పెత్తనం పెరిగిపోయింది. స్పష్టంగా నిడమానూరు సురేష్ అనే చైర్మన్ ఉన్నప్పటికీ కనీసం పట్టించుకోకుండా టీడీపీ నేతలు కొంతమంది ఉత్సవాలకు రూ.1.20 కోట్లకుపైగా వసూలు చేశారు. దీనిపై అనేక ఆరోపణలు వచ్చాయి. స్థానిక ప్రజాప్రతినిధికి సైతం అందులో వాటాలు ఉన్నాయని ఆర్యవైశ్యులు బాహాటంగానే చెబుతున్నారు. ఈ క్రమంలో లెక్కలు తేల్చాలని కమిటీ సభ్యులు, ఆర్యవైశ్య ప్రముఖులు అడిగినప్పటికీ స్థానిక ఎమ్మెల్యే కనుసన్నల్లో ఏర్పాటైన కమిటీ కనీసం పట్టించుకోలేదు. ఆరోపణలు పెరిగిపోతుండటంతో కార్పొరేటర్ బస్సు బాబు మరో రూ.15 లక్షల వరకు అప్పులు ఉన్నాయని చెప్పుకొచ్చిన పరిస్థితులు ఉన్నాయి. ఈ ఏడాది కూడా కొద్ది కాలం క్రితం జరిగిన దసరా ఉత్సవాలకు రూ.1.50 కోట్ల వరకు వసూలు చేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటివరకు ఆ లెక్కలు బహిర్గతం చేయలేదని ఆర్యవైశ్య నేతలు చెబుతున్నారు.

సంప్రదాయాన్ని కాదని...

ఆర్యవైశ్యులు పూజించే శ్రీ కన్యకాపరమేశ్వరి ఆలయానికి సంబంధించి వారు మాత్రమే కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. కూటమి అధికారంలోనికి వచ్చిన తరువాత కొందరు ఆర్యవైశ్యులను ముందు పెట్టి, మిగతా సామాజికవర్గాలను సైతం కమిటీల్లో వేసి మొత్తం 110 మందితో కూడిన జంబో కమిటీ వేశారు. అప్పటికే ఆర్యవైశ్యుల్లో అసహనం వ్యక్తమైంది. ఇక గీతామందిరం ఉన్న స్థలంపై కూడా కూటమి నేతల కన్ను పడింది. అందులో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తామని, జోరుగా ఇప్పటికే ఊదరగొట్టారు. అడ్వాన్స్‌లు చెల్లించాలంటూ పలువురి నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. ఆర్యవైశ్య మహాసభ నిర్ణయించాల్సిన అంశాలపై స్థానిక ఎమ్మెల్యే నిర్ణయం ఎలా తీసుకుంటారని ఆర్యవైశ్యులు సూటిగానే ప్రశ్నిస్తున్నారు. పొన్నూరు రోడ్డులో ఉన్న పలు దుకాణాలు, పంట పొలాలు స్వాహా చేసేందుకు భారీ కుట్రలు పన్నుతున్నారని తెలుస్తోంది.

అమ్మ సన్నిధిలో రాజకీయాలా?

వైఎస్సార్ సీపీ హయాంలో గీతామందిరం కమిటీ బాధ్యతలు స్వీకరించే సమయంలో కేవలం బెలూన్లు ఎగరేశారని రాద్ధాంతం చేసిన టీడీపీ నేతలు... ఇప్పుడు నేరుగా స్థానిక ఎమ్మెల్యే ఫ్లెక్సీ ఆలయం ముందు ఎలా పెట్టారని ఆర్యవైశ్య ప్రముఖులు నిలదీస్తున్నారు. ఈ వ్యవహారం ఆర్యవైశ్య సంఘాలతో పాటు, టీడీపీలోని ఆ వర్గీయులకు తలపోటుగా మారింది. టీడీపీలోని ఇరవై శాతం కమీషన్ వ్యక్తులు, 'కొనుగోళ్ల'కే అధిక ప్రాధాన్యం ఇచ్చే వారిని పక్కన పెట్టుకుని స్థానిక ఎమ్మెల్యే ఈ ఆలయ ఆస్తులపై కన్ను వేశారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

షాపింగ్ కాంప్లెక్సు ఎందుకు?

బహిరంగ వేలం పాట ద్వారా మూడు నుంచి ఐదు సంవత్సరాలకు లీజుకు ఇచ్చే అవకాశం ఉంటుంది. అది కూడా ఆర్యవైశ్య మహాసభ అంగీకారం, దేవదాయ, ధర్మదాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో కొనసాగుతుంది. లీజుపై షాపింగ్ కాంప్లెక్స్ ఏర్పాటు చేస్తామని టీడీపీ నేతలు చెప్పటం తగదని ఆర్యవైశ్యులు అంటున్నారు. ఈ వ్యవహారంతో అమ్మవారికి మేలు జరుగుతుందా..? లేక టీడీపీ నేతలకా? అనే వాదనలు వినవస్తున్నాయి. ఇప్పటికే కోర్టులో కేసు నడుస్తున్న క్రమంలో ఎటువంటి నిర్ణయం తీసుకోకూడదనే స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయని ఇటీవల గడువు ముగిసిన కమిటీ సభ్యులు చెబుతున్నారు. గీతామందిరం భూముల జోలికి వస్తే పోరాటానికి దిగుతామని ఆర్యవైశ్యులు పేర్కొంటున్నారు.

చోరీ కేసులో టీడీపీ ఎమ్మెల్యే అనుచరుడి ప్రమేయం

ప్రకాశం, గుంటూరు జిల్లాల్లో సంచలనం సృష్టిస్తున్న కేసు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: ప్రకాశం జిల్లాలోని ఒక దేవాలయంలో జరిగిన చోరీ కేసులో తీగలాగితే డొంక కదిలినట్లు గుంటూరు జిల్లాకు చెందిన టీడీపీ ఎమ్మెల్యే ప్రధాన అనుచరుడితో పాటు అతడి అల్లుడి ప్రమేయం ఉన్నట్లు పోలీసు అనుమానిస్తున్నారు. ఈ విషయం ఈ రెండు జిల్లాల్లో సంచలనం సృష్టిస్తోంది. వివరాలు ఇలా ఉన్నాయి.. ప్రకాశం జిల్లా గిద్దలూరు పట్టణం రాచర్ల రోడ్డులోని శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయంలో గత నెల 23వ తేదీ చోరీ జరిగింది. గుర్తు తెలియని దొంగలు దేవాలయం కటాంజనం గేటు తాళాలు పగులగొట్టి లోపలకు ప్రవేశించారు. గర్భాలయంలో స్వామివారి శంఖు చక్రాలు, కిరీటం, పాదాలు, నాలుగు హస్తాలను దోచుకెళ్లారు. మొత్తం 14 కిలోల వెండి చోరీకి గురైనట్లు పోలీసులకు అర్చకులు ఫిర్యాదు చేశారు. దీంతో వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు విచారణ ప్రారంభించారు. దేవాలయంలోని సీసీ కెమెరాలను ధ్వంసం చేసిన తర్వాత దొంగలు లోపలికి ప్రవేశించినట్లు పోలీసులు నిర్ధారించారు. ఇక్కడే కథ అసలైన కీలక మలుపు తిరిగింది.

జోరుగా ప్రచారం

గిద్దలూరు వెంకటేశ్వరస్వామి దేవాలయంలో జరిగిన చోరీలో పొన్నూరు పట్టణానికి చెందిన ఏలూరి చెన్నయ్య, అతడి మేనల్లుడి ప్రమేయం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. చోరీ చేసి తెచ్చిన వెండిని కరిగించి బూర్లగడ్డ సుబ్రహ్మణ్యం ద్వారా విక్రయించడానికి చెన్నయ్య మధ్యవర్తిగా వ్యవహరించినట్లు సమాచారం. బుధవారం పొన్నూరు వెళ్లిన ఒంగోలు సీసీఎస్ పోలీసులు ఆ పట్టణంలోని ఒక బంగారం దుకాణంలో తనిఖీలు నిర్వహించారు. చెన్నయ్య ఇంట్లో కూడా తనిఖీలు నిర్వహించి నగదు స్వాధీనం చేసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. చెన్నయ్యతో పాటు చోరీ సొత్తును విక్రయించడానికి ప్రయత్నించిన సుబ్రహ్మణ్యంను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. టీడీపీ సీనియర్ ఎమ్మెల్యేకి చెన్నయ్య ముఖ్య అనుచరుడు కావడంతో అతడిని కాపాడేందుకు ఆ ఎమ్మెల్యే ఇప్పటికే రంగంలోకి దిగినట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది.

జెడ్పీ బడ్జెట్ ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

సమావేశాన్ని నిర్వహిస్తున్న హెనీ క్రిస్టినా

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ 2026–27 ఆర్థిక సంవత్సర బడ్జెట్ ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా అధికారులను ఆదేశించారు. గురువారం జెడ్పీ కార్యాలయంలోని ఆమె చాంబర్‌లో 15వ ఆర్థిక సంఘం, సాధారణ నిధులతో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలో చేపట్టిన పనులపై అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. మూడు జిల్లాల్లో పనుల పురోగతిపై చర్చించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పనుల అంచనాలతోపాటు వచ్చే ఆర్థిక సంవత్సర బడ్జెట్ రూపకల్పనకు చర్యలు తీసుకోవాలని ఆమె వారికి సూచించారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో ఏర్పాటు చేస్తున్న శిలాఫలకాలపై ముద్రించే పేర్ల విషయంలో ప్రోటోకాల్ తప్పనిసరిగా పాటించాలన్నారు. సమావేశంలో జెడ్పీ డిప్యూటీ సీఈవో సీహెచ్ కృష్ణ, జెడ్పీ ఏవోలతో పాటు పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈలు, ఈఈలు, డీఈలు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నంలోని మైనింగ్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న పేరేచర్ల తెల్లక్వారీ వర్కర్స్

అయ్యా.. మాకో దారి చూపండి!

టీడీపీ నేత ఆగడాలతో తీవ్రంగా నష్టపోతున్నాం

- తెల్లక్వారీకి దారి చూపించాలని కార్మికుల ఆందోళన
- గుంటూరు జిల్లా పేరేచర్ల నుంచి వచ్చి మైనింగ్ కార్యాలయం వద్ద నిరసన
- భూగర్భ గనులు శాఖ రాష్ట్ర డైరెక్టర్ చంద్రశేఖర్‌కు వినతి

ఇబ్రహీంపట్నం: ఓ టీడీపీ నాయకుడి ఆగడాలతో ఇబ్బందులు పడుతున్నామని, తమ తెల్లక్వారీకి 'దారి' చూపాలని గుంటూరు జిల్లా మేడికొండూరు మండలం పేరేచర్ల గ్రామానికి చెందిన వడ్డెర క్వారీ వర్కర్స్ లేబర్ కాంట్రాక్ట్ సహకార సంఘం సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఇబ్రహీంపట్నంలోని గనులు, భూగర్భ శాఖ రాష్ట్ర డైరెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. ఉదయం తొమ్మిది గంటలకే కార్యాలయానికి ర్యాలీగా చేరుకుని కొద్దిసేపు ఆందోళన నిర్వహించారు. టీడీపీ నాయకుల తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కూటమి ప్రభుత్వ మాజీ మంత్రి కనుసన్నల్లో పేరేచర్ల టీడీపీ నాయకుడు పిల్లి వెంకటేశ్వరరావు తమ క్వారీకి వెళ్లేందుకు ఉన్న దారిని పొక్లయినర్‌తో తవ్వేశారని మండిపడ్డారు. సుమారు 13 నెలలుగా క్వారీలో పనులు చేసుకునే అవకాశం లేనందున కుటుంబాలు పస్తులు ఉండాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

వంద మందికి జీవనాధారం..

వడ్డెర ప్రజాగళం సంఘం అధ్యక్షుడు ఇడగొట్టు నాగేశ్వరరావు మాట్లాడుతూ గ్రామంలోని సుమారు 50 కుటుంబాలకు చెందిన వంద మంది వడ్డెర కులస్తులు క్వారీని నడుపుకొని జీవనం సాగిస్తున్నారన్నారు. వడ్డెరలను తమ క్వారీపైకి వెళ్లకుండా స్థానిక టీడీపీ నాయకుడు, ప్రముఖ కాంట్రాక్టర్ పిల్లా వెంకటేశ్వరరావు అడ్డుకుంటున్నారని తెలిపారు. ఆయన 11 ఎకరాల క్వారీని ఒక్కరే నడుపుకొంటున్నారని, 100 మంది సొసైటీ కార్మికులు కేవలం రెండెకరాల్లో క్వారీని నడపుకొంటుంటే అడ్డుకోవడం ఏమిటని ప్రశ్నించారు. ప్రభుత్వ ఆధీనంలో ఉన్న దారిని 1973 నుంచి అందరూ వినియోగించుకుంటున్నట్లు నాగేశ్వరరావు తెలిపారు. గతంలో దారిని అడ్డుకున్న పిల్లి వెంకటేశ్వర రావు ఆగడాలు అప్పట్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి దృష్టికి తీసుకెళ్లిన వెంటనే సమస్యకు పరిష్కారం చూపారని చెప్పారు. అప్పులు తెచ్చి ప్రభుత్వానికి రూ.40లక్షలు లీజు కింద చెల్లించి క్వారీ నడుపుకుంటున్నట్లు తెలిపారు. చంద్రబాబు ప్రభుత్వంలో పలువురు పెద్దలకు చెప్పినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదన్నారు. గత్యంతరం లేక క్వారీ పైకి వెళ్లేందుకు తాడు సహాయంతో నిచ్చెన ఏర్పాటు చేసుకుని ఎక్కుతున్నామని, దానిని కూడా బడా కాంట్రాక్టర్ అడ్డుకున్నారని పేర్కొన్నారు.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం

చంద్రశేఖర్‌కు పేరేచర్ల తెల్లక్వారీ సమస్య వివరిస్తున్న వర్కర్లు

అనంతరం మైనింగ్ శాఖ రాష్ట్ర డైరెక్టర్ డబ్ల్యూబీ చంద్రశేఖర్‌ను వారి కార్యాలయంలో కలిశారు. సమస్యను ఆయనకు వివరించారు. చంద్రశేఖర్ స్పందిస్తూ గతంలో వచ్చిన ఫిర్యాదుల మేరకు ఇప్పటికే వడ్డెర క్వారీ వర్కర్స్ సమస్యపై విచారణ అధికారిని నియమించినట్లు తెలిపారు. ఆయన ఇచ్చిన తుది నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. సుమారు 100 మంది క్వారీ కార్మికులు పాల్గొన్నారు.

ముందు జాగ్రత్తే ఔషధం

మారిన జీవనశైలితో షుగర్ మహమ్మారి కబళిస్తోంది. ప్రతి ఒక్కరూ మధుమేహంపై అవగాహన కలిగి ఉండి, జాగ్రత్తలు తీసుకోవటం ద్వారా వ్యాధి బారిన పడకుండా కాపాడుకోవచ్చని వైద్య నిపుణులు చెబుతున్నారు. ముందస్తుగా తగు జాగ్రత్తలు తీసుకోవటం ద్వారా వ్యాధి బారిన పడకుండా కాపాడుకోవచ్చని పేర్కొంటున్నారు.

- నేడు వరల్డ్ డయాబెటీస్ డే
- వ్యాధి బారిన పడుతున్న పిల్లలు, యువత
- ఆధునిక జీవన శైలితో పెరుగుతున్న బాధితులు
- అప్రమత్తతతో వ్యవహరించాలని వైద్యుల సూచన



గుంటూరు మెడికల్ : చిన్నపిల్లలు, పెద్దవారు అనే తేడా లేకుండా ఆధునిక జీవన శైలి వల్ల నేడు చాలా మంది మధుమేహం వ్యాధి బారిన పడి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. యువత ఈ వ్యాధి సోకి తమ శక్తి అంతా నిర్వీర్యం చేసుకుంటున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక ప్రకారం 1980లో ప్రపంచ వ్యాప్తంగా షుగర్ బాధితుల సంఖ్య 108 మిలియన్లు ఉంటే... ఇప్పుడా సంఖ్య 425 మిలియన్లకు చేరింది. ప్రతి ఏడాది షుగర్ వ్యాధితో 1.5 మిలియన్ల మరణాలు సంభవిస్తున్నాయి. వ్యాధితో సంభవించే మరణాలు 2000 నుంచి 2019 సంవత్సరం మధ్య కాలంలో మూడు శాతం పెరిగాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆందోళన వ్యక్తం చేసింది. ప్రతి ఒక్కరు మధుమేహంపై అవగాహన కలిగి ఉండి, జాగ్రత్తలు తీసుకోవటం ద్వారా వ్యాధి బారిన పడకుండా కాపాడుకోవచ్చు. ఏటా నవంబర్ 14న ప్రపంచ మధుమేహ వ్యాధి దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం.

కారణాలు ఇవీ....

పిల్లల్లో మధుమేహం రావటానికి ప్రధాన కారణం ఇన్‌ఫెక్షన్లు. శరీరంలో ప్యాంక్రియాస్ అనేది ఇన్సులిన్‌ను ఉత్పత్తి చేస్తుంది. ఇన్‌ఫెక్షన్ వల్ల ప్యాంక్రియాస్ దెబ్బతిని ఇన్సులిన్ ఉత్పత్తి అవ్వకపోవటంతో వ్యాధి సోకుతుంది. పుట్టుకతో వచ్చే జన్యుపరమైన కారణాలు, జంక్‌ఫుడ్, వ్యాయామం లేకపోవటం, బరువు పెరగటం, మానసిక ఒత్తిడికి గురవ్వటం వల్ల కూడా ఈ వ్యాధి సోకుతుంది. పెద్ద వారిలో జీవనశైలిలో మార్పులు, వ్యాయామం లేకపోవటం, ఆహారంలో మార్పులు ముఖ్యంగా ఫాస్ట్‌ఫుడ్స్ ఎక్కువగా తీసుకోటం, అధిక బరువు, ఒత్తిడి వంటి కారణాలతో షుగర్ వ్యాధి వస్తుంది.

వ్యాధి లక్షణాలు....

తరచుగా మూత్ర విసర్జనకు వెళ్లటం, తరచూ దాహం వేయటం, ఆకలి పెరగటం, బరువు తగ్గిపోవటం, నీరసం, నిస్సత్తువ, పిల్లలు రాత్రి వేళల్లో పక్క తడపటం వంటి లక్షణాలు షుగర్ వ్యాధి సోకిన వారిలో కనిపిస్తాయి. తక్షణమే తల్లిదండ్రులు వైద్యులను సంప్రదించి జీవితాంతం పిల్లలకు ఇన్సులిన్ వాడాలి. పెద్ద వారిలో షుగర్ వ్యాధి సోకితే బాగా దాహం వేసినట్లు ఉంటుంది. తరచుగా మూత్రానికి వెళ్తారు. చూపు మసకబారుతుంది. బాగా అలసిపోతారు. కొంత మందిలో శృంగార కోరికలు తగ్గుతాయి. కొంత మందికి కాళ్లలో స్పర్శ ఉండదు. కాళ్లలో తిమ్మిర్లు వస్తాయి. అతిగా ఆకలి వేస్తుంది. ఆకస్మాత్తుగా బరువు తగ్గిపోతారు. ఆయాసం, వాంతులు, విరేచనాలు, మర్మావయవాల వద్ద ఇన్‌ఫెక్షన్లు వస్తాయి.

జిల్లాలో బాధితులు....

ఏమీ తినకుండా నిర్ధారణ పరీక్ష చేస్తే 126 ఉంటే షుగర్ ఉన్నట్లు. ఏదైనా ఆహారం తిన్న తరువాత 200 ఉంటే షుగర్ ఉన్నట్లు లెక్క. జిల్లాలో 50 మంది షుగర్ వైద్య నిపుణులు, 120 మంది పిల్లల వైద్య నిపుణులు ఉన్నారు. ప్రతినెలా ఒక్కో వైద్యుడి వద్దకు ముగ్గురు నుంచి ఐదుగురు పిల్లలు షుగర్ వ్యాధి చికిత్స కోసం వస్తున్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఎన్‌సీడీ కార్యక్రమంలో భాగంగా 2024–25లో జిల్లా వ్యాప్తంగా షుగర్ వ్యాధి బాధితుల సర్వే చేశారు. జిల్లాలో 18 సంవత్సరాలు దాటిన వారి సంఖ్య 1,79,148. వీరిలో లక్ష మందికి షుగర్ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయగా.. 72,395 మంది వ్యాధితో బాధ పడుతున్నట్లు తేలింది. వీరి పిల్లలకు షుగర్ వ్యాధి వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్న దృష్ట్యా ముందస్తుగా వైద్య పరీక్షలు చేయించి తగు జాగ్రత్తలు తీసుకోవటం ద్వారా వ్యాధి బారిన పడకుండా కాపాడవచ్చు.

జాగ్రత్తలతో నియంత్రణ

మధుమేహం రాకుండా ముందస్తుగా తగు జాగ్రత్తలు తీసుకోవటం ద్వారా వ్యాధి బారిన పడకుండా కాపాడుకోవచ్చు. వ్యాధి సోకిన వారు తప్పనిసరిగా వైద్యుల సలహాలు పాటిస్తూ జీవన శైలిలో మార్పులు చేసుకోవటం ద్వారా పూర్తిగా షుగర్ నియంత్రణలో పెట్టుకోవచ్చు. షుగర్ నియంత్రణలో మందులతోపాటుగా వ్యాయామం చాలా కీలకం. కుటుంబంలో ఒకరికి వ్యాధి ఉంటే తక్షణమే వైద్యులను సంప్రదించి పరీక్షలు చేయించుకోవాలి. శరీర బరువును అదుపులో ఉంచుకోవాలి. రోజూ శారీరక వ్యాయామం చేయాలి. నిర్ణీత వేళకు పోషకాహారం, మితాహారం తీసుకోవాలి. ఫాస్ట్‌పుడ్స్‌ను, ఒత్తిడిని దరిచేరనీయవద్దు. సరిపడా నిద్ర ఉండాలి. నూనె వస్తువులు, ఉప్పు తగ్గించి తీసుకోవాలి. స్వీట్లు, కూల్‌డ్రింక్స్, చాక్లెట్లు, ఐస్‌క్రీమ్స్ వంటి షుగర్ ఎక్కువగా ఉండేవి తిన కూడదు. ఆకుకూరలు, కూరగాయలు ఎక్కువగా తీసుకోవాలి.

– డాక్టర్ నందిపాటి వెంకట సందీప్,
ఎండోక్రైనాజిస్ట్, గుంటూరు

ఆధునిక మందులతో కిడ్నీలకు రక్షణ

గతంలో షుగర్ వచ్చిన వారు వ్యాధి సోకిన ఐదు నుంచి ఏడేళ్లలో కిడ్నీలు ఫెయిల్ అవ్వటం, డయాలసిస్ చేయించుకోవటం వంటి సమస్యల బారిన పడి చనిపోయేవారు. షుగర్ వల్ల వచ్చిన వారి కిడ్నీ సమస్యలకు మందులు లేకపోవటంతో ఇలా జరిగేది. నేడు షుగర్‌కు ఆధునిక మందులు అందుబాటులోకి వచ్చాయి. సెల్టాటు ఇన్‌బీటాస్, ఫినిరినోన్, జీఎల్‌పీఒన్ వంటి మూడు రకాల మందులు మార్కెట్‌లో ఉన్నాయి. బాధితులు వీటిని తీసుకోవటం ద్వారా షుగర్‌ను కంట్రోల్ చేస్తాయి. కిడ్నీ జబ్బులు రాకుండా, జీవితాంతం కిడ్నీలు ఫెయిల్ అవ్వకుండా పరిరక్షిస్తాయి. జబ్బును త్వరగా గుర్తించి చికిత్స అందిస్తేనే ఫలితం ఉంటుంది. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రతి ఒక్కరూ ముందస్తుగా స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకుని వైద్యుల సలహాలు పాటించాలి.

– డాక్టర్ చింతా రామకృష్ణ,
సీనియర్ నెఫ్రాలజిస్టు, గుంటూరు

క్లుప్తంగా

డీసీఎం కమలాకర్‌బాబు విజయవాడ బదిలీ

లక్ష్మీపురం: గుంటూరు రైల్వే డివిజన్ డీసీఎం కమలాకర్‌బాబు విజయవాడకు గురువారం బదిలీ అయ్యారు. డీఆర్ఎం కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన వీడ్కోలు సభలో డివిజన్ అధికారులు ఆయన్ను సత్కరించారు. అనంతరం మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని ఉద్యోగులంతా ఎంతో స్నేహభావంతో ఉంటూ, సహకారం అందించారని తెలిపారు. గుంటూరు డివిజన్ అధికారులకు, సిబ్బందికి సహాయ సహకారాలు అందించేందుకు అందుబాటులో ఉంటానని తెలిపారు.

వైఎస్సార్‌సీపీలో పలువురికి పదవులు

పట్నంబజారు: వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు గుంటూరు జిల్లాకు సంబంధించి పలు నియోజకవర్గాల నాయకులకు నూతన పదవులు ఇస్తూ ఆదేశాలు వెలువడ్డాయి. ఈమేరకు గురువారం కేంద్ర పార్టీ కార్యాలయం నుండి ఉత్తర్వులు వెలువడ్డాయి. వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడుగా ప్రత్తిపాడు నియోజకవర్గానికి చెందిన డాక్టర్ కొమెర్ల శివకుమార్, ఎస్సీ విభాగం గుంటూరు నగర అధ్యక్షుడిగా తూర్పు నియోజకవర్గానికి చెందిన ఆలా కిరణ్, ప్రత్తిపాడు నియోజకవర్గానికి సంబంధించి నియోజకవర్గ ఎంప్లాయిస్ అండ్ పెన్షనర్స్ విభాగం అధ్యక్షుడిగా కొండమూడి బుచ్చయ్య, ఆర్టీసన్ విభాగం ప్రత్తిపాడు నియోజకవర్గ అధ్యక్షుడిగా పేరేచర్ల శివకుమార్‌లను నియమిస్తూ ఆదేశాలు వెలువడ్డాయి.

వర్కింగ్ జర్నలిస్టుల అక్రిడిటేషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు వెస్ట్: రాష్ట్ర, జిల్లా స్థాయిలలో పనిచేస్తున్న పాత్రికేయులకు రెండు సంవత్సరాల (2026, 2027) కాలపరిమితికి సమాచార, పౌర సంబంధాల శాఖ జారీ చేసే నూతన అక్రిడిటేషన్‌లకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు సంచాలకులు కె.ఎస్. విశ్వనాథన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అక్రిడిటేషన్ నిబంధనల మేరకు అర్హత కలిగిన పాత్రికేయుల దరఖాస్తులు ఆన్‌లైన్ ద్వారా స్వీకరిస్తారన్నారు. గతంలో జారీ చేసిన అక్రిడిటేషన్ కార్డుల గడువు ఈ ఏడాది నవంబర్ 30 నాటికి ముగుస్తోందని తెలిపారు. దరఖాస్తుల నమోదుకు ముందుగా మీడియా సంస్థల వివరాలు పోర్టల్‌లో పొందుపరచవలసి ఉందన్నారు. సంబంధిత పత్రాల డాక్యుమెంట్లను పెన్‌డ్రైవ్‌లో పొందుపరిచి ఫొటోస్టాట్ కాపీలను సమాచార, పౌర సంబంధాల శాఖ, పండిట్ నెహ్రూ బస్టాండ్, ఎన్టీఆర్ అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్, రెండవ అంతస్తులోని విజయవాడ కార్యాలయంలో అందజేయాలని తెలిపారు. అనంతరం ఈనెల 14వ తేదీ నుంచి ఆన్‌లైన్ వెబ్ సైట్‌లో సూచించిన విధంగా సంబంధిత పూర్తి వివరాలను నమోదు చేయాల్సి ఉంటుందని వివరించారు.

న్యూస్ చానల్ రిపోర్టర్ కుట్రలో ఐదుగురు అరెస్ట్

- సీఐని బ్లాక్ మెయిల్ చేసేందుకు సహచరులతో పథకం
- కారు వెనుక అద్దాలు ధ్వంసం
- నిందితుడిపై తొమ్మిది కేసులు

మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, పక్కన డీఎస్పీ అరవింద్, సీఐ

నగరంపాలెం: న్యూస్ చానల్ రిపోర్టర్ పన్నిన కుట్రలో ఐదుగురిని అరెస్ట్ చేశామని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలోని హాల్‌లో గురువారం జరిగిన మీడియా సమావేశంలో జిల్లా ఎస్పీ కేసు వివరాలు వివరించారు. ఈనెల 4న కృష్ణానగర్ రెండో వీధిలో సాయితేజ అపార్ట్‌మెంట్ ఎదురున్న కారు వెనుక అద్దాలను పగులకొట్టారని బీఆర్‌కే న్యూస్ చానల్ రిపోర్టర్ కన్నెగంటి అరుణ్ బాబు డయల్ 112కు ఫిర్యాదు చేశాడు. దీంతో పట్టాభిపురం పీఎస్ హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస రావు ఘటనా స్థలానికి చేరుకుని కారుని పరిశీలించారు. అయితే, అక్కడ అరుణ్ కనిపించలేదు. మహిళా వాచ్‌మన్ గంగమ్మతో హెచ్‌సీ మాట్లాడారు. ముగ్గురు టోపీలు, మాస్క్‌లతో వచ్చారని, తమను సీఐ శ్రీనివాసరావు పంపించారంటూ గొడవ చేశారని తెలిపింది. అనంతరం అరుణ్ బాబుని అడిగి, పెంట్ హౌస్‌లోని ఆయన ఇంటి కెళ్లారని హెడ్ కానిస్టేబుల్‌కు చెప్పింది. ఆ ముగ్గురు కిందకి వెళ్తూ సీఐను వదిలేయాలంటూ అరుణ్‌బాబు కారు వెనుక అద్దాలు ధ్వంసం చేశారని తెలిపింది.

ప్రత్యేక బృందాలతో దర్యాప్తు

హెచ్‌సీ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి, ప్రత్యేక బృందాలతో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సీసీటీవీ ఫుటేజీలు, టవర్ డంప్స్‌ను పరిశీలించారు. అయితే అరుణ్‌బాబే సహచరులను ఇంటికి పంపించి, సీఐ దాడి చేయించినట్లు పన్నాగం పన్నినట్లు బహిర్గతమైందని, ఇదంతా ఒక డ్రామా అని తేలిందని ఎస్పీ వివరించారు. డ్రామాలో భాగంగానే అతని కారు వెనుక అద్దాలను పగలకొట్టించాడని తెలిపారు. ఇందులో బడే జగదీశ్ (స్వర్ణభారతీనగర్ 28వ వీధి), మేడా సంపత్‌కుమార్ (బృందావన్ గార్డెన్స్ ఏడో వీధి), వి.ఆదర్శ్ బాబు (పల్నాడు జిల్లా వినుకొండ ఇందిరానగర్), గంగిరెడ్డి ప్రసన్నరెడ్డి, సాయిబాబు (హైదరాబాద్)ను అరెస్ట్ చేశామని చెప్పారు.

బ్లాక్ మెయిల్ చేయాలని పథకం

సీఐ మాతంగి శ్రీనివాసరావుని బ్లాక్‌మెయిల్ చేయాలని అరుణ్‌బాబు కుట్ర పన్నా డు. జగదీష్, సంపత్‌కుమార్‌కు అతనే కాల్ చేసి పథకం గురించి చెప్పాడు. పేర్కొన్నారు. దీనిపై జగదీశ్, మేడా సంపత్‌కుమార్, సాయిబాబు, ప్రసన్నరెడ్డి, కావూరి అశోక్, గోపీలతో చర్చించాడు. ఈనెల 4న రాత్రి 11 గంటలకు ఆదర్శ్‌బాబు, సాయిబాబు, ప్రసన్నరెడ్డి మోటారుసైకిల్‌పై అపార్ట్‌మెంట్ వద్దకెళ్లారు. ఆ ముగ్గురు పెంట్ హౌస్‌లోని అరుణ్‌బాబు ఇంటికెళ్లి గొడవ చేశారు. గ్రిల్‌ను కాళ్లతో కొట్టి కిందకి రాగా, ఆదర్శ్ రాయితో కారు వెనుక అద్దాన్ని పగులకొట్టాడు. ఆ తర్వాత ముగ్గురూ పారిపోయారు. ఈ దృశ్యాలను కావూరి అశోక్ రికార్డ్ చేశాడు. దీనికిగాను అరుణ్ బాబు సంపత్ ద్వారా జగదీశ్‌కు రూ.5 వేలు చెల్లించాడని, అందులో రూ.2 వేలను జగదీశ్ బంకా అరుణ్ ద్వారా ఆదర్శ్‌బాబుకి చెల్లించినట్లు బయటపడిందని ఎస్పీ వివరించారు.

చానల్‌లో స్క్రోలింగ్

గతంలో అరుణ్‌బాబు రెండు పత్రికల్లో (సాక్షి కాదు) పని చేశాడు. ప్రస్తుతం బీఆర్‌కే న్యూస్ చానెల్‌లో రిపోర్టర్‌గా ఉన్నాడు. కారు అద్దాలు పగులకొట్టాక, అతని పనిచేసే న్యూస్ చానల్‌లో సీనియర్ జర్నలిస్ట్ ఇంటిపై రౌడీ మూకల దాడి, రౌడీలుగా మారిన పోలీసులు అంటూ స్క్రోలింగ్ చేశాడు. రౌడీమూకలను ఎవరూ పోషిస్తున్నారనేది తమ వద్ద ఆధారాలున్నాయని ఎస్పీ వివరించారు. అరుణ్‌బాబుపై పాతగుంటూరు పీఎస్, వినుకొండ పీఎస్, అరండల్‌పేట పీఎస్, పట్టాభిపురం పీఎస్, నరసరావుపేట రెండో పట్టణ పీఎస్‌ల్లో తొమ్మిది కేసులు వరకు ఉన్నాయని తెలిపారు. మిర్చియార్డులో లారీ డ్రైవర్‌గా చేసే జగదీష్‌పై నల్లపాడు పీఎస్‌లో కొట్లాట కేసు, జేకేసీ కళాశాలలో కార్యాలయపు రికార్డు సహాయకునిగా మేడా సంపత్‌కుమార్ పని చేసేవాడని తెలిపారు. ఇతనిపై నగరంపాలెం పీఎస్, పట్టాభిపురం పీఎస్‌లో కేసులున్నాయని చెప్పారు. ఇక ఆదర్శ్‌బాబు, సాయిబాబు విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాలలో, ప్రసన్నరెడ్డి హైదరాబాద్ మల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతున్నారని తెలిపారు. వీరిపై రౌడీషీట్లు తెరుస్తామని ఎస్పీ చెప్పారు.

పోలీసుల వద్ద కూడా వసూలు

గతంలో అరుణ్‌బాబు పోలీసుల వద్ద కూడా డబ్బులు వసూలు చేశాడని జిల్లా ఎస్పీ తెలిపారు. నెలవారీ మామూళ్లు, కొన్ని ప్రభుత్వ కార్యాలయాల నుంచి రూ.25 వేలు, రూ.50 వేలు వచ్చేవని గుర్తించామని చెప్పారు. అతని బాధితులు ఎవరైనా ఉంటే ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని అన్నారు. మీడియా, ట్యాగ్ ముసుగులో కొంత మంది ఇబ్బంది కలిగిస్తున్నారని చెప్పారు. 30, 20 ఏళ్లకు పైగా విలువలతో పనిచేసే జర్నలిస్టులు ఉన్నారని, లోపాలను ఎత్తిచూపడమే మీడియా అని పేర్కొన్నారు. సమావేశంలో పశ్చిమ డీఎస్పీ అరవింద్, పట్టాభిపురం పీఎస్ సీఐ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పీఎఫ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలి: ఏపీటీఎఫ్

హెనీ క్రిస్టినాకు వినతిపత్రం సమర్పిస్తున్న ఏపీటీఎఫ్ ప్రతినిధులు

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా వివిధ కేడర్లలో పని చేస్తున్న ఎంఈవో, హెచ్‌ఎం, ఉపాధ్యాయుల పీఎఫ్ సమస్యలను 10 రోజుల్లో పరిష్కరించని పక్షంలో జెడ్పీ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగుతామని ఏపీటీఎఫ్ గుంటూరు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.బసవలింగారావు, మహమ్మద్ ఖాలీద్ స్పష్టం చేశారు. జెడ్పీ కార్యాలయంలో గురువారం చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా, డిప్యూటీ సీఈవో సీహెచ్. కృష్ణను కలిసిన ఏపీటీఎఫ్ బృందం పీఎఫ్ సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు. బసవ లింగారావు మాట్లాడుతూ జెడ్పీ కార్యాలయంలోని పీఎఫ్ విభాగంలో తొమ్మిది నెలలుగా ఫైళ్లను పరిష్కరించకుండా మూలన పడేశారని తెలిపారు. ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయుల క్లోజర్స్, మిస్సింగ్ క్రెడిట్స్ అప్‌డేటేషన్ పనుల్లో కార్యాలయ సిబ్బంది నిర్లక్ష్యం చూపుతున్నారని ఆరోపించారు. దీంతో ఉద్యోగ విరమణ పొందిన, పొందబోవు ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. పీఎఫ్ ఖాతాలను అప్‌డేట్ చేయకుండా ఉపాధ్యాయుల నుంచి బలవంతంగా సెల్ఫ్ డిక్లరేషన్ అడుగుతున్నారని, అటువంటి అధికారం ఎవరిచ్చారని ప్రశ్నించారు. ఉపాధ్యాయులు దాచుకున్న సొమ్ము తీసుకోవడానికి నిబంధనలు విధించడం తగదన్నారు. ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయులకు మిస్సింగ్ క్రెడిట్ రూపంలో రావలసిన సొమ్మును వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యలు పరిష్కరించని పక్షంలో పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు పి.నాగశివన్నారాయణ, జిల్లా కార్యదర్శి జి.దాస్, జిల్లా పూర్వ ప్రధాన కార్యదర్శి ఎం.హనుమంతరావు, జిల్లా కౌన్సిలర్లు ఆర్.బాలరాజు, కృష్ణారావు, జహంగీర్, కుంబా శ్రీనివాస్, గురుమూర్తి పాల్గొన్నారు.

మహిళపై కత్తితో దాడికి పాల్పడిన వ్యక్తి అరెస్టు

ప్రత్తిపాడు: మహిళపై కత్తితో దాడికి పాల్పడిన వ్యక్తిని కాకుమాను పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన ప్రకారం.. కాకుమానుకు చెందిన పచ్చిపులుసు లక్ష్మీ రాజ్యం ఈ నెల 11వ తేదీ తెల్లవారుజామున ఇంట్లో ఒంటరిగా ఉంది. ఆ సమయంలో అదే గ్రామానికి చెందిన మన్నవ శ్రీనివాసరావు లోపలకు ప్రవేశించి మెడలో ఉన్న బంగారపు గొలుసును అపహరించేందుకు ప్రయత్నించాడు. లక్ష్మీ రాజ్యం పెద్దగా కేకలు వేయడంతో శ్రీనివాసరావు వెంట తెచ్చుకున్న కత్తితో ఆమెపై దాడి చేశాడు. తీవ్ర గాయాలపాలైన మహిళ ఫిర్యాదు మేరకు కాకుమాను ఎస్ఐ ఏక్‌నాథ్ కేసు నమోదు చేశారు. దర్యాప్తు చేపట్టిన ఎస్ఐ గురువారం నిందితుడు మన్నవ శ్రీనివాసరావును అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరిచారు. న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

నగరపాలక సంస్థ స్థలంలో గుడి నిర్మాణం

శంకుస్థాపన చేసేందుకు గుడి నిర్వాహకుల ఏర్పాట్లు

నిర్వాహకులతో మాట్లాడుతున్న నగరపాలక సంస్థ సిటీ ప్లానర్ రాంబాబు, పోలీసులు

పోలీసులతో కలసి అడ్డుకున్న నగరపాలక సంస్థ అధికారులు

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని ఆర్టీసీ కాలనీ చివర గాంధీనగర్(చిన్నేరు కుంట)లో గుడి శంకుస్థాపనను నగరపాలక సంస్థ అధికారులు, పోలీసులు అడ్డుకున్నారు. తూర్పు నియోజకవర్గ పరిధిలోని గాంధీనగర్‌లో చెరువు ఉంది. దానినే చిన్నేరు కుంటగా కూడా పిలిస్తుంటారు. చెరువు క్రమక్రమంగా ఆక్రమణకు గురవుతోంది. దగ్గరలోనే సుత సంతోషిమాత శ్రీ లలితా త్రిపుర సుందరి సమేత మహాలింగేశ్వరస్వామి దేవస్థానం ఉంది. దాని పక్కనే మరొక దేవాలయం నిర్మించేందుకు శనివారం ప్రతిష్ట చేపట్టారు. విషయం తెలుసుకున్న నగరపాలక సంస్థ అధికారులు హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. శంకుస్థాపన కార్యక్రమాన్ని నిలిపివేయాలని,ఇది నగరపాలక సంస్థకు చెందిన స్థలమని చెప్పారు. గుడి నిర్వాహకులు మాత్రం ఇది తమకు పూర్వీకుల నుంచి వస్తున్న స్థలమని, ఇక్కడ శంకుస్థాపన చేసి తీరుతామని స్పష్టం చేయడంతో నగరపాలక సంస్థ అధికారులు పోలీసుల సహకారం తీసుకున్నారు. దీంతో అక్కడకు పదుల సంఖ్యలో పోలీసులు చేరుకున్నారు. సున్నితమైన అంశం కావడంతో రాత్రి వరకు గుడి నిర్వాహకులు, పోలీసులు, నగరపాలక సంస్థ అధికారులు చిన్నేరు కుంట వద్దే తిష్ట వేశారు.

సెల్‌ఫోన్ టవర్ ఎక్కి యువకుడి హల్‌చల్

- నగదు ఇప్పించాలంటూ ఆందోళన
- గంటన్నరపాటు ఉత్కంఠ
- నచ్చచెప్పి దింపించివేసిన పోలీసులు

టవర్ ఎక్కి కూర్చున్న యువకుడు భూషణం

భార్యాపిల్లలతో మాట్లాడి యువకుడిని తీసుకువస్తున్న సీఐ శివరామకృష్ణ

ఫిరంగిపురం: తనకు రావాల్సిన నగదు రాక ఎన్నో ఇబ్బందులు పడుతున్నానని, దాన్ని ఇప్పించాలంటూ ఓ యువకుడు 60 అడుగుల సెల్‌ఫోన్ టవర్ ఎక్కి కూర్చుని హల్‌చల్ చేశాడు. మండల కేంద్రంలోని విజ్ఞాన పురానికి చెందిన వెలిచర్ల భూషణం పెయింటర్‌గా పని చేస్తుంటాడు. అతడికి భార్య, ఇద్దరు ఆడపిల్లలు, ఒక మగపిల్లవాడు ఉన్నారు. కాగా ఐదేళ్ల కిందట తనకున్న ఇంటిని తాకట్టు పెట్టి స్థానికంగా ఉన్న ఓ వ్యక్తి ద్వారా గుంటూరులోని మరో వ్యక్తికి ఐదు లక్షల నగదు ఇప్పించాడు. అప్పటి నుంచి ప్రతి నెలా వడ్డీ చెల్లిస్తున్నాడు. నగదు ఇప్పటివరకు తిరిగి ఇవ్వక పోవడంతో మనస్తాపానికి గురై పశు వైద్యశాల పక్కనే ఉన్న సెల్ ఫోన్ టవర్ ఎక్కి కూర్చున్నాడు. న్యాయం చేయకపోతే పైనుండి దూకుతానని చెప్పాడు. విషయం తెలుసుకున్న సీఐ శివరామకృష్ణ, ఎస్ఐలు సురేష్, నవీన్, ఏఎస్ఐ పి.జాన్‌బాషా, సిబ్బంది అక్కడకు చేరుకున్నారు. కిందకు దిగిరావాలంటూ పోలీసులు ఎంతో నచ్చచెప్పి చూశారు. ముందు జాగ్రత్తగా 108 వాహనం కూడా అక్కడకు రప్పించారు. కానీ తనకు నగదు చెల్లించాల్సిన గుంటూరుకు చెందిన లోహిత్ రెడ్డిని పిలిపించాలంటూ పట్టుబట్టాడు. దీంతో అతడి కోసం ప్రయత్నించినా ఫోన్ కలవకపోవడంతో యువకుడిని నచ్చచెప్పేందుకు పోలీసులు ప్రయత్నించారు. చివరకు భార్య జ్యోతి, కుమార్తెలు మల్లిక, మహి, కుమారుడు లక్కీలను పిలిపించి వారితో నచ్చచెప్పించారు. దీంతో ఆయువకుడు తనకు న్యాయం చేయాలని అంటూ గంటన్నర తరువాత సెల్ టవర్ దిగివచ్చాడు. సీఐ శివరామకృష్ణ మాట్లాడి వివరాలు నమోదు చేసుకొని, న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు.

లింగ నిర్ధారిత వీర్యంతో పెయ్యదూడలు

విజయవాడ పశు సంవర్ధకశాఖ డైరెక్టరేట్ కార్యాలయం జాయింట్ డైరెక్టర్ డాక్టర్ టీ.వి.సుధాకర్

మాట్లాడుతున్న జాయింట్ డైరెక్టర్ డాక్టర్ టీవీ సుధాకర్

ప్రత్తిపాడు: సాంకేతిక టెక్నాలజీతో తయారుచేసిన లింగ నిర్ధారిత వీర్యంతో 90 శాతానికి పైగా పెయ్యదూడలే జన్మిస్తాయని, రైతులు తమ గేదెలకు పెయ్యదూడల సెమన్ ఇంజక్షన్ చేయించాలని విజయవాడ పశు సంవర్థకశాఖ డైరెక్టరేట్ కార్యాలయం జాయింట్ డైరెక్టర్ డాక్టర్ టీ.వి. సుధాకర్ అన్నారు. ప్రత్తిపాడు మండలం యనమదలలో గురువారం రాష్ట్రీయ గోకుల్ మిషన్, ఆంధ్రప్రదేశ్ పశుగణాభివృద్ధి సంస్థ, పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో పశువుల గర్భకోశ వ్యాధుల చికిత్సా శిబిరాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సుధాకర్, స్థానిక ఏడీ సుగణ్యారావు, జిల్లా లైవ్ స్టాక్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ ఈవో డాక్టర్ వై.సుధాకర్‌లతో కలిసి చికిత్సా శిబిరాన్ని ప్రారంభించారు. జేడీ సుధాకర్ మాట్లాడుతూ పెయ్యదూడలతో పాడిరైతులకు అనేక లాభాలున్నాయని వివరించారు. ఈ మంచి గేదెజాతి సెమెన్ వలన పాల దిగుబడి అధికంగా ఉంటుందని చెప్పారు. డీఎల్‌డీఏ ఈవో వై.సుధాకర్ మాట్లాడుతూ గేదెలను మంచిగా మేపడం వలన అధికంగా పాలు ఇవ్వడంతోపాటు వెంటనే ఎదకొచ్చి చూడి కడతాయని వివరించారు. చలికాలంలో గేదెలన్నీ ఎదకొచ్చి చూడి కట్టడం, ఈనడం జరుగుతుందని చెప్పారు. అందుచేత తగు జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. ఏడీ సుగణ్యారావు మాట్లాడుతూ పాడి రైతులు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వంగిపురం, గొట్టిపాడు పశువైద్యాధికారులు డాక్టర్ సీహెచ్.హరీష్‌కన్నా, డాక్టర్ కేవీఎస్ నందకిషోర్, పాడి రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వీవీఐటీ విశ్వవిద్యాలయానికి ఇస్రో ప్రాజెక్ట్ నిధులు



అధ్యాపకుడిని అభినందిస్తున్న చాన్సలర్ వాసిరెడ్డి విద్యాసాగర్

పెదకాకాని: విశ్వవిద్యాలయాల పరిశోధనా సంస్థలకు అంతరిక్ష శాస్త్రం అనువర్తనాలకు సంబంధించిన పరిశోధనలను ప్రోత్సహించేందుకు ఇస్రో సంస్థ రెస్పాండ్ కార్యక్రమం ద్వారా వీవీఐటీ విశ్వవిద్యాలయానికి నిధులు అందించడానికి ఆమోదం తెలిపినట్లు ప్రో చాన్సలర్ వాసిరెడ్డి మహదేవ్ తెలిపారు. మండలంలోని నంబూరు వీవీఐటీయూలో గురువారం ఆయన వివరాలు తెలిపారు. ఈసీఈ విభాగానికి చెందిన ఎన్. దుర్గారావు ప్రధాన పరిశోధకుడిగా, ఎం.వై. భానుమూర్తి, శేషు చక్రవర్తి సహ పరిశోధకులుగా' లో నాయిస్ టైమ్ అండ్ ఫ్రీక్వెన్సీ ట్రాన్ఫర్ యూజింగ్ ఆప్టికల్ మీడియం' అనే ప్రాజెక్ట్‌ను ఇస్రో బెంగళూరు కేంద్రానికి పంపగా రెస్పాండ్ కార్యక్రమానికి ఎంపికైనట్లు చెప్పారు. ఈ ప్రాజెక్ట్‌కు ఇస్రో రూ. 20 లక్షలు అందిస్తుందని తెలిపారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా ఆప్టికల్ ఫైబర్ ఆధారిత వ్యవస్థ ద్వారా దీర్ఘ దూరాలకు తక్కువ శబ్దంతో అధిక స్థిరత్వం కలిగిన ఫ్రీక్వెన్సీ ప్రసార సాంకేతికతను అభివృద్ధి చేయడం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఇందులో విశ్వవిద్యాలయానికి చెందిన అధ్యాపకులు పరిశోధకులుగా ఉండటం ద్వారా విద్యార్థులను భాగస్వామ్యం చేయనున్నట్లు తెలిపారు. ఇస్రో వంటి ప్రతిష్టాత్మక సంస్థ ఆమోదించిన పరిశోధనలలో విద్యార్థులు భాగం కావడం ద్వారా ఉపగ్రహాల తయారీ తదితర అంశాలపై అవగాహన కలుగుతుందని చెప్పారు. అనంతరం ప్రాజెక్ట్ పరిశోధకులుగా ఉన్న అధ్యాపకులను చాన్సలర్ వాసిరెడ్డి విద్యాసాగర్, వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కొడాలి రాంబాబు, రిజిస్ట్రార్ వై. మల్లికార్జునరెడ్డి, అకడమిక్ డీన్ కె. గిరిబాబు అభినందించారు.

డ్వాక్రా గ్రూపు మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి



అవని పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అధికారులు

నెహ్రూనగర్ : డ్వాక్రా గ్రూపు మహిళలు, వారి కుటుంబ సభ్యులు పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు ప్రభుత్వం వెసులుబాటు కల్పించిందని మెప్మా పీడీ విజయలక్ష్మి తెలిపారు. గురువారం నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్‌లో మెప్మా ఆర్పీలు, సీఓలు, సీఎంఎంలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు డ్వాక్రా గ్రూపులను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో 50 నుంచి 60 రకాల వ్యాపారాలు చేసుకునేందుకు వీలుగా వ్యాపార అవకాశాలను రూపొందించిందన్నారు. దీనిపై డ్వాక్రా గ్రూపు మహిళలు గాని వారి కుటుంబ సభ్యులు గాని లబ్ధి పొందే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం మహిళ పారిశ్రామిక వృద్ధికి సంబంధించిన అవని పుస్తకాన్ని ఆవిష్కరించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

■ గుంటూరు మిర్చి యార్డ్ ప్రక్కన చిలకలూరిపేట రోడ్డు నందు 1530 గజాలు, ఆర్.సి.సి. గోడౌన్ అమ్మకానికి కలదు. ✆ 9848752471

PLOT FOR SALE

■ కొలనుకొండ, జయభేరి కన్‌స్ట్రక్షన్ దగ్గర, KIA షోరూం పక్కన, 918 చ.గ. తూర్పు (హైవే) ఫేస్ త్రికోణాకారంలో ఉన్న స్థలము అమ్మకము. సంప్ర॥ ✆ 99662 28370

SERVICES

■ ప్రముఖ బ్యాంకుల నందు గల హౌసింగ్ లోన్‌లు మా యొక్క బ్యాంకుకు టేక్ ఓవర్ చేయబడును & కొత్త లోనులు చేయబడును కమీషన్ అవసరం లేదు. & DSAలు కావలెను. కమిషన్ వెంటనే ఇవ్వబడును. సంప్ర: 8121847536, 9966617161

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో / ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) పోన్ : 81422 92071

■ బంగారం కొనబడును. బ్యాంకులో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకి తీసుకుంటాం. ✆ 88024 89999

■ బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతర ప్రైవేటుసంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారాం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు కొనబడును. (స్పాట్‌క్యాష్) సంప్ర॥ ✆ 8790741166

WANTED

■ రుమాలి రోటీ పుల్కా చేయుటకు మాస్టర్స్ మరియు ఇండియన్ అసిస్టెంట్స్ మా రెస్టారెంటు నందు కావలెను. గుంటూరు సంప్రదించండి. 8712277968

■ ప్రముఖ హాస్పిటల్‌లో పని చేయుటకు MBBS డాక్టర్స్ M/F కావలెను. వర్క్ టైం: 10.00AM – 12PM, 2PM–6PM. 9381443438

■ ఎలక్ట్రికల్ ఆటోలు & ట్రాక్టర్లుకు గుంటూరు జిల్లాలో బ్రాంచిల కొరకు 1.సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ Q:ఏదైనాడిగ్రీ (ఫ్రెషర్స్ / అనుభవం ఉన్న వారు) 2. సర్వీస్ టెక్నీషియన్స్ ITI/ ఎలక్ట్రికల్ బ్యాక్‌గ్రౌండ్ (ఫ్రెషర్స్/ అనుభవం ఉన్న వారు) కావలెను. సం. 80089 31038, 91338 65966, hr.shreelakshmi infraequipments@gmail.com

■ తెనాలి దగ్గర దుగ్గిరాలలో ప్రముఖ కాఫీ పరిశ్రమకు సాధారణ ఎంప్లాయిస్, ప్యాకింగ్ బాయ్స్ & సెక్యూరిటీ గార్డ్స్ కావలెను రూమ్ & కాంటీన్ సౌకర్యం ✆ 7093924466, 8096161777

■ గుంటూరు పరిసర ప్రాంతాలలోని ప్రముఖ పారిశ్రామిక సంస్థలలో మా సంస్థ తరుపున పని చేయుటకు అనుభవము కలిగిన సెక్యూరిటీ సూపర్ వైజర్లు, సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. సూపర్‌వైజర్స్ అర్హతలు: వయస్సు:30–45సం,ఇంటర్/ డిగ్రీ, ఎత్తు: 05'-06" పైన, రిటైర్డ్ ఆర్మీ, పారా మిలిటరీ వారికి ప్రాధాన్యత. గార్డ్ అర్హతలు: వయస్సు:23–45 సం, 10th,ఎత్తు: 05'-05"పైన లేబర్ యాక్ట్ ప్రకారం జీతం ఉదయం 11 గం.నుండి మీఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో సం: సత్యా ఇన్వెస్టిగేషన్&సెక్యూరిటీ సర్వీసెస్,బృందావన్ గార్డెన్స్, స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రక్కన, గుంటూరు. 7095125556, 0863-2951838

■ గుంటూరు మాస్టర్‌మైండ్స్ కాలేజి నందు క్లాసు ఇన్‌ఛార్జిస్, హాస్టల్ ఇన్‌ఛార్జిస్, వార్డెన్స్‌గా పనిచేయుటకు పురుషులు కావలెను. జీతము: 12000/- నుండి 15000/- వరకు ఇవ్వబడును. (ఉచిత భోజనము, వసతి కల్పించబడును) విద్యా అర్హతలు: ఇంటర్ మరియు డిగ్రీ, వయస్సు: 22 సంవత్సరముల పైన ఉండవలెను. వివరముల కొరకు సంప్రదించగలరు. ఫోన్ నెంబర్: 89784 80429

సాక్షి క్లాసిఫైడ్స్
గుంటూరు ప్యాక్ రూ.475/- మాత్రమే (4 లైన్లు)
ప్రతి అదనపు లైను రూ.100/- మాత్రమే
ప్రతి 3 ప్రకటనలకు 2 ప్రకటనలు ఉచితం
గుంటూరు
7075167663
7075167541

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరుతున్నాము. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే దానితో ఈ దినపత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

పంజాబ్ నేషనల్ బ్యాంక్ / punjab national bank (భారత ప్రభుత్వరంగ సంస్థ)

అసెట్ రికవరీ మానిటరింగ్ బ్రాంచ్
డి నెం.9-13-45/2/9/1, 5వ అంతస్తు, ఎమ్‌వీఆర్ వినాయగర్ ట్రేడ్ సెంటర్, విఐపి రోడ్డు విశాఖపట్నం-530020. ఫోన్ : 96409 33383, 98312 00669

స్థిరాస్తుల అమ్మకానికి వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని రూలు 9(1) తో చదువుకోవలసిన రూలు 8(6) ప్రకారం సెక్యూరిటైజేషన్ & రీకనస్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్టు 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకానికి ఇ-వేలం ప్రకటన

సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన పంజాబ్ నేషనల్ బ్యాంక్ వారికి దిగువ తెలిపిన ఋణగ్రహీతలు/హామీదారులు చెల్లించవలసిన బకాయి మొత్తంను రాబట్టుకొనుటకు బ్యాంక్/సెక్యూర్డ్ క్రెడిటార్ అధీకృత అధికారిచే నిర్మాణాత్మక/భౌతికంగా/లాంఛనాత్మక స్వాధీనం చేసుకున్న, సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖాపెట్టిన/చార్జి చేసిన దిగువ వివరించిన స్థిరాస్తులను "ఎక్కడ ఎలా ఉన్నది" "అక్కడ అలా" మరియు "అక్కడ ఏమున్నదో అది" అనే ప్రాతిపదికన దిగువ తెలిపిన పట్టికలోని తేదిలో విక్రయించబడునని ప్రజానీకానికి, ముఖ్యంగా దిగువ తెలిపిన ఋణగ్రహీతలు మరియు హామీదారులకు అందుమూలంగా తెలియజేయడమైనది. రిజర్వు ధర, జమ చేయవలసిన ధరావత్తు సొమ్ము వివరములు దిగువ పట్టికలోని సంబంధిత ఆస్తుల వద్ద తెలియజేయడమైనది.

బ్రాంచ్ పేరు : ARMB విశాఖపట్నం

ఇ-వేలం తేది & సమయం: 05-12-2025, ఉ॥ 11.00 గం.ల నుండి సా॥ 4.00 గం.ల వరకు
ధరావత్తు సమర్పించుటకు ఆఖరి తేది: 05-12-2025, మ॥ 3.00 గం.ల వరకు

ఋణగ్రహీత/హామీదారుల పేర్లు & చిరునామా : శ్రీ దుగ్గెంపూడి శ్రీకాంత్ రెడ్డి (ఖాతా నెం.423800NC00001757), డీ నెం.11-7, చల్లవారి పాలెం, అంకిరెడ్డిపాలెం, అంకిరెడ్డిపాలెం (రూరల్), గుంటూరు-522005 & మరొక చిరునామా : శ్రీ దుగ్గెంపూడి శ్రీకాంత్ రెడ్డి, ఫ్లాట్ నెం.303, డి.నెం.799, అశ్విని ప్లాజా, అంకిరెడ్డిపాలెం, గుంటూరు-522005. డిమాండ్ నోటీసు తేది : 22.10.2021, మొత్తం బకాయి : తేది.31.03.2025 నాటికి బకాయి రూ.34,62,518.24/- (అక్షరాల ముప్పై నాలుగు లక్షల అరవై రెండు వేల ఐదు వందల పద్దెనిమిది రూపాయల ఇరవై నాలుగు పైసలు మాత్రమే) + వడ్డీ, మరియు ఇతర ఛార్జీలతో కలిపి చెల్లించవలెను. స్వాధీనత నోటీసు తేది : 17.03.2022, స్వాధీనత యొక్క స్వభావం : భౌతిక స్వాధీనం.

తనఖాపెట్టిన స్థిరాస్తి వివరాలు మరియు ఆస్తి యజమాని / తనఖా పెట్టిన వ్యక్తి పేరు

డాక్యుమెంట్ నెం.7181/2017, తేది.30-11-2017 ప్రకారం శ్రీ దుగ్గెంపూడి శ్రీకాంత్ రెడ్డి గారి పేరున ఉన్న ఆస్తి :

షెడ్యూల్-ఎ : గుంటూరు జిల్లా, నల్లపాడు సబ్ జిల్లా, గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా యొక్క పరిధి, అంకిరెడ్డిపాలెం గ్రామం, డి నెం.799 నందు విస్తీర్ణం ఎకరా 6.34 సెంట్లు భూమి నందు విస్తీర్ణం 866.24 చ॥గ॥లలోని స్థలం ఇందులో అశ్విని ప్లాజా అను పేరుతో నిర్మించబడిన అపార్ట్‌మెంట్ కలదు. హద్దులు : తూర్పు : 80.00 అ॥ల రోడ్డు, దక్షిణం : ఈమని ధన లక్ష్మీ గారికి చెందిన ఆస్తి, పడమర : వి.వి. భాస్కర రెడ్డి గారికి చెందిన ఆస్తి, ఉత్తరం : కె. వసంత లక్ష్మీ గారికి చెందిన ఆస్తి. ఈ హద్దుల యందు విస్తీర్ణం 866.24 చ॥గ॥లు స్థలంలోని అవిభాజ్యమైన మరియు నిర్దిష్టపరచని వాటా భూమి విస్తీర్ణం 43 చ॥గ॥లు మాత్రమే.

షెడ్యూల్-బి : పై షెడ్యూల్-ఎ నందు మొత్తం విస్తీర్ణం 866.24 చ॥గ॥లలోని అవిభాజ్యమైన మరియు నిర్దిష్టపరచని వాటాతో ఉన్న భూమి విస్తీర్ణం 43 చ॥గ॥లు లేదా 35.95 చ॥మీ॥లతో "అశ్విని ప్లాజా" నందు 3వ అంతస్తులోని ప్లింత్ ఏరియా 1030 చ॥అ॥లతో (కామన్ ఏరియాలు, నడుపాయాలు మరియు సాధారణ దారి మరియు కార్ పార్కింగ్ ఏరియాతో కలిపి) నెం.303 తో ఉన్న ఒక ఫ్లాట్. హద్దులు : తూర్పు : రోడ్డుకు ఆనుకొని ఉన్న ఓపెన్ టు స్కై, పడమర : సాధారణ మెట్లు మరియు కామన్ కారిడార్, దక్షిణం : ఓపెన్ టు స్కై, ఉత్తరం : ఈ ఫ్లాట్ మరియు ఫ్లాట్ నెం.304 కు మధ్యన ఉన్న ఓపెన్ టు స్కై.

రిజర్వు ధర : రూ.16.00 లక్షలు | ధరావత్తు : రూ.1.80 లక్షలు | బిడ్ పెంపుదల మొత్తం : రూ.0.10 లక్షలు

సెక్యూర్డ్ క్రెడిటార్ వారికి తెలిసినంత వరకు ఉన్న ఎన్‌కంబరెన్స్ వివరములు : బ్యాంక్ రికార్డ్స్ ప్రకారం ఏవిధమైన ఎన్‌కంబరెన్స్ లేవు

ఇ-వేలం నియమ నిబంధనలు : (1). సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని నియమ & నిబంధనలను అనుసరించి దిగువ తరువరి తెలిపిన నిబంధనలను అనుసరించి అమ్మకం జరుపబడును. (2). ఆస్తులను "ఎక్కడ ఎలా ఉన్నవి అక్కడ అలాగే పద్ధతి, అక్కడ ఏమున్నాయో అదే పద్ధతిపై" విక్రయించబడతాయి. (3). అధీకృత అధికారి గారి పరిజ్ఞాన మేర తెలిసిన షెడ్యూలులోని సెక్యూర్డ్ ఆస్తికి సంబంధించిన ఉత్తమ వివరముల మేరకు తెలుపబడినవి. కాని సదరు వివరములలోని తప్పులకు, తప్పుడు వివరములకు, వదిలివేయబడుటకు అధీకృత అధికారి గారి సమాధానం తెలుపవలసిన అవసరం లేదు. (4). అమ్మకం ఇ-వేలం పోర్టల్ https://BAANKNET.COM ద్వారా ఆన్‌లైన్‌లో దిగువ సంతకందారు తేది. 05.12.2025 న ఉదయం 11.00 గం॥ల నుండి సా॥ 4.00 గం॥ల వరకు నిర్వహించబడును. 5. అమ్మకం యొక్క పూర్తి వివరములతో నియమ నిబంధనల కొరకు దయచేసి https://BAANKNET.COM & www.pnbindia.in వెబ్‌సైటులు చూడవలెను.

SARFAESI చట్టం 2002 లోని రూలు 8(6) r/w 9(1) ప్రకారం చట్టబద్ధమైన అమ్మకం ప్రకటన

తేది: 11.11.2025, ప్రదేశం : విశాఖపట్నం | సం/- అధీకృత అధికారి, పంజాబ్ నేషనల్ బ్యాంక్

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

స్ట్రెస్డ్ అస్సెట్స్ రికవరీ బ్రాంచ్, 3వ అంతస్తు, కెనెస్ మేడమీద, సూర్యప్రకాష్ స్క్వేర్, గురునానక్ నగర్ రోడ్డు, ఎన్.టి.ఆర్.జిల్లా, విజయవాడ – 520008, ఆంధ్రప్రదేశ్. ఫోన్ :0866-2546922

అధీకృత అధికారి వివరములు : పేరు : శ్రీ వై. ముక్తేశ్వరరావు (చీఫ్ మేనేజర్), మొబైల్ నెం. : 88866 40777
ఆస్తి తనిఖీ కొరకు : 92912 32223

Appendix – IV –A
[See Proviso to Rule 8(6) R/w Rule 9(1)]

స్థిరాస్తుల అమ్మకం కొరకు అమ్మకం ప్రకటన

[illegible]

రిజర్వు ధర : రూ.36,14,000/- | ధరావత్తు : రూ.3,61,400/- | బిడ్ పెంపుదల : రూ.10,000/-

ఇ-వేలం తేది : 06-12-2025, సమయం : ఉ॥ 11.00 గంటల నుండి సా॥ 04.00 గంటల వరకు

[illegible]

తేది: 13-11-2025, ప్రదేశం: విజయవాడ | సం/- అధీకృత అధికారి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

క్లుప్తంగా

పశువులకు గర్భకోశవ్యాధుల పరీక్షలు

ఫిరంగిపురం: మండలంలోని వేములూరిపాడు గ్రామంలో పశుగణాభివృద్ధి సంస్థ, పశుసంవర్థకశాఖ, రాష్ట్రీయ గోకుల్ మిషన్ ఆధ్వర్యంలో ఉచిత గర్భకోశవ్యాధుల చికిత్స శిబిరం గురువారం నిర్వహించారు. పశువులకు వైద్యులు పి.రోజర్ బిన్ని, పీర్ అహ్మద్, లోక్‌నాథ్‌సింగ్‌లు చూడిపరీక్షలు, గర్భకోశవ్యాధుల పరీక్షలు చేసి మందులు అందజేశారు. దూడలకు సైతం పరీక్షలు చేశారు. పశువులకు వచ్చే వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి పీర్ అహ్మద్ వివరించారు. కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ తాడికొండ ఏడీ వై.రాయప రెడ్డి, దరియా, జె.సుమన్, గౌస్, తార్‌అహ్మద్, రఫీ, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

శతక దర్శనం సంపుటాలు అందజేత

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు గురువారం ఎ.రవికుమార్ శతక దర్శనం మూడు సంపుటాలను అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు తాతిరెడ్డి మాట్లాడుతూ.. అంబటి దక్షిణామూర్తి, విశాలాక్ష్మి దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారుడు ఎ.రవికుమార్ తాడేపల్లి పుస్తక భాండాగారానికి శతక దర్శనం మూడు సంపుటాలను అందజేశారని తెలిపారు. ఆసక్తి గల ఉపాధ్యాయులు, విద్యార్థులు వాటిని చదుకోవచ్చని తెలిపారు.

మహిళల హక్కులకు పోరాటాలు ఉధృతం చేయాలి

మంగళగిరి టౌన్: శ్రామిక మహిళల హక్కుల కోసం పోరాటాలను ఉధృతం చేయాలని వర్కింగ్ ఉమెన్ రాష్ట్ర నాయకురాలు రమాదేవి కోరారు. మంగళగిరి నగర పరిధిలోని సీఐటీయూ కార్యాలయంలో గురువారం శ్రామిక మహిళ గుంటూరు జిల్లా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ.. లైంగిక వేధింపుల చట్టం ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలన్నింటిలోనూ విస్తృతంగా ప్రచారం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. లైంగిక వేధింపుల నిరోధానికి కమిటీలు ఏర్పాటు చేయాలని కోరారు. సదస్సులో వర్కింగ్ ఉమెన్ జిల్లా నాయకురాలు రమణ, సచివాలయ ఉద్యోగుల రాష్ట్ర కార్యదర్శి అనురాధా, ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా కార్యదర్శి లక్ష్మి, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి కుమారి, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

కార్మికుల బకాయిలు వెంటనే చెల్లించాలి

తాడేపల్లిరూరల్: ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులకు బకాయిలను యాజమాన్యం వెంటనే చెల్లించాలని యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ అన్నారు. బ్రహ్మానందపురంలో సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షలను నాయకులు డి.నాగేశ్వరరావు, వై.సాంబశివరావు, సుభాని, గురవయ్య, ఆశీర్వాదంలతో కలిసి గురువారం ప్రారంభించారు. గత 345 రోజులుగా కార్మికులు నిరసన దీక్షలు నిర్వహిస్తున్నా ప్రభుత్వంలో స్పందన కలగకపోవడం దారుణమన్నారు. శివకుమారి, రిబ్కా, సువర్ణ, నాగమల్లేశ్వరి, శారమ్మ, తదితరులు పాల్గొన్నారు.

లంక భూముల రైతులకు అండగా ఉంటాం

దుగ్గిరాల: పెదకొండూరు గ్రామంలోని 40 ఏళ్లుగా లంక భూమిని సాగుచేస్తున్న రైతులకు ప్రభుత్వ పరంగా వారి రికార్డులలో నమోదు కాకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రైతు సంఘం జిల్లా కార్యదర్శి కంచుమాటి అజయ్ అన్నారు. పెదకొండూరు గ్రామంలో గురువారం రైతు సమావేశం మన్నవ నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. చంద్రబాబు సర్కార్ లంక సాగుదారులను గుర్తించి వారిని ఆన్‌లైన్‌లో నమోదు చేసి పట్టాదారు పాసు పుస్తకాలను ఇవ్వాలన్నారు.

దేశ భద్రత అందరి బాధ్యత

దుగ్గిరాల: దేశ భద్రతను కాపాడడం ప్రతి పౌరుడి బాధ్యత అని భారత ప్రజాస్వామ్య లౌకిక పరిరక్షణ సమితి అధ్యక్షుడు షేక్.సుభానీ పిలుపునిచ్చారు. దుగ్గిరాలలోని ముర్తుజా నగర్‌లో నిర్వహించిన సమావేశంలో గురువారం ఆయన మాట్లాడుతూ.. దేశ రాజధాని ఢిల్లీలో ఎర్రకోట మెట్రోస్టేషన్ సమీపంలో జరిగిన పేలుళ్ల ఘటనపై ఆవేదన వ్యక్తం చేశారు. ఘటనలో మృతి చెందిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కార్యక్రమంలో హుస్సేన్ సాహెబ్, జిలానీ తదితరులు పాల్గొన్నారు.
చిలువూరు గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఏపీ ఎమ్మార్పీఎస్ స్టేట్ లీగల్ కన్వీనర్ చిలువూరు నాగరాజు మాదిగ మాట్లాడుతూ.. దేశ రాజధాని ఢిల్లీ చారిత్రాత్మక ఎర్రకోట సమీపంలో ఉగ్రమూకల దాడి ఘటనకు కేంద్ర భద్రతా వైఫల్యమే కారణమన్నారు. బీజేపీ పాలనలో దేశ రక్షణ, పౌరుల మనుగడపై నీలి నీడలు కమ్ముకున్నాయన్నారు.

పంట పొలాలను దెబ్బతీస్తున్న పందులు!

పొలాల వెంబడి గుంపులుగా తిరుగుతున్న పందులు

పందుల దాడిలో దెబ్బతిన్న వరిపంట

- ప్రకృతి వైపరీత్యాలతో రైతులకు నష్టం
- పందుల స్వైర విహారంతో తీవ్రంగా మరోవైపు
- ఆందోళన చెందుతున్న అన్నదాతలు

తాడేపల్లి రూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థలో పలు ప్రాంతాల్లో ప్రకృతి వైపరీత్యాల వల్ల రైతులకు ఇటీవల నష్టం వాటిల్లింది. మరోపక్క మంగళగిరి నియోజకవర్గంలో పోలకంపాడులో పందుల స్వైర విహారం వల్ల స్థానిక రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోంది. మంగళగిరి ప్రకాశం బ్యారేజీ రోడ్డులోని ఓపెన్ థియేటర్ రోడ్, గుంటూరు చానల్ పోలకంపాడు బీరువాల కంపెనీ పుష్కర కాలనీ వెనుక భాగంగా ఉన్న పంట పొలాల్లో ప్రతిరోజూ వందల సంఖ్యలో పందులు తిరుగుతున్నాయి. ఈ ప్రాంతంలో సుమారు 80 ఎకరాల్లో రైతులు వరి పండిస్తున్నారు. వరి నాట్లు వేసిన సమయంలో అధిక వర్షాల కారణంగా వరి మొక్కలు నేలకొరిగాయి. తిరిగి మరలా రైతులు పాడైపోయిన వరి మొక్కలు తీసి కొత్త మొక్కలు నాటుకున్నారు. అనంతరం విపరీతమైన ఉష్ణోగ్రత పెరగడంతో ఆ ఉష్ణోగ్రతకు మరోసారి రైతులు నష్టపోయారు.

పంటపొలాలు ధ్వంసం..

స్థానిక పంటలో వరి పొట్ట దశకు వచ్చిన తరువాత మొంథా తుఫాన్ కారణంగా వరి ఒరిగిపోయింది. దీంతో రైతులు అదనంగా కూలీ చెల్లించి ఆ పంటను పైకి లేపారు. మూడు నెలల నుంచి పందులు స్వైర విహారం చేస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరి కంకులు రావడంతో పందులు వాటిని కొరకడం.. కంకుల వేళ్లను మూతితో పెకలించడం వల్ల వరి మొక్కలు కిందపడిపోతున్నాయి. పొలం మొత్తం తొక్కి అక్కడే పడుకోవడంతో వరి కంకులు నీటిలో కలిసిపోయి నష్టం వాటిల్లుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే అధికారులు స్పందించి పందుల పెంపకం దారులకు కౌన్సిలింగ్ నిర్వహించి, పందులను షెడ్డుల్లో ఉంచేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వ్యవసాయం ఎలా చేయాలి..

రైతులు ఓ పక్క ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొంటూ పంటలను పండిస్తున్నారు. పంట పొలాల్లో పందులు తిరగడం వల్ల తీవ్రంగా నష్టపోతున్నారు. కొంతమంది ప్రత్యేకంగా పందులను తీసుకువచ్చి ఇక్కడ వదిలేసి వెళ్లిపోతున్నారు. రాత్రి పంట పొలాల్లో, పగలు ఇళ్లల్లో తిరుగుతున్నాయి. వెంటనే అధికారులు స్పందించి పందులను నివారించాలి.

బద్దిగం శ్రీనివాసరెడ్డి, తాడేపల్లి

కాపలా ఉండలేకపోతున్నాం..

పోలకంపాడులో రెండు ఎకరాలు కౌలుకు తీసుకుని వరిపంట వేశాను. పందులు తిరగడంతో వరి పాడైపోతోంది. ఉదయం, సాయంత్రం కాపలా కాస్తున్నాం. రాత్రి సమయంలో వచ్చి పంటను నాశనం చేస్తున్నాయి. వరి కంకులతో పాటు వరి దుబ్బులు కూడా పాడైపోతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో వ్యవసాయం చేయాలంటే చాలా కష్టంగా ఉంది. అధికారులు చర్యలు తీసుకోవాలి.

కనకయ్య, పోలకంపాడు

కోకోకోలా యాజమాన్యం నిర్లక్ష్య వైఖరి విడనాడాలి

నిరసన వ్యక్తం చేస్తున్న యూనియన్ నాయకులు, కార్మికులు

మంగళగిరి టౌన్: గత కొంతకాలంగా కోకోకోలా యాజమాన్యం క్యాంటీన్‌లో నాసిరకం భోజనం అందిస్తున్నారని.. పలుమార్లు యాజమాన్యం దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోలేదని.. ఇప్పటికైనా యాజమాన్యం నిర్లక్ష్య వైఖరిని విడనాడి నాణ్యమైన భోజనం అందించాలని ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు నాగళ్ల శ్రీధర్ డిమాండ్ చేశారుఆత్మకూరు హిందూస్థాన్ కోకోకోలా బెవరేజెస్ ప్రైవేట్ లిమిటెడ్ మెయిన్ గేటు వద్ద గురువారం కార్మికులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీధర్, గౌరవ అధ్యక్షులు రామమోహనరావు, ప్రధాన కార్యదర్శి ఆదినారాయణలు మాట్లాడుతూ.. గత ఆరు నెలల కిందట నాసిరకం ఆహారం, భద్రతా లోపాలపై అధికారులకు ఫిర్యాదు చేసినా నేటికీ చర్యలు లేవని పేర్కొన్నారు. క్యాంటీన్ భోజనం నాణ్యత లేకపోవడంతో కార్మికులు అనారోగ్యానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సరిపడా ఉద్యోగులు లేనందున ఉన్నవారిపై పనిభారం, ఒత్తిడి పడిందని వాపోయారు. ఫ్రెషర్స్‌కు సరైన శిక్షణ లేక యంత్రాల వద్ద గాయపడుతున్నారని.. యాజమాన్యం ఈ విషయాన్ని దాచిపెడుతోందని అన్నారు. కార్యక్రమంలో ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

కోర్టును ఆశ్రయించిన సబింద్రారెడ్డి

- సోషల్ మీడియా యాక్టివిస్టుపై గంజాయి కేసు
- ఈ విషయమై సీబీఐ విచారణకు హైకోర్టు ఆదేశం
- సుప్రీంకోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకున్న పోలీసులు

తాడేపల్లి రూరల్: గుంటూరు జిల్లా తాడేపల్లి పరిధిలోని కుంచనపల్లి ప్రాతూరు రోడ్డులో నివాసముంటున్న సోషల్ మీడియా యాక్టివిస్ట్ సబింద్రారెడ్డిని తాడేపల్లి పోలీసులమంటూ మఫ్టీ డ్రస్‌లో వచ్చి, ఆయన భార్య ముందే కారులో బలవంతంగా ఎక్కించుకుని వెళ్లడంపై గురువారం ఆయన మంగళగిరి అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో ప్రైవేటు ఫిర్యాదు చేశారు. సబింద్రారెడ్డిని అప్పట్లో అరెస్ట్ చేసి కుటుంబ సభ్యులకు తెలియకుండా అక్రమంగా గంజాయి కేసు పెట్టిన పత్తిపాడు సీఐ శ్రీనివాసరావు, తాడేపల్లి సీఐ వీరేంద్రకుమార్, లాలాపేట సీఐ ఏవీ శివప్రసాద్, కొంత మంది ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లపై ఫిర్యాదు చేశారు. దానిపై స్పందించిన కోర్టు 5495/25 సిఎస్ఆర్ నంబరు ఇచ్చింది. ఈ కేసును ఫైల్ చేసిన న్యాయవాదులు కాశినీడి బాజీ గంగాధరరావు, ఆరెకూటి రామ్మోహన్‌రెడ్డి, శ్యామల మధుసూదన్‌రెడ్డిలు మాట్లాడుతూ సబింద్రారెడ్డిని సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారనే దురుద్దేశంతో కొంత మంది పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేసి గంజాయి కేసు నమోదు చేశారన్నారు. అప్పట్లో ఈ కేసు రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిందని, ఈ కేసును హైకోర్టు సీబీఐకి అప్పగించడంతో పోలీసులు సుప్రీంకోర్టును ఆశ్రయించడంతో విచారణ తాత్కాలికంగా నిలిపివేశారని చెప్పారు. ఈ క్రమంలో జరుగుతున్న పరిణామాలపై సబింద్రారెడ్డి ప్రైవేటు కంప్లయింట్ ఇచ్చారని తెలిపారు.

బ్యూటిఫికేషన్‌పై దృష్టి సారించాలి

మంగళగిరి టౌన్: మంగళగిరి నగరంలోని పార్కులను త్వరితగతిన పూర్తిచేసి బ్యూటిఫికేషన్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆంధ్రప్రదేశ్ అర్బన్ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ఎం.కె.వి. శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో నిర్మాణంలో ఉన్న పార్కులు, చెరువు అభివృద్ధి పనులను గురువారం ఎంటీఎంసీ అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఎంటీఎంసీ పరిధిలోని కాజా వాకింగ్ ట్రాక్, ఇప్పటంలోని చెరువు అభివృద్ధి పనులు, పూర్తయిన పార్కులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ.. ఎంటీఎంసీ అభివృద్ధి దిశగా వెళుతున్న నేపథ్యంలో త్వరితగతిన పనులు పూర్తిచేయాలన్నారు. కార్యక్రమంలో ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్ బాషా, ఉద్యాన అధికారి రామారావు, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

ఇప్పటం చెరువు భూమి అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న శ్రీనివాసులు

నేటి నుంచి సదరం ధృవీకరణ పత్రాల స్లాట్ బుకింగ్

తాడికొండ: వైకల్య నిర్ధారణకు శుక్రవారం నుంచి సదరం స్లాట్ బుకింగ్ ప్రారంభించనున్నట్లు తాడికొండ ఎంపీడీవో కె.సమతా వాణి ఒక ప్రకటనలో తెలిపారు. నవంబరు, డిసెంబరు 2025కు సంబంధించి రెండు నెలలకు గానూ సదరం స్లాట్ బుకింగ్ నిమిత్తం తమ దగ్గరలోని గ్రామ/వార్డ్ సచివాలయంలో సదరం స్లాట్‌లు బుక్ చేసుకోవచ్చని తెలిపారు. శారీరక, మానసిక, బధిరులు, దృష్టి వైకల్యం ఉన్నవారికి రాష్ట్రంలోని జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రుల్లో.. శారీరక, దృష్టి వైకల్యం కలిగిన వారికి ఏరియా హాస్పటల్‌లో.. శారీరక వైకల్యం ఉన్నవారికి సీహెచ్‌సీలో సదరం ధృవీకరణ పత్రాలు జారీ చేసేందుకు స్లాట్ బుకింగ్ చేసుకోవచ్చని ఆమె ఆ ప్రకటనలో వివరించారు.

మంగళగిరి నుంచి తిరుపతికి బస్ సర్వీస్

మంగళగిరి టౌన్: మంగళగిరి ఆర్టీసీ బస్ డిపో నుంచి తిరుపతికి ప్రతిరోజూ నూతనంగా సూపర్ లగ్జరీ సర్వీస్‌ను ఏర్పాటు చేసినట్లు మంగళగిరి డిపో మేనేజర్ రెంటిపాళ్ల పిచ్చయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బస్సు మంగళగిరి నుంచి రాత్రి 8.15 గంటలకు బయలుదేరి గుంటూరు, ఒంగోలు, నెల్లూరు మీదుగా తిరుపతికి ఉదయం 5.45 గంటలకు చేరుకుంటుందని అన్నారు. తిరిగి అదే బస్సు తిరుపతి నుంచి ఉదయం 8.15 గంటలకు బయలుదేరి నెల్లూరు, ఒంగోలు, గుంటూరు మీదుగా తిరిగి మంగళగిరి అదే రోజు సాయంత్రం 6.25 గంటలకు చేరుకుంటుందని పేర్కొన్నారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన ఆ ప్రకటనలో తెలిపారు.

మంగళగిరి రూరల్ సీఐగా బ్రహ్మం

మంగళగిరి టౌన్: మంగళగిరి రూరల్ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా ఎ.వి. బ్రహ్మం గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన సీఐ వై.శ్రీనివాసరావు వీఆర్‌కు బదిలీ కావడంతో ఆయన స్థానంలో బ్రహ్మంను అధికారులు నియమించారు. బ్రహ్మం గతంలో రేపల్లె, బాపట్ల, క్రోసూరు, నరసరావుపేట 1వ టౌన్, నరసరావుపేట రూరల్ పోలీస్‌స్టేషన్లలో ఎస్ఐగా విధులు నిర్వర్తించారు. అనంతరం సీఐగా పదోన్నతి పొంది అమరావతి పోలీస్‌స్టేషన్, రాష్ట్ర ఇంటెలిజెన్స్ విభాగంలో సేవలు అందించారు. ప్రజలకు సత్వర న్యాయం అందించడమే లక్ష్యమని ఈ సందర్భంగా బ్రహ్మం పేర్కొన్నారు. రూరల్ సర్కిల్ పరిధిలో గంజాయి, బహిరంగ మద్యపానం, చట్టవ్యతిరేక కార్యకలాపాలపై నిరంతరం నిఘా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.

చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి

మంగళగిరి టౌన్: సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడిని నిరసిస్తూ జాతీయ స్థాయిలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సోమవారం తలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షులు నాగరాజు మాదిగ కోరారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద గల డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద గురువారం చలో ఢిల్లీ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జస్టిస్ గవాయ్‌పై దాడిచేసిన వారిపై చట్టపరమైన చర్యలు తక్షణమే తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కలకోటి నాగేశ్వరరావు, ఎమ్మార్పీఎస్ నాయకులు చందోలు విక్టర్‌పాల్, నతానీలు, అద్దేపల్లి నాగేశ్వరరావు, భాస్కర్, శ్యామల, నాగేంద్రం పాల్గొన్నారు.

పంట కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

దుగ్గిరాల: పంట కోత కోసిన వెంటనే ప్రభుత్వం పంట కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యంకొనుగోలు చేయాలని రైతు సంఘం మండల కార్యదర్శి జెట్టి బాలరాజు అన్నారు. దుగ్గిరాలలోని రైతులతో గురువారం సమావేశమైన ఆయన మాట్లాడుతూ.. వరి పంట కోతకు వచ్చిందని, పంటను ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని కోరారు.

దళిత, గిరిజన, మైనార్టీలపై పెరుగుతున్న దాడులు

మంగళగిరి టౌన్: దేశంలో దళిత, గిరిజన, మైనార్టీలపై దాడులు పెరుగుతున్నాయని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళగిరి పట్టణ పరిధి సీపీఐ కార్యాలయంలో గురువారం పట్టణ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా రోజురోజుకీ ఈ దాడులు పెరుగుతున్నాయని, సామాజిక న్యాయ సమానత్వ ఆత్మగౌరవం కోసం నవంబరు 18వ తేదీన రాష్ట్రంలోని అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మోదీ కేంద్రంలో అధికారం చేపట్టిన తరువాత దేశవ్యాప్తంగా మత విద్వేషాలు పెరిగాయని విమర్శించారు. సమావేశంలో నాయకులు నందం బ్రహ్మేశ్వరరావు, ప్రభాకరరావు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ కలయిక

తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గురువారం మర్యాద పూర్వకంగా కలిసిన తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు

వైఎస్సార్ సీపీ భవిష్యత్ కార్యాచరణపై చర్చ

వేమారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన మాజీ ఎంపీ నందిగం సురేష్

మంగళగిరి టౌన్: వైఎస్సార్ సీపీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డిని మాజీ పార్లమెంట్ సభ్యులు నందిగం సురేష్ గురువారం మంగళగిరి మండల పరిధి ఆత్మకూరు నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ భవిష్యత్ కార్యాచరణపై చర్చించుకున్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ముదిగొండ ప్రకాష్, గంజి షణ్ముఖ్, భూషణం, కలకోటి చక్రవర్తి, కట్టెపోగు ప్రశాంత్, శివ, చిన్ని, దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై అధికారుల కొరఢా

తాడికొండ: తాడికొండ అక్కదేవత చెరువుపై నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాలపై అధికారులు కొరఢా ఝులిపించారు. ఇరువర్గాలకు చెందిన వ్యక్తులు ప్రార్థనా మందిరాల నిర్మాణానికి పనులు చేస్తుండటంతో దీనిపై గ్రామస్తులు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేయగా విషయంపై జిల్లా ఉన్నతాధికారులు దృషి సారించి నిర్మాణాలను తొలగించాలని ఆదేశించారు. అయితే దీనిపై ఈవోఆర్డీగా ఉంటూ ఇన్‌చార్జి కార్యదర్శిగా కొనసాగుతున్న రమణయ్య ముఖం చాటేశారు. సెలవు పేరుతో పత్తా లేకుండా పోవడంతో రంగంలోకి దిగిన పోలీసులు మత సామరస్యం దెబ్బతినే ప్రమాదం ఉన్న నేపథ్యంలో చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన 145 నోటీసులు జారీ చేసి నిర్మాణాలు నిలిపేయాలని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. అక్రమ నిర్మాణాలను నిలిపేయాల్సిన ఈవోఆర్డీ ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వర్తిస్తూ ఓ వర్గానికి కొమ్ముగాయడంతో వ్యవహారం ముదిరిందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. పలువురు ఆయనను ఫోన్ ద్వారా సంప్రదించగా తనకేం సంబంధం లేదంటూ ముఖం చాటేశారని గ్రామ పెద్దలు చెబుతున్నారు. కాగా 3 రోజులుగా శిక్షణ పేరుతో సెలవు పెట్టిన ఈవోఆర్డీ గురువారం కూడా మరో రెండు రోజులు తన సెలవు పొడిగిస్తూ అనారోగ్య కారణాలు సాకుగా చూపుతూ సెలవుపై వెళ్లడంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

అక్రమ నిర్మాణాలను నిలిపేయాలంటూ బోర్డు ఏర్పాటు చేస్తున్న పంచాయతీ కార్మికులు

అమరావతి క్యాంపస్ సలహాదారుగా ప్రొఫెసర్ వీఎస్ రావు

తాడికొండ: అమరావతిలో త్వరలో ఏర్పాటుకానున్న విద్యాసంస్థ బిట్స్ పిలానీ, అమరావతి క్యాంపస్ సలహాదారుగా ప్రొఫెసర్ వజ్ఝా సాంబశివరావు నియమితులయ్యారు. బిట్స్ పిలానీ రిజిస్ట్రార్ కల్నల్ సౌమ్యబ్రత చక్రబర్తి ఈ మేరకు నియామక పత్రాన్ని విడుదల చేశారు. అధ్యాపకునిగా అడ్మినిస్ట్రేటర్‌గా బిట్స్ పిలానీలో వీఎస్ రావు అందించిన సేవలను ప్రశంసిస్తూ నియామకపత్రాన్ని జారీ చేశారు. ఈ నేపథ్యంలో ఇటీవల ఆయన అమరావతి క్యాంపస్ సలహాదారుగా బాధ్యతలు స్వీకరించారు. సోమవారం ఉదయం సచివాలయానికి వెళ్లి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును మర్యాదపూర్వకంగా కలిసి బిట్స్ అమరావతి క్యాంపస్‌కు అవసరమైన సహకారాన్ని కోరారు. అందుకు సుముఖంగా స్పందించిన ముఖ్యమంత్రి ప్రభుత్వ పరంగా పూర్తి సహకారం అందిస్తామని, కలిసి ముందుకు సాగుదామని బదులిచ్చారు. రాజధాని పరిధిలోని తుళ్లూరు గ్రామానికి చెందిన ప్రొఫెసర్ వజ్ఝా సాంబశివరావు నాలుగున్నర దశాబ్దాల పాటు బిట్స్ పిలానీలో వివిధ హోదాల్లో పనిచేశారు. అనంతరం బిట్స్ పిలానీ హైదరాబాద్ క్యాంపస్ ఏర్పాటులో విశేషంగా కృషిచేసి ఆ క్యాంపస్ వ్యవస్థాపక డైరెక్టర్‌గా సేవలందించారు.

ఉద్యమంలా కోటి సంతకాల సేకరణ

మంగళగిరి టౌన్: ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో పెట్టేందుకు చంద్రబాబు సర్కార్ చేస్తున్న ప్రయత్నాలను వ్యతిరేకిస్తూ నిర్వహిస్తున్న కోటి సంతకాల సేకరణ కార్యక్రమం ఉద్యమంలా సాగుతోంది. ఇందులో భాగంగా మంగళగిరి నగర, మండల పరిధిలోని పలు ప్రాంతాల్లో గురువారం కార్యక్రమాన్ని వైఎస్సార్ సీపీ నాయకులు చేపట్టారు. ఈ సందర్భంగా పట్టణ పరిధిలోని 21వ వార్డు అధ్యక్షులు బియ్యం శ్రీను ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ.. ప్రైవేటీకరణ అనే దుర్మార్గపు ఆలోచనను చంద్రబాబు ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బొట్టు రవి, వల్లభాపురం వాము, బియ్యంశెట్టి తంబి, రామనాథం రామాంజనేయులు, చాంద్ బాషా, రాజేష్, శ్రీను, వాసు, అలీ తదితరులు పాల్గొన్నారు. కాజా గ్రామంలో గురువారం గ్రామ అధ్యక్షులు బొమ్ము శంకర్‌రెడ్డి సూచనలతో మండల ఎస్సీసెల్ అధ్యక్షులు కర్నెపూడి సుభాకర్ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఆర్ల బ్రహ్మయ్య, మంద విజయ్‌బాబు, రాజోలు శ్రీనివాసరావు, ఆర్ల నాగేశ్వరరావు, శేషు, మాణిక్యాల రాజా, కిషోర్ రాజు, నాగరాజు, పేతురు, మధు, తురకా ప్రశాంత్, జగ్గయ్య, తవనం బుడంకాయ, జశ్వంత్, వరకుమార్, సుధీర్, ప్రవీణ్, ప్రసాద్, డేవిడ్‌రాజు, నాంచారయ్య, కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

21వ వార్డులో సంతకాల సేకరిస్తున్న నాయకులు

రైతులందరికీ అన్నదాత సుఖీభవ అమలు చేయాలి

తాడేపల్లి రూరల్: ఉండవల్లిలో రాజధాని రైతుసంఘం సమావేశాన్ని గురువారం నిర్వహించారు. రైతు సంఘం నాయకులు జొన్న శివశంకరరావు మాట్లాడుతూ.. అర్హులైన రైతులందరికీ అన్నదాత సుఖీభవ పథకం అమలు చేయాలని కోరారు. మొంథా తుఫాన్ పంట నష్టపరిహారం రైతుల ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్‌చేశారు. నాయకులు దాసరి గణేష్, రాజధాని రైతు సంఘం అధ్యక్షులు ఈశ్వర్ రెడ్డి, కమిటీ సభ్యులు షేక్ ఎర్రపేరు, వెంకయ్య, పి.వీరాస్వామి, డి.సాంబశివరావు, బక్కిరెడ్డి, గాంధీ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 25447 (మంగళగిరి)
7075167541 (తాడికొండ)
Office mail : sakshigntadvt@gmail.com

క్లుప్తంగా...

ఆందోళన బాటలో అంగన్‌వాడీలు

నేడు సచివాలయాల్లో వినతి పత్రాలు

సాక్షి, అమరావతి: పిల్లలు తక్కువగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలను కుదించి సమీప సెంటర్లలో విలీనం చేయడానికి చంద్రబాబు ప్రభుత్వం చేసిన ప్రతిపాదనలపై అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు కన్నెర్రజేస్తున్నారు. ఈ చర్యలను ప్రతిఘటిస్తూ రాష్ట్రవ్యాప్తంగా శాంతియుత ఆందోళనలకు పిలుపునిచ్చారు. ఈ మేరకు అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేయాలనే ప్రధాన డిమాండ్‌పై ఏపీ అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో శుక్రవారం సచివాలయాల్లో వినతి పత్రాలు అందించనున్నారు.

అటవీ భూములను ఆక్రమించారు

పెద్దిరెడ్డి కుటుంబంపై డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ఆరోపణ

సాక్షి, అమరావతి: చిత్తూరు జిల్లా మంగళంపేటలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబసభ్యులు అటవీ భూములను ఆక్రమించారని ఆరోపిస్తూ డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ గురువారం 'ఎక్స్'లో పోస్టు చేశారు. తాను నిర్వహించిన ఏరియల్ సర్వేలో ఈ ఆక్రమణలు వెలుగులోకి వచ్చాయని పేర్కొన్నారు. 76.74 ఎకరాలు ఆక్రమించి కట్టడాలు నిర్మించారని, రెవెన్యూ రికార్డులు తారుమారు చేశారంటూ ఆరోపణలు చేశారు. విజిలెన్స్ విభాగం నివేదిక ఆధారంగా కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

ప్రభుత్వాన్నే ప్రైవేట్‌పరం చేయండి

సీఎం చంద్రబాబుపై సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య సెటైర్

కర్నూలు (సెంట్రల్)/సాక్షి, అమరావతి: మెడికల్ కాలేజీలు, ఏపీ టూరిజం హోటళ్లు, ఆటస్థలాలు.. ఇలా ఒక్కోదాన్ని ప్రైవేటీకరించే బదులు సీఎం చంద్రబాబునాయుడు ప్రభుత్వాన్నే ప్రైవేటీకరిస్తే సరిపోతుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య ఎద్దేవా చేశారు. కర్నూలులో గురువారం ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రానికి అప్పులు పెరిగిపోతున్నాయని, ఏపీ శ్రీలంక అవుతోందని, సింగపూర్‌గా మార్చేందుకు తనకు అవకాశం ఇవ్వాలని చెప్పి అధికారంలోకి వచ్చిన చంద్రబాబునాయుడు రెండేళ్లలోనే రూ.2.50 లక్షల కోట్ల అప్పులు చేశారని విమర్శించారు. రాయలసీమ వరప్రదాయని హంద్రీ–నీవా ప్రాజెక్టు విస్తరణకు చర్యలు ఎందుకు తీసుకోవడంలేదని ప్రశ్నించారు.

విద్యాశాఖను భ్రష్టుపట్టించిన లోకేశ్

స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీలో చదివానని చెప్పుకొనే మంత్రి లోకేశ్ విద్యాశాఖను భ్రష్టుపట్టించారని ఈశ్వరయ్య ధ్వజమెత్తారు. లోకేశ్ విద్యాశాఖ మంత్రి అయ్యాక రాష్ట్రంలో 4,112 ఏకోపాధ్యాయ పాఠశాలలను మూసేశారని, రూ.6,400 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఉండడంతో పేదవిద్యార్థుల చదువులు నిలిచిపోయాయని చెప్పారు. అలాగే ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ తిరుపతి పర్యటనలో వ్యవహరించిన తీరు సరిగాలేదని చెప్పారు. అధికారంలో లేని సమయంలో 30 వేలమంది మహిళలను దేశసరిహద్దులు దాటించారని చెప్పిన ఆయన వారిలో కనీసం ఒక్కరినైనా వెనక్కి తెచ్చారా అని ప్రశ్నించారు. అలాగే, బీసీలకు కులాల ప్రాతిపదికన స్థానిక సంస్థల ఎన్నికల్లో సీట్లు కేటాయించాలని చంద్రబాబు ప్రభుత్వాన్ని ఆయన గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. 'సామాజిక న్యాయం–ఆత్మగౌరవం' నినాదంతో ఈ నెల 18న ఆందోళన చేస్తామన్నారు.

ఒక్క ఆరోపణైనా నిరూపించావా?

- పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబంపై భూకబ్జా అంటూ నిరాధార ఆరోపణలా?
- 2000–2001లో వీరు కొనుగోలు చేసినవి పట్టా భూములే
- డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌పై వైఎస్సార్‌సీపీ ఆగ్రహం

సాక్షి, అమరావతి: డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగంగా పవన్ కళ్యాణ్ తమ పార్టీ సీనియర్ నాయకుడు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబంపై భూ కబ్జా అంటూ నిరాధార ఆరోపణలు చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ ఆగ్రహం వ్యక్తం చేసింది. 'అధికారంలోకి వచ్చి 18 నెలలు అవుతోంది. మీ చేతిలో అధికారం ఉంది.. ఫైళ్లన్నీ మీ దగ్గరే ఉన్నాయి. ఇప్పటికీ ఒక్క ఆరోపణను కూడా రుజువు చేయలేకపోయారు. పాచిపోయిన అవే పాత ఆరోపణలకు సినిమా రంగు తొడిగి కొత్తగా ప్రచారం చేసినా అబద్ధాలు నిజాలు అవుతాయా?' అంటూ పవన్ కళ్యాణ్‌ను సూటిగా ప్రశ్నించింది. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబం 2000–2001లో కొనుగోలు చేసిన భూములు పట్టా భూములేనని, ఇది నిజం కాదని నిరూపించగలరా అంటూ సవాల్ విసిరింది. ఈ మేరకు 'సీజ్ ద లయ్యర్ పీకే, శాడిస్టు చంద్రబాబు' హ్యాష్ ట్యాగ్‌తో సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో గురువారం పోస్టు చేసింది. ఆ పోస్టులో వైఎస్సార్‌సీపీ ఏమన్నదంటే..

ఈ డాక్యుమెంట్ల వివరాలు తప్పు అని చెప్పగలరా?

- పవన్ కళ్యాణ్ ఆరోపిస్తున్న ఈ భూములన్నీ కూడా 2000–2001 మధ్య కొన్నవి కాదా? ఈ కింది డాక్యుమెంట్ల వివరాలు తప్పు అని పవన్ కళ్యాణ్ చెప్పగలరా?
- డాక్యుమెంట్ నంబర్ 2346/2000, కొనుగోలు చేసిన తేదీ 2000 డిసెంబర్ 29, యజమాని పేరు పి.లక్ష్మరెడ్డి, పట్టాదారు పాసుబుక్‌లో ఉన్న పేరు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, సర్వే నెంబరు 295/1ఏ, విస్తీర్ణం: 15 ఎకరాలు.
- డాక్యుమెంట్ నంబర్ 1/2001, కొనుగోలు చేసిన తేదీ 2000 డిసెంబర్ 30, యజమాని పేరు పీవీ మిధున్‌రెడ్డి, సర్వే నంబర్ 295/1సీ, విస్తీర్ణం 10 ఎకరాలు.
- డాక్యుమెంట్ నంబర్ 2345/2000, కొనుగోలు చేసిన తేదీ 2000 డిసెంబర్ 29, యజమాని పేరు పీవీ మిధున్‌రెడ్డి, సర్వే నంబర్ 295/1సీ, విస్తీర్ణం 11 ఎకరాలు.
- డాక్యుమెంట్ నంబర్ 139/2001, కొనుగోలు చేసిన తేదీ 2001 ఫిబ్రవరి 2, యజమాని పేరు పి.ద్వారకనాథ్‌రెడ్డి, సర్వే నంబర్ 296/2, విస్తీర్ణం 18.94 ఎకరాలు.
- డాక్యుమెంట్ నంబర్ 2347/2000, కొనుగోలు చేసిన తేదీ 2000 డిసెంబర్ 29, యజమాని పేరు పి.ఇందిరమ్మ, సర్వే నంబర్ 295/1బీ, విస్తీర్ణం 10.80 ఎకరాలు.
- డాక్యుమెంట్ నంబర్ 2/2001, కొనుగోలు చేసిన తేదీ 2000 డిసెంబర్ 30, యజమాని పేరు పి.ఇందిరమ్మ, సర్వే నంబర్ 295/1డీ, 296/1, విస్తీర్ణం 10 ఎకరాలు.. మొత్తం విస్తీర్ణం 75.74 ఎకరాలు.

ఈ ప్రశ్నలకు బదులివ్వండి

- సర్వే సెటిల్‌మెంట్ డైరెక్టర్ 1981లో ఇచ్చిన తీర్పులోని అంశాలను కూడా పవన్ కళ్యాణ్ కాదనగలరా?
- పెద్దిరెడ్డి కుటుంబ సభ్యులు కొనుగోలు చేసిన 75.74 ఎకరాలకు 1966లోనే రైత్వారీ పట్టాలు ఇచ్చిన మాట వాస్తవం కాదా?
- 1975లో మళ్లీ సుమోటోగా విచారణ జరిపి నోటీసులు జారీ చేసి, విచారణ జరిపి.. 1981లో డైరెక్టర్ ఆఫ్ సెటిల్‌మెంట్‌కు సంబంధించి తుది తీర్పులో అవి పట్టా భూములనేని నిర్ధారించి విచారణను నిలుపుదల చేసిన మాట మాట నిజం కాదా?
- 1968 సెప్టెంబర్ 16న అటవీ శాఖ ఈ భూములకు వెళ్లడానికి 30 అడుగుల వెడల్పుతో దారి వదిలిన మాట వాస్తవం కాదా? ఈ మేరకు అటవీ శాఖ కూడా విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్‌ను కాదంటారా?
- అధికారంలోకి వచ్చిన నాటి నుంచి బురద చల్లడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. అధికారులతో ఎన్నో కమిటీలు వేసి, విచారణల మీద విచారణలు చేశారు. ఇన్ని రోజుల్లో ఒక్క ఆధారాన్నీ చూపలేకపోయారు. నేపాల్‌కు ఎర్రచందనం అంటూ ఇదే పవన్ అర్థం లేని విమర్శలు చేశారు. నిరూపించాలని పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి ఆరోజు సవాల్ విసిరినా, ఇప్పటికీ దానిపై నోరు మెదపలేదెందుకు?
- చంద్రబాబు, పవన్ కళ్యాణ్ సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ స్కీంలను ఎగ్గొట్టి, అమలు చేస్తున్న ఏకైక స్కీం డైవర్షన్ స్కీం మాత్రమే. వాటికి సమాధానాలు చెప్పలేక కిందా మీదా పడుతున్న సమయంలో మీ అసమర్థతను కప్పిపుచ్చుకోవడానికి మీరు ఎంచుకున్న స్కీం డైవర్షన్లు కాదా?

పార్టీ ఆఫీస్‌లకు చవకగా ప్రభుత్వ భూములు

- ఉత్తర్వులు జారీ చేసిన చంద్రబాబు ప్రభుత్వం
- 33 ఏళ్ల లీజు జీవోకు సవరణలు
- ఇక నుంచి 66 ఏళ్ల నుంచి 99 ఏళ్లకు లీజు
- నియోజకవర్గ, మండల కేంద్రాల్లోనూ 30 సెంట్లు
- తిరుపతిలో టీడీపీ కార్యాలయానికి ఖరీదైన రెండెకరాల భూమి
- మచిలీపట్నంలో రవాణా శాఖకు కేటాయించిన భూమి రద్దు చేసి మరీ టీడీపీ ఆఫీస్‌కు కేటాయింపు
- ఎకరానికి ఏడాది లీజు కేవలం రూ.వెయ్యి మాత్రమే

సాక్షి, అమరావతి: జాతీయ, రాష్ట్ర స్థాయి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల కార్యాలయాలకు నియోజకవర్గ, మండల కేంద్రాల్లో ప్రభుత్వ భూములను చవకగా 99 ఏళ్ల పాటు లీజుకు కేటాయించేలా చంద్రబాబు ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. 2017లో ఇదే చంద్రబాబు ప్రభుత్వం.. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల కార్యాలయాల కోసం ప్రభుత్వ భూములను 33 ఏళ్ల పాటు లీజుకు కేటాయించాలని, పార్టీలు మనుగడలో ఉంటే 99 ఏళ్లకు లీజు పొడిగించాలని ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పుడు ఆ ఉత్తర్వులకు సవరణలు చేస్తూ ప్రభుత్వ భూముల కేటాయింపు లీజును 66 ఏళ్లకు పెంచుతూ.. పార్టీ మనుగడలో ఉంటే 99 ఏళ్లకు లీజును పొడిగించాలని గురువారం జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది. ఇందుకు అనుగుణంగా జిల్లా కలెక్టర్లు, భూ పరిపాలన ప్రధాన కమిషనర్ చర్యలు తీసుకోవాల్సిందిగా ఉత్తర్వుల్లో సూచించారు. తాజాగా జారీ చేసిన జీవో ఆధారంగా అధికారంలో ఉన్న పార్టీలు నియోజకవర్గాలు, మండల కేంద్రాల్లో ప్రభుత్వ భూములను గుర్తించి, తమ పార్టీ కార్యాలయాల కోసం 66 ఏళ్ల నుంచి 99 ఏళ్లకు లీజుకు కేటాయింపులు చేయించుకోనున్నాయి. ఇదిలా ఉండగా మచిలీపట్నం నార్త్ మండలంలో గతంలో రవాణా శాఖకు కేటాయించిన 1.60 ఎకరాల భూమి కేటాయింపులను రద్దు చేసి, ఇప్పుడు ఆ భూమిని తెలుగుదేశం పార్టీ ఆఫీస్‌కు కేటాయిస్తూ ప్రభుత్వం మరో జీవో జారీ చేసింది. ఎకరానికి ఏడాదికి రూ.1,000 చొప్పున 33 ఏళ్ల పాటు లీజుకు కేటాయించారు. ఈ భూమిని కృష్ణా జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడికి అప్పగించాల్సిందిగా ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. అలాగే తిరుపతి రూరల్ మండలం అవిలాలలో టీడీపీ కార్యాలయం కోసం ఖరీదైన రెండు ఎకరాల భూమిని 33 ఏళ్ల పాటు లీజుకు కేటాయిస్తూ ప్రభుత్వం మరో ఉత్తర్వును జారీ చేసింది. ఎకరానికి ఏడాదికి రూ.1,000 లీజు చొప్పున కేటాయించారు. ఈ భూమిని తిరుపతి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షునికి అప్పగించాల్సిందిగా ఆ ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

పవన్.. దమ్ముంటే రుజువు చెయ్

- లేదంటే క్షమాపణ చెప్పు
- డిప్యూటీ సీఎంకు ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి సవాల్

సాక్షి అమరావతి/పుంగనూరు: వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చేసిన ఆరోపణలపై రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి మండిపడ్డారు. గురువారం ఆయన ఈ మేరకు సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ట్వీట్ చేశారు. పవన్‌కళ్యాణ్‌కు దమ్ముంటే ఆరోపణలు రుజువు చేయాలని లేదా క్షమాపణ చెప్పాలని ఎంపీ సవాల్ విసిరారు. 'కూటమి ప్రభుత్వం ఏర్పాటై 18 నెలలు గడుస్తోంది. ఆరోపణలు ఒక్కటి కూడా మాపై రుజువు చేయలేకపోయారు. పాచిపోయిన ఆరోపణలు చేస్తూ.. సినిమా రంగులు తొడిగి.. కొత్తగా ప్రచారం చేసినా అబద్ధాలను నిజాలు చేయలేరు. అధికారం మీ వద్దే ఉంది. రుజువు చేయండి. ఆన్‌లైన్‌లో రికార్డులు పరిశీలించండి. అభివృద్ధిని విస్మరించి డైవర్షన్ పాలిటిక్స్‌తో ప్రభుత్వం కాలం గడుపుతోంది. కూటమి అధికారంలోకి వచ్చిన రోజునుంచీ మా కుటుంబంపై బురద చల్లడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. అధికారులతో ఎన్నో కమిటీలు వేసి, విచారణలు చేశారు. ఒక్కటైనా రుజువు చేశారా? నేపాల్‌కు ఎర్రచందనం అంటూ పవన్‌కళ్యాణ్ అర్థం లేని విమర్శలు చేశారు. వాటిని నిరూపించాలి. ఆరోజే సవాల్ విసిరినా పవన్ ఇప్పటివరకు స్పందించలేదు. చంద్రబాబు డైరెక్షన్‌లో పవన్‌కళ్యాణ్ చేస్తున్న ఆరోపణలు అర్థరహితం. సూపర్–6, సూపర్–7 స్కీమ్‌లను ఎగ్గొట్టి డైవర్షన్ స్కీమ్ మాత్రమే అమలు చేస్తున్నారు. తుపాను కారణంగా రైతులకు పంటనష్టం, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకుండా ఆరోగ్యశ్రీని నిర్వీర్యం చేసి, వైద్య, విద్యను ప్రైవేటీకరణ చేయడంపై ప్రజావ్యతిరేకత తీవ్రమైంది. దీనికి సమాధానం ఇవ్వలేని కూటమి ప్రభుత్వం తన అసమర్థతను కప్పిపుచ్చుకునేందుకు ఎంచుకున్న స్కీమ్ డైవర్షన్ పాలిటిక్స్. ఇలాంటి ఆరోపణలకు, తప్పుడు కేసులకు భయపడే ప్రసక్తే లేదు. మీరు చేసిన ఆరోపణల్ని నిరూపించండి లేదా క్షమాపణ చెప్పండి. పవన్‌చేసే ఆరోపణలను నమ్మే స్థితిలో జనం లేరు. ఇప్పటికైనా కూటమి నాయకులు అసత్య ఆరోపణలు మానుకోవాలి. లేకపోతే నవ్వుల పాలు కాకతప్పదు' అని ఎక్స్ ట్వీట్‌లో మిథున్‌రెడ్డి పేర్కొన్నారు.

1966లో రైత్వారీ పట్టా

'చిత్తూరు జిల్లా పులిచెర్ల మండలంలోని 75.74 ఎకరాలకు 1966లో రెవెన్యూ అధికారులు రైత్వారీ పట్టా జారీ చేశారు. 1975లో దీనిని రెవెన్యూ అధికారులు సుమోటోగా విచారణ జరిపారు. 1981లో డైరెక్టర్ ఆఫ్ సెటిల్‌మెంట్ తీర్పు ఇచ్చింది. ఆ భూములు పట్టా భూములని నిర్ధారించింది. 1968 సెప్టెంబర్ 16న అటవీ శాఖ భూముల్లోకి వెళ్లడానికి 30 అడుగుల వెడల్పుతో దారి వదిలారు. ఇందుకు సంబంధించి కొనుగోలు చేసిన డాక్యుమెంట్లు, వాటి వివరాలను ఆన్‌లైన్‌లో పరిశీలించుకోవచ్చు' అని తన ట్వీట్‌లో ఎంపీ తెలిపారు.

అటవీ ప్రాంతంలో 75.74 ఎకరాలకు పట్టాలున్నాయి

పీసీసీఎఫ్ పీవీ చలపతిరావు స్పష్టీకరణ

సాక్షి, అమరావతి: చిత్తూరు జిల్లా మంగళంపేట అటవీ ప్రాంతంలోని 75.74 ఎకరాల భూమికి పట్టాలు ఉన్నాయని ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ (పీసీసీఎఫ్) పీవీ చలపతిరావు స్పష్టం చేశారు. అటవీ భూముల అన్యాక్రాంతంపై విచారణకు ప్రత్యేక కమిటీ వేశామని, ఎక్కడ భూములు ఆక్రమణకు గురైనా వెనక్కి తీసుకుంటామని గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు. చిత్తూరు జిల్లా పులిచెర్ల మండలం మంగళంపేట అటవీ భూముల్లో ఆక్రమణలు చోటుచేసుకున్నాయని తెలిపారు. వీటిపై కేసులు నమోదు చేశామన్నారు. ఈ కేసులో ఏ1గా పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ఏ2గా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఏ3గా పెద్దిరెడ్డి ద్వారకానాథ్‌రెడ్డి, ఏ4గా పెద్దిరెడ్డి ఇందిరమ్మ పేర్లు నమోదు చేశామన్నారు. అటవీ చట్టంలోని ప్రిలిమినరీ అఫెన్స్ రిపోర్ట్ ప్రకారం చార్జిషీటు దాఖలు చేశామని, ఆక్రమణకు గురైన 32.63 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకున్నామన్నారు. 1968 గెజిట్ ప్రకారం మంగళంపేట అటవీ ప్రాంతంలో 75.74 ఎకరాలకు పట్టాలు ఉన్నాయన్నారు. 32.63 ఎకరాల అటవీ భూమిని కూడా కలిపేసుకున్నారని, దానికి కంచె వేశారన్నారు. ఆ అటవీ భూముల్లో ఉద్యాన పంటలు వేసి సాగు చేసి ఆదాయం పొందారని, చట్టవిరుద్ధంగా బోర్ తవ్వారన్నారు. అటవీ వనరులు దుర్వినియోగం చేశారని., దాదాపు రూ.1.26 కోట్ల విలువైన అటవీ సంపదకు నష్టం వాటిల్లిందన్నారు. వీరిపై కేసులు నమోదు చేసి నోటీసులు ఇచ్చామన్నారు.

సచివాలయాల్ని నిర్వీర్యం చేసే కుట్రలు మానుకోవాలి

ఏపీ గవర్నమెంట్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ చైర్మన్ వెంకటరామిరెడ్డి

సాక్షి, అమరావతి: సచివాలయాలను నిర్వీర్యం చేసే కుట్రలు మానుకోవాలని చంద్రబాబు ప్రభుత్వానికి ఏపీ గవర్నమెంట్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ చైర్మన్ కె.వెంకటరామిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ప్రజలకు ప్రభుత్వమంటే ఇప్పుడు సచివాలయమే కనిపిస్తోందన్నారు. వారికి ఏ సర్టిఫికెట్ కావాలన్నా, ఏ పథకం అమలు కావాలన్నా గ్రామ, వార్డు సచివాలయాలనే ఆశ్రయిస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటివరకు 12 కోట్లకు పైగా సేవలను ప్రజలకు సచివాలయాలు అందించాయన్నారు. కరోనా, వరదలు, తుపాన్ల వంటి విపత్తులు వచ్చినపుడు గ్రామ, వార్డు సచివాలయాలు అందిస్తున్న సేవలు వెలకట్టలేనివన్నారు. అలాంటి సచివాలయాలు పనితీరు బాగాలేదన్నట్టుగా తప్పు పట్టడం ఉద్యోగుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసేలా ఉందన్నారు. పనివేళలు లేకుండా.. సెలవు రోజుల్లోనూ 24 గంటలూ ఏదో ఒక పని వారిపై రుద్దుతున్నారన్నారు. ఏదో ఒక సర్వే పేరుతో రోజూ ఇళ్లల్లో తిప్పుతున్నారన్నారు. ప్రభుత్వం సర్వేల పేరుతో ఎంత ఒత్తిడి పెడుతున్నా ప్రజలకు ఇబ్బందులు కలగకూడదని సచివాలయాల ఉద్యోగులు అన్నీ ఓర్చుకుని కష్టపడుతున్నారన్నారు. ప్రభుత్వ, వాట్సాప్ గవర్నన్స్‌పై ప్రచారం పేరుతో ఇంటింటికీ తిప్పుతున్నారన్నారు.

సచివాలయ వ్యవస్థను గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సృష్టించిందనే అక్కసుతోనే..

గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థపై వస్తున్న తప్పుడు కథనాలపై ఏపీ గ్రామ, వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ అబ్దుల్ రజాక్ ఓ ప్రకటనలో అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రజలకు సేవ చేయాలన్న ఆకాంక్షతో సచివాలయ వ్యవస్థలోకొచ్చిన 1,20,000 మందికి పైగా ఉద్యోగులు పనిచేస్తున్నారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఈ వ్యవస్థను సృష్టించిందన్న ఏకైక కారణంతో కక్షగట్టడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు.

పవన్ ఓ మాట.. పీసీసీఎఫ్ మరో మాట!

సాక్షి టాస్క్‌ఫోర్స్: చిత్తూరు జిల్లా పులిచెర్ల మండలం మంగళంపేట భూములపై డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలకు, పీసీసీఎఫ్ చలపతిరావు చేసిన ప్రకటనకు పొంతనే లేదు. పరస్పరం విరుద్ధంగా ఉన్నాయి. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని పవన్ హడావుడి చేశారనే విమర్శలు వెలువెత్తుతున్నాయి. పుంగనూరు నియోజకవర్గం పులిచెర్ల మండలం మంగళంపేట పరిధిలో 76.74 ఎకరాల భూమిని పెద్దిరెడ్డి కుటుంబం ఆక్రమించిందని బాబు ప్రభుత్వం దుష్ప్రచారం చేస్తున్న విషయం తెలిసిందే. దీన్ని పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తీవ్రంగా ఖండించారు. ఆ భూములపై చంద్రబాబు గతంలో సీఎంగా ఉన్నప్పుడే విచారణ జరిపించారన్నారు. తాజాగా ప్రభుత్వం కక్షగట్టి ఇచ్చిన నోటీసులపై పెద్దిరెడ్డి కుటుంబం ఇప్పటికే కోర్టును ఆశ్రయించింది. ఈ క్రమంలో ఈ భూముల తతంగాన్ని తానే వెలికి తీసినట్లు పవన్ కళ్యాణ్ ఇటీవల బిల్డప్ ఇచ్చుకున్నారు. 76.74 ఎకరాల భూములను పెద్దిరెడ్డి కుటుంబం ఆక్రమించిందని, వారిపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇది జరిగిన కొద్ది గంటల వ్యవధిలోనే ఆ భూములు పెద్దిరెడ్డి కుటుంబానికి చెందినవేనని ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ చలపతిరావు ప్రకటించారు. తద్వారా ఆ భూములు తమవే అన్న ఎంపీ మిథున్‌రెడ్డి వాదనతో పీసీసీఎఫ్ చలపతి రావు ఏకీభవించినట్లయింది. దీంతో పవన్ వ్యాఖ్యలు ఒట్టి ఆరోపణలేనని తేటతెల్లమైంది. కాగా, పవన్ మొన్న కాకినాడ పోర్ట్‌కు వెళ్లి చేసిన హడావుడి, నిన్న ఎర్రచందనంపై చేసిన వ్యాఖ్యలు ఒట్టి హడావుడేనని ఈ సందర్భంగా చర్చనీయాంశమైంది.

ఉత్తమ నీటి సంరక్షణ పంచాయతీగా మురుగమ్మి

జాతీయ స్థాయిలో రెండో స్థానం

మురుగమ్మి గ్రామంలో నీటి సంరక్షణకు ఏర్పాటు చేసిన కుంట

పీసీపల్లి: ప్రకాశం జిల్లా పీసీపల్లి మండలంలోని మురుగమ్మి గ్రామం జాతీయ స్థాయిలో రెండో ఉత్తమ నీటి సంరక్షణ పంచాయతీగా ఎంపికైంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 2021 నుంచి 2024 మధ్య మురుగమ్మి పంచాయతీలో వాటర్ షెడ్ కింద 51 పనులు చేపట్టి రూ.97.33 లక్షలు ఖర్చు చేశారు. గ్రామ పరిధిలో చెరువు, కుంటలు, చెక్‌డ్యామ్‌లు నిర్మించి భారీగా నీటిని నిల్వ చేసేందుకు చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలో కేంద్ర జల్‌శక్తి శాఖ 6వ జాతీయ అవార్డులకు ఈ ఏడాది ఆగస్టులో డ్వామా అధికారులు దరఖాస్తు పంపించారు. దీనిని పరిశీలించిన కేంద్ర జల్ శక్తి శాఖ.. రెండో ఉత్తమ నీటి సంరక్షణ పంచాయతీగా మురుగమ్మిని ఎంపిక చేసింది. రూ.1.5 లక్షల నగదు బహుమతిని ప్రకటించింది. ఈ నెల 18న ఢిల్లీలో నిర్వహించే కార్యక్రమంలో రాష్ట్రపతి ముర్ము నుంచి సర్పంచ్ సుబ్బరత్నమ్మ అవార్డు అందుకోనున్నారు.

విద్యుత్ కాంట్రాక్టుల్లో చిన్న సంస్థలకు 'షాక్'

కొత్త నిబంధనలతో వాటిని కాంట్రాక్టులకు దూరంచేసే యత్నం

- గతంలో 113 మార్కులుంటే టెండర్ దాఖలుకు అర్హత
- ఇప్పుడది 124 మార్కులకు పెంచేసిన బాబు సర్కార్
- 150కి 113 మార్కులు పొందడమే చిన్న సంస్థలకు కష్టం
- అది తెలిసే బడా సంస్థలకు అనుకూలంగా మార్పులు
- ఎంఎస్‌ఎంఈలను నిర్వీర్యం చేసి పెద్ద కంపెనీలకు రెడ్ కార్పెట్
- 50% మెటీరియల్ ఎంఎస్‌ఎంఈల నుంచే కొంటామన్నదీ ఒట్టిమాటే



సాక్షి, అమరావతి: చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత విద్యుత్ శాఖలో టెండర్లన్నీ కొన్ని సంస్థలకు, కొందరు వ్యక్తులకే దక్కుతున్నాయి. ఇదెలా సాధ్యమవుతోందనేది ఇన్నాళ్లూ ఎవరికీ అంతుచిక్క లేదు. కానీ తాజాగా దాని వెనుక ఉన్న కొన్ని వ్యూహాలు వెలుగులోకి వచ్చాయి. తామనుకున్న కంపెనీకి కాంట్రాక్టును దక్కించడం కోసం చంద్రబాబు సర్కార్ అనేక జిమ్మిక్కులకు పాల్పడుతోంది. చట్టం ముందు దొరకకుండా, న్యాయపరంగా ఎలాంటి ఇబ్బందులు రాకుండా, పక్కా ప్రణాళికతో అవినీతికి పాల్పడుతోంది. అందుకు నిదర్శనమే తాజాగా బయటపడ్డ 'నిబంధనల' కుట్రలు. అధికారం చేతికి రాగానే మొదలుపెట్టిన ఆ అక్రమాల భాగోతం ఇది.

రింగ్ కాంట్రాక్టర్ల హవా

విద్యుత్ సంస్థలపై పడి దోచుకుతినడానికి చంద్రబాబు సర్కారులోని నేతలు సరికొత్త దారులు వెదుకుతున్నారు. కాంట్రాక్టుల్లో వాటాల కోసం రసవత్తర డ్రామాలు ఆడుతున్నారు. వారికి తోడుగా విద్యుత్ సంస్థల్లో కొందరు కాంట్రాక్టర్లు రింగ్ (కూటమి) మాస్టర్లుగా ఏర్పడ్డారు. టెండర్ల విలువను పెంచేసి, ఎవరికి టెండర్ రావాలో వారికి అనుకూలంగా నిబంధనలు మార్చేసి, అనుకున్న విధంగా టెండర్లు దక్కేలా చేసి ఆపైన వాటాలను దండుకుంటున్నారు. తమ మాట వినని వారి టెండర్లను తామే తప్పుబట్టినట్టు నటించి, తమ వాటా కోసం బేరాలు సాగిస్తున్నారు. ఈ రింగ్ కాంట్రాక్టర్లు తమ కూటమిలో లేని సంస్థలు టెండర్లలో పాల్గొంటే వారిని ఏదో విధంగా అనర్హులుగా చూపించాలని అధికారులపై ఒత్తిడి తీసుకువస్తుంటారు. అందుకోసం పాలకుల వద్ద నుంచి సిఫారసు చేయించుకుంటున్నారు. బాబు సర్కార్‌లో ఇప్పటి వరకూ అందరికీ తెలిసిన వ్యవహారం.

కొత్త బ్రహ్మాస్త్రం.. 'మార్కులు'

టెండర్లను బడా సంస్థలకు కట్టబెట్టేందుకు, చిన్న, మధ్య తరహా కంపెనీలను కనీసం టెండర్ దాఖలు వరకూ కూడా రానివ్వకుండా ఆపేందుకు చంద్రబాబు ప్రభుత్వం అర్హత పేరుతో తాజాగా ఒక బ్రహ్మాస్త్రాన్ని సంధించింది. దానిపేరే 'మార్కులు'. విద్యుత్ శాఖలో ఏ టెండర్ వేయాలన్నా ఆ కంపెనీకి విద్యుత్ సంస్థలు విధించిన నిబంధన ప్రకారం 150కి గానూ 113 మార్కులు రావాలనేది ఇన్నాళ్లూ ఉన్న నిబంధన. దీనివల్ల ఏ కంపెనీ అయినా తమకున్న వనరులు, పరిధులను బట్టి టెండర్లు దాఖలు చేసే అవకాశం ఉంది. కానీ ఇప్పుడు వాటిని 124కు పెంచేశారు. అంటే ఆ మేరకు నిబంధనలు అదనంగా జత చేశారు. దీనివల్ల చిన్న, మధ్య తరహా సంస్థలేవీ టెండర్లలో పాల్గొనలేవు.

చెప్పేదొకటి.. చేసేది మరొకటి

నిజానికి చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత విద్యుత్ సంస్థల్లో ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలు, విద్యుత్ వైర్లు, ఇతర విలువైన సామాగ్రి(మెటీరియల్) ఏది అవసరమైనా అందులో 50 శాతం సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమ(ఎంఎస్‌ఎంఈ)ల నుంచే తీసుకుంటామని ప్రకటించింది. కానీ ఇప్పుడు దానికి విరుద్ధంగా ఎంఎస్‌ఎంఈలకు ఎలాంటి కాంట్రాక్టు దక్కకుండా చేస్తోంది.

చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కొన్ని అడ్డగోలు టెండర్ల తీరు..

బూడిద టెండర్‌లో గోల్‌మాల్

నెల్లూరు జిల్లాలోని శ్రీ దామోదరం సంజీవయ్య థర్మల్ పవర్ స్టేషన్‌లో విద్యుత్ ఉత్పత్తికి వాడే బొగ్గు నుంచి వచ్చే బూడిద టెండర్లలో కమిషన్ కోసం కూటమి ఎమ్మెల్యే పెద్ద కథే నడిపారు. ఏపీ పవర్ జనరేషన్ కార్పొరేషన్ తరపున ఏపీ పవర్ డెవలప్‌మెంట్ కంపెనీ లిమిటెడ్ రూ.270 కోట్ల అంచనా విలువతో 'చెరువు బూడిద రవాణా' ఈ–టెండర్‌ను పిలిచింది. ఇందులో ఎల్1, ఎల్2, ఎల్3గా వచ్చిన వారికి రూ.90 కోట్ల చొప్పున పనులు అప్పగిస్తుంది. టెండర్ దక్కించుకున్న సంస్థలు థర్మల్ ప్లాంట్‌కు చుట్టుప్రక్కల 300కి.మీ. పరిధిలో ఈ బూడిదను సరఫరా చేయాలి. అయితే కాంట్రాక్టర్ అర్హత ప్రమాణాలను అయిన వారి కోసం అనుకూలంగా మార్చేశారు. ఈ విషయం నెల్లూరు జిల్లాకు చెందిన కూటమి ఎమ్మెల్యేకు తెలిసింది. కొన్ని ఇంజినీరింగ్ సంస్థలు ఆ ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశాయి. దీంతో వెంటనే ఆయన జెన్‌కోకు లేఖ రాశారు. టెండర్‌పై వచ్చిన ఫిర్యాదులను ఆ లేఖలో పేర్కొంటూ, అధికారులను వివరణ కోరారు. చివరికి టెండర్ వేసిన కాంట్రాక్టర్‌తో బేరం కుదుర్చుకుని ఫిర్యాదు చేసిన వారినే తిరిగి బెదిరించారు.

సబ్ స్టేషన్ టెండర్‌లో రింగ్

ఏపీ ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్‌లో ప్రకాశం జిల్లా పుల్లలచెరువు వద్ద 220 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి రూ.60.21 కోట్లకు టెండర్ పిలిచింది. కానీ ఇక్కడ ఏకంగా రూ.6.68 కోట్లు పెంచేశారు. నిజానికి రూ.60.21 కోట్ల టెండర్‌లోనే ఆ సంస్థల లాభాలు కూడా ఉంటాయి. అదనంగా ఎందుకు పెరిగిందని ఆరాతీస్తే.. బాబు ప్రభుత్వంలోని ఓ ప్రజాప్రతినిధితో మూడు సంస్థలు టెండర్ దక్కించుకోవడం కోసం ముందే బేరాలు కుదుర్చుకున్నాయని తెలిసింది.

భవ్య కోసం... 'టెండర్'

ఏపీజెన్‌కో ఆధ్వర్యంలోని థర్మల్, జల విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టుల్లో పనిచేసే ఉద్యోగులకు వైద్య సేవలు అందించేందుకు ఆసుపత్రులు ఉన్నాయి. వీటి నిర్వహణ, అభివృద్ధి కోసమంటూ భవ్య హెల్త్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థకు టెండర్ అప్పగించారు. అయితే మొదట రెండు సార్లు టెండర్లు పిలిచినప్పుడు నిర్వహణ చేపట్టే సంస్థకు ఆసుపత్రి ఉండాలని, వైద్య రంగంలో 15 ఏళ్ల అనుభవం ఉండాలని నిబంధన పెట్టారు. కానీ మూడవసారి పిలిచిన టెండర్లలో అవేవీ లేవు. భవ్యకు ప్రతి నెలా రూ.1.03 కోట్లను ఏపీజెన్‌కో చెల్లించాలి. ఇతర సంస్థలు నెలకు రూ.67 లక్షలు మాత్రమే అడిగాయి. అంతేకాకుండా స్పెషలిస్ట్ డాక్టర్ల సేవల కోసం రూ.8 వేలు, సూపర్ స్పెషలిస్ట్ డాక్టర్లు వస్తే రూ.12 వేలు, ఉద్యోగుల ఆరోగ్య తనిఖీల కోసం ఒక్కొక్కరికీ రూ.3,800 చొప్పున అదనంగా ఇవ్వాలి. ఇతర సంస్థలు ఇంతకన్నా తక్కువ కోట్‌చేశాయి. అయినా కాదన్నారు. మరో విశేషం ఏమిటంటే ఆర్టీపీపీలో వైద్య సేవల కోసం యశోదా హాస్పిటల్ నెలకు రూ.11.50 లక్షలు ఇస్తే చేస్తామంటే వద్దని, భవ్యకు రూ.15.57 లక్షలకు ఇచ్చేందుకు ఒప్పుకున్నారు. ఒక్కో ప్రాజెక్టు వద్ద దాదాపు 3,500 మంది చొప్పున ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు ఉన్నారు. ఈ లెక్కన మూడేళ్ల టెండర్ కాలంలో దాదాపు రూ.100 కోట్లను భవ్యకు కట్టబెడుతున్నారు.

సీఆర్‌డీఏ టెండర్లలో భారీ పెంపు

సీఆర్‌డీఏ పరిధిలో నిర్మించే సబ్ స్టేషన్లు, లైన్ల మార్పులపై నాలుగు టెండర్లను పిలిచారు. వీటిలో 132 కేవీ, 220కేవీ సబ్ స్టేషన్ల నిర్మాణంతో పాటు పలు లైన్ల ఏర్పాటు పనులు ఉన్నాయి. వీటన్నిటి విలువ రూ.1,800 కోట్లు కాగా రూ.2,100 కోట్లకు టెండర్ల విలువ పెంచేశారు. బీఎస్‌ఆర్ ఇన్ఫ్రా, యూనివర్శల్ కేబుల్‌కు అండర్ గ్రౌండ్ కేబుల్స్ టెండర్ రూ.990 కోట్లది రూ.1100 కోట్లకు ఇచ్చారు. 400కేవీ లైన్ మార్పు పనులు రూ.350 కోట్లది పీవీఆర్ కన్‌స్ట్రక్షన్స్, కేఆర్‌కు రూ.390 కోట్లకు ఇచ్చారు. 220 కేవీ సబ్ స్టేషన్ జీవీపీఆర్‌కు రూ.215 కోట్లది రూ.237 కోట్లకు ఇచ్చారు. నేలపాడు 220 కేవీ సబ్ స్టేషన్ రూ.240 కోట్లది రూ.280 కోట్లకు ఇచ్చారు. కర్నూలు జిల్లా భావనాసి, ప్రకాశం జిల్లా పుల్లలచెరువు, ఏలూరు జిల్లా కొప్పాక, విజయనగరం జిల్లా భోగాపురంలో 220 కేవీ సబ్‌స్టేషన్లు రూ.200 కోట్లు విలువ కాగా రూ.230 కోట్లకు టెండర్లు వేశారు.

లింగయ్యపాలెం జీఐఎస్ టెండర్

సీఆర్‌డీఏ పరిధిలోని లింగయ్యపాలెంలో 220/33 కేవీ గ్యాస్ ఇన్సూలేటెడ్ సబ్ స్టేషన్(జీఐఎస్) నిర్మాణం చేపట్టాలని ఏపీ ట్రాన్స్‌కో నిర్ణయించింది. దానికి రూ.267.35 కోట్లు వ్యయం అవుతుందని అంచనా వేసింది. దీనికి సంబంధించి టెండర్లు కూడా పిలిచి ఓ కార్పొరేట్ సంస్థకు టెండర్‌ను అప్పగించింది. కాకినాడ సెజ్‌లో నిర్మిస్తున్న 400కేవీ సబ్ స్టేషన్ల పనులను రెండు సంస్థలు జాయింట్ వెంచర్‌గా టెండర్ వేస్తే వాళ్లకు అప్పగించారు. కానీ లింగయపాలెం సబ్ స్టేషన్‌కు మాత్రం కాంపిటేటివ్ బిడ్డింగ్ విధానాన్ని అనుసరించారు. చిత్రమేమిటంటే కాకినాడ ఎస్‌ఈజెడ్‌లో జేవీలుగా టెండర్ దక్కించుకున్న సంస్థలే ఇక్కడ విడివిడిగా టెండర్లు దాఖలు చేశాయి. అయితే, మంత్రి అండతో రింగ్ మాస్టర్లుగా మారిన కొందరు కాంట్రాక్టర్లు ఇతర సంస్థలను టెండర్లలో పాల్గొననివ్వలేదు.

ఐఐటీల్లో.. సీట్లెందుకు భర్తీ కావట్లేదు?

30 % ఎంబీఏ సీట్లు ఖాళీగా వదిలేస్తున్న వైనం

ఫ్యాకల్టీ, మౌలిక వసతులకు భారీగా ప్రజాధనం

అనామక కాలేజీల్లో చేరుతున్న లక్షల మంది

దేశంలోని టాప్ ఐఐటీలు ఎంబీఏ సీట్లను పూర్తిస్థాయిలో భర్తీ చేయడంలేదు. మంజూరైన సీట్లలో 30 శాతానికిపైగా ఖాళీగా వదిలేస్తున్నాయి. లక్షల మంది విద్యార్థులు రెట్టింపు ఫీజులతో అనామక కాలేజీల్లో చేరుతుంటే.. ప్రజాధనంతో నడిచే టాప్ ఇన్‌స్టిట్యూట్స్ మంజూరైన సీట్లలో సైతం ప్రవేశాలు కల్పించకపోవడం సమంజసమా..? ఎన్ఐఆర్ఎఫ్‌లో టాప్ 20లో ఉండే ఈ ఐఐటీలు.. ప్లేస్‌మెంట్స్‌లో వెనుకబడుతున్నాయా... విద్యార్థులను చేర్చుకోవడంలో విఫలమవుతున్నాయా.. కారణాలు ఏవైనా కాని.. దేశంలోని ఉత్తమ ఇన్‌స్టిట్యూట్స్ ఐఐటీల్లో భారీ సంఖ్యలో ఎంబీఏ సీట్లు మిగిలిపోవడం ప్రజాధనం వృథాకాక మరేమిటి?! ఐఐటీల్లో ఎంబీఏ సీట్లు ఖాళీగా మిగిలిపోవడంపై కెరీర్స్ 360 మ్యాగజీన్ ఫౌండర్ మహేశ్వర్ పెరి విశ్లేషణాత్మక కథనం..

మహేశ్వర్ పెరి

తాజా గణాంకాలను పరిశీలిస్తే.. ఐఐటీల్లో మంజూరైన సీట్ల సంఖ్యకు, ఉద్యోగాలు పొందిన విద్యార్థుల సంఖ్యకు మధ్య చాలా అంతరం కనిపించింది. దాదాపు 40 శాతం మందికి ప్లేస్‌మెంట్స్ లభించలేదు. ఇవి దేశంలోని టాప్ 20 బీస్కూల్స్ జాబితాలో ఉన్న ఇన్‌స్టిట్యూట్స్. ఇలా దేశంలోనే బెస్ట్ బీస్కూల్స్‌లో కేవలం 60 శాతం మంది విద్యార్థులకే ఆఫర్లు లభించడం ఏమిటి? అనే ప్రశ్న ఎదురైంది. అయితే ఈ ఐఐటీలు మంజూరైన ఎంబీఏ సీట్లను పూర్తిస్థాయిలో భర్తీ చేయడం లేదని తేలింది. అంటే 100 మంది విద్యార్థుల కోసం ఫ్యాకల్టీని, మౌలిక వసతులను, వనరులను తీసుకొని.. కేవలం 70, లేదా 80 మంది విద్యార్థులను చేర్చుకుంటున్నాయి. దేశంలోని బెస్ట్ ఇన్‌స్టిట్యూట్స్‌గా గుర్తింపు పొందిన ఐఐటీలు దేశ వనరులను ఇలా వృథా చేయడం బాధాకరం. ఈ ఇన్‌స్టిట్యూట్స్‌లు పూర్తి స్థాయిలో విద్యార్థులను చేర్చుకోవడం లేదు. ఇదంతా ప్లేస్‌మెంట్స్ శాతాలు, సగటు వేతనాలు ఎక్కువగా చూపి.. టాప్‌ర్యాంకుల్లో నిలిచేందుకేనా అనే సందేహం ఎదురవుతోంది.

5లక్షల మంది పోటీ

గతేడాది క్యాట్ పరీక్ష కోసం 3.2 లక్షల మంది దరఖాస్తు చేసుకుంటే.. 2.93 లక్షల మంది ఈ పరీక్ష రాసారు. మొత్తంగా 5 లక్షల నుంచి 5.2 లక్షల మంది విద్యార్థులు దేశంలో ఏదో ఒకచోట ఎంబీఏ ప్రోగ్రామ్‌లో చేరారు. ఒకవైపు దేశంలో ఎంబీఏ కోర్సులో చేరడానికి ఏటా లక్షల సంఖ్యలో పోటీపడుతుంటే... జాతీయస్థాయిలో ఉత్తమ పబ్లిక్ ఇన్‌స్టిట్యూట్స్‌లో ఎంబీఏ సీట్లు పూర్తి స్థాయిలో భర్తీచేయకపోవడం సమంజసంకాదు. టాప్ ఐఐటీలు కేవలం 60 శాతం సీట్లను భర్తీ చేస్తున్నాయి. మిగతా 40 శాతం సీట్లు భర్తీ చేయకుండా వదిలేస్తున్నాయి. ప్రవేశాల కోసం ప్రభుత్వం అనుమతి పొంది ప్రజాధనంతో ఫ్యాకల్టీ, తరగతి గదులు, మౌలిక వసతులు ఏర్పాటు చేసుకున్న ఈ ఇన్‌స్టిట్యూట్స్.. పూర్తిస్థాయిలో సీట్లను భర్తీ చేయడంలేదు.

ఐఐటీ ఢిల్లీ

విద్యా సంవత్సరం	మొత్తం సీట్లు	భర్తీ అయినవి	మిగిలిన సీట్లు (%)
2020–21	144	117	18.75
2021–22	144	128	11.11
2022–23	144	93	35.41

- 2025 ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకుల్లో 4వ స్థానంలో నిలిచిన ఈ ఐఐటీ ఢిల్లీ..
- 2022–23 విద్యాసంవత్సరంలో దాదాపు 35 శాతం సీట్లను భర్తీ చేయలేదు.
- అదే బీటెక్‌లో ఈ స్థాయిలో సీట్లు భర్తీ చేయకుండా వదిలేయడం ఊహించగలమా? అది అసాధ్యం. ఇక్కడ 2022–23లో 144 సీట్లు మంజూరైతే కేవలం .. 93 సీట్లు భర్తీ చేశారు. ఇందులో 89 మందికి ప్లేస్‌మెంట్స్ లభించినట్లు చెప్పారు. అంటే 95 శాతం మందికి ప్లేస్‌మెంట్స్ దక్కాయన్నమాట!! కాని మంజూరైన మొత్తం సీట్ల కోణంలో చూస్తే 61.81 శాతం మందికి మాత్రమే ప్లేస్‌మెంట్స్ లభించినట్లు లెక్క!
- దీనిపై మంజూరైన అన్ని సీట్లను భర్తీ చేయడంలేదు అని చెబుతున్నారు.
- ఇది మాకు విస్మయం కలిగించింది. ప్లేస్‌మెంట్స్ లభించకుంటే అర్థం చేసుకోవచ్చు. కాని మంజూరైన సీట్లలో ప్రవేశం కల్పించకపోవడం ఏమిటి? అది కూడా దేశంలోని టాప్ 4వ స్థానంలో ఉన్న బీస్కూల్ పూర్తి సీట్లు భర్తీ చేయకపోవడం ఆందోళనకరం.

ఐఐటీ ఖరగ్‌పూర్

విద్యా సంవత్సరం	మొత్తం సీట్లు	భర్తీ అయినవి	మిగిలిన సీట్లు (%)
2020–21	99	97	2.02
2021–22	101	94	6.93
2022–23	206	125	39.32

- 2025 ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్స్‌లో 12వ స్థానంలో నిలిచిన ఐఐటీ ఖరగ్‌పూర్‌లో 2022–23 విద్యాసంవత్సరంలో దాదాపు 40 శాతం సీట్లు భర్తీ చేయలేదు. ఇక్కడ
- 206 సీట్లు మంజూరైతే.. కేవలం 125 మందిని చేర్చుకున్నారు. 124 మందికి ప్లేస్‌మెంట్స్ లభించినట్లు పేర్కొన్నారు. అంటే.. 99 శాతం మందికి ఉద్యోగాలు లభించాయి. మంజూరైన సీట్ల కోణంలో చూస్తే మాత్రం 60 శాతం మందికి మాత్రమే ప్లేస్‌మెంట్స్ లభించినట్లు భావించాలి.

ఐఐటీ మద్రాస్

విద్యా సంవత్సరం	మొత్తం సీట్లు	భర్తీ అయినవి	మిగిలిన సీట్లు (%)
2020–21	129	114	11.63
2021–22	146	67	54.11
2022–23	96	86	10.42

- 2025 ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్స్‌లో 13వ స్థానంలో నిలిచిన ఐఐటీ మద్రాస్‌లో పరిస్థితి ఇది.

ఐఐటీ బాంబే

విద్యా సంవత్సరం	మొత్తం సీట్లు	భర్తీ అయినవి	మిగిలిన సీట్లు (%)
2020–21	182	148	18.68
2021–22	182	115	36.81
2022–23	182	114	37.36

- 2025 ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్స్‌లో 14వ స్థానంలో నిలిచిన ఐఐటీ బాంబేలో 2022–23 విద్యాసంవత్సరంలో 37 శాతం సీట్లు భర్తీకాలేదు. మంజూరైన 182 సీట్లలో 114 మాత్రమే భర్తీ చేశారు. కాని భర్తీ అయిన 114 మందిలో 111 మందికి ప్లేస్‌మెంట్స్ లభించాయి. అంటే 97.37శాతం మందికి ఉద్యోగాలు దక్కినట్లు ప్రకటించారు. కాని మంజూరైన సీట్ల కోణంలో చూస్తే.. కేవలం 60 శాతం మందికే ఆఫర్లు దక్కాయి.

ఇదంతా ఐఐటీలు ఇచ్చిన డేటానే..

ఈ డేటా అంతా ఈ ఇన్‌స్టిట్యూట్‌లు ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్‌లో ఇచ్చిన సమాచారమే. అక్కడి నుంచే మేం ఈ గణాంకాలు తీసుకున్నాం. పూర్తి స్థాయిలో సీట్లు భర్తీ చేయకపోవడం అనేది ఐఐటీల్లో ఎంబీఏ విభాగంలో మాత్రమే కనిపిస్తోంది. ఇవన్నీ దేశంలోనే టాప్ బీస్కూల్స్. ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్ ప్లేస్‌మెంట్స్‌పై ఆధారపడి ఉంటుంది. ఫ్యాకల్టీ, మౌలిక వసతులు, ఇతర ఖర్చుల కోసం ప్రజాధ నాన్ని భారీగా వెచ్చిస్తూ.. 50, 60, 70% మాత్రమే ప్రవేశాలు కల్పించడం ఎంతవరకు సమంజసం. ఎక్కువ మంది విద్యార్థులు ఎలాంటి ఊరు పేరు లేని, ఎలాంటి ఫలితాన్ని ఇవ్వని బీస్కూల్స్‌లో చేరుతుంటే.. ఎంతో సామర్థ్యం ఉన్న ఐఐటీలు సీట్లను వృథాగా వదిలేయడం ఆందోళన కలిగిస్తోంది. అక్కడ ఇక్కడి కంటే 3,4, రెట్లు ఎక్కువ ఫీజు వసూలు చేస్తారు. ఎలాంటి ప్రతిఫలం ఉండదు.

ఐఐఎంల్లో పరిస్థితి పూర్తిగా భిన్నం

ఐఐఎంలను పరిశీలిస్తే.. అవి అన్ని సీట్లు భర్తీ చేస్తున్నాయి. ఐఐఎం అహ్మదాబాద్, ఐఐఎం బెంగళూరు, ఐఐఎం కోజికోడ్.. ఇలా దాదాపు అన్ని ఐఐఎంల్లోనూ సీట్లన్నీ భర్తీ అయ్యాయి. వీటిల్లో మంజూరైన సీట్లు–ప్లేస్‌మెంట్స్ కోణంలో చూసినా, లేదా అడ్మిట్ అయిన సీట్లు–ప్లేస్‌మెంట్స్ కోణంలో చూసినా.. 99 శాతం, 98 శాతం ప్లేస్‌మెంట్స్ లభించాయి. ఇది టాప్ ఐఐఎంల్లో మాత్రమే కాదు. అన్ని ఐఐఎంల్లోనూ ఇదే విధంగా ఉంది. ఖాళీ సీట్లు జీరో శాతంలోనే ఉన్నాయి. అంటే మంజూరైన సీట్లలో వంద శాతం ప్రవేశం కల్పించారు. కాని ఐఐటీల్లో మాత్రం మంజూరైన సీట్లు–ప్లేస్‌మెంట్స్ కోణంలో చూస్తే 50%, 60% మాత్రమే ప్లేస్‌మెంట్స్ లభించాయి. ఎక్కడా కూడా 80శాతం దాటే లేదు.

మొత్తంగా చూస్తే ఇలా..

మొత్తంగా ఏడు ఐఐటీల్లో మంజూరైన ఎంబీఏ సీట్లు 895 ఉంటే.. అవి 629 మందిని మాత్రమే ప్రవేశం కల్పించాయి. అంటే 30 శాతం సీట్లు భర్తీకాలేదు. మరోవైపు మొత్తం 21 ఐఐఎంల్లో 8091 సీట్లు మంజూరైతే.. 8017 సీట్లు భర్తీ అయ్యాయి. ఇక్కడ కేవలం 0.91% మాత్రమే ఖాళీ సీట్లు. ఒక శాతం కంటే తక్కువ. ఐఐటీల్లో అడ్మిటెడ్ సీట్లు– ప్లేస్‌మెంట్స్ 99.33 శాతంగా ఉంటే.. మంజూరైన సీట్లు–ప్రవేశాల కోణంలో చూస్తే ప్లేస్‌మెంట్స్ 65 శాతం మాత్రమే. అదే ఐఐఎంల్లో అడ్మిటెడ్ సీట్లు–ప్లేస్‌మెంట్స్ 99 శాతం ఉంటే.. మంజూరైన సీట్ల కోణంలో 96 ప్లేస్‌మెంట్స్ లభించాయి!!

తిరుమల లడ్డూ పేరుతో చంద్రబాబు డైవర్షన్ పాలిటిక్స్

- గోమాంసం గురించి పట్టించుకోని సనాతని పవన్, బీజేపీ నేతలు
- మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ నేత అంబటి రాంబాబు ధ్వజం

సాక్షి,అమరావతి: ప్రజా సమస్యల పరిష్కారంలో విఫలమైన కూటమి ప్రభుత్వం.. ప్రజల దృష్టి మరల్చడానికే తిరుమల లడ్డూ పేరుతో డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడుతోందని మాజీ మంత్రి అంబటి రాంబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. తుపానుతో నష్టపోయిన రైతులు, ఫీజు రీయింబర్స్‌మెంట్ అందక విద్యార్థులు అల్లాడుతుంటే, వారిని ఆదుకోవడంలో విఫలమైన చంద్రబాబు హిందువుల మనోభావాలతో ఆడుకుంటూ నీచమైన రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు. తాడేపల్లి వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం అంబటి మీడియాతో మాట్లాడారు. తిరుమల నెయ్యి కల్తీ అంటూ నిరాధార ఆరోపణలతో గగ్గోలు పెడుతున్న టీడీపీ, బీజేపీ నేతలతో పాటు సనాతని పవన్‌కళ్యాణ్ విశాఖలో బట్టబయలైన గోమాంసంపై ఎందుకు మాట్లాడటం లేదని నిలదీశారు. బాపట్ల టీడీపీ ఎమ్మెల్యే నరేంద్రవర్మ అనుచరుడు, టీడీపీ నేత సుబ్రహ్మణ్యగుప్తాకు చెందిన కోల్డ్‌స్టోరేజ్‌లో సుమారు 2 లక్షల కిలోల గోమాంసం పట్టుబడితే.. చంద్రబాబుతోపాటు బీజేపీ నేతలు పురందేశ్వరి, మాధవ్, జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ కనీసం ఎందుకు నోరు విప్పడం లేదని ప్రశ్నించారు. విశాఖలో గోవులను వధించి, విదేశాలకు ఎగుమతి చేస్తుండడం పాలకులకు కనపడడం లేదా? సుబ్రహ్మణ్య గుప్తాని ఎందుకు అరెస్టు చేయడం లేదు అని నిలదీశారు. 'టీడీపీ నేతలు ఛారిటబుల్ ట్రస్టు పేరిట పశువులను రవాణా చేస్తున్నారు. హోంమంత్రికి చెందిన వ్యక్తులు కూడా గోవులను రవాణా చేసి వధకు పంపిస్తున్నారు. వీటిపై ఫిర్యాదులు వస్తున్నాయి. అయినా పోలీసులు పట్టించుకోవడం లేదు. దీనిగురించి మాట్లాడని, కూటమి నేతలు తిరుమల లడ్డూ కల్తీ అంటూ అభాండాలతో రాజకీయం చేస్తున్నారు. టీటీడీ మాజీ ఈవో ధర్మారెడ్డిని సీబీఐ నేతృత్వంలోని సిట్ అధికారులు విచారణకు పిలిస్తే.. ఆయన లోపల ఉండగానే.. ఎల్లో మీడియా చానల్స్ విష ప్రచారానికి పూనుకున్నాయి. టీవీ5, ఆంధ్రజ్యోతి చానెల్స్ ధర్మారెడ్డి అప్రూవర్‌గా మారారని వార్తలు ప్రసారం చేశారు. టీటీడీ చైర్మన్‌గా ఉన్న టీవీ–5 చానల్‌లో మరింత దిగజారి హిందూ భక్తుల మనోభావాలను దెబ్బతీశారు. అయితే సిట్ విచారణ అనంతరం బయటకు వచ్చిన ధర్మారెడ్డిని మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా, కల్తీకి తావే లేదని స్పష్టం చేశారు. ఈ విషయంలో ఎల్లో మీడియా దుష్ప్రచారం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో తిరుమల లడ్డూ పవిత్రతకు భంగం కలిగిస్తూ నీచంగా మాట్లాడిన చంద్రబాబును సుప్రీంకోర్టు నిలదీసింది. ఒక ముఖ్యమంత్రి పవిత్రమైన లడ్డూ గురించి ఈ విధంగా ఎలా మాట్లాడుతారని ఉన్నత న్యాయస్థానం ప్రశ్నించింది. హిందూ మతాన్ని, భక్తుల మనోభావాలను రాజకీయాల్లోకి లాగుతున్న చంద్రబాబును భగవంతుడు కూడా క్షమించడు' అని అంబటి ఆగ్రహం వ్యక్తం చేశారు.

అక్రమ కేసులతో ప్రజా ఉద్యమాన్ని ఆపలేరు

- మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై వైఎస్సార్‌సీపీ పోరాటం కొనసాగుతుంది
- ప్రభుత్వాన్ని హెచ్చరించిన మాజీమంత్రి మేరుగు నాగార్జున

సాక్షి, అమరావతి: మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా తమపార్టీ చేస్తున్న ప్రజా ఉద్యమాన్ని నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టడం ద్వారా ఆపలేరని వైఎస్సార్‌సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు, మాజీమంత్రి మేరుగు నాగార్జున ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఆయన గురువారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సంతనూతలపాడు నియోజకవర్గంలో నిరసన చేపడితే తనతో పాటు 77 మందిపై పోలీసులు అక్రమ కేసులు నమోదు చేశారని ధ్వజమెత్తారు. పేదలకు ఉచితంగా అందాల్సిన వైద్యాన్ని, వైద్యవిద్యను అందని ద్రాక్షగా మార్చవద్దని నినదిస్తూ చంద్రబాబుకు కనువిప్పు కలిగేలా శాంతియుతంగా నిరసన ప్రదర్శన చేస్తేనే ఈ ప్రభుత్వం తట్టుకోలేకపోయిందని చెప్పారు. నిరసన తెలిపే హక్కును చంద్రబాబు ప్రభుత్వం కాలరాస్తోందన్నారు. తమపై ఎందుకు కేసులు పెట్టారో ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు. కేసులు పెట్టినంత మాత్రాన వైఎస్సార్‌సీపీ శ్రేణులు భయపడిపోతాయనుకోవడం చంద్రబాబు అవివేకమన్నారు. పేదల పక్షాన వైఎస్సార్‌సీపీ పోరాటం ఆపే ప్రసక్తే ఉండదని స్పష్టం చేశారు. మెడికల్ కాలేజీలు ప్రైవేటుపరం కాకుండా చేసే ఉద్యమంలో వెనకడుగు వేయబోమని చెప్పారు.

కుట్రలను గమనిస్తున్న ప్రజలు

రాష్ట్రవ్యాప్తంగా 175 నియోజకవర్గాల్లో వైఎస్సార్‌సీపీ నిర్వహించిన ప్రజా ఉద్యమం నిరసన కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించిందని చెప్పారు. విద్యార్థులు, మేథావులు, ప్రజా సంఘాల వారు ఈ కార్యక్రమంలో పాల్గొని ఉద్యమానికి మద్దతు తెలిపారన్నారు. పేదలకు నాణ్యమైన ఉచిత వైద్యం అందించాలన్న లక్ష్యంతో సీఎంగా ఉన్నప్పుడు వైఎస్ జగన్ 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేసి ఏడు కాలేజీలు పూర్తిచేశారని గుర్తుచేశారు. కానీ 2024లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు వాటిని పీపీపీ పేరుతో ప్రైవేటుపరం చేస్తుండటాన్ని వ్యతిరేకిస్తూ నెలరోజులుగా వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో కోటిసంతకాల సేకరణ కార్యక్రమం జరుగుతోందని చెప్పారు. చంద్రబాబుకు కనువిప్పు కలగాలని తమపార్టీ చేస్తున్న ప్రజా ఉద్యమాన్ని చూసి తట్టుకోలేక ప్రభుత్వం ఉక్కిరిబిక్కిరి అయిపోతోందన్నారు. ప్రజల గొంతులను ఎలాగైనా నొక్కాలనే కుట్రతో చంద్రబాబు ప్రభుత్వం ఊరూరా నాయకులను ఏరుకొచ్చి మరీ అక్రమ కేసులు బనాయించి వేధిస్తోందని చెప్పారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులను భయపెట్టడం ద్వారా ప్రజా సంపదను దోచుకోవాలని చూస్తున్న చంద్రబాబు ప్రభుత్వ కుట్రలను ప్రజలు చూస్తున్నారని, వారు సరైన సమయంలో బుద్ధి చెబుతారని ఆయన పేర్కొన్నారు.

నకిలీ మద్యం కేసులో 13 మందికి రిమాండ్ పొడిగింపు

విజయవాడ లీగల్: నకిలీ మద్యం కేసులో విజయవాడ, నెల్లూరు జైళ్లలో రిమాండ్‌లో ఉన్న అద్దేపల్లి జనార్దనరావు, అద్దేపల్లి జగన్మోహనరావు, నకిరికంటి రవి, బాదల్ దాస్, ప్రదీప్‌దాస్, డి.శ్రీనివాసరెడ్డి, అంగలూరు కళ్యాణ్, తిరుమలశెట్టి శ్రీనివాసరావు, తాండ్ర రమేష్‌బాబు, షేక్ అల్లాభక్షు, చెక్కా సతీష్‌కుమార్‌లను పోలీసులు గురువారం వర్చువల్‌గా ఎక్సైజ్ న్యాయస్థానంలో హాజరుపరిచారు. ఇదే వ్యవహారంపై నమోదైన అక్రమ కేసులో అరెస్టయిన జోగి రమేష్, జోగి రాము రిమాండ్ కూడా గురువారం ముగియడంతో వారినీ ఎక్సైజ్ న్యాయస్థానంలో పోలీసులు హాజరుపరిచారు. అందరికీ ఈనెల 25 వరకు రిమాండ్ పొడిగిస్తూ న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు.

జోగి రమేష్, జోగి రాము కస్టడీ విచారణ వాయిదా

నకిలీ మద్యం అక్రమ కేసులో నెల్లూరు సెంట్రల్‌జైలులో రిమాండ్‌లో ఉన్న జోగి రమేష్, జోగి రాములను 10 రోజులపాటు పోలీసు కస్టడీకి కోరుతూ దాఖలు చేసిన పిటిషన్‌పై డిఫెన్స్ న్యాయవాదులు ఎక్సైజ్ న్యాయస్థానంలో గురువారం కౌంటర్ దాఖలు చేశారు. ఈ విచారణను ఈనెల 17కి న్యాయమూర్తి వాయిదా వేశారు. ఇదే కేసులో జోగి రమేష్ ములాఖత్‌లు పెంచాలని కోరుతూ ఆయన తరపు న్యాయవాది చోడిశెట్టి మన్మథరావు దాఖలు చేసిన పిటిషన్‌పై గురువారం విచారణ పూర్తయింది. న్యాయమూర్తి తీర్పును ఈనెల 20కి వాయిదా వేశారు.

బెయిల్ పిటిషన్ల విచారణ వాయిదా

నకిలీ మద్యం కేసులో రిమాండ్‌లో ఉన్న 11 మంది నిందితుల తరపున దాఖలైన పిటిషన్లలో నకిరికంటి రవి, బాదల్ దాస్, ప్రదీప్ దాస్, డి.శ్రీనివాసరెడ్డి, అంగలూరు కళ్యాణ్, తిరుమలశెట్టి శ్రీనివాసరావు పిటిషన్లపై ప్రాసిక్యూషన్ తరపు న్యాయవాదులు కౌంటర్లు దాఖలు చేశారు. అద్దేపల్లి జనార్ధనరావు, అద్దేపల్లి జగన్మోహనరావు, చెక్కా సతీష్‌కుమార్, జోగి రమేష్, జోగి రాము పిటిషన్లపై కౌంటర్, విచారణను ఎక్సైజ్ కోర్టు న్యాయమూర్తి జి.లెనిన్‌బాబు ఈనెల 20కి వాయిదా వేశారు.

ఎన్‌కౌంటర్ చేసి పాతరేస్తాం

నా తమ్ముడు సతీష్‌పై సీఎం కార్యాలయంలో ఫిర్యాదు చేస్తారా?

మాల.. లం.. అని దూషిస్తూ బెదిరించిన డీఐజీ కోయా ప్రవీణ్

డీజీపీ కార్యాలయంలో టీడీపీ దళిత నేత సుధా మాధవి ఫిర్యాదు

సుధా మాధవి

సాక్షి, అమరావతి: 'వేమన సతీశ్‌కు డబ్బులు ఇచ్చాననే విషయం చెబుతావా.. మాల లం.. మీరు, మీ జాతి బెదిరిస్తే డబ్బులు తిరిగి వస్తాయనుకుంటున్నారా.. నిన్నూ, నీ మొగుడ్నీ, కుటుంబం మొత్తాన్ని ఎన్‌కౌంటర్ చేసి అక్కడే పాతరేస్తాం' అని కర్నూలు డీఐజీ కోయా ప్రవీణ్ తమను బెదిరించారని టీడీపీ దళిత నేత సుధా మాధవి వెల్లడించారు. పోలీసులు తమను కిడ్నాప్ చేసి, బంధించి, వేధించి.. టీడీపీ ఎన్ఆర్ఐ విభాగం నేత వేమన సతీశ్‌కు తాము డబ్బులు ఇవ్వలేదని వీడియో రికార్డింగ్ చేయించారని కూడా తెలిపారు. ఈ మేరకు గురువారం ఆమె డీజీపీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. డీఐజీ కోయా ప్రవీణ్, రాజంపేట సీఐ నాగార్జున, మహిళా ఎస్సై, ముగ్గురు కానిస్టేబుళ్లపై చర్యలు తీసుకోవాలని కోరారు. అన్నమయ్య జిల్లా రైల్వే కోడూరు టీడీపీ టికెట్ ఇప్పిస్తానని చెప్పి, ఆ పార్టీ ఎన్ఆర్ఐ విభాగం నేత వేమన సతీశ్ తమ నుంచి రూ.7 కోట్లు తీసుకున్నారని సుధా మాధవి ఇటీవల వెల్లడించిన విషయం తెలిసిందే. ఆయనకు నగదు ఇస్తున్న వీడియోలను కూడా విడుదల చేయడం సంచలనంగా మారింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ పెద్దలు ఆమెను లక్ష్యంగా చేసుకున్నారు. పోలీసులు సుధా మాధవి, ఆమె భర్తను మంగళగిరిలోని టీడీపీ ప్రధాన కార్యాలయం ఎదురుగా ఉన్న సర్వీస్ రోడ్డులో కిడ్నాప్ చేయడం తీవ్ర కలకలం సృష్టించింది. సుధా మాధవి దంపతులను పోలీసులు అపహరించారని వారి కుమారుడు హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. దాంతో పోలీసులు వారిని విడిచిపెట్టారు. ఈ నేపథ్యంలో తమను డీఐజీ కోయా ప్రవీణ్, సీఐ నాగార్జున తదితరులు ఎలా కిడ్నాప్ చేసి వేధించిందీ వివరిస్తూ సుధా మాధవి డీజీపీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. అనంతరం ఆమె మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ ఫిర్యాదులోని అంశాలను వివరించి, పోలీసుల నుంచి తమ ప్రాణాలకు ముప్పు ఉందని వాపోయారు. సుధారాణి ఫిర్యాదులో పేర్కొన్న అంశాలు ఇలా ఉన్నాయి.

టీడీపీ కార్యాలయం ఎదుటే కిడ్నాప్

మంగళగిరిలోని టీడీపీ ప్రధాన కార్యాలయం ఎదురుగా ఉన్న సర్వీస్ రోడ్డులో మమ్మల్ని కిడ్నాప్ చేశారు. నంబరు లేని వాహనంలో వచ్చిన పోలీసులు నా భర్తను, నన్నూ బలవంతంగా ఎక్కించుకుని తీసుకుపోయారు. అడ్డుకునేందుకు యత్నించిన మా కొడుకు, మనవడిని తీవ్రంగా కొట్టారు. నాకు, నా భర్తకు తుపాకి గురిపెట్టి అరిస్తే కాల్చేస్తామని బెదిరించారు. మా ఇద్దరు పిల్లల్ని కూడా చంపేస్తామన్నారు. రాజంపేట టౌన్ సీఐ నాగార్జున మమ్మల్ని నేరుగా మదనపల్లెకు తీసుకువెళ్లి ఓ గదిలో బంధించారు.

ఎన్‌కౌంటర్లో లేపేస్తాం

సీఐ నాగార్జున, ఓ మహిళా ఎస్సై, నలుగురు కానిస్టేబుళ్లు మమ్మల్ని తీవ్రంగా వేధించారు. మమ్మల్ని కులంపేరుతో బూతులు తిట్టారు. వేమన సతీశ్‌కు రూ.7 కోట్లు ఇవ్వలేదని చెప్పాలని, లేకపోతే ఇక్కడే చంపేసి ఆత్మహత్య చేసుకున్నట్టు కేసు రాస్తామని బెదిరించారు. అనంతరం సీఐ నాగార్జున తన దగ్గర ఉన్న ఓ ఫోన్ నుంచి డీఐజీ కోయా ప్రవీణ్‌కు ఫోన్ చేసి మాట్లాడమని నాకు ఇచ్చారు. అవతలి నుంచి డీఐజీ కోయా ప్రవీణ్ తనను పరిచయం చేసుకుని.. 'వేమన సతీశ్ నాకు వరుసకు తమ్ముడు అవుతాడు. అతను రూ.7 కోట్లు తీసుకున్న విషయాన్ని మీరు ముఖ్యమంత్రి కార్యాలయానికి ఫిర్యాదు చేస్తారా.. మీకు ఎంత ధైర్యం.. అలా ఫిర్యాదు చేసి బతకగలం అనుకుంటున్నారా.. మిమ్మల్ని ఇక్కడే ఎన్‌కౌంటర్ చేస్తే దిక్కూ మొక్కూ ఉండదు.. అయినా మీ ముఖాలకు రూ.7 కోట్లు ఉన్నాయా.. మీరు, మీ జాతి బెదిరిస్తే డబ్బులు తిరిగి వస్తాయనుకుంటున్నారా.. మాల లం.. అని అసభ్యంగా తిడుతూ బెదిరించారు. నిన్నూ, నీ మొగుడిని, మొత్తం కుటుంబాన్ని ఎన్‌కౌంటర్ చేసి అక్కడే పాతరేస్తాం అని హెచ్చరించారు.

మాల, మాదిగలకు రోడ్డెక్కడం అలవాటే

ఆ వెంటనే వేమన సతీశ్ మాతో ఫోన్లో మాట్లాడారు. చూశారా నా పవర్.. రాష్ట్రంలో మీరు కాదు కదా.. మిమ్మల్ని పుట్టించిన వాళ్లు కూడా నా నుంచి డబ్బులు వెనక్కి తీసుకోలేరు. రూ.50 లక్షలు ఇస్తాను తీసుకోండి.. అంతేగానీ సీఎం.. పీఎం.. అంటూ తిరిగితే ఆ డబ్బులు కూడా దొరకవు. మీ మాల, మాదిగ కులాల వారికి ఇలా రోడ్డు ఎక్కడం అలవాటే.. అంటూ చెప్పుకోలేని పరుష పదాలతో తీవ్రంగా దూషించారు. అనంతరం పోలీసులు మమ్మల్ని తీవ్రంగా కొట్టి, బెదిరించి మాతో బలవంతంగా వీడియో రికార్డింగ్ చేయించారు. వేమన సతీశ్‌కు మేము రూ.7 కోట్లు ఇవ్వలేదని మాతో అబద్ధపు వాంగ్మూలం ఇప్పించారు. పోలీసుల నుంచి మా ప్రాణాలకు ముప్పు ఉంది. మాకు భద్రత కల్పించాలని కోరుతున్నాం. మమ్మల్ని కిడ్నాప్ చేసి వేధించిన డీఐజీ కోయా ప్రవీణ్, సీఐ నాగార్జున, మహిళా ఎస్సై, నలుగురు కానిస్టేబుళ్లపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం.

చంద్రబాబు ఓ క్రెడిట్ చోర్

మూడు లక్షల ఇళ్లల్లో ఒక్కటైనా కట్టించావా బాబు?

- పేదల కోసం గజం స్థలం అయినా కొన్నావా?
- గత ప్రభుత్వ హయాంలోనే ఆ ఇళ్లన్నీ నిర్మాణం
- అందులో 1,40,010 ఇళ్లు అప్పట్లోనే దాదాపు పూర్తి
- శ్లాబ్ దశ వరకు మరో 87,380 ఇళ్ల నిర్మాణం
- వివిధ దశల్లో మిగిలిన 66,845 ఇళ్లు
- అయినా ఆ మూడు లక్షల ఇళ్లు ఆయనే కట్టినట్లు సీఎం బిల్డప్
- పచ్చి అబద్ధాలతో చంద్రబాబు కలరింగ్
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి ఫైర్

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వం ఆర్భాటంగా ప్రచారంచేసి బుధవారం ప్రారంభించిన 3,00,092 ఇళ్లలో 1,40,010 ఇళ్లు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే దాదాపు పూర్తయ్యాయని.. శ్లాబ్ లెవెల్ వరకు 87,380 ఇళ్ల నిర్మాణం జరిగిందని.. మరో 66,845 ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి స్పష్టం చేశారు. కానీ, మొత్తం 3 లక్షల ఇళ్లు తామే కట్టినట్లు సీఎం చంద్రబాబు పచ్చి అబద్ధాలతో బిల్డప్ ఇస్తున్నారని.. అందుకే ఆయన క్రెడిట్ చోర్ అనేది మరోసారి తేటతెల్లం అయిందని ఎద్దేవా చేశారు. హైదరాబాద్‌లో గురువారం శ్రీకాంత్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ ఏమన్నారంటే..

చంద్రబాబు తీరు అత్యంత హేయం

'గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 71.8 వేల ఎకరాల్లో 31.19 లక్షల ఇళ్ల పట్టాలను అక్కచెల్లెమ్మలకు ఇచ్చి, వారి పేరు మీదే రిజిస్ట్రేషన్ చేయించింది. అంతేకాక, 21.75 లక్షల ఇళ్లు మంజూరు చేసి అందులో 9 లక్షలకు పైగా ఇళ్లను పూర్తిచేసింది. 2023 అక్టోబరు 12న, ఒకేసారి 7,43,396 గృహ ప్రవేశాలతో ఒక చరిత్ర సృష్టించింది. అయినా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏమీ చేయనట్లుగా, అన్నీ తానే చేసినట్లుగా పచ్చి అబద్ధాలు ప్రచారం చేస్తున్న చంద్రబాబు తీరు అత్యంత హేయం. 18 నెలల్లో 3 లక్షల 92 ఇళ్లను ఒకేరోజు లబ్ధిదారులకు అందజేసినట్లు ప్రచారం చేసుకున్న ఆయన.. అందుకోసం కనీసం గజం స్థలం కొని పేదలకు మంజూరుచేసి ఉంటే చూపాలి. అవేవీ చేయకుండా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పూర్తయిన ఇళ్లకు రంగులేసి, అప్పటికే ఆ ఇళ్లలో ఉంటున్న వారికి మళ్లీ తాళాలిచ్చి, అవన్నీ తామే కట్టించి, గృహ ప్రవేశాలు చేయిస్తున్నామని చంద్రబాబు నిస్సిగ్గుగా చెప్పుకుంటున్నారు. రాయచోటిలో బుధవారం ప్రారంభించిన ఇళ్లు మా ప్రభుత్వ హయాంలోనే పూర్తయ్యాయి. శవాలు పూడ్చడానికి కూడా పనికిరావని గేలిచేసిన పెద్దమనిషి ఇప్పుడు అవే స్థలాల్లో వైఎస్ జగన్ ప్రభుత్వం నిర్మించిన ఇళ్లను తన ఖాతాలో వేసుకోవడానికి నానా పాట్లు పడుతున్నాడు.

సిగ్గులేకుండా తండ్రీకొడుకుల మార్కెటింగ్

నాటి సీఎం వైఎస్ జగన్ అమలుచేసిన సంక్షేమ పథకాల రద్దు, కొన్నింటి పేరు మార్పు.. నాడు ఏర్పాటైన పరిశ్రమలను కూడా తామే తీసుకొచ్చినట్లు ప్రచారం చేసుకోవడం మినహా, ఈ 18 నెలల కాలంలో చంద్రబాబు ప్రభుత్వం చేసిందేమీ లేదు. అదానీ డేటా సెంటర్ (ఇప్పుడు గూగుల్ డేటా సెంటర్) ఏర్పాటుకు సంబంధించిన వైఎస్ జగన్ పాలనలోనే మొత్తం ప్రక్రియ పూర్తయింది. కానీ, తండ్రీకొడుకులు అదంతా వారి ఘనత అన్నట్లు మార్కెటింగ్ చేసుకున్నారు. అలాగే, రెన్యువబుల్ ఎనర్జీ ప్రాజెక్టులకు కూడా మా హయాంలోనే ఒప్పందాలు జరిగితే, అవి కూడా వారే తీసుకొచ్చినట్లు సిగ్గులేకుండా మాట్లాడుతున్నారు.

పెద్దిరెడ్డి భూములపై నిరాధార ఆరోపణలు

ఇక మాజీమంత్రి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని రాజకీయంగా ఎదుర్కోలేక అటవీ భూములు కాజేశాడంటూ టీడీపీ కూటమి నాయకులు ఆయన మీద పదేపదే బురదజల్లి వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నారు. ఏడాదిన్నరగా ఇలా ఆరోపణలు చేస్తూనే ఉన్నా, ఇప్పటివరకు ఏ ఒక్కదాన్నీ నిరూపించలేకపోయారు.

పులివెందుల మెడికల్ కళాశాల పనులు పూర్తయ్యాయి

- మదనపల్లె వైద్య కళాశాల పనులూ జరిగాయి
- సభలో అంగీకరించిన మంత్రి, ఎమ్మెల్యే

మదనపల్లె: మెడికల్ కళాశాలల నిర్మాణాలపై వాస్తవాలు బయటికొస్తున్నాయి. వైఎస్సార్‌సీపీ హయాంలో మెడికల్ కళాశాలల నిర్మాణాలే జరగలేదని ఇన్నాళ్లూ అసత్యాలు వల్లె వేస్తూ వచ్చిన మంత్రులు మెల్లగా మాట మారుస్తున్నారు. అబద్ధాలతో ప్రజలను ఏమార్చాలని చూసిన చంద్రబాబు సర్కారులోని మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రజల్లో చులకన అవుతామని భావించి జనం సాక్షిగా నిజాన్ని అంగీకరిస్తున్నారు. తాజాగా మదనపల్లె మార్కెట్ యార్డు నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో మెడికల్ కళాశాలల విషయంపై మంత్రి సత్య కుమార్, ఎమ్మెల్యే షాజహాన్ మాట్లాడారు. మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ పులివెందుల మెడికల్ కళాశాల భవనాలు పూర్తయ్యాయని సభ సాక్షిగా నిజాన్ని అంగీకరించారు. అలాగే మదనపల్లె కళాశాలకు సంబంధించి రూ.27 కోట్ల నిర్మాణ పనులు జరిగాయని పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్యే షాజహాన్ మాట్లాడుతూ మదనపల్లె మెడికల్ కళాశాలలో రూ.67 కోట్ల పనులు జరిగాయని, అందులో రూ.30 కోట్లు గత ప్రభుత్వంలో బిల్లులు చేసుకున్నారని చెప్పారు. కాగా, ఒకే వేదికపై నుంచి.. ఒకే విషయంపై మాట్లాడిన సదరు బీజేపీ మంత్రి, టీడీపీ ఎమ్మెల్యే మదనపల్లె మెడికల్ కళాశాల నిర్మాణ వ్యయంలో పరస్పర విరుద్ధమైన అంకెలు చెప్పడం గమనార్హం.

10 కలలకు రంగులు

పిల్లలూ! ఇవాళ బాలల దినోత్సవం. అంటే చాచా నెహ్రూ పుట్టిన రోజు. ఆయన మన దేశానికి మొదటి ప్రధాని. ఆయనకు చిన్నారులంటే ఎంతో ఇష్టం. అందుకే ఆయన జయంతి సందర్భంగా ఈ రోజు 'బాలల దినోత్సవం' జరుపుకుంటాం. 'చిల్డ్రన్స్ డే' సందర్భంగా చాచా నెహ్రూ మెచ్చే పది రకాల థీమ్స్‌తో మీకు నచ్చిన బొమ్మలు గీసి ఇంట్లో, స్కూల్లో పెడితే ఎలా ఉంటుంది? వాటిని మీకు నచ్చిన వారికి బహుమతిగా ఇస్తే చాలా బాగుంటుంది కదా? మరెందుకు ఆలస్యం? వెంటనే బొమ్మలు గీయడం మొదలుపెట్టండి. ఈ 10 థీమ్స్ మీకోసమే.

★ **చిన్నారులు–చాచా నెహ్రూ:** ఇవాళ్టి బాలల చేతుల్లోనే రేపటి దేశభవిత ఉంటుంది. అందుకే చాచా నెహ్రూ బాలల గురించి ఆలోచించేవారు. తన ప్రతి నిర్ణయం రాబోయే తరాలపై ఎలాంటి ప్రభావం చూపుతోందో తెలుసుకునేవారు. అటువంటి చాచా నెహ్రూ ఇవాళ ఉంటే ఎలా ఉండేది? ఈ కాలం చిన్నారుల్ని చూసి ఆయన ఎలా మురిసిపోయేవారు? వారితో కలిసి ఎలా ఆడిపాడేవారు? ఇవన్నీ ఊహించుకొని ఓ చక్కని బొమ్మ గీయండి. మీరు గీసే ఆ బొమ్మ భవితకు మార్గదర్శకంగా మారి, అందరి మనసుల్లో నిలిచిపోతుంది.

★ **అందరికీ విద్య:** మీరందరూ చక్కగా బడికెళ్లి చదువుకుంటారు. ఎన్నో విషయాలు నేర్చుకుంటారు. ఆడుతూ పాడుతూ గడిపేస్తారు. మరి మీలాంటి చిన్నారులు చాలామంది బడికి దూరంగా ఉన్నారన్న విషయం తెలుసా? వారంతా రోజు కూలి చేసి పొట్టపోసుకుంటున్నారన్న సంగతి తెలుసా? అలాంటి వారి బాధల్ని మీరు మీ చిత్రాల్లో చూపండి. వారిని చదువుకు చేరువ చేసే మార్గాలు ఆలోచించమనేలా మెసేజ్ ఇవ్వండి.

★ **పర్యావరణం ముఖ్యం:** పచ్చని చెట్లు, చెంగు చెంగున గెంతే సాధుజంతువులు, సెలయేళ్లు, జలపాతాలు... ఇవన్నీ మీకు ఇష్టం కదా? వాటిని రంగుల్లో చిత్రించడం మీకెంతో సరదా కదా? అయితే అనేక కారణాలతో పర్యావరణం ప్రమాదంలో ఉంది. కాలుష్యం కోరల్లో పడి నలిగిపోతోంది. దీనివల్ల జనం అనేక సమస్యలతో బాధపడుతున్నారు. రానురాను పరిస్థితులు మరింత దారుణమవుతాయి. వాటికి అడ్డుకట్ట వేయడం మీ బాధ్యత కూడా. పర్యావరణాన్ని కాపాడుకుందామనే సందేశంతో బొమ్మ గీసి పెట్టండి.

★ **టెక్నాలజీ– మంచీచెడూ:** ప్రస్తుతం అందరికీ టెక్నాలజీ చేరువయ్యింది. ఏఐ రాకతో సరికొత్త టెక్నాలజీకి ద్వారాలు తెరుచుకున్నాయి. ఈ నేపథ్యంలో వాటి వాడకంపై అందరికీ అవగాహన కావాలి. ఆ టెక్నాలజీని చెడు కోసం కాకుండా మంచి పనుల కోసం వాడేలా మీరు చిత్రాల ద్వారా సందేశం ఇవ్వండి.

★ **భిన్నత్వంలో ఏకత్వం:** మన దేశం అనేక సంస్కృతులకు, సంప్రదాయాలకు ఆలవాలం. ఒక్కోచోట ఒక్కో భాష, ఒక్కో పద్ధతి... అయినా అందరం ఒకే దేశంగా కలిసి ఉంటున్నాం. దీన్నే 'భిన్నత్వంలో ఏకత్వం' అంటారు. వివిధ రాష్ట్రాల సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా చిత్రాలు గీయండి. అన్నీ కలిసిన భారతదేశాన్ని చూపించండి.

★ **కలలు కనండి..సాధించండి:** 'కలలు కనండి.. సాధించండి' అన్నారు మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం. మీకూ ఎన్నో కలలు, ఆశలు ఉంటాయి. పెద్దయ్యాక మీరేం అవ్వాలనుకుంటున్నారో ఆలోచించి, ఇప్పుడే ఓ చిత్రం గీయండి. అందులో మీరెలా ఉండబోతున్నారో ఊహించుకోండి. అది మీకు స్ఫూర్తిని ఇస్తుంది.

★ **ఆనందాల హరివిల్లు** చిన్నారుల ఆనందమే కుటుంబం ఆనందం కదా? మీరు ఆనందంగా ఉండేందుకు చేసే పనులేమిటి? ఆడుకోవడం, సైకిల్ తొక్కడం, టీవీ చూడటం, పాటలు వినడం.. ఇలా అనేక పనులు ఉంటాయి. వాటన్నింటినీ కలిపి బొమ్మలుగా గీయండి. వాటిని చూసినప్పుడల్లా మీకు ఆనందాన్ని అందిస్తాయి.

★ **బాలల హక్కులు** మీది ఈ దేశం. అందరికీ ఉన్నట్టే, ఈ దేశంలో మీకూ హక్కులు ఉన్నాయి. ఆ హక్కులకు భంగం కలిగించే అధికారం ఎవరికీ లేదు. విద్య, వైద్యం, చదువు, ఆహ్లాదకర వాతావరణం.. ఇవన్నీ మీకు దక్కాల్సిన హక్కులు. వాటి గురించి తెలుసుకొని, అవే బొమ్మలుగా గీయండి. వాటి గురించి ఇతరులకు తెలియజెప్పండి.

★ **అంతరిక్ష వికాసం:** మన దేశం అంతరిక్ష ప్రయోగాల్లో ముందంజలో ఉంది. మంగళయాన్, చంద్రయాన్... అలాగే బాహుబలి శాటిలైట్... ఇలా మనం గొప్పగా ప్రగతి సాధిస్తున్నాం. ఇస్రోలో మన సైంటిస్ట్‌లు ఎన్నో ఘనతలు సాధిస్తున్నారు. అంతరిక్ష పరిశోధనలో మన దేశ వికాసం ఎలా ఉందో బొమ్మల్లో చూపి క్లాస్‌రూమ్‌లో డిస్‌ప్లే చేయండి.

★ **భావిభారత్:** మరో 20 ఏళ్లలో భారతదేశాన్ని ఎలా చూడాలనుకుంటున్నారు? భారత్‌లో ఎలాంటి మార్పులు వస్తాయని మీరు ఊహిస్తున్నారు? ఎలాంటి మార్పులు వస్తే బాగుంటుందని మీరు భావిస్తున్నారు? ఇవన్నీ ఆలోచించి బొమ్మలు గీయండి. వాటిని అందరికీ చూపించండి. భావిభారత్‌ను మీ చిత్రాల్లో చూడటం అందరికీ ముచ్చటగా ఉంటుంది.

నేడు బాలల దినోత్సవం సందర్భంగా ఇటీవల కాలంలో బాగా పాపులర్ అయిన కొందరు బాలతారల ఇంటర్వ్యూలు. సిక్స్ ఇయర్స్ ఏజ్‌లో బాలనటుడిగా కెరీర్ ప్రారంభించి, సిక్స్‌టీన్‌లోకి అడుగు పెట్టి, యువ హీరో కావడానికి రెడీగా ఉన్న ర్యాన్ జాయ్‌తో మాటామంతీ!

చిన్నప్పటి మహేశ్‌ని!

ఆరేళ్ల వయసులోనే బాల నటుడిగా కెరీర్ స్టార్ చేసి, ఇప్పుడు స్వీట్ సిక్స్‌టీన్‌లో ఉన్నాడు ర్యాన్. కొంచెం మహేశ్ బాబు పోలికలతో కనిపించే ర్యాన్ చిన్నప్పటి మహేశ్‌గా రెండు సినిమాల్లో నటించాడు. ఆ విశేషాలతో పాటు మరిన్ని విశేషాలు ఈ విధంగా పంచుకున్నాడు ర్యాన్ జాయ్.

★ మా నాన్నగారి వృత్తి రీత్యా మేం చిన్నప్పుడు ముంబైలో ఉండేవాళ్లం. నేను అక్కడే పుట్టాను. నాకు సిక్స్ ఇయర్స్ అప్పుడు మా అమ్మ నన్ను ఆడిషన్స్‌కి తీసుకెళ్లేవారు. ఆ క్యారెక్టర్లకు కావల్సిన ఏజ్ లేదని సెలక్ట్ చేసేవాళ్లు కాదు. ఫైనల్లీ 'హైదరాబాద్ లవ్‌స్టోరీ'లో చాన్స్ వచ్చింది. తెలుగులో నా కెరీర్ ఆ సినిమాతో మొదలై, ఈ మధ్య చేసిన 'జయమ్మ పంచాయతీ' వరకూ సక్సెస్‌ఫుల్‌గా సాగుతోంది.

★ నా ఫీచర్స్ మహేశ్ సార్‌కి దగ్గరగా ఉండటంవల్లే 'భరత్ అనే నేను', 'మహర్షి' చిత్రాల్లో చిన్నప్పటి మహేశ్‌బాబుగా యాక్ట్ చేసే చాన్స్ వచ్చింది. అయితే మహేశ్ సార్‌తో నా కాంబినేషన్ సీన్స్ ఉండవు కాబట్టి, ఆయన్ను కలవలేదు. ఒకే ఒక్కసారి 'మహర్షి' సెట్స్‌లో ఆయన ఉన్నప్పుడు ఆ దగ్గర్లోనే నేను ఉన్నాను. ఫొటో కావాలని అడిగితే, అప్పుడు ఎమోషనల్ సీన్స్ చేస్తున్నారు. ఆయన కళ్లనిండా నీళ్లు ఉన్నాయి. కొంచెం ఆగమన్నారు. చాలా టైమ్ పట్టింది. ఇక వెళ్లిపోతుంటే, ఆయనే పిలిచి ఫొటో దిగే చాన్స్ ఇచ్చారు.

★ ఇప్పటివరకూ చైల్డ్ ఆర్టిస్ట్‌గా 20కి పైగా సినిమాలు చేశాను. వాటిలో 'నేనే రాజు నేనే మంత్రి', 'నేల టికెట్టు' వంటి సినిమాలు ఉన్నాయి. ప్రస్తుతం 'అల్లరి' నరేశ్ గారు హీరోగా చేస్తున్న ఒక సినిమాలో లెంగ్తీ రోల్ చేస్తున్నాను. ఇప్పుడు నా ఏజ్ 16 కాబట్టి... అటు చైల్డ్ ఆర్టిస్ట్‌గా చేయలేను... ఇటు నా వయసున్న క్యారెక్టర్లు తక్కువ ఉంటాయి. సో... కొంచెం గ్యాప్ వచ్చే అవకాశం ఉంది.

★ నేను హీరో అవాలనుకుంటున్నాను కాబట్టి... బాడీ బిల్డింగ్, డ్యాన్స్, ఫైట్స్ వంటి వాటి మీద ఫోకస్ చేయాలనుకుంటున్నాను. చిన్నప్పుడు కరాటే నేర్చుకున్నాను. అలాగే థియేటర్ క్లాసెస్ తీసుకుందామనుకుంటున్నాను. హీరో అనిపించుకోవడానికి ఏమేం కావాలో అన్నీ నేర్చుకుంటాను. నాకు ఏదైనా బిజినెస్ చేయాలని కూడా ఉంది. మెయిన్ టార్గెట్ హీరో అయినప్పటికీ ఫ్యూచర్‌లో బిజినెస్ మీద కూడా ఫోకస్ పెడతాను.

★ ఒక కంప్లీట్ యాక్టర్‌గా పేరు తెచ్చుకోవాలన్నదే నా లక్ష్యం. ఆమిర్ ఖాన్‌లా అన్నమాట. ఆయన చేసే సినిమాలు ఒకదానికి ఒకటి పోలిక ఉండవు. వెరైటీగా ఉంటూ ట్రూగా ఉంటాయి. అలా నిజాయతీకి దగ్గరగా ఉండే సినిమాలు చేయాలనుకుంటున్నాను.

సినిమా... నాటిక

'ఒక్క క్షణం, కేజీఎఫ్ 2, తండేల్, కింగ్‌డమ్, కిష్కింధపురి, లవ్‌స్టోరీ, సరిలేరు నీకెవ్వరు'.. వంటి మూవీస్‌తో గుర్తింపు తెచ్చుకున్న భానుప్రకాశ్ చెప్పిన విశేషాలు.

★ అన్నమయ్య జిల్లా సోమల మండలం నెల్లిమంద గ్రామం ఎగువపల్లి మా ఊరు. మా నాన్న సురేశ్ అమసగారు. చిన్నప్పుడే మా తాతయ్య హైదరాబాద్‌కి వచ్చేశారు. మా నాన్న ఇప్పుడు ఇంటీరియర్ డిజైన్ కాంట్రాక్టర్‌గా చేస్తున్నారు. మా నాన్నకి డైరెక్టర్ కావాలని లక్ష్యం. అయితే ఎంత ప్రయత్నించినా కుదరకపోవడంతో నిర్మాతగా సుమారు 30కి పైగా షార్ట్ ఫిల్మ్స్ నిర్మించారు నాన్న. అలా మా నాన్న నిర్మిస్తున్న 'నీ కొరకు నేను వేచి ఉంటాను' షార్ట్ ఫిల్మ్‌లో ఒక పాత్రకి ఓ అబ్బాయి కావాల్సి వచ్చింది. ఎవరూ సెట్ కాలేదు.. 'నువ్వు చేస్తావా? అని నాన్న అడగడంతో చేశాను. అప్పటి నుంచి షార్ట్ ఫిల్మ్స్ చేశాను. అల్లు శిరీష్ సార్ హీరోగా నటించిన 'ఒక్క క్షణం' (2017) బాల నటుడిగా నా ఫస్ట్ మూవీ.

★ నేను హైదరాబాద్‌లో పుట్టి, పెరిగాను. ప్రస్తుతం 8వ తరగతి చదువుతున్నాను. షూటింగ్స్ ఉన్నప్పుడు నేను సెట్స్‌కి బుక్స్ తీసుకెళతాను. ఆ రోజు జరిగిన క్లాస్ నోట్స్‌ని నా ఫ్రెండ్స్‌ని అడిగి, షూటింగ్ గ్యాప్‌లో రాసుకుంటాను. చాలా సందర్భాల్లో ఒకే సమయంలో ఇటు ఎగ్జామ్స్, అటు షూటింగ్స్ వచ్చాయి. అయితే షూటింగ్స్ షెడ్యూల్ సడెన్‌గా ఫిక్స్ అవుతుంటాయి కాబట్టి వెళ్లక తప్పదు. ఆ సమయంలో ఎఫ్ఏ 1, ఎఫ్ఏ 2 వంటి పరీక్షలుంటే టీచర్స్ నా కోసం మళ్లీ కండక్ట్ చేస్తారు.

★ నేను చైల్డ్ ఆర్టిస్ట్‌గా ఎంత తోపు, తురుం అయినా కానీ ఫ్రెండ్స్ వద్ద నేను జస్ట్ భానుప్రకాశ్ అంతే... నేను నటించిన ఏదైనా సినిమా చూసినప్పుడు నా నటన గురించి టీచర్లు, ఫ్రెండ్స్ మాట్లాడతారు. వాళ్లందరికీ నేను నటించిన ఓ మంచి సినిమా చూపించాలని కోరిక. మా బంధువులు నేను నటించిన సినిమా చూస్తున్నప్పుడు 'హే.. భాను వచ్చాడు...' అంటూ బాగా ఎగ్జయిట్ అవుతారు.

★ ప్రస్తుత పరిస్థితుల్లో నాటకాలు అంతరించిపోతున్నాయి. వాటికి ఆదరణ దక్కడం లేదు. నేను 'అమ్మ చెక్కిన బొమ్మ' అనే నాటికలో నటించాను. ఈ ఏడాది మార్చి 28న తొలి ప్రదర్శన ఇచ్చాను. ఇప్పటివరకూ పద్దెనిమది ప్రదర్శనలు ఇచ్చాను. ఆ నాటిక ఎక్కడ వేసినా శశి అనే నా పాత్రకు నాకు బెస్ట్ యాక్టర్ అవార్డు వస్తోంది. సినిమా పుట్టకముందు నుంచి నాటకరంగం ఉంది. ఈ రంగంలో ఇప్పటి వరకూ ఉన్న నాలాంటి చైల్డ్ ఆర్టిస్ట్స్‌కి బెస్ట్ చైల్డ్ ఆర్టిస్ట్ అవార్డు ఇచ్చారు కానీ, బెస్ట్ యాక్టర్ అవార్డు ఇవ్వలేదు. కానీ 'అమ్మ చెక్కిన బొమ్మ' నాటకం ఎక్కడ ప్రదర్శించినా ఉత్తమ నటుడిగా నాకు అవార్డు వస్తుండటం చాలా సంతోషంగా ఉంది. తెలుగు రాష్ట్రాల్లోనే కాదు.. హిందీలో, గుజరాతీలోనూ 'అమ్మ చెక్కిన బొమ్మ' నాటిక వేశాం.

సుద్దపూసని కాదు

''హ్యాష్‌టాగ్ 90స్' వెబ్ సిరీస్‌లో లాగా నేను చదువులో సుద్దపూసని కాదు. నాకెప్పుడూ 90కి పైగా మార్కులు వస్తుంటాయి. నాకు పరీక్షలు ఉన్నప్పుడు ఏవైనా షూటింగ్స్ ఉంటే అమ్మ ఒప్పుకోదు. ఎందుకంటే ఫస్ట్ చదువుకే ప్రియారిటీ.. ఆ తర్వాతే ఏదైనా. అందుకే ఏ పరీక్షనూ ఇప్పటివరకు మిస్ అవలేదు'' అని రోహన్ రాయ్ తెలిపాడు. 'వినయ విధేయరామ, రాజుగారి గది 2, రంగుల రాట్నం, మిస్టర్ మజ్ను, చెక్, సూపర్ మచ్చి, గుడ్ లక్ సఖి..' వంటి పలు సినిమాలతో పాటు సీరియల్స్‌లో, 'హ్యాష్ టాగ్ 90స్' వెబ్ సిరీస్‌తో ప్రేక్షకులను అలరించిన రోహన్ రాయ్ చెప్పిన విశేషాలు.

మా నాన్న సుబ్బారాయుడుగారు (చీరాల) కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి. ప్రస్తుతం బెంగళూరులో పని చేస్తున్నారు. అమ్మ రాధా మాధవి బేసికల్‌గా నా మేనేజర్ కూడా. నా కోసం తన పని వదులుకుంది. నా డేట్స్ చూసుకోవడంతో పాటు షూటింగ్స్‌కి నా వెంట వస్తుంటుంది.

★ చిన్నప్పుడు ఇంట్లో టీవీ బాగా చూసేవాణ్ణి. నా వయస్సు ఐదేళ్లున్నప్పుడే ఎవరైనా మా ఇంటికి వచ్చి వెళ్లాక వాళ్లని ఇమిటేట్ చేసేవాణ్ణి. వాళ్లు కూర్చునే, నడిచే విధానాన్ని కూడా. అప్పుడు నాకు, మా కుటుంబ సభ్యులకు అర్థమైంది నాకు నటన అంటే ఇష్టం అని. టీవీలో స్క్రోలింగ్ చూసి 'డ్రామా జూనియర్స్' ఆడిషన్స్‌కి నన్ను తీసుకెళ్లింది అమ్మ. అందులో నేనే ఫస్ట్ కంటెస్టెంట్. సీజన్ 1, సీజన్ 2, సీజన్ 4 చేశాను. 'డ్రామా జూనియర్స్'లో నా నటన చూసి డైరెక్టర్ బోయపాటి శ్రీనుగారు ఆడిషన్ చేసి, 'వినయ విధేయ రామ' సినిమాకి అవకాశం ఇచ్చారు. ఆ తర్వాత ఓంకార్‌గారు 'రాజుగారి గది 2'లో చాన్స్ ఇచ్చారు. అప్పటి నుంచి నా ప్రయాణం కొనసాగుతోంది.

★ హీరోలు నానీగారిని, నవీన్ పొలిశెట్టిగారిని చూసినప్పుడు నేను కూడా వారిలా కావాలనిపించేది. తెరపై వాళ్లు నటిస్తున్నట్లు ఉండదు... వారిద్దరూ నేచురల్ యాక్టర్స్. కథ, పాత్రల్ని ఎంపిక చేసుకునే విధానంలో వాళ్లిద్దర్నీ స్ఫూర్తిగా తీసుకుంటూ ఉంటాను. నానీగారు హీరో కాదు.. ఆర్టిస్ట్. కథ నచ్చితే ఆయన ఏదైనా చేయగలరు.

★ నా జీవితంలో మంచి బ్రేక్ ఇచ్చింది మాత్రం 'హ్యాష్‌టాగ్ 90స్' వెబ్ సిరీస్. దాని తర్వాత వెంట వెంటనే సినిమాలు రావడం, మంచి పాత్రలు ఎంచుకుని చేయడం చాలా సంతోషంగా ఉంది. తిరువీర్‌గారు హీరోగా రాహుల్ శ్రీనివాస్‌గారి దర్శకత్వంలో తెరకెక్కిన 'ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో' ఈ నెల 7న విడుదలైంది. ఈ చిత్రంలో నేను చేసిన రాము పాత్రకి చాలా మంచి స్పందన వచ్చింది. ప్రస్తుతం శివాజీగారితో 'సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసని' అనే సినిమా చేశాను. త్వరలో విడుదల కానుంది.

★ షూటింగ్ ఉన్నప్పుడు క్లాసులు మిస్ అవుతాను. నైట్ లేదా షూటింగ్ గ్యాప్‌లో చదువుకోవడం, రాసుకోవడం చేస్తుంటాను. యూట్యూబ్, గూగుల్ తల్లి కూడా ఉంది. వాటి నుంచి కూడా నేర్చుకుంటూ ఉంటాను. రాత్రిళ్లు మేలుకుని నోట్స్ రాసుకుంటాను. ఈ విషయంలో మా ఫ్రెండ్స్, టీచర్స్ నాకు బాగా సపోర్ట్ చేస్తారు.

పేరెంట్స్‌కి గిఫ్ట్స్

''భవిష్యత్‌లో నేను ఒక మంచి ఆర్టిస్టును అవ్వాలనుకుంటున్నాను. ప్రేక్షకులు గుర్తుపెట్టుకునే రోల్స్ చేయాలని ఆసక్తిగా ఎదురు చూస్తున్నాను. సినిమాలు, వెబ్ సిరీస్, టీవీ సీరియల్స్‌లో యాక్ట్ చేస్తున్నాను. యాడ్స్ కూడా చేస్తున్నాను. వేటికవే డిఫరెంట్ ఎక్స్‌పీరియన్స్'' అని చెప్పాడు ఉజ్వల్ తేజ్. 'భైరవం, ఆయ్' వంటి సక్సెస్‌ఫుల్ సినిమాలతో పాటు 'గాలివాన, పరంపర' వంటి వెబ్ సిరీస్‌లోనూ మెరిశాడు ఉజ్వల్ తేజ్. 'నిండు నూరేళ్ళ సావాసం', 'పాపే మా జీవనజ్యోతి' వంటి సీరియల్స్‌తో బిజీగా ఉంటున్న ఉజ్వల్ పంచుకున్న కొన్ని విషయాలు...

★ మా స్వస్థలం కర్నూలు. ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉంటున్నాం. 8వ క్లాస్ చదువుతున్నాను. నాకు చిన్నప్పట్నుంచి యాక్టింగ్, డ్యాన్స్ ఇష్టం. వాటిలో నాకున్న స్కిల్‌ని మా పేరెంట్స్ గమనించి, డ్యాన్స్ స్కూల్‌లో జాయిన్ చేయించారు. అక్కడ మా పేరెంట్స్ ఫ్రెండ్ ఒకరి సలహాతో జూనియర్ మోడల్ ఇంటర్నేషనల్ కాంటెస్ట్‌లో పోటీ చేశాను. తమిళనాడులో తెలంగాణ స్టేట్‌ను, దుబాయ్‌లో ఇండియానూ రిప్రజెంట్ చేసి, విజేతగా నిలిచాను.

★ నా తొలి సినిమా పేరు 'నా సినిమా ఆగిపోయింది'. ఈ చిత్రంలో యాక్ట్ చేసేప్పుడు నాకు సరిగ్గా యాక్టింగ్ రాదు. కానీ ఆ సినిమా డైరెక్టర్ ప్రోత్సాహంతో బాగా నటించగలిగాను. ఈ సినిమా త్వరలోనే విడుదలవుతుంది. దీనికన్నా ముందు నేను యానీ మాస్టర్‌తో ఓ యాడ్ చేశాను.★ ఒక వైపు యాక్టింగ్... మరో వైపు స్టడీస్... ఈ రెంటినీ ఎలా బ్యాలన్స్ చేస్తున్నానంటే.. షూటింగ్ స్పాట్‌కి బుక్స్ తీసుకు వెళ్తాను. షూటింగ్‌లో నాకు ఖాళీ దొరికినప్పుడల్లా మా అమ్మగారు నా చేత చదివిస్తుంటారు. నేను ఏవైనా క్లాసులు మిస్ అయితే నా టీచర్స్ నాకు రీ క్యాప్ చేస్తారు. నా ఫ్రెండ్స్ నోట్స్‌లు ఇస్తారు.

★ మా స్కూల్లో చిల్డ్రన్స్ డేని బాగా సెలబ్రేట్ చేసుకుంటాం. ఒక చిల్డ్రన్స్ డేకి మా స్కూల్‌లో ఓ ప్రోగ్రామ్ ప్లాన్ చేశారు. కానీ అదే రోజు నేను షూటింగ్‌లో పాల్గొనాలి... అయితే అనుకోకుండా నేను ఆ షూటింగ్ క్యాన్సిల్ అయ్యింది. ఇది తెలిసి మా ప్రిన్సిపాల్ మేడమ్ నన్ను పిలిపించి, అప్పటికప్పుడు నాతో డ్యాన్స్ చేయించారు. అది నాకో హ్యాపీ మూమెంట్. కొన్నిసార్లు నాకు షూటింగ్ ఉన్న రోజే ఎగ్జామ్స్ కూడా ఉండేవి. ఇలాంటి పరిస్థితుల్లో నేను సినిమా యూనిట్ దగ్గర అనుమతి తీసుకుని, ఎగ్జామ్స్ రాసేవాడిని. ఇలా కుదరకపోతే మా ప్రిన్సిపాల్ నాకు సపోర్ట్ చేస్తారు.★ నా తొలి సంపాదనతో మా అమ్మానాన్నలకు బహుమతులు ఇవ్వడం నాకెంతో సంతృప్తినిచ్చింది. నా మూవీస్ 'బ్రిలియంట్ బాబు', 'స్మాల్ టౌన్ బాయ్స్' విడుదలకు సిద్ధమవుతున్నాయి.

అప్పులు తీర్చాను

'కిష్కింధపురి, పరాక్రమం' చిత్రాల్లో బాల నటుడిగా ప్రేక్షకులను మెప్పించాడు అర్షిత్. చిరంజీవి, నాగార్జునలను స్ఫూర్తిగా తీసుకుని, భవిష్యత్‌లో పెద్ద నటుడు కావాలనుకుంటున్న అర్షిత్ పంచుకున్న కొన్ని విషయాలు....

★ స్వస్థలం గోదావరి ఖని. హైదరాబాద్‌లో ఉంటున్నాం. ప్రస్తుతం 8వ తరగతి చదువుతున్నాను. నాకు నటన అంటే ఆసక్తి కలగడానికి మా అక్క కారణం. అలాగే 'పిల్లలు పిడుగులు' టీవీ షో నుండి 'డ్రామా జూనియర్స్' వరకు... నేను ఇండస్ట్రీలోకి రావడానికి చాలామంది స్ఫూర్తిగా నిలిచారు. షూటింగ్ సమయంలో ఎగ్జామ్స్ ఉంటే ముందుగా షూటింగ్స్‌కే ప్రిఫరెన్స్ ఇస్తాను. నేను పరీక్షలకు హాజరు కాకపోయినా వాళ్ళు నాకు విడిగా ఎగ్జామ్స్ నిర్వహిస్తారు. నా క్లాస్‌లో నేనే టాపర్‌ని. షూటింగ్ గ్యాప్‌లో చదువుకుంటాను. నా ట్విన్ సిస్టర్ స్టడీ సిలబస్‌లో నాకు సహాయం చేస్తుంది. ఇంట్లో కూడా అమ్మానాన్నలు నాకు చాలా సపోర్టివ్‌గా ఉంటారు.

★ సినిమాల్లో నటిస్తూ, సిల్వర్ స్క్రీన్‌పై కనిపించినంత మాత్రాన నన్ను క్లాస్‌లో ప్రత్యేకంగా ఏం చూడరు. క్లాస్‌లో అందరిలానే నేనూ ఓ సాధారణ అబ్బాయిని. అయితే మా బంధువులు నన్ను చూసి గర్వపడుతుంటారు. పెద్ద హీరోలతో పని చేయడం నాకు స్ఫూర్తినిస్తుంది. సెట్స్‌లో వారి కష్టాన్ని గమనిస్తుంటాను. వాళ్ల కష్టాన్ని చూసి, నేను చాలా నేర్చుకుంటుంటాను. హీరోలతో కలిసి పని చేయడాన్ని నా అదృష్టంగా భావిస్తున్నాను.

★ చైల్డ్ ఆర్టిస్టుగా నా మొదటి సినిమా 'సర్కిల్'. ఈ చిత్రంలో నటించినందుకు రూ. 1000 పారితోషికం ఇచ్చారు. నా తొలి సంపాదనను మా తల్లిదండ్రులకు ఇచ్చేశాను. అలాగే ఆంధ్రప్రదేశ్ అమెరికన్ అసోసియేషన్ వాళ్ళు ఓ షార్ట్ ఫిల్మ్ కాంటెస్ట్ నిర్వహించగా, నేను యాక్ట్ చేసిన 'పచ్చిపులుసు' షార్ట్ ఫిల్మ్‌కి, రూ. 15 లక్షల ప్రైజ్ మనీ బహుమతిగా లభించింది. ఆ తర్వాత మా అప్పులు కొన్ని తీర్చేశాను. 'కిష్కింధపురి' సినిమా తర్వాత నాకు మంచి గుర్తింపు లభిస్తోంది. నాతో సెల్ఫీలు తీసుకుంటున్నారు. ఒక మంచి యాక్టర్‌గా ప్రేక్షకుల చేత గుర్తింపు తెచ్చుకోవాలన్నదే నా లక్ష్యం.

డి.జి. భవాని
దేరంగుల జగన్‌మోహన్
ముసిమి శివాంజనేయులు

యాక్టింగ్... చారిటీ

బాల నటుడిగా 25కి పైగా సినిమాల్లో నటించాడు నాగచైతన్య వర్మ. 'అమీర్‌పేటలో, నారప్ప, నా సామిరంగా, జటాధర, పేకమేడలు, లగ్గం' వంటి పలు సినిమాలతో పాటు 'కానిస్టేబుల్ కనకం' వెబ్ సిరీస్‌తో తనకంటూ గుర్తింపు సొంతం చేసుకున్న నాగచైతన్య వర్మ తన ఫ్యూచర్ ప్లాన్స్‌ని ఇలా పంచుకున్నాడు...

★ మాది అన్నమయ్య జిల్లా రాయచోటి మండలం చమర్తివాండ్ల పల్లి. నటుడు కావాలనే నా ఆకాంక్షను మా అమ్మానాన్న వరలక్ష్మి దేవి, నాగార్జున రాజు ప్రోత్సహించారు. 'అమీర్‌పేటలో' సినిమాతో నటుడిగా నా జర్నీ మొదలైంది. ప్రస్తుతం ఎయిత్ క్లాస్ చదువుతున్నాను. షూటింగ్స్ ఉన్నప్పుడు స్కూల్‌కి సెలవు పెడతాను కదా... అప్పుడు ఫ్రెండ్స్‌ని అడిగి నోట్స్ రాసుకుంటాను. స్కూల్ వాళ్లు కూడా ఎంతో సపోర్ట్ చేస్తారు. నా ఫస్ట్ ప్రియారిటీ ఎగ్జామ్స్‌కే. ఎగ్జామ్స్‌లో నాకు 80 శాతంపైన మార్కులు వస్తుంటాయి. టాప్ 5 ర్యాంక్స్‌లో కచ్చితంగా నేను ఉంటాను.

★ నా సినిమాలు చూసినప్పుడు 'బాగా నటించావ్.. ఇలాగే ముందుకెళ్లు' అని టీచర్లు, నా స్నేహితులు చెబుతుంటారు.. ఈ ఆగస్టులో విడుదలైన 'కానిస్టేబుల్ కనకం' వెబ్ సిరీస్‌లో అవసరాల శ్రీనివాస్‌గారి చిన్నప్పటి పాత్రలో నెగటివ్ రోల్ చేశాను. నా నటన బాగుందని చాలా మంది అభినందించారు. ఈ నెల 7న విడుదలైన 'జటాధర' సినిమాలో హీరో సుధీర్ బాబు చిన్నప్పటి పాత్ర చేశాను. మంచి మూవీ చేశావని పొగిడారు.

★ నేను నటించడం మా బంధువులకు, ఇరుగు పొరుగు వాళ్లకి చాలా ఇష్టం. 'నువ్వు ఇంకా బాగా నటించి, మంచి స్థాయికి వెళ్లాలి' అని అంటుంటారు. నా సినిమా చూసి బాగా చేశావని చెబుతున్నప్పుడు సంతోషంగా ఉంటుంది. తెలుగు సినిమా వేదిక మా తెలుగు తల్లి, కళా వారధి సౌజన్యంతో 2023లో నిర్వహించిన ఉగాది పురస్కారాల్లో ఉత్తమ బాలనటుడిగా ఆర్. నారాయణమూర్తి సార్ చేతుల మీదుగా అవార్డు అందుకోవడం చాలా సంతోషాన్నిచ్చింది.

★ జూలై 28న నా పుట్టినరోజు సందర్భంగా కడపలోని బాలల అనాథాశ్రమానికి నా పారితోషికంలో నుంచి ప్రతి ఏడాదీ నగదు సాయం చేయడం నాకెంతో సంతృప్తినిస్తుంది.★ ప్రస్తుతం ప్రభాస్‌గారి 'ఫౌజీ'తోపాటు 'హే భగవాన్, యుఫోరియా, సహకుటుంబానాం, సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసని, బ్యాచ్ మేట్స్, అర్జునుడి గీతోపదేశం' సినిమాలు చేస్తున్నాను. ప్రేక్షకుల మనసుల్లో గుర్తుండిపోవాలనుకుంటున్నా.

● నృత్య ప్రతిభ

ఏడేళ్లు... మూడు గంటలు.. ఏడు రికార్డులు

కళ పట్ల ప్రేమ ఉంటే ఏ వయసు అయినా వండర్స్ సృష్టించవచ్చు అనడానికి నిదర్శనం శర్నీథా దత్త రచ్చ. హైదరాబాద్‌లోని అత్తాపూర్‌లో ఉంటున్న ఈ చిన్నారి వయసు ఏడేళ్లు. ఇటీవల రంగప్రవేశం (సోలో అరంగేట్రం)తో ఏకధాటిగా మూడు గంటల పాటు కూచిపూడి నృత్యం చేసిన అరుదైన గుర్తింపుతో పాటు ఏడు రికార్డులను సొంతం చేసుకుంది. అతి పిన్న వయస్కురాలైన కళాకారిణి గా శర్నీథ వార్తల్లో నిలిచింది.

శర్నీథా దత్త రచ్చ రెండవ తరగతి చదువుతోంది. రెండేళ్లక్రితం శాస్త్రీయ నృత్యంలో ఓనమాలు దిద్దిన శర్నీథ ఇటీవల సంక్లిష్టమైన నాట్య భంగిమలను, తిల్లానాలను అత్యద్భుతంగా ప్రదర్శించి ఎంతోమంది ప్రశంసలను అందుకుంది.

సాధనమున రికార్డులు... శర్నీథా నృత్యాన్ని వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఇంటర్నేషనల్, ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్, గోల్డెన్ స్టార్ బుక్ ఆఫ్ రికార్డ్స్, డైమండ్ బుక్ ఆఫ్ రికార్డ్స్, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్, విశ్వం బుక్ ఆఫ్ రికార్డ్స్, జీనియస్ బుక్ ఆఫ్ రికార్డ్స్.. చూసి శర్నీథ ప్రతిభను గుర్తించాయి. అసాధారణమైన ఈ ప్రతిభకు శారద కళాక్షేత్రం నుంచి 'నాట్యమయూరి' అవార్డును గురువు భావన పెదప్రోలు నుంచి అందుకున్నది.

అలసట ఎరగని తపన... శర్నీథా తల్లిదండ్రులు రచ్చ హరి వినోద్, నరీనా దేవి కూతురి మూడేళ్ల వయసు నుంచి శిక్షణ ఇప్పించడం మొదలుపెట్టారు. 'నృత్యం అంటే శర్నీథకు ప్రాణం. ప్రాక్టీస్ అంటే చాలు సాధన చేస్తూనే ఉంటుంది. నృత్యాంగేట్రం చేయడానికి ఎనిమిది నెలలు ప్రాక్టీస్ చేసింది. వారణాసి లో అసి ఘాట్, అయోధ్య రామమందిరం లోపల, చిదంబరం గర్భగుడి దగ్గర, బాసరలో... నృత్య ప్రదర్శన ఇచ్చింది. ఈ ఏడాది జూలైలో జరిగిన ఆల్ ఇండియా డ్యాన్స్ ఫెస్టివల్ సబ్ జూనియర్‌లో పాల్గొని, ఐదవ స్థానంలో నిలిచింది. శర్నీథ నృత్యసాధనలో చూపే భక్తి, శ్రద్ధ ప్రముఖ నృత్యకారులను కూడా మెప్పిస్తుంది. అభినయంలో చిన్న వయస్సులోనే చూపే ఆత్మవిశ్వాసం ప్రేక్షకులను సమ్మోహ పరుస్తుంది.

– నిర్మలారెడ్డి

బులియన్
(బంగారం 10 గ్రా.: వెండి కిలో)
నవంబర్ 13న ముగింపు రూ.లలో

	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	రాజమండ్రి	ప్రొద్దుటూరు	చెన్నై
బంగారం (24 క్యారెట్లు)	1,27,910	1,30,450	1,27,800	1,30,450	1,26,400	1,28,730
బంగారం (22 క్యారెట్లు)	1,17,210	1,17,150	1,17,150	1,20,660	1,16,290	1,18,000
వెండి	1,67,000	1,68,600	1,82,000	1,68,600	1,67,500	1,82,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

సాక్షి బిజినెస్
శుక్రవారం
14-11-2025

స్టాక్ మార్కెట్లు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు

సూచీ	మార్పు	ముగింపు
సెన్సెక్స్ ▲	12	84,479
నిఫ్టీ ▲	3	25,879

విదేశీ సూచీలు

సూచీ	విలువ		మార్పు
నాస్డాక్	23,000	▽	403
డోజోన్స్	47,837	▽	418
ఎఫ్టీఎస్ఈ 100	9,805	▽	106
డాక్స్	24,041	▽	340
షాంఘై	4,029	△	29
నికాయ్	51,282	△	219

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్బీఐ	88.25	89.27
£	బ్రిటన్ పౌండ్	ఎస్బీఐ	115.11	118.05
€	యూరో	ఎస్బీఐ	101.46	104.24
¥	జపాన్ యెన్ (100)	ఎస్బీఐ	46.00	58.25
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్బీఐ	55.78	59.65
S$	సింగపూర్ డాలర్	థామస్కుక్	65.85	69.55
SAR	సౌదీ రియాల్	థామస్కుక్	22.76	24.26
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్కుక్	23.25	24.51
¥	చైనా యువాన్	థామస్కుక్	11.62	13.47

పసిడి రూ. 3,000 జూమ్

- 10 గ్రా. ధర రూ. 1.30 లక్షలు
- వెండి రూ. 7,700 జంప్; కేజీ రూ. 1.69 లక్షలు

న్యూఢిల్లీ: డాలరు బలహీనత, అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో దేశీయంగా పసిడి ధరలు గురువారం భారీగా ఎగిశాయి. ఢిల్లీ బులియన్ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత గల బంగారం రేటు 10 గ్రాములకు రూ. 3,000 పెరిగింది. రూ. 1,30,900 పలికింది. అమెరికా ప్రభుత్వ షట్డౌన్ ముగియడం సైతం పసిడి ధరల పెరుగుదలకు దోహదపడిందని ట్రేడర్లు తెలిపారు. అటు కిలో వెండి ధర కూడా రూ. 7,700 ఎగిసి రూ. 1,69,000కి చేరింది. అంతర్జాతీయంగా స్పాట్ మార్కెట్లో ఔన్సు (31.1 గ్రాములు) పసిడి రేటు 41.19 డాలర్లు పెరిగి 4,236.84 డాలర్లకు చేరింది. అలాగే వెండి కూడా ఔన్సుకి 1.13 శాతం పెరిగి 53.86 డాలర్లు పలికింది. అటు అమెరికా ఫ్యూచర్స్ మార్కెట్లో బంగారం ఒక దశలో 4,249.69 డాలర్ల వద్ద, వెండి 54.39 డాలర్ల వద్ద ట్రేడయ్యాయి. డాలరు బలహీనంగా ఉండటంతోపాటు అమెరికాలో వడ్డీ రేట్లను మరింతగా తగ్గించవచ్చన్న అంచనాలతో బంగారం రేట్లు గణనీయంగా పెరిగినట్లు హెచ్డీఎఫ్సీ సెక్యూరిటీస్ సీనియర్ అనలిస్ట్ సౌమిల్ గాంధీ తెలిపారు. ఈ వారంలో వెండి పటిష్టంగా రికవర్ అయ్యి, 10% వరకు పెరిగిందని ఆయన చెప్పారు. వడ్డీ రేట్ల తగ్గింపు అంచనాలు, సరఫరాపరమైన ఆందోళనలు, పరిశ్రమలు..పెట్టుబడులకు సంబంధించి డిమాండ్, టెక్నికల్ అంశాలు ఇందుకు దోహదపడ్డాయని తెలిపారు. ఎకానమీకి, జాతీయ భద్రతకు ప్రధానమైన కీలక లోహాల జాబితాలో అమెరికా ప్రభుత్వం చేర్చడం సైతం వెండి పరుగులకు కారణమైంది.

నష్టాల్లో టాటా మోటార్స్ సీవీ

క్యూ2లో రూ. 867 కోట్లు

న్యూఢిల్లీ: వాణిజ్య వాహన రంగ దిగ్గజం టాటా మోటార్స్ కమర్షియల్ వెహికల్స్ (టీఎంసీవీ) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025–26) రెండో త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జూలై–సెప్టెంబర్(క్యూ2)లో లాభాలనువీడి రూ. 867 కోట్ల నికర నష్టం ప్రకటించింది. టాటా క్యాపిటల్లో పెట్టుబడుల ఫలితంగా నమోదైన రూ. 2,026 కోట్ల మార్క్ టు మార్కెట్ (ఎంటుఎం) నష్టాలు లాభాలను దెబ్బతీశాయి. గతేడాది(2024–25) ఇదే కాలంలో రూ. 498 కోట్ల నికర లాభం ఆర్జించింది. మొత్తం ఆదాయం మాత్రం రూ. 17,535 కోట్ల నుంచి రూ. 18,585 కోట్లకు బలపడింది. నిర్వహణ లాభం (ఇబిటా) రూ. 1,225 కోట్ల నుంచి రూ. 1,694 కోట్లకు ఎగసింది. జూలైలో ప్రతిపాదించిన ఐవెకో కొనుగోలు ప్రక్రియ ప్రణాళిక ప్రకారం ముందుకెళుతున్నట్లు టాటా గ్రూప్ ఆటో దిగ్గజం పేర్కొంది. వచ్చే(2026) ఏప్రిల్కల్లా కొనుగోలు పూర్తికాగలదని భావిస్తోంది. ఐవెకోను సొంతం చేసుకున్నాక ఆదాయం 24–25 బిలియన్ డాలర్లకు చేరగలదని అంచనా వేస్తోంది. కంపెనీ ఇటీవల ప్రయాణికుల వాహన విభాగాన్ని టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికల్స్(టీఎంపీవీ)గా విడదీయడంతోపాటు.. వాణిజ్య వాహన విభాగాన్ని టాటా మోటార్స్ లిమిటెడ్ (టీఎంసీవీ) పేరుతో లిస్ట్ చేసింది.

ఫలితాల నేపథ్యంలో టీఎంసీవీ షేరు బీఎస్ఈలో 2.3 శాతం క్షీణించి రూ. 320 వద్ద ముగిసింది.

25 నుంచి ఫార్మా ఎక్స్పో

- నోయిడాలో మూడు రోజుల పాటు నిర్వహణ
- 120 దేశాల నుంచి నిపుణులు, ఎగ్జిబిటర్లు, ఇన్వెస్టర్లు

న్యూఢిల్లీ: ఈ నెల 25 నుంచి గ్రేటర్ నోయిడాలో 18వ విడత అంతర్జాతీయ ఫార్మా సదస్సు సీపీహెచ్ఐ, పీఎంఈసీ ఇండియా 2025ని నిర్వహించనున్నారు. ఇన్ఫార్మా మార్కెట్స్ ఇన్ ఇండియా మూడు రోజుల పాటు నిర్వహించే ఈ ఎక్స్పోలో.. యాక్టివ్ ఫార్మా ఇంగ్రీడియంట్స్ (ఏపీఐ) విషయంలో స్వయం సమృద్ధి సాధించడం, డిజిటలైజేషన్, ఎగుమతులు మొదలైనవి ఇందులో ప్రధాన థీమ్లుగా ఉంటాయి. ఇటలీ, జర్మనీ, స్విట్జర్లాండ్, చైనా, దక్షిణ కొరియా తదితర 120 దేశాల నుంచి 50,000కు పైగా పరిశ్రమ నిపుణులు, 2,000 ఎగ్జిబిటర్లు, ఇన్వెస్టర్లు ఇందులో పాల్గొనున్నారు. దేశీ దిగ్గజాలు డాక్టర్ రెడ్డీస్ ల్యాబరేటరీస్, హెటిరో ల్యాబ్స్, అకుమ్స్ డ్రగ్స్, ఎంఎస్ఎన్ ల్యాబొరేటరీస్ మొదలైనవి ఈ జాబితాలో ఉన్నాయి. అంతర్జాతీయ ఫార్మాకు భారత్ కేంద్రంగా ఎదుగుతోందని ఇన్ఫార్మా మార్కెట్స్ ఇన్ ఇండియా ఎండీ యోగేష్ ముద్రాస్ తెలిపారు. దేశీ ఫార్మా పరిశ్రమ 2030 నాటికి 130 బిలియన్ డాలర్లకు, 2047 నాటికి 450 బిలియన్ డాలర్లకు వృద్ధి చెందుతుందనే అంచనాలు ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం కూడా ఫార్మాపై మరింతగా దృష్టి పెడుతోందని చెప్పారు.

ఆద్యంతం ఒడిదుడుకులు

స్వల్ప లాభాల ముగింపు

ముంబై: ట్రేడింగ్ ఆద్యంతం తీవ్ర ఒడిదుడుకులకు లోనైన స్టాక్ సూచీలు గురువారం స్వల్ప లాభాలతో గట్టెక్కాయి. విదేశీ ఇన్వెస్టర్ల విక్రయాలు, రూపాయి బలహీనత అంశాలు సెంటిమెంట్ను దెబ్బతీశాయి. ఫలితంగా సెన్సెక్స్ 12 పాయింట్లు పెరిగి 84,479 వద్ద స్థిరపడింది. నిఫ్టీ మూడు లాభపడి 25,879 వద్ద నిలిచింది. సూచీలకిది నాలుగోరోజూ లాభాల ముగింపు. ఆసియా మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు అందుకున్న సూచీలు ఉదయం లాభాలతో మొదలయ్యాయి. ద్రవ్యోల్బణం దిగిరావడంతో వడ్డీరేట్ల తగ్గింపు ఆశలు, అమెరికా సుంకాల ఎత్తివేతపై అంచనాలతో ప్రథమార్ధమంతా లాభాల్లోనే ట్రేడయ్యాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 452 పాయింట్లు పెరిగి 84,919 వద్ద, నిఫ్టీ 135 పాయింట్లు బలపడి 26,011 వద్ద గరిష్టాన్ని తాకాయి. అయితే బిహార్ ఎన్నికల ఫలితాల(నేడు) వెల్లడికి ముందు ఇన్వెస్టర్లు ద్వితీయార్ధంలో లాభాల స్వీకరణ పాల్పడ్డారు. దీంతో సూచీలు ఆరంభ లాభాలు కోల్పోయి ఫ్లాటుగా ముగిశాయి. ఫండింగ్ బిల్లుపై ట్రంప్ సంతకం చేయడంతో అమెరికా ప్రభుత్వ షట్డౌన్ అధికారింగా ముగియడంతో అంతర్జాతీయ మార్కెట్లు లాభాల్లో ట్రేడవుతున్నాయి.

- లిస్టింగ్ తర్వాత రెండో రోజూ 'గ్రో' షేరు ర్యాలీ కొనసాగింది. బీఎస్ఈలో 5.50% పెరిగి రూ.138 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 17% ఎగసి రూ.153.50 వద్ద గరిష్టాన్ని నమోదు చేసింది. లిస్టింగ్ రోజు 34% పెరిగిన ఈ షేరు రెండు ట్రేడింగ్ సెషన్లలో మొత్తంగా 39% లాభాలు పంచింది. కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.84,856 కోట్లకు చేరింది.
- విదేశీ ఇన్వెస్టర్లు వరుసగా నాలుగో రోజూ అమ్మకాలకు పాల్పడ్డారు. గురువారం రూ.384 కోట్ల విలువైన షేర్లను విక్రయించారు. మరోవైపు సంస్థాగత ఇన్వెస్టర్లు (డీఐఐలు) రూ.3092 కోట్ల ఈక్విటీలు కొనుగోలు చేశారు. ఈ ఏడాదిలో ఇప్పటివరకు ఎఫ్ఐఐలు రూ.2.49 లక్షల కోట్ల షేర్లను విక్రయించగా, డీఐఐలు రూ.6.61 లక్షల కోట్లను కొన్నారు.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్లో ..	
భారత ఉత్పత్తులకు మరింత పోటీతత్వం: మోదీ	ప్రీమియం ఎగ్జిక్యూటివ్ ఫీచర్లతో టాటా కర్వ్

యాడ్వెంట్ హోటల్స్ లిస్టింగ్ గుడ్

310 వద్ద ప్రారంభమై రూ. 325కు చేరిక

రియల్టీ రంగ సంస్థ వేలర్ ఎస్టేట్(గతంలో డీబీ రియల్టీ) నుంచి ప్రత్యేక కంపెనీగా విడివడిన యాడ్వెంట్ హోటల్స్ ఇంటర్నేషనల్ 17 శాతం ప్రీమియంతో లిస్టయ్యింది. డిస్కవరీ(జారీ) ధర రూ. 265కాగా.. బీఎస్ఈలో రూ. 310 వద్ద ట్రేడింగ్ ప్రారంభమైంది.

చివరికి 5 శాతం అప్పర్ సర్క్యూట్ను తాకి రూ. 325 వద్ద నిలిచింది. ఎన్ఎస్ఈలోనూ రూ. 313 వద్ద లిస్టయ్యి రూ. 329 వద్ద ముగిసింది. ప్రస్తుతం యాడ్వెంట్ గోవాలో 313 గదుల గ్రాండ్ హయత్తోపాటు.. ముంబైలో 171 గదులతో హిల్టన్ హోటల్ను నిర్వహిస్తోంది. గోవాలో మరో 113 గదులను జత చేసుకోనుంది. అంతేకాకుండా ఒప్పందాలు, భాగస్వామ్యాల ద్వారా పోర్ట్ఫోలియోను విస్తరిస్తోంది. ఈ బాటలో రియల్టీ దిగ్గజం ప్రెస్టీజ్ గ్రూప్తో ఒప్పందం ద్వారా ఢిల్లీలో సెయింట్ రీజస్, మారియట్ మార్క్విస్ బ్రాండ్లతో మరో 2 హోటళ్లను అభివృద్ధి చేస్తోంది.

ఇక మహీంద్రా ఇన్సూరెన్స్..!

- మాన్యులైఫ్తో కలిసి జీవిత బీమా జాయింట్ వెంచర్
- మొత్తం రూ. 7,200 కోట్ల పెట్టుబడి

న్యూఢిల్లీ: వ్యాపార దిగ్గజం మహీంద్రా అండ్ మహీంద్రా (ఎంఅండ్ఎం) తాజాగా బీమా రంగంలోకి ప్రవేశిస్తున్నట్లు ప్రకటించింది. జీవిత బీమాకు సంబంధించి కెనడాకు చెందిన మాన్యులైఫ్తో కలిసి జాయింట్ వెంచర్ ఏర్పాటు చేసేందుకు ఒప్పందం కుదుర్చుకున్నట్లు వెల్లడించింది. ఇందులో రెండు సంస్థలకు చెరి 50 శాతం వాటాలు ఉంటాయి. దానికి తగ్గట్లుగా చెరి రూ. 3,600 కోట్లు చొప్పున మొత్తం రూ. 7,200 కోట్లు ఇన్వెస్ట్ చేయనున్నాయి. ప్రాథమికంగా తొలి అయిదేళ్లలో రెండు సంస్థలు చెరో రూ. 1,250 కోట్లు పెట్టుబడి పెట్టనున్నాయి. రాబోయే పదేళ్లలో రూ. 18,000 కోట్లు–రూ. 30,000 కోట్ల వేల్యుయేషన్ స్థాయికి వ్యాపారాన్ని విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు మహీంద్రా గ్రూప్ సీఈవో అనీష్ షా తెలిపారు. మహీంద్రా ఫైనాన్స్ నుంచి ఎంఅండ్ఎంకి అందే డివిడెండ్ను కొత్త వ్యాపారంలోకి ఇన్వెస్ట్ చేయనున్నట్లు చెప్పారు. దేశీయంగా ఇప్పటికీ బీమా కవరేజీ అత్యంత తక్కువగా ఉన్న నేపథ్యంలో ఈ పరిశ్రమ వృద్ధికి గణనీయంగా అవకాశాలు ఉన్నట్లు షా తెలిపారు. అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న బీమా పరిశ్రమల్లో ఒకటైన భారత్ మార్కెట్లో ఎంట్రీ తమకు కీలక మైలురాయని మాన్యులైఫ్ ప్రెసిడెంట్ ఫిల్ విదరింగ్టన్ తెలిపారు.

మూడు నెలల్లో లైసెన్సుకు దరఖాస్తు..

వచ్చే రెండు, మూడు నెలల్లో లైసెన్సు కోసం బీమా రంగ నియంత్రణ సంస్థకు దరఖాస్తు చేసుకోనున్నట్లు షా చెప్పారు. జాయింట్ వెంచర్ కార్యకలాపాలు ప్రారంభం కావడానికి 15 నుంచి 18 నెలల సమయం పడుతుందని వివరించారు. సాధారణంగా కొత్త వెంచర్లు బ్రేక్–ఈవెన్ సాధించేందుకు 10–12 ఏళ్లు పడుతుందని షా పేర్కొన్నారు. గ్రామీణ, సెమీ–అర్బన్ ప్రాంతాల్లో ఈ జాయింట్ వెంచర్ను నంబర్ వన్ స్థానంలో నిలబెట్టాలని నిర్దేశించుకున్నట్లు వివరించారు. జీవిత బీమాతో ప్రారంభించబోతున్న తమకు కాంపోజిట్ లైసెన్సు కూడా లభిస్తే మరింత ప్రయోజనకరంగా ఉంటుందని ఆయన తెలిపారు. మాన్యులైఫ్ ఫైనాన్షియల్ కార్పొరేషన్కి ఆసియా, యూరప్, అమెరికావ్యాప్తంగా 3.6 కోట్ల మంది కస్టమర్లు ఉన్నారు. 37,000 మంది పైగా ఉద్యోగులు, 1.09 లక్షల మంది ఏజెంట్లు,, వేల సంఖ్యలో డిస్ట్రిబ్యూషన్ పార్ట్నర్లు ఉన్నారు.

బీఎస్ఈలో గురువారం ఎంఅండ్ఎం షేర్లు 1.45% క్షీణించి రూ. 3,699 వద్ద ముగిశాయి.

సాక్షి స్పోర్ట్స్



క్వార్టర్ ఫైనల్లో లక్ష్య సేన్

కుమామోటో: జపాన్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-500 బ్యాడ్మింటన్ టోర్నమెంట్లో భారత నంబర్వన్ లక్ష్య సేన్ క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. గురువారం జరిగిన పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 15వ ర్యాంకర్ లక్ష్య సేన్ 21-13, 21-11తో ప్రపంచ 20వ ర్యాంకర్ జియా హెంగ్ జేసన్ తె (సింగపూర్)పై గెలుపొందాడు. 39 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్లో లక్ష్య సేన్ పూర్తి ఆధిపత్యం చలాయించాడు. తొలి గేమ్లో స్కోరు 14-13 వద్ద లక్ష్య సేన్ వరుసగా ఏడు పాయింట్లు గెలిచాడు. రెండో గేమ్లోనూ లక్ష్య సేన్ తన జోరు కొనసాగించాడు. మరోవైపు భారత్కే చెందిన హెచ్ఎస్ ప్రణయ్ పోరాటం ముగిసింది. ప్రిక్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 35వ ర్యాంకర్ ప్రణయ్ 18-21, 15-21తో ప్రపంచ 30వ ర్యాంకర్ రస్ముస్ గెమ్కే (డెన్మార్క్) చేతిలో ఓడిపోయాడు.

సురేఖ 'డబుల్ ధమాకా'

టీమ్, వ్యక్తిగత విభాగాల్లో స్వర్ణ పతకాలు నెగ్గిన భారత ఆర్చర్

ఆసియా చాంపియన్షిప్లో భారత్ ఖాతాలో ఐదు పతకాలు

ఢాకా: ప్రపంచ రెండో ర్యాంకర్ వెన్నం జ్యోతి సురేఖ మరోసారి అంతర్జాతీయ వేదికపై మెరిసింది. ఆసియా ఆర్చరీ చాంపియన్షిప్లో ఆంధ్రప్రదేశ్కు చెందిన ఈ ఆణిముత్యం రెండు స్వర్ణ పతకాలతో అదరగొట్టింది. ముందుగా దీప్షిక, ప్రీతికలతో కలిసి జ్యోతి సురేఖ మహిళల కాంపౌండ్ టీమ్ ఈవెంట్లో భారత్కు పసిడి పతకాన్ని అందించింది. ఆ తర్వాత వ్యక్తిగత విభాగంలోనూ బంగారు పతకాన్ని సాధించి 'డబుల్ ధమాకా' సృష్టించింది. ఈ క్రమంలో ఆసియా చాంపియన్షిప్ మహిళల వ్యక్తిగత విభాగంలో మూడుసార్లు చాంపియన్గా నిలిచిన తొలి ఆర్చర్గా జ్యోతి సురేఖ రికార్డు నెలకొల్పింది. ఇంతకుముందు జ్యోతి సురేఖ 2015, 2021లలో జరిగిన ఆసియా చాంపియన్షిప్ పోటీల్లోనూ వ్యక్తిగత విభాగంలో బంగారు పతకాలు సాధించింది. టీమ్ విభాగం ఫైనల్లో జ్యోతి సురేఖ, దీప్షిక, ప్రీతికలతో కూడిన భారత జట్టు 236–234 (59–59, 59–58, 59–59, 59–58)తో పార్క్ యెరిన్, ఓ యుహున్, జుంగ్యున్ పార్క్లతో కూడిన దక్షిణ కొరియా జట్టును ఓడించింది. వ్యక్తిగత విభాగం ఫైనల్లో జ్యోతి సురేఖ 147–145తో భారత్కే చెందిన ప్రీతికపై నెగ్గి పసిడి పతకాన్ని అందుకుంది. అంతకుముందు సెమీఫైనల్లో జ్యోతి సురేఖ 149–143తో సియు చెన్ (చైనీస్ తైపీ)పై, ప్రీతిక 146–145తో కుల్సుం మోనీ (బంగ్లాదేశ్)పై గెలిచారు.

కాంపౌండ్ మిక్స్డ్ టీమ్ ఈవెంట్లో అభిషేక్ వర్మ–దీప్షిక ద్వయం భారత్కు స్వర్ణ పతకాన్ని అందించింది. ఫైనల్లో అభిషేక్ వర్మ–దీప్షిక జంట 153–151తో బోనా అక్తర్–హిము బచర్ (బంగ్లాదేశ్) జోడీపై గెలిచింది. అభిషేక్ వర్మ, సాహిల్, ప్రథమేశ్లతో కూడిన భారత పురుషుల కాంపౌండ్ జట్టు రజత పతకంతో సరిపెట్టుకుంది. ఫైనల్లో భారత్ 229–230తో మూసా, మీర్జామెతోవ్, ట్యుటున్లతో కూడిన కజకిస్తాన్ జట్టు చేతిలో ఓడిపోయింది.

90 అంతర్జాతీయ స్థాయిలో ఇప్పటి వరకు జ్యోతి సురేఖ గెలిచిన మొత్తం పతకాలు. ఇందులో 33 స్వర్ణాలు, 33 రజతాలు, 24 కాంస్య పతకాలు ఉన్నాయి.

ప్రిక్వార్టర్ ఫైనల్లో అర్జున్, హరికృష్ణ

అర్జున్

హరికృష్ణ

పనాజీ: తాడో పేడో తేల్చుకోవాల్సిన టైబ్రేక్ గేముల్లో భారత నంబర్వన్, తెలంగాణ గ్రాండ్మాస్టర్ ఇరిగేశి అర్జున్... ఆంధ్రప్రదేశ్ గ్రాండ్మాస్టర్ పెంటేల హరికృష్ణ మెరిశారు. తద్వారా సొంతగడ్డపై జరుగుతున్న పురుషుల ప్రపంచకప్ చెస్ టోర్నమెంట్లో అర్జున్, హరికృష్ణ ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించారు. గురువారం జరిగిన నాలుగో రౌండ్ టైబ్రేక్లో ప్రపంచ 6వ ర్యాంకర్, 22 ఏళ్ల అర్జున్ 2–0తో ప్రపంచ 55వ ర్యాంకర్, 46 ఏళ్ల పీటర్ లెకో (హంగేరి)పై... ప్రపంచ 46వ ర్యాంకర్ హరికృష్ణ 1.5–0.5తో ప్రపంచ 52వ ర్యాంకర్ నిల్స్ గ్రాండెలియస్ (స్వీడన్)పై గెలుపొందారు. పీటర్ లెకోతో జరిగిన తొలి టైబ్రేక్ గేమ్లో అర్జున్ 40 ఎత్తుల్లో... రెండో టైబ్రేక్ గేమ్లో 57 ఎత్తుల్లో నెగ్గాడు. గ్రాండెలియస్తో జరిగిన తొలి టైబ్రేక్ గేమ్ను 35 ఎత్తుల్లో 'డ్రా' చేసుకున్న హరికృష్ణ... రెండో టైబ్రేక్ గేమ్లో 34 ఎత్తుల్లో విజయం సాధించాడు.

ప్రజ్ఞానందకు నిరాశ

భారత్కే చెందిన మరో గ్రాండ్మాస్టర్ ప్రజ్ఞానందకు నిరాశ ఎదురైంది. తమిళనాడుకు చెందిన ప్రపంచ 7వ ర్యాంకర్ ప్రజ్ఞానంద ప్రిక్వార్టర్ ఫైనల్లో వెనుదిరిగాడు. ప్రపంచ 45వ ర్యాంకర్ డానిల్ డుబోవ్ (రష్యా)తో జరిగిన టైబ్రేక్లో ప్రజ్ఞానంద 0.5–1.5తో ఓడిపోయాడు.

సఫారీ సవాల్కు సై

నేటి నుంచి దక్షిణాఫ్రికాతో భారత్ తొలి టెస్టు

ఇరు జట్లలోనూ మేటి స్పిన్నర్లు ● అదనపు బ్యాటింగ్ లైనప్తో టీమిండియా

ఉదయం గం. 9:30 నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో హాట్స్టార్లో ప్రత్యక్ష ప్రసారం

బవుమా

గిల్

కోల్కతా: సొంతగడ్డపై బెబ్బులి అయిన టీమిండియాతో ప్రపంచ టెస్టు చాంపియన్ దక్షిణాఫ్రికా సవాల్కు సిద్ధమైంది. ఇరు జట్ల మధ్య నేటి నుంచి ఈడెన్ గార్డెన్స్లో తొలి టెస్టు జరగనుంది. ఇరుజట్లలోనూ నాణ్యమైన స్పిన్నర్లు ఉండటంతో స్పిన్ ఫ్రెండ్లీ వికెట్పై ఈ సంప్రదాయ క్రికెట్ సమరం ఆసక్తికరంగా జరుగుతుందని అంతా ఆశిస్తున్నారు. ఇంగ్లండ్ గడ్డపై టెస్టు సిరీస్ను సమం చేసుకున్న భారత్ అదే ఉత్సాహంతో సొంతగడ్డపై సఫారీని ఓడించాలనే లక్ష్యంతో ఉంది. బ్యాటింగ్ బలగం, స్పిన్, పేస్ల కలబోతతో పాటు అనుకూలించే ఆతిథ్య వేదిక టీమిండియాను పైచేయిగా నిలుపుతోంది.

టీమిండియాకు పరీక్షే!

ఆతిథ్య అనుకూలతలెన్ని ఉన్నా కూడా న్యూజిలాండ్తో భారత్లో జరిగిన టెస్టు సిరీస్లో టీమిండియా వైట్వాష్ అయ్యింది. కాబట్టి ఈసారి ఆదమరిస్తే అంతేసంగతి. తొలి రోజు తొలి సెషన్ నుంచే భారత ఆటగాళ్లు ఈ విషయాన్ని గుర్తుంచుకొని శ్రమిస్తేనే అనుకూలతలతో సానుకూల ఫలితాల్ని ఆశించవచ్చు. బ్యాటింగ్ లైనప్ మునుపెన్నడూ లేనంత పటిష్టంగా ఉంది. ఏకంగా ఎనిమిది, తొమ్మిది మంది బ్యాటింగ్ చేసే ఆటగాళ్లు తుది జట్టులో ఉన్నారు. జైస్వాల్, రాహుల్, సాయి సుదర్శన్లతో టాపార్డర్, కెప్టెన్ గిల్, రిషభ్ పంత్, ధ్రువ్ జురేల్లతో కూడిన మిడిలార్డర్, జడేజా, సుందర్, అక్షర్లతో లోయర్ ఆర్డర్ కూడా పరుగులు రాబట్టగలదు. ఇంగ్లండ్ సిరీస్లో సుందర్, జడేజాల భాగస్వామ్యం, టెస్టును 'డ్రా' చేసిన వైనం ఇప్పుడప్పుడే ఎవరూ మర్చిపోరు. ఇంగ్లండ్ పర్యటనలో గాయపడిన రిషభ్ పంత్ తన పునరాగమనాన్ని ఘనంగా చాటేందుకు సిద్ధం కాగా, ధ్రువ్ జురేల్ భీకర ఫామ్లో ఉన్నాడు. కాబట్టే టీమ్ మేనేజ్మెంట్ ఆంధ్ర పేస్ ఆల్రౌండర్ నితీశ్ కుమార్ను పక్కనబెట్టి మరీ ఇద్దరు స్పెషలిస్టు వికెట్ కీపర్లకు అవకాశమిచ్చింది.

సఫారీ తక్కువేం కాదు...

దక్షిణాఫ్రికా గట్టి ప్రత్యర్థి. గతంలో భారత పర్యటనలకు వచ్చినపుడు కంగుతిన్న సఫారీ జట్లకి... ప్రస్తుత బవుమా బృందానికి తేడా ఉంది. భారత్లాగే దక్షిణాఫ్రికా ఆయుధం కూడా స్పిన్నే! అనుభవజ్ఞుడైన కేశవ్ మహరాజ్తో పాటు సైమన్ హార్మర్, సెనురాన్ ముత్తుసామి ఈ పర్యటనలో తప్పకుండా ఆతిథ్య బౌలర్లకు దీటుగా ప్రభావం చూపించగలరు. అచ్చూ భారత్లాగే సఫారీ బ్యాటింగ్ లైనప్ కూడా పటిష్టంగా ఉంది. మార్క్రమ్–రికెల్టన్ ఓపెనింగ్ జోడీ నుంచి ఎనిమిదో స్థానంలో బ్యాటింగ్కు దిగే మార్కో యాన్సెన్ వరకు పరుగులు సాధిస్తారు. ట్రిస్టన్ స్టబ్స్, డి జార్జి, సారథి బవుమా, వికెట్ కీపర్ కైల్ వెరీన్లు స్పిన్, పేస్ను ఎంచక్కా ఎదుర్కోగలరు. పైగా ఇక్కడికి వచ్చే ముందు పాక్లో పర్యటించిన దక్షిణాఫ్రికా జట్టు పరిమిత ఓవర్ల సిరీస్ (వన్డే, టి20)లు ఓడిందేమో కానీ టెస్టు సిరీస్ను మాత్రం కోల్పోలేదు. 1-1తో సమం చేసుకొని భారత ఉపఖండంపై సత్తాచాటేందుకు 'సై' అంటోంది.

పిచ్, వాతావరణం

ఈడెన్ గార్డెన్స్ పిచ్ తొలిరోజు బ్యాటింగ్కు అనుకూలం. పిచ్పై ఉన్న పచ్చికతో పేస్ బౌలర్లు కూడా ఆరంభంలో ప్రభావం చూపొచ్చు. ఆఖరి సెషన్ లేదంటే మూడో రోజు నుంచి స్పిన్కు టర్న్ అవుతుంది. టాస్ నెగ్గిన జట్టు కచ్చితంగా బ్యాటింగే ఎంచుకుంటుంది. వర్షం ముప్పు లేదు.

తుది జట్లు (అంచనా)

భారత్: గిల్ (కెప్టెన్), జైస్వాల్, రాహుల్, సాయిసుదర్శన్, పంత్, జురేల్, జడేజా, వాషింగ్టన్ సుందర్, అక్షర్/కుల్దీప్, బుమ్రా, సిరాజ్.

దక్షిణాఫ్రికా: బవుమా (కెప్టెన్), మార్క్రమ్, రికెల్టన్, స్టబ్స్, టోని డి జోర్జి, కైల్ వెరీన్, సెనురాన్ ముత్తుసామి, హార్మర్, యాన్సెన్, కేశవ్, రబడ.

16 భారత్, దక్షిణాఫ్రికా జట్ల మధ్య ఇప్పటి వరకు మొత్తం 44 టెస్టులు జరిగాయి. 16 టెస్టుల్లో భారత్, 18 టెస్టుల్లో దక్షిణాఫ్రికా గెలిచాయి. 10 టెస్టులు 'డ్రా'గా ముగిశాయి. స్వదేశంలో దక్షిణాఫ్రికాతో భారత్ 19 టెస్టులు ఆడింది. 11 టెస్టుల్లో నెగ్గి, ఐదింటిలో ఓడింది. మూడు టెస్టులు 'డ్రా' అయ్యాయి.

13 ఈడెన్ గార్డెన్స్లో భారత జట్టు ఇప్పటి వరకు 42 టెస్టులు ఆడింది. 13 మ్యాచ్ల్లో నెగ్గి, 9 మ్యాచ్ల్లో ఓడిపోయింది. 20 మ్యాచ్లు 'డ్రా'గా ముగిశాయి. భారత్, దక్షిణాఫ్రికా మధ్య ఈడెన్ గార్డెన్స్లో మూడు టెస్టులు జరిగాయి. రెండింటిలో భారత్, ఒక దాంట్లో దక్షిణాఫ్రికా గెలుపొందాయి.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్లో

అనుపమ అద్భుతం

ప్రపంచ స్నూకర్ టైటిల్ గెలిచిన తొలి భారతీయ క్రీడాకారిణిగా రికార్డు

దోహా: అంచనాలకు మించి రాణించిన భారత స్నూకర్ ప్లేయర్ అనుపమ రామచంద్రన్ తన కెరీర్లోనే అతిగొప్ప విజయాన్ని అందుకుంది. అంతర్జాతీయ బిలియర్డ్స్, స్నూకర్ సమాఖ్య (ఐబీఎస్ఎఫ్) ఆధ్వర్యంలో జరిగిన ప్రపంచ స్నూకర్ చాంపియన్షిప్లో (15 రెడ్) తమిళనాడుకు చెందిన 23 ఏళ్ల అనుపమ విజేతగా అవతరించింది. గురువారం జరిగిన ఫైనల్లో అనుపమ 3–2 (51–74, 65–41, 10–71, 78–20, 68–60) ఫ్రేమ్ల తేడాతో ఎన్జీ ఆన్ యీ (హాంకాంగ్)పై విజయం సాధించింది. తద్వారా ప్రపంచ స్నూకర్ టైటిల్ గెలిచిన తొలి భారతీయ క్రీడాకారిణిగా చరిత్ర సృష్టించింది. గతంలో భారత్కు చెందిన అమీ కమాని (2016లో), విద్యా పిళ్లై (2022లో) ఫైనల్లో ఓడిపోయి రన్నరప్గా నిలిచారు. అనుపమ మాత్రం తొలి ప్రయత్నంలోనే ప్రపంచ టైటిల్ను సొంతం చేసుకుంది. తాజా ఓటమితో 34 ఏళ్ల ఎన్జీ ఆన్ యీ నాలుగోసారి ప్రపంచ స్నూకర్ చాంపియన్షిప్లో రన్నరప్ ట్రోఫీతో సరిపెట్టుకోవడం గమనార్హం. 2012 ఫైనల్లో వెండీ జాన్స్ (బెల్జియం) చేతిలో... 2023 ఫైనల్లో బాయ్ యులు (చైనా) చేతిలో... 2024 ఫైనల్లో ప్లాయ్చోంపో (థాయ్లాండ్) చేతిలో ఎన్జీ ఆన్ యీ ఓడిపోయింది. అయితే ఎన్జీ ఆన్ యీ గతంలో మూడుసార్లు (2009, 2010, 2019) ప్రపంచ స్నూకర్ చాంపియన్గా నిలవడం విశేషం.

నూతన వధూవరులకు వైఎస్ జగన్ ఆశీస్సులు

ఎన్టీఆర్ జిల్లా నందిగామకు చెందిన వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సహాయ కార్యదర్శి మంగునూరు కొండారెడ్డి, లక్ష్మి దంపతుల కుమార్తె వివాహం గుంటుపల్లిలోని సీఏ కన్వెన్షన్ హాల్‌లో గురువారం సాయంత్రం జరిగింది. వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ వివాహ వేడుకకు విచ్చేసి.. నూతన వధూవరులు ప్రణయచంద్రారెడ్డి, జానకి ప్రియను ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలిపారు. – గుంటుపల్లి (ఇబ్రహీంపట్నం)

కంటి'పాప' భావోద్వేగం

ఎన్టీఆర్ జిల్లా గుంటుపల్లిలోని సీఏ కన్వెన్షన్ హాలులో గురువారం వివాహ వేడుకకు హాజరైన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చూసిన ఓ పాప ఆనందంతో భావోద్వేగానికి గురైంది. కంటతడి పెట్టింది. దీంతో ఆ పాపను వైఎస్ జగన్ ఆప్యాయంగా హత్తుకున్నారు. కన్నీళ్లు తుడిచి ఓదార్చారు.

వైఎస్సార్‌సీపీ నేతలపై అక్రమ కేసులు

ట్రాఫిక్‌కు అంతరాయం, నిబంధనలు ఉల్లంఘించారని నెపం

లక్ష్మీపురం/శ్రీకాకుళం క్రైమ్/చీమకుర్తి/అనంతపురం: రాష్ట్రంలో ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా బుధవారం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ర్యాలీలు నిర్వహించడంపై పలుచోట్ల పోలీసులు అక్రమ కేసులు నమోదు చేశారు. గుంటూరులో పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి అంబటి రాంబాబుపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. గుంటూరులోని జూట్‌మిల్లు ఫ్లెవైఓవర్ బ్రిడ్జి వద్దకు ర్యాలీ చేరుకోగానే పట్టాభిపురం సీఐ బారికేడ్లు అడ్డు పెట్టి అడ్డగించారు. అంబటితో దురుసుగా వ్యవహరించారు. పైగా పోలీసుల విధులకు ఆటంకం కలిగించారంటూ తిరిగి అంబటి రాంబాబు, మరికొందరిపై బుధవారం రాత్రి పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌లో అక్రజుమ కేసులు నమోదు చేశారు. అనంతపురం జిల్లా తాడిపత్రిలో ర్యాలీ సందర్భంగా టీడీపీ నాయకులను దూషించారనే నెపంతో తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కేతిరెడ్డి పెద్దారెడ్డితో పాటు పలువురిపై కేసులు నమోదు చేశారు. ప్రకాశం జిల్లా సంతనూతలపాడులో వైఎస్సార్‌సీపీకి చెందిన 77 మందిపై గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. ర్యాలీ వల్ల ట్రాఫిక్ అంతరాయం కలిగించారని పార్టీ నేతలు మేరుగ నాగార్జున, బత్తుల బ్రహ్మానందరెడ్డి, దుంపా రమణమ్మ, దుంపా చెంచిరెడ్డి తదితరులపై కేసులు నమోదు చేశారు. ఇచ్చిన అనుమతికి మించి ఎక్కువ మందితో ర్యాలీ నిర్వహించారని శ్రీకాకుళంలో పార్టీ నేతలు గేదెల పురుషోత్తం, ముంజేటి కృష్ణారావు, పొన్నాడ రుషి, అంబటి శ్రీనివాసరావు, సాధు వైకుంఠరావు, మెంటాడ స్వరూప్, మహ్మద్ రఫీ, గుజ్జల అప్పలరాజుతో పాటు మరో 200 మంది, పలాసలో మాజీ మంత్రి సీదిరి అప్పలరాజుతో పాటు మరో 30 మందిపై అక్రమ కేసులు నమోదు చేశారు.



Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Published at D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP) and Printed at Jagati Publications Limited, D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP).,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of news under the PRB act) Phone No : 0863-2512581 Fax No: 0863-2512584, RNI Regn No. APTEL/2008/23801. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

సజ్జల శ్రీధర్‌రెడ్డి పిటిషన్‌పై విచారణ 17కి వాయిదా

అన్ని అంశాలు ఆ రోజు పరిశీలిస్తామన్న హైకోర్టు

సాక్షి, అమరావతి : మద్యం అక్రమ కేసులో సీఆర్‌పీసీ సెక్షన్ 167(2) కింద తాను దాఖలు చేసిన డీఫాల్ట్ బెయిల్ పిటిషన్‌పై విచారణ జరిపేలా విజయవాడ ఏసీబీ కోర్టును ఆదేశించాలని కోరుతూ సజ్జల శ్రీధర్‌రెడ్డి దాఖలు చేసిన వ్యాజ్యంలో హైకోర్టు తదుపరి విచారణను ఈనెల 17కి వాయిదా వేసింది. ఈ వ్యాజ్యంలో లేవనెత్తిన అన్ని అంశాలను అప్పుడు పరిశీలిస్తామని హైకోర్టు స్పష్టంచేసింది. ఈ మేరకు న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప గురువారం ఉత్తర్వులు జారీచేశారు. ఈ వ్యాజ్యం గురువారం విచారణకు రాగా.. శ్రీధర్‌రెడ్డి తరఫు న్యాయవాది అభయ్ సిద్ధాంత్ వాదనలు వినిపించారు. పిటిషనర్ దాఖలు చేసిన డీఫాల్ట్ బెయిల్ పిటిషన్‌కు విచారణార్హత లేదంటూ ఏసీబీ కోర్టు ఆ పిటిషన్‌ను రిటర్న్ చేసిందన్నారు. సీఐడీ అనుబంధ పిటిషన్ తేలే వరకు వేచి ఉండాలని హైకోర్టు ఉత్తర్వులిచ్చిన నేపథ్యంలో తమ పిటిషన్‌కు విచారణర్హత ఎలా ఉందో స్పష్టతనివ్వాలని కోరిందన్నారు. దీంతో తాము సుప్రీంకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను జతచేసి స్పష్టతనిచ్చామన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి, ఈ వ్యవహారంలో అన్ని అంశాలను వచ్చే సోమవారం పరిశీలిస్తానని తెలిపారు.

అమ్మో పులి

- పల్నాడు జిల్లా వెల్దుర్తి మండల పరిసరాల్లో పులి సంచారం
- వజ్రాలపాడ తండా అటవీ ప్రాంతంలో ఇటీవల రెండు గేదెలను చంపిన పులి
- భయాందోళనలో అటవీ సమీప ప్రాంత పశు కాపరులు, రైతులు
- నల్లమల టైగర్ జోన్ నుంచి జిల్లా అటవీప్రాంతంలోకి వచ్చినట్టు భావిస్తున్న అటవీశాఖ అధికారులు
- అటవీ ప్రాంతప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచన
- అటవీశాఖకు సహకరిస్తున్న వేట నియంత్రణ దళాలు, పశువుల కాపరులు, స్థానిక రైతులు

సాక్షి, నరసరావుపేట: పల్నాడు జిల్లా నల్లమల అటవీ ప్రాంతానికి ఆనుకొని ఉన్న మండలాల్లో పులుల సంచరిస్తున్నాయన్న సమాచారంతో స్థానికులు హడలిపోతున్నారు. వెల్దుర్తి మండలం వజ్రాలపాడు తండాలో శనివారం, ఆదివారాలలో మేతకు వెళ్లిన రెండు గేదెలు ప్రాణాలు కోల్పోయాయి. గేదెలు మరణించిన తీరు, అక్కడి పాద ముద్రల ఆధారంగా పులి చంపినట్టు అటవీ అధికారులు నిర్ధారణకు వచ్చారు. దీంతో ఏ సమయంలో పులులు దాడులు చేస్తాయోనని ముఖ్యంగా పశువుల కాపరులు, రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సాయంత్రం అయితే ప్రజలంతా ఇళ్లకే పరిమితమవుతున్నారు. ఈ రేంజ్‌లో ఇటీవల కాలంలో అటవీ ప్రాంతాల్లోకి వెళ్లిన పశువులను పెద్దపులి వేటాడి చంపిన ఘటనలు అనేకం ఉన్నాయి. రెండేళ్ల కిందట దుర్గి మండలం గజాపురం అటవీ ప్రాంతంలో ఓ ఆవును అడవి జంతువులు వేటాడి చంపాయి. ఆ ప్రదేశంలో ఉన్న పాద ముద్రికల ఆధారంగా రెండు పులులు దాడి చేసినట్టు అటవీశాఖ అధికారులు అప్పట్లో నిర్ధారించారు. పల్నాడు జిల్లా అడవులకు ఆనుకొని ఉన్న నల్లమల టైగర్ జోన్ నుంచి పులుల సంచారం పెరగడంతో ఆ ప్రాంత ప్రజల్లో గుబులు మొదలైంది.

పెరుగుతున్న పులుల సంఖ్య...

శ్రీశైలం, నాగార్జునసాగర్ పరిసర ప్రాంతాల మధ్య ఉన్న నల్లమల అభయారణ్యంలో పులుల సంతతి కొన్నేళ్లుగా బాగా వృద్ధి చెందుతోంది.

వెల్దుర్తి మండలం వజ్రాలపాడు అటవీప్రాంతంలో శనివారం పులి దాడిలో మరణించిన గేదె

వెల్దుర్తి మండలం వజ్రాలపాడు అటవీప్రాంతంలో ఆదివారం పులి దాడిలో మరణించిన గేదె

ప్రస్తుతం వాటి సంఖ్య 85 దాకా ఉందని అటవీశాఖ అధికారిక లెక్కల ప్రకారం చెబుతున్నా, అనధికారికంగా మరి కొన్ని పులులు ఉండవచ్చని భావిస్తున్నారు.

టైగర్ జోన్‌ను ఆహార వేట కోసం పులులు పల్నాడు జిల్లా శివారు తండాల వైపు వచ్చి ఉంటాయని అటవీశాఖ అధికారులు భావిస్తున్నారు. వెల్దుర్తి, దుర్గి, కారంపూడి, బొల్లాపల్లి మండలాల పరిధిలోని నల్లమల అటవీ సమీప ప్రాంతాలలో పులులు సంచరించే అవకాశం ఉందని, ఆ ప్రాంత ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరిస్తున్నారు.

రక్షణ కోసం చర్యలు

వివిధ కారణాలతో జనారణ్యం సమీపంలోకి వచ్చిన పులులను ఇబ్బందిపెట్టవద్దని ప్రజలకు అటవీ శాఖ అధికారులు సూచిస్తున్నారు. అటవీ, వేట నిరోధక దళాలు, వనమిత్రల సహాయంతో పులుల జాడ తెలుసుకొని, వాటి మార్గాలను టైగర్ జోన్ వైపు మళ్లించే యత్నాలు ముమ్మరంగా చేస్తున్నారు. రైతులు తమ పంటలను కాపాడు కోవడానికి పొలాల చుట్టు వేసే విద్యుత్ కంచెల బారిన పడి మరణించకుండా ఉండేందుకు ఆయా ప్రాంతాలలో రైతులకు అవగాహన కల్పించడంతో పాటు నిత్యం రాత్రిపూట గస్తీ పెంచారు. ఎప్పటికప్పుడు ఆయా ప్రాంతాల్లో పర్యటించి వన్యప్రాణుల రక్షణకు చర్యలు తీసుకుంటున్నారు. వజ్రాలపాడు తండా సమీపంలోని నాలుగు గ్రామాలలో సోమవారం అటవీ శాఖ దండోరా వేయించింది. పులి సంచారం నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చట్టాలపై అవగాహన కల్పిస్తున్నారు. పులి దాడిలో చనిపోయిన పశువుల యజమానులకు నష్టపరిహారం అందిస్తున్నట్టు సమాచారం. ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు. పాదముద్రలను పరిశీలించి వరుసగా రెండు రోజులు ఒకే పులి దాడిచేసిందా లేదా వేర్వేరు పులులు దాడి చేశాయా అనే కోణంలో అటవీ అధికారులు పరిశీలిస్తున్నారు.

నిరుపేదలకు సెంటు స్థలం పంపిణీ చేయలేదు.. బడుగులకు ఒక్క పక్కా ఇల్లు కట్టించలేదు.. అభాగ్యులకు ఆశ్రయం కల్పించాలనే ఆలోచనే లేదు.. అక్కచెల్లెమ్మల సొంతింటి కల నెరవేర్చేందుకు మనసు ఒప్పుకోదు.. అయితే టీడీపీ కార్యాలయం కోసం సునాయాసంగా భూమిని కేటాయించేస్తారు.. ప్రజలకు ఏమాత్రం ఉపయోగం లేకపోయినా తెలుగు తమ్ముళ్లు సేదతీరేందుకు విలాసవంతమైన భవనాలను నిర్మించేస్తారు.. రూ.కోట్ల విలువైన భూములను సైతం అప్పనంగా ఆధీనంలోకి తీసేసుకుంటారు. పేదల పొడ గిట్టని ఘనత వహించిన బాబుగారి ప్రభుత్వంలో ఎల్లప్పుడూ స్వార్థ ప్రయోజనాలకే పెద్దపీట వేస్తుంటారు. అందులో భాగంగానే తిరుపతి శివారులో రూ.60 కోట్ల విలువ చేసే రెండు ఎకరాలను దర్జాగా పార్టీ ఆఫీస్‌కు అప్పగించేశారు.

తిరుపతిలోని జాతీయ రహదారికి ఆనుకుని మదర్ డెయిరీ సమీపంలో టీడీపీ కార్యాలయానికి కేటాయించిన భూమి

పచ్చ భోజ్యం!

- టీడీపీ జిల్లా కార్యాలయానికి రూ.60 కోట్ల విలువైన భూమి కేటాయింపు
- తిరుపతి శివారులో హైవే పక్కన రెండు ఎకరాలు పందేరం
- గుట్టుగా అనుమతులు ఇచ్చేసిన రెవెన్యూ అధికారులు
- పంచాయతీ తీర్మానం లేకుండానే కేబినెట్ ఆమోదం
- మల్లంగుంట దళితులను దగా చేసిన ప్రభుత్వం
- కారుచౌకగా కొట్టేయడంపై సర్వత్రా విమర్శలు

సాక్షి, టాస్క్‌ఫోర్స్: తిరుపతి నగర శివార్లలో భూముల ధరలు రూ.కోట్లకు చేరుకున్నాయి. అది కూడా ఆరు లేన్ల జాతీయ రహదారి పక్కన అయితే వాటి విలువను మాటల్లో చెప్పలేం. అలాంటి భూములపై అక్రమార్కుల కన్నుపడిందంటే మామూలే అనుకోవచ్చు. అదే ప్రభుత్వంలోని పెద్దల కన్నుపడితే.. ఆ స్థలం కోసం ఏకంగా చట్టాలనే సవరిస్తే.. రూ.కోట్లు విలువైన భూములను కారు చౌకగా కొట్టేసేందుకు చకచకా ఫైళ్లను కదిలిస్తే.. అది అధికార దుర్వినియోగమే అవుతుంది. అదే ఇప్పుడు చంద్రబాబు ప్రభుత్వం చేస్తోంది. నిరుపేదలకు ఒక్క సెంటు భూమి ఇవ్వలేని చంద్రబాబు ప్రభుత్వం తమ పార్టీ కార్యాలయాలకు మాత్రం రూ.కోట్లు విలువైన భూములను అప్పనంగా కట్టబెడుతోంది. గత ఎన్నికల సమయంలో పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో 3సెంట్లు స్థలాన్ని ఇల్లు లేని నిరుపేదలకు పంచుతానని మాట ఇచ్చిన చంద్రబాబు అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడుస్తున్నా మాట నిలబెట్టుకోలేదు. . అయితే టీడీపీ కార్యాలయాలకు మాత్రం అడ్డంగా భూములు కేటాయిస్తున్నారు. ఇప్పటికే పలు చోట్ల నిర్మించి టీడీపీ కార్యాలయాలపై కోర్టుల్లో కేసులు నడుస్తున్నా లెక్క చేయకుండా ఇంద్రభవనాలను ఆవిష్కరిస్తున్నారు.

ఏడాదికి రూ.వెయ్యి

అవిలాల రెవెన్యూ లెక్క దాఖలా సర్వే నంబరు 495లో రెండు ఎకరాలను టీడీపీ జిల్లా కార్యాలయానికి కేటాయించారు. ఆ భూమిని 33 ఏళ్ల లీజుకు ఇవ్వడమే కాకుండా, ఏడాదికి కేవలం రూ.1000 అద్దె చెల్లించేలా ఉత్తర్వులు జారీ చేశారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు 33ఏళ్ల పాటు భూములను లీజు తీసుకునేలా కల్పించిన హక్కును సవరించి 66 ఏళ్లకు పెంచారు. తర్వాత కూడా ఆ పార్టీలు మనుగడలో ఉంటే 99ఏళ్లకు పెంచుకునే అవకాశమివ్వడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

మల్లంగుంట వాసుల నోట్లో మట్టి

పూర్వీకుల కాలం నుంచి మల్లంగుంట పంచాయతీ పరిధిలోని దళితులు ఆ భూములను సాగు చేసుకునేవారు. దాదాపు 70వ దశకంలోనే అప్పటి ప్రభుత్వం వారికి దరఖాస్తు పట్టాలను కూడా మంజూరు చేసింది. అయితే తిరుపతి పరిధి అంతకంతకు విస్తరించడంతో పరిసరాల్లోని భూములకు విలువ క్రమంగా పెరుగుతూ వచ్చింది. దీంతో భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని 2003–04 మధ్యన అప్పటి టీడీపీ ప్రభుత్వం దరఖాస్తు పట్టాలను రద్దు చేసింది. అయితే ఆ భూములపై పలువురు అనుభవదారులు కోర్టుల్లో కేసులు వేసినప్పటికీ ప్రభుత్వం స్వాధీనం చేసుకుని వెబ్ ల్యాండ్స్‌లో అనాధీనంగా మార్పులు చేసింది. తాజాగా ఆ భూముల్లో రెండు ఎకరాలను టీడీపీ కార్యాలయానికి కేటాయించేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంపై దళితులు మండిపడుతున్నారు. ఒకప్పుడు సాగునీటి వసతి లేక ఆ భూముల్లో వ్యవసాయం చేయలేకపోయామని వెల్లడిస్తున్నారు. ఆర్థిక స్తోమత లేక ఇళ్లు కూడా నిర్మించుకోలేకపోయామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే కారణంగా టీడీపీ సర్కారు తమ నుంచి గతంలో భూముల లాక్కుందని, ఇప్పుడు పార్టీ కార్యాలయం పేరుతో కొట్టేసిందని వాపోతున్నారు.

పంచాయతీ తీర్మానం లేకుండానే..

ప్రభుత్వ భూములను గ్రామ పంచాయతీలకు అప్పగిస్తే అందులో కమర్షియల్ కాంప్లెక్స్‌లు నిర్మించి తద్వారా ఆదాయం పెంచుకుంటారు. ఆ సొమ్ముతో అభివృద్ధి పనులు చేపడుతారు. ప్రభుత్వ ఆ దిశగా చర్యలు చేపట్టకుండా టీడీపీ కార్యాలయం నిర్మాణానికి అడ్డగోలుగా జీఓలను సవరించుకుని లీజు షరతులను సడలించుకుని భూ కేటాయింపులు చేయడం దుర్మార్గమని మేధావులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ భూములను లీజు పేరుతో కొట్టేయడానికి చట్టాలను సవరించడంపై విస్మయం వ్యక్తం చేస్తున్నారు. తిరుపతి జిల్లా టీడీపీ కార్యాలయానికి కేటాయించి రెండు ఎకరాలకు సంబంధించి గ్రామ పంచాయతీ తీర్మానం కోసం పంపిన దస్త్రాలను సర్పంచ్ లక్ష్మీశివ తిరస్కరించారు. అయినప్పటికీ అధికారులు మాత్రం గుట్టుగా ఫైళ్లను ముందుకు కదిలించేయడం గమనార్హం.

చకచకా కదిలిన ఫైళ్లు

రూ.కోట్లు విలువైన ప్రభుత్వ భూమిని టీడీపీ కార్యాలయానికి కట్టబెట్టడానికి గుట్టుగా అధికారులు సహకరించారు. పాలకుల ఆదేశాలతో చకచకా ఫైళ్లను ముందుకు కదలించేశారు. కలెక్టర్ నుంచి వీఆర్‌ఓ వరకు అన్ని రకాల పనులు పూర్తి చేశారు. ఆ మేరకు మంత్రి మండలిలో తీర్మానించుకుని అనుమతులు పొందడం చూస్తుంటే ఇందులో కుట్రకోణం అర్థమవుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. సామాన్యుడు జానెడు స్థలం ఆక్రమించి ఇల్లు కడితే తొలగించేంత వరకు నిద్రపోని అధికారులు, రూ. కోట్లు విలువైన భూములను ఇలా ధారాదత్తం చేయడంపై వివిధ పార్టీల నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మాపై పోలీసు కేసు కొట్టేయండి

హైకోర్టులో జోగి రమేష్ భార్య, కుమారుల పిటిషన్

సాక్షి, అమరావతి: తమపై ఎన్టీఆర్ కమిషనరేట్, మాచవరం పోలీసులు నమోదు చేసిన కేసును కొట్టేయాలని కోరుతూ మాజీ మంత్రి జోగి రమేష్ సతీమణి జోగి శకుంతల, కుమారులు జోగి రాజీవ్, జోగి రోహిత్ హైకోర్టును ఆశ్రయించారు. తమపై నమోదు చేసిన కేసులో తదుపరి చర్యలన్నీ నిలిపేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలని అభ్యర్థించారు. ఈ వ్యాజ్యంపై న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప గురువారం విచారణ జరిపారు. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి, న్యాయవాది ఎం.బాలకృష్ణ వాదనలు వినిపించారు. నకిలీ మద్యం కేసులో జోగి రమేష్‌ను ఎక్సైజ్ పోలీసులు ఈ నెల 2న అరెస్ట్ చేశారని, అయితే ఆయనకు వైద్య పరీక్షలు నిర్వహించే సమయంలో పిటిషనర్లను అనుమతించలేదన్నారు. వారిని పోలీసులు బయటకు నెట్టేశారన్నారు. ఇదే సమయంలో పోలీసులు జోగి రమేష్ అనుచరులను నెట్టేశారన్నారు. దీంతో అక్కడ తలుపులు, అద్దాలు పగలడంతో మాచవరం పోలీసులు జోగి రమేష్ భార్య, కుమారులపై బీఎన్ఎస్ సెక్షన్లతో పాటు ప్రజా ఆస్తుల విధ్వంస నిరోధక చట్టం కింద కేసులు పెట్టారని నివేదించారు. వాస్తవానికి పిటిషనర్లు ఎలాంటి నేరం చేయలేదని, పోలీసులు పెట్టిన సెక్షన్లేవీ చెల్లవన్నారు. అందువల్ల ఈ కేసును కొట్టేయాలని కోరారు. పోలీసుల తరఫున అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (ఏపీపీ) ప్రియాంక వాదనలు వినిపిస్తూ పిటిషనర్లపై నమోదైన సెక్షన్లన్నీ కూడా ఏడేళ్ల లోపు శిక్ష పడేవేనన్నారు. దీంతో పిటిషనర్లకు సెక్షన్ 35(3) కింద నోటీసులివ్వాలని పోలీసులను ఆదేశిస్తూ న్యాయమూర్తి ఉత్తర్వులిచ్చారు. తదుపరి విచారణను జనవరి 8కి వాయిదా వేశారు.

50 రోజులు ఆడకుండానే..

ఓజీ సినిమాకు అర్ధ శతదినోత్సవం

అర్ధశత దినోత్సవం పేరుతో వేడుకలు జరుపుతున్న జనసేన నేతలు

కోడూరు: డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ నటించిన ఓజీ సినిమా 50 రోజులు ప్రదర్శించకుండానే ప్రదర్శించినట్లు అర్ధ శత దినోత్సవాలు నిర్వహించడం విమర్శలకు దారితీసింది. సెప్టెంబరు 25న ఈ సినిమాను విడుదల చేయగా, కృష్ణాజిల్లా కోడూరు మండలంలోని లక్ష్మీ టాకీస్‌లో ఈ సినిమాను 20 రోజులపాటు మాత్రమే ప్రదర్శించారు. ఆ తర్వాత మోంథా తుపాను కారణంగా ఈ థియేటర్‌లో ఏ సినిమాను ప్రదర్శించకుండా ఖాళీగా వదిలేశారు. కానీ, ఈ సినిమాను అక్కడ 50 రోజులు ప్రదర్శించకుండానే ప్రదర్శించినట్లు జనసేన నేతలు అర్ధ శత దినోత్సవం పేరుతో వేడుకలు జరపడంతో ప్రజలు అవాక్కయ్యారు. 50 రోజులపాటు రోజుకు నాలుగు షోలను ప్రదర్శించామంటూ జనసేన నేతలు కేక్‌లు కట్‌చేసి ఫ్లెక్సీ ఏర్పాటుచేయడం చూసి స్థానికులు నవ్వుకుంటున్నారు.

హెచ్‌ఎంలకు ఆర్జిత సెలవులు ఇవ్వాలి

సాక్షి, అమరావతి : వేసవి సెలవుల్లో విధులకు హాజరైన ప్రధానోపాధ్యాయులకు ఆర్జిత సెలవులు మంజూరుచేయాలని పాఠశాల విద్యాశాఖను రాష్ట్ర జాతీయ ఉపాధ్యాయ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ఎం షరీఫ్ గురువారం ఓ ప్రకటనలో కోరారు. 2024–25 విద్యా సంవత్సరం టెన్త్ ఫలితాలు ఏప్రిల్ 23న వచ్చాయని, 24 నుంచి వేసవి సెలవులు ప్రకటించారని ఆయన గుర్తుచేశారు. సెలవుల్లో ప్రధానోపాధ్యాయులు సప్లిమెంటరీ పరీక్షల ఫీజు వసూలుతో పాటు పాసైన విద్యార్థులకు ధృవపత్రాలు ఇచ్చేందుకు విధులకు హాజరై సెలవులు వినియోగించుకోలేదన్నారు. ఈ క్రమంలో దామాషా పద్ధతిలో వారికి ఆర్జిత సెలవులు మంజూరు చేయాలని షరీఫ్ విజ్ఞప్తి చేశారు.

ఎంజేపీ విద్యార్థులకు నీట్, ఐఐటీ శిక్షణ

సాక్షి, అమరావతి: మహాత్మ జ్యోతిబా పూలే(ఎంజేపీ) గురుకుల పాఠశాలల్లో పదో తరగతిలో ప్రతిభ చాటిన విద్యార్థులకు ఇంటర్ ప్రథమ సంవత్సరం నుంచి నీట్, ఐఐటీలో శిక్షణ ఇవ్వనున్నట్టు మంత్రి ఎస్.సవిత తెలిపారు. బాలురు, బాలికలకు వేర్వేరుగా శిక్షణ అందించనున్నట్లు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విశాఖలోని సింహాచలం ఎంజేపీలో బాలురకు, శ్రీ సత్యసాయి జిల్లా టేకులోడు ఎంజేపీలో బాలికలకు ఆయా సబ్జెక్టుల్లో నిష్ణాతులైన బోధకులతో శిక్షణ ఇవ్వనున్నామన్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచే ఈ శిక్షణ ప్రారంభమవుతుందన్నారు. భవిష్యత్తులో మరిన్ని ఎంజేపీ పాఠశాలల్లో ఉచిత శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించామని మంత్రి సవిత ఆ ప్రకటనలో తెలిపారు.

'విశాఖ సమ్మిట్ అంతా బోగస్'

రాజమహేంద్రవరం సిటీ: విశాఖలో నిర్వహిస్తున్న 30వ సమ్మిట్ అంతా బోగస్ అని అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ విమర్శించారు. రాజమహేంద్రవరంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 2016 సమ్మిట్‌లో చంద్రబాబు 316 ఎంఓయూలు చేస్తే వాటిలో 115 బోగస్‌గా తేలాయన్నారు.

బాపట్ల జిల్లాలో 'ఆర్ఈ' జోన్

సాక్షి, అమరావతి: పునరుత్పాదక ఇంధన తయారీ జోన్ (రెన్యువబుల్ ఎనర్జీ మ్యాన్యుఫ్యాక్చరింగ్–ఆర్ఈఎంజెడ్)ను బాపట్ల జిల్లాలో ఏర్పాటు చేయనున్నారు. కుందూరు, బల్లికురవ మండలం గుడిపాడు, ముక్తేశ్వరం గ్రామాల్లోని వెయ్యి ఎకరాల్లో ఈ జోన్‌ను పెట్టనున్నారు. ఇందుకోసం ఏపీ ఎస్‌పీసీఎల్ చేసిన ప్రతిపాదనకు ప్రభుత్వం అనుమతి మంజూరు చేసింది.

పునరుత్పాదక ప్రాజెక్టులకు అనుమతులు

సాక్షి, అమరావతి: అల్లూరి జిల్లా చిట్టంవలస పంప్డ్ స్టోరేజ్ పవర్ (పీఎస్పీ) ప్రాజెక్ట్ సామర్థ్యాన్ని 800 మెగావాట్ల నుంచి 1,800 మెగావాట్లకు పెంచడానికి నవయుగ ఇంజనీరింగ్ కంపెనీ లిమిటెడ్ చేసిన ప్రతిపాదనకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. కర్నూలు జిల్లా హోళగుండ, ఆలూరు మండలాల్లోని చిన్నహైట, లింగదల్లి, నెరనికి, ఎల్లార్తి గ్రామాలలో 250 మెగావాట్ల ఏసీ/334 మెగావాట్ పవర్ డీసీ సోలార్ పవర్ ప్రాజెక్ట్ ఏర్పాటుకు సెయిల్ సోలార్ పీ12 ప్రైవేట్ లిమిటెడ్‌కు అనుమతి ఇచ్చింది.

బెయిల్ పిటిషన్లపై విచారణ వాయిదా

విజయవాడ లీగల్ : మద్యం అక్రమ కేసులో జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న చెవిరెడ్డి భాస్కరరెడ్డి, చెరుకూరి వెంకటేష్‌నాయుడు తరఫున దాఖలైన బెయిల్ పిటిషన్లపై డిఫెన్స్ న్యాయవాదులు గురువారం కౌంటర్ దాఖలు చేశారు. అయితే, తదుపరి విచారణను కోర్టు 17వ తేదీకి వాయిదా వేసింది.

మిథున్‌రెడ్డి బెయిల్ షరతుల సడలింపు..

మద్యం అక్రమ కేసులో బెయిల్‌పై ఉన్న పార్లమెంటు సభ్యులు పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి లక్నోకు వెళ్లేందుకు అనుమతి కోరుతూ సిట్ ఆఫీసుకు హాజరు నుండి మినహాయింపు ఇవ్వాలని దాఖలు చేసిన పిటిషన్‌పై ఏసీబీ న్యాయస్థానంలో గురువారం విచారణ జరిగింది. ఈనెల 13 నుండి 15 వరకు మినహాయింపునిస్తూ న్యాయమూర్తి ఆదేశాలు జారీచేశారు.

రెండు పర్యాటక ప్రాజెక్టులకు భూముల కేటాయింపు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో రెండు పర్యాటక ప్రాజెక్టులకు ప్రభుత్వం భూములు కేటాయించింది. మచిలీపట్నం సమీపంలోని తాళ్లపాలెంలో మైరా బేవే రిసార్ట్స్ సంస్థ అమ్యూజ్‌మెంట్ పార్క్–రిసార్ట్స్ నిర్మాణానికి సర్వే నంబర్ 556/2లో 20 ఎకరాలు కేటాయించింది. సబ్ రిజిస్ట్రార్ ఆఫీసు రేటు ప్రకారం 66 ఏళ్లకు 1శాతం లీజుతో భూమిని అప్పగిస్తోంది. అవసరమైతే మరో 33ఏళ్ల వరకు లీజు గడువును పొడిగించుకునే వెసులుబాటు కల్పించింది. వీటితో పాటు ఎస్‌జీఎస్టీ, విద్యుత్ వంటి ప్రోత్సాహకాలను ప్రకటించింది. ఈ సంస్థ రూ.157.53 కోట్ల పెట్టుబడితో నిర్మాణాలు చేపట్టి 380 మందికి ఉపాధి కల్పించనున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. మరోవైపు విజయవాడలోని భవానీ ద్వీపంలో విశ్వనాథ్ అవెన్యూ ప్రైవేట్ లిమిటెడ్‌కు 'అడ్వెంచర్ థ్రిల్ సిటీ' ఏర్పాటుకు 10 ఎకరాలు ఎస్ఆర్‌ఓ విలువ ప్రకారం 1శాతానికి 66 ఏళ్ల పాటు లీజుకు కేటాయించింది. దీనికి కూడా మరో 33 ఏళ్లు పొడిగించుకునే వెసులుబాటు ఇచ్చింది. ఈ సంస్థ 51.48 కోట్ల పెట్టుబడి పెడుతున్నట్టు వెల్లడించింది.

'సీఐఐ సదస్సులో 98 పర్యాటక ఒప్పందాలు'

సాక్షి, అమరావతి : విశాఖలో 14, 15 తేదీల్లో నిర్వహిస్తున్న సీఐఐ సదస్సులో పర్యాటక రంగంలో 98 ఒప్పందాలు చేసుకోనున్నామని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సముద్ర తీరంలో వెల్‌నెస్ సెంటర్లను తీసుకురావడంతో పాటు ఎకో టూరిజంలో సమూల మార్పులు తీసుకొస్తున్నామన్నారు.

టిడ్కో నిర్మాణాల కొనసాగింపుపై కమిటీ నివేదిక

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని పలు పట్టణాల్లో చేపట్టిన టిడ్కో ఇళ్ల ప్రాజెక్టుల పనులు కొనసాగించేందుకు నిర్మాణ కాంట్రాక్టు సంస్థల డిమాండ్ల అమలు, సాధ్యాసాధ్యాలపై నియమించిన సాంకేతిక కమిటీ నివేదికను గురువారం ప్రభుత్వం విడుదల చేసింది.గతంలో ప్రాజెక్టు కొనసాగింపుపై పబ్లిక్ హెల్త్ చీఫ్ ఇంజినీర్ చైర్మన్‌గా ఐదుగురు ఇతర విభాగాల ఇంజినీరింగ్ నిపుణులతో టెక్నికల్ కమిటీని వేశారు. ఈ కమిటీ సూచనలపై ఏడీసీఎల్ విభాగం నుంచి విజిలెన్స్ నివేదికను సమర్పించినట్టు జారీ చేసిన ఉత్తర్వుల్లో తెలిపారు. కాంట్రాక్టు సంస్థల డిమాండ్లు, కమిటీ సూచనలతో కూడిన మార్గదర్శకాలను ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఎస్‌ఎంసీ ఎన్నికలకు మార్గదర్శకాలు

సాక్షి, అమరావతి: ప్రభుత్వ పాఠశాలల విలీనం నేపథ్యంలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ(ఎస్‌ఎంసీ)లను పునర్ నిర్మించాలని సమగ్ర శిక్ష రాష్ట్ర విభాగం ఆదేశించింది. అవసరమైనచోట కొత్త కమిటీల ఎన్నిక కోసం సమగ్ర శిక్ష ఎస్పీడీ బి.శ్రీనివాసరావు మార్గదర్శకాలు విడుదల చేశారు. ఎన్నికై న సభ్యుల పదవీ కాలం రెండేళ్లు లేదా సభ్యుని కుమారుడు/కుమార్తె పాఠశాల చదువు పూర్తి చేసుకొని బయటకు వెళ్లే తేదీ ఏది ముందైతే దాన్ని పరిగణనలోకి తీసుకోవాలని ఆదేశించారు. ఎన్నికై న సభ్యుల నుంచి చైర్మన్, వైస్ చైర్మన్/ చైర్‌పర్సన్‌ను ఎన్నుకోవాలని సూచించారు.

వైఎస్సార్‌సీపీ నేత కైలే అనిల్ తదితరులకు హైకోర్టులో ఊరట

సాక్షి, అమరావతి: కృష్ణా జిల్లా పామర్రు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి కైలే అనిల్‌కుమార్, మరో ఐదుగురికి హైకోర్టు ఊరటనిచ్చింది. వీరిపై పమిడిముక్కల పోలీసులు నమోదు చేసిన కేసులో తదుపరి చర్యలన్నింటినీ హైకోర్టు నిలిపేసింది. తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. పిటిషనర్లపై నమోదు చేసిన కేసులో వారికి ఏయే సెక్షన్లు వర్తిస్తాయో స్పష్టంగా చెప్పాలని పబ్లిక్ ప్రాసిక్యూటర్ (పీపీ) మెండ లక్ష్మీనారాయణను ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ యడవల్లి లక్ష్మణరావు గురువారం మధ్యంతర ఉత్తర్వులు జారీచేశారు.

అగ్రికల్చర్ 'స్పెషల్' సీట్ల భర్తీకి 15న కౌన్సెలింగ్

సాక్షి, అమరావతి/గుంటూరు రూరల్: ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ వర్సిటీ బీఎస్సీ(హానర్స్) అగ్రికల్చర్‌లో స్పెషల్ కేటగిరి(స్పోర్ట్స్ అండ్ గేమ్స్, క్యాప్ అండ్ స్కౌట్స్ అండ్ గైడ్స్)లో మిగిలిన సీట్లతో పాటు అగ్రిసెట్–2025 అభ్యర్థులకు చివరి విడత మాన్యువల్ కౌన్సెలింగ్ ఈ నెల 15న నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎంవీ రమణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలకు వర్సిటీ వెబ్‌సైట్ angrau.ac.inను సంప్రదించాలని సూచించారు.

కేరళలో సీపీఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ కుమార్తె వివాహం

సాక్షి, అమరావతి: సీపీఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ కుమార్తె సాయిలీల వివాహం సాయికృష్ణతో గురువారం ఘనంగా జరిగింది. కేరళలోని తిరువనంతపురం సమీపంలోని కోవలం బీచ్‌లో ఈ వివాహం జరిపించారు. సీపీఐ జాతీయ కార్యదర్శి కె.ప్రకాష్‌బాబు, సీపీఐ ఎంపీ పి.సంతోష్ కుమార్, కేరళ పార్టీ ప్రధాన కార్యదర్శి బినోయ్ విశ్వం, కర్ణాటక పార్టీ కార్యదర్శి సాథి సుందరష్, మంత్రులు పి.ప్రసాద్, కె.రాజన్, అనిల్ కుమార్, ఎమ్మెల్యే లతాదేవి, ఫిలిం డైరెక్టర్ చంద్ర సిద్ధార్థ్ తదితర ప్రముఖులు హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు. ఈ నెల 16న సాయంత్రం 6.30 గంటలకు విజయవాడ బందర్‌రోడ్డులోని ఎస్ఎస్ కన్వెన్షన్ హాల్లో రిసెప్షన్ నిర్వహిస్తున్నట్టు రామకృష్ణ తెలిపారు.

మెగా హ్యాండ్‌లూమ్ క్లస్టర్‌కు 9.84 ఎకరాలు

25 ఏళ్ల లీజుకు మార్కెటింగ్ శాఖ స్థలం

సాక్షి, అమరావతి : మెగా హ్యాండ్‌లూమ్ క్లస్టర్ కోసం మార్కెటింగ్ శాఖకు చెందిన స్థలాన్ని కేటాయిస్తూ వ్యవసాయ శాఖ స్పెషల్ సీఎస్ బుడితి రాజశేఖర్ గురువారం ఉత్తర్వులిచ్చారు. ధర్మవరం వ్యవసాయ మార్కెట్ కమిటీకి చెందిన సర్వే నం.65లో 9.84 ఎకరాల మార్కెట్ యార్డు స్థలాన్ని 25 ఏళ్ల కాలపరిమితికి కేటాయించారు. అయితే యాజమాన్య హక్కులు మాత్రం బదలాయించడం లేదని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

స్త్రీ శక్తి పథకం కోసం ఆర్టీసీకి రూ.400 కోట్లు విడుదల

సాక్షి, అమరావతి : మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కోసం ఉద్దేశించిన 'స్త్రీ శక్తి' పథకం కోసం రీయింబర్స్ చేస్తూ ప్రభుత్వం రూ.400 కోట్లు విడుదల చేసింది. ఆగస్టు నుంచి అమల్లోకొచ్చిన ఈ పథకం కింద ఆర్టీసీకి ప్రభుత్వం ఇప్పటి వరకు రూ.631.31కోట్లు చెల్లించాల్సి ఉంది. అందులో రూ.400 కోట్లను విడుదల చేస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులిచ్చింది.

ప్రభాస్

చిరంజీవి


అల్లు అర్జున్

నాగచైతన్య

రిషబ్ శెట్టి

నిఖిల్

సాయిదుర్గా తేజ్

సైన్స్ ఫిక్షన్‌కి సై

సైన్స్ ఫిక్షన్ స్టోరీస్ భలే ఉంటాయి. అందుకే అలాంటి కథలకు చాన్స్ వచ్చినప్పుడు స్టార్ హీరో నుంచి స్మాల్ హీరో వరకూ వెంటనే 'సై' అనేస్తారు. ప్రస్తుతం తెలుగులో రూపొందుతున్న సైన్స్ ఫిక్షన్ సినిమాలు పది వరకూ ఉన్నాయి. ఆ సైన్స్ ఫిక్షన్స్ గురించి తెలుసుకుందాం.

సత్యలోకం నేపథ్యంలో...

చిరంజీవి హీరోగా రూపొందిన భారీ బడ్జెట్ చిత్రం 'విశ్వంభర'. 'బింబిసార' ఫేమ్ వశిష్ట దర్శకత్వం వహించిన ఈ సినిమాలో త్రిష కృష్ణన్, ఆషికా రంగనాథ్ హీరోయిన్లుగా నటించారు. విక్రమ్ రెడ్డి సమర్పణలో యూవీ క్రియేషన్స్‌పై వంశీ కృష్ణా రెడ్డి, ప్రమోద్ ఉప్పలపాటి నిర్మించారు. సోషియో ఫ్యాంటసీ, సైన్స్ ఫిక్షన్ జానర్‌లో రూపొందిన 'విశ్వంభర' ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని పంచుతుందని ఫిల్మ్‌నగర్ టాక్. ''మనకి తెలిసినవి 14 లోకాలు. కింద 7 లోకాలు, పైన 7 లోకాలు. ఆ 14 లోకాలకు పైన ఉన్న లోకమే సత్యలోకం. యమలోకం, స్వర్గం, పాతాళలోకం.. అన్నీ చూసేశాం. 'విశ్వంభర' కోసం వాటన్నింటిని దాటి నేను పైకి వెళ్లాను. బ్రహ్మదేవుడు ఉండే సత్యలోకాన్ని మా సినిమాలో చూపించాం. ఆ లోకంలో ఉండే హీరోయిన్‌ను వెతుక్కుంటూ హీరో 14 లోకాలు దాటి వెళ్లి తిరిగి భూమి మీదకు ఆమెను ఎలా తీసుకొచ్చాడు? అనేది ఈ చిత్రకథ'' అంటూ ఓ ఇంటర్వ్యూలో 'విశ్వంభర' స్టోరీ లైన్ చెప్పారు డైరెక్టర్ వశిష్ట. ఈ చిత్రం సంక్రాంతి కానుకగా 2025 జనవరి 10న విడుదల కావాల్సి ఉండగా 2026 వేసవిలో విడుదలకు వాయిదా వేశారు మేకర్స్.

''విశ్వంభర' ఒక చందమామ కథలా సాగిపోయే అద్భుతమైన కథ. చిన్నపిల్లలకు, పెద్దవాళ్లలో ఉండే చిన్న పిల్లలను సైతం ఇది అలరిస్తుంది.. వినోదపరుస్తుంది. 'విశ్వంభర'లో సెకండ్ హాఫ్ మొత్తం వీఎఫ్ఎక్స్, గ్రాఫిక్స్ మీద ఆధారపడి ఉంది. ప్రేక్షకులకు అత్యున్నతమైన ప్రమాణాలతో బెస్ట్ క్వాలిటీ అందివ్వాలని మేం కష్టపడుతున్నాం'' అని హీరో చిరంజీవి తెలిపిన సంగతి తెలిసిందే. ఈ చిత్రానికి ఎంఎం కీరవాణి సంగీతం అందిస్తున్నారు.

సంక్రాంతికి రాజాసాబ్

'బాహుబలి' సినిమాతో అంతర్జాతీయ స్థాయిలో తనకంటూ ప్రత్యేకమైన ఇమేజ్‌ను సొంతం చేసుకున్నారు ప్రభాస్ . 'బాహుబలి'తో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న ఆయన ఆ తర్వాత 'సాహో, రాధే శ్యామ్, ఆదిపురుష్, సలార్, కల్కి 2898 ఏడీ..' ఇలా వరుసగా భారీ పాన్ ఇండియా సినిమాలు చేస్తున్నారు. ప్రభాస్ నటిస్తున్న తాజా చిత్రం 'ది రాజా సాబ్'. మారుతి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో నిధీ అగర్వాల్, మాళవికా మోహనన్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. పీరియాడికల్ హారర్ కామెడీ, సైన్స్ ఫిక్షన్ నేపథ్యంలో రూపొందుతోన్న ఈ చిత్రంలో ప్రభాస్ ద్విపాత్రాభినయం చేస్తున్నారు. ప్రభాస్ స్టైల్, ఫ్యామిలీ ఎంటర్‌టైన్మెంట్, హారర్, కామెడీ అంశాల సమ్మిళితంగా ఈ మూవీ రూపొందుతోంది. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా లుక్స్, టీజర్‌పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇండస్ట్రీలోనూ మంచి బజ్ నడుస్తోంది. పలుమార్లు విడుదల వాయిదా పడుతూ వస్తున్న ఈ సినిమా 2026 సంక్రాంతి కానుకగా జనవరి 9న ప్రేక్షకుల ముందుకు వస్తుందని చిత్రబృందం ప్రకటించిన సంగతి తెలిసిందే. ''ప్రభాస్ గారిని 'బుజ్జిగాడి' సినిమా స్టైల్‌లో 'ది రాజా సాబ్' ద్వారా వింటేజ్ లుక్‌లో చూపిస్తున్నాం'' అంటూ మారుతి తెలిపారు. ''మా సంస్థ నుంచి వస్తున్న బిగ్గెస్ట్ ఫిల్మ్ 'ది రాజా సాబ్'. ఈ సినిమా కోసం బిగ్గెస్ట్ ఇండోర్ సెట్ వేశాం. 40 నిమిషాల క్లైమాక్స్ ఎపిసోడ్ ఈ చిత్రానికి హైలైట్‌గా నిలుస్తుంది'' అని నిర్మాత టీజీ విశ్వప్రసాద్ పేర్కొన్నారు.

సరికొత్త అనుభూతి

నాగచైతన్య హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'ఎన్?సీ 24' (వర్కింగ్ టైటిల్). 'తండేల్' సినిమాతో బ్లాక్‌బస్టర్ అందుకోవడంతో పాటు తొలిసారి వంద కోట్ల క్లబ్‌లో చేరారాయన. 'తండేల్' వంటి విజయవంతమైన సినిమా తర్వాత ఆయన నటిస్తున్న చిత్రమిది. సాయిదుర్గా తేజ్‌తో 'విరూపాక్ష' (2023) వంటి హిట్ మూవీ తర్వాత కార్తీక్ దండు దర్శకత్వం వహిస్తున్న చిత్రం ఇది. 'సంక్రాంతికి వస్తున్నాం' వంటి సూపర్ హిట్ సినిమా తర్వాత మీనాక్షీ చౌదరి హీరోయిన్‌గా నటిస్తున్న చిత్రం కూడా ఇదే. ఇలా... సూపర్ సక్సెస్‌లు అందుకున్న తర్వాత నాగచైతన్య, మీనాక్షీ చౌదరి, కార్తీక్ దండు కాంబినేషన్‌లో రూపొందుతోన్న ఈ సైన్స్ ఫిక్షన్ మూవీపై ఇటు ఇండస్ట్రీలో అటు ప్రేక్షకుల్లో ఫుల్ క్రేజ్ నెలకొంది. బాపినీడు సమర్పణలో సుకుమార్ రైటింగ్స్, శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర బ్యానర్‌లో బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మిస్తున్నారు. భారీ బడ్జెట్‌తో ప్రతిష్టాత్మకంగా రూపొందుతోన్న ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతోంది. 'తండేల్'లో ఫుల్ మాస్ లుక్‌లో కనిపించిన నాగచైతన్య.. 'ఎన్‌సీ 24'లో నాగచైతన్య నెవర్ బిఫోర్ లుక్‌లో కనిపించబోతున్నారు. మిథికల్ థ్రిల్లర్, సైన్స్ ఫిక్షన్‌గా రూపొందుతోన్న ఈ చిత్రంలో దక్ష అనే ఆర్కియాలజిస్ట్‌గా సరికొత్త పాత్రలో కనిపిస్తారు మీనాక్షీ చౌదరి. ఇటీవల విడుదల చేసిన ఆమె ఫస్ట్ లుక్‌కి మంచి స్పందన వచ్చింది. ఈ కథలో ఆమె పాత్ర చాలా క్రూషియల్‌గా ఉండబోతోందట. ఎమోషన్స్, పెర్ఫార్మెన్స్‌కి స్కోప్ ఉండే దక్ష క్యారెక్టర్ ఆమె కెరీర్‌లో ఓ మైలురాయిగా నిలవనున్నట్లు చిత్రయూనిట్ పేర్కొంది. ఈ సినిమా ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని పంచుతుందని మేకర్స్ తెలిపారు. ఈ సినిమాకి అజనీష్ బి. లోక్‌నాథ్ సంగీతం అందిస్తున్నారు.

యాక్షన్ అడ్వెంచర్

నిఖిల్ సిద్ధార్థ్ హీరోగా చందు మొండేటి దర్శకత్వంలో వచ్చిన 'కార్తికేయ' (2014), 'కార్తికేయ 2' (2022) చిత్రాలు ఎంత సూపర్ హిట్ అయ్యాయో ప్రత్యేకించి చెప్పక్కర్లేదు. ఒకదానికి మించి ఒకటి బ్లాక్ బస్టర్‌గా నిలిచాయి. 'కార్తికేయ 2'తో వందకోట్లకు పైగా వసూళ్లు సాధించారు నిఖిల్. కృష్ణతత్వం నేపథ్యంలో రూపుదిద్దుకున్న ఈ చిత్రంలో అనుపమ పరమేశ్వరన్, అనుపమ్ ఖేర్, హర్ష, శ్రీనివాసరెడ్డి కీలక పాత్రలు పోషించారు. కృష్ణతత్వాన్ని ఉద్దేశించి అనుపమ్ ఖేర్ చెప్పే డైలాగ్స్ సినిమాకే హైలైట్‌గా నిలిచిన సంగతి తెలిసిందే. ఈ చిత్రం దక్షిణాదితోపాటు బాలీవుడ్‌లోనూ సూపర్‌హిట్ అందుకుంది. అంతేకాదు... కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన 70వ జాతీయ చలన చిత్ర పురస్కారాల్లో ఉత్తమ ప్రాంతీయ తెలుగు చిత్రంగా 'కార్తికేయ 2' నిలిచింది. ఈ సినిమాకి కొనసాగింపుగా 'కార్తికేయ 3' చిత్రం ఉంటుందని మేకర్స్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ''సరికొత్త అడ్వెంచర్‌ను సెర్చ్ చేసే పనిలో డాక్టర్ కార్తికేయ నిమగ్నమయ్యారు. త్వరలో రానున్నాం'' అంటూ నిఖిల్ సిద్ధార్థ్ సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన విషయం విదితమే. సైన్స్ ఫిక్షన్‌గా రూపొందనున్న ఈ ప్రాజెక్ట్ స్క్రిప్ట్ పనులు జరుగుతున్నట్లు తెలుస్తోంది. 'కార్తికేయ, కార్తికేయ 2' చిత్రాలతో పోలిస్తే 'కార్తికేయ 3' మరింత భారీ బడ్జెట్‌తో ప్రతిష్టాత్మకంగా రూపొందనుందని ఫిల్మ్ నగర్ టాక్. ఇదిలా ఉంటే... నిఖిల్ సిద్ధార్థ్ హీరోగా నటిస్తోన్న తాజా చిత్రం 'స్వయంభు'. భరత్ కృష్ణమాచారి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో సంయుక్తా మీనన్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. భువన్, శ్రీకర్ నిర్మిస్తున్నారు. సోషియో ఫ్యాంటసీ జానర్‌లో తెరకెక్కుతోన్న ఈ సినిమాలో సైన్స్ ఫిక్షన్‌ని కూడా జోడించారట మేకర్స్. ఈ చిత్రం 2026 వేసవిలో విడుదల కానుందని టాక్.

హాలీవుడ్ స్థాయిలో...

'పుష్ప: ది రైజ్, పుష్ప 2: ది రూల్' వంటి చిత్రాలతో అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటారు అల్లు అర్జున్. అంతేకాదు... 'పుష్ప: ది రైజ్'కి గానూ ఉత్తమ నటుడిగా జాతీయ అవార్డు కూడా అందుకున్నారాయన. 'పుష్ప' ఫ్రాంచైజీ తర్వాత తమిళ దర్శకుడు అట్లీతో సినిమా చేస్తున్నారు అల్లు అర్జున్. వీరిద్దరి కాంబినేషన్‌లో రూపొందుతోన్న 'ఏఏ 22 ఏ 6'(వర్కింగ్ టైటిల్) చిత్రాన్ని కళానిధి మారన్ సమర్పణలో సన్ పిక్చర్స్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తోంది. ఈ చిత్రంలో హీరోయిన్‌గా బాలీవుడ్ నటి దీపికా పదుకోన్ ఫిక్స్ అయ్యారు. ఈ సినిమా కోసం లాస్ ఏంజిల్స్ వెళ్లి అక్కడ వీఎఫ్ఎక్స్ కంపెనీలతో, వీఎఫ్ఎక్స్ ఆర్టిస్టులతో సమావేశం అయింది చిత్రయూనిట్. సైన్స్ ఫిక్షన్ జానర్‌లో రూపొందుతోన్న ఈ సినిమా కోసం హాలీవుడ్ సినిమాలకు ధీటుగా ఓ కొత్త ప్రపంచం క్రియేట్ చేస్తోందట యూనిట్. పాన్ ఇండియా కాదు,.. పాన్ వరల్డ్ స్కేల్‌లో ఈ మూవీ రూపొందనుందనే వార్తలూ వినిపించాయి.

''పుష్ప' తర్వాత అల్లు అర్జున్ చేయబోయే సినిమా ఎలా ఉంటుంది? అనే ఆత్రుత అందరిలోనూ నెలకొంది. కొన్ని రోజులు వెయిట్ చేయండి. మీకు మేం ఓ కొత్త ప్రపంచం చూపించడానికి వర్క్ చేస్తున్నాం. ఇప్పటి వరకు మీరు చూడనిది వెండితెరపై చూపిస్తామని భరోసా ఇవ్వగలను. చాలా మంది హాలీవుడ్ టెక్నీషియన్లతో మేం వర్క్ చేస్తున్నాం. వాళ్లు సైతం తమకు ఈ సినిమా సవాల్‌గా ఉందని చెబుతున్నారు. అంటే మేం ఓ భారీ సినిమా చేస్తున్నామని అర్థం'' అంటూ అట్లీ పేర్కొన్న సంగతి తెలిసిందే. ''అల్లు అర్జున్ తిరుగులేని ఎనర్జీ, అట్లీ విజన్, దీపికా పదుకోన్ బ్రిలియంట్ పెర్ఫార్మెన్స్‌లతో ప్రపంచవ్యాప్తంగా సినీ ప్రేక్షకులకు ఐకానిక్‌గా 'ఏఏ 22 ఏ 6' సినిమాను రూపొందిస్తున్నాం'' అని సన్ పిక్చర్స్ సంస్థ పేర్కొంది. ఈ మూవీకి సాయి అభ్యంకర్ స్వరకర్త.

జనవరిలో ఆరంభం

కన్నడలో తెరకెక్కిన 'కాంతార' చిత్రంతో నటుడిగా, దర్శకుడిగా దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించారు రిషబ్ శెట్టి. ఆ సినిమాకి ప్రీక్వెల్‌గా రూపొందిన 'కాంతార: చాప్టర్ 1' చిత్రం ఈ అక్టోబర్ 2న పలు భాషల్లో రిలీజ్ అయి సూపర్ హిట్‌గా నిలిచింది. 'కాంతార'కు మించి వసూళ్లు సాధించింది ఈ మూవీ. రిషబ్ శెట్టి హీరోగా నటిస్తున్న స్ట్రైట్ తెలుగు చిత్రం 'జై హనుమాన్'. 'హను-మాన్' మూవీతో బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకున్నారు డైరెక్టర్ ప్రశాంత్ వర్మ. ఆ చిత్రానికి కొనసాగింపుగా 'జై హనుమాన్' చిత్రం రూపొందుతున్న సంగతి తెలిసిందే. ఈ మూవీలో హనుమంతుడి పాత్ర పోషిస్తున్నారు రిషబ్ శెట్టి. ''కాంతార : చాప్టర్ 1' విడుదలకు ముందే మరో సినిమాకు సైన్ చేయాలనుకోలేదు. కానీ, ప్రశాంత్ వర్మ చెప్పిన 'జై హనుమాన్' కథ నన్ను ఎంతలా ఆకట్టుకుందంటే, వెంటనే ఆయనకు ఓకే చెప్పాను. స్క్రిప్ట్ అద్భుతంగా ఉంది, కథ చాలా ఇంట్రెస్టింగ్‌గా ఉంది. ఇప్పటికే ఫొటోషూట్ పూర్తి చేశాం'' అంటూ ఇటీవల ఓ సందర్భంలో రిషబ్ శెట్టి పేర్కొన్నారు. ఇదిలా ఉంటే... ఈ సినిమాలో రానా కూడా నటించనున్నారనే వార్తలు వస్తున్నాయి. రిషబ్ శెట్టి, రానాతో కలిసి ఉన్న ఫొటోని ప్రశాంత్ వర్మ గతంలో షేర్ చేసిన సంగతి తెలిసిందే. దీంతో ఈ వార్తలకు మరింత బలం చేకూరింది. హనుమంతుడి పాత్ర పోషిస్తున్న రిషబ్ శెట్టిలాంటి నటుడికి ధీటుగా నిలబడాలంటే ఆ స్థాయి దేహం, ఆహార్యం ఉండాలంటే రానా కరెక్ట్ అని దర్శకుడి ఆలోచన అట. 'బాహుబలి'లో ప్రభాస్‌కు ధీటుగా భళ్లాలదేవుడి పాత్రలో రానా నటనను ప్రేక్షకులు అంత సులభంగా మర్చిపోలేరు. మరి... 'జై హనుమాన్'లో రానా పాత్ర ఏంటి? ఎలా ఉంటుంది? అన్నది తెలియాలంటే అధికారిక ప్రకటన వచ్చే వరకు వేచి చూడాలి. మైత్రీ మూవీ మేకర్స్‌పై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

ఏటిగట్టుపై అద్భుతం

'విరూపాక్ష, బ్రో' వంటి హిట్ సినిమాల తర్వాత సాయిదుర్గా తేజ్ నటించిన తాజా చిత్రం 'ఎస్‌వైజీ'(సంబరాల ఏటిగట్టు). నూతన దర్శకుడు రోహిత్ కేపీ దర్శకత్వం వహించిన ఈ సైన్స్ ఫిక్షన్ చిత్రంలో ఐశ్వర్యా లక్ష్మి హీరోయిన్. ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్‌పై 'హను-మాన్' వంటి బ్లాక్‌బస్టర్ మూవీ నిర్మించిన కె. నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి ఈ పాన్ ఇండియా ప్రాజెక్ట్‌ను నిర్మించారు. ఈ చిత్రం సెప్టెంబర్ 25న తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళంలో విడుదల కావాల్సి ఉండగా వాయిదా పడింది. అక్టోబరు 15న సాయిదుర్గా తేజ్ పుట్టినరోజు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో 'అసుర ఆగమన' పేరుతో విడుదల చేసిన ఈ మూవీ గ్లింప్స్‌కి అద్భుతమైన స్పందన వచ్చింది. ''నా జీవితంలో 'ఎస్‌వైజీ'(సంబరాల యేటిగట్టు) చిత్రం చాలా ముఖ్యమైనది. ఈ సినిమా కోసం నా సర్వస్వం ధారపోశాను. అద్భుతమైన క్వాలిటీతో సినిమా ఇవ్వాలని చాలా కష్టపడుతున్నాం. నిరంజన్, చైతన్యగార్లు ఖర్చుకి వెనకాడకుండా సపోర్ట్ చేశారు. డైరెక్టర్ రోహిత్ తీసిన ఈ సినిమా అద్భుతంగా ఉంటుంది.. అందరూ ఎంజాయ్ చేస్తారు. ఇది నా ప్రామిస్'' అంటూ ఇటీవల సాయిదుర్గా తేజ్ పేర్కొన్నారు. ఈ మూవీకి బి. అజనీష్ లోక్‌నాథ్ సంగీత దర్శకుడు.

పైన పేర్కొన్న సినిమాలే కాదు... మరికొన్ని చిత్రాలు కూడా సైన్స్ ఫిక్షన్ నేపథ్యంలో ప్రేక్షకులను అలరించేందుకు సమాయత్తం అవుతున్నాయి.

- దేరంగుల జగన్ మోహన్

ప్రీమియం ఎగ్జిక్యూటివ్ ఫీచర్లతో టాటా కర్వ్

- కర్వ్ అకెంప్లిష్డ్ వేరియంట్ ప్రారంభ ధర రూ.14.55 లక్షలు
- కర్వ్ ఈవీ అకెంప్లిష్డ్, ఎంపవర్డ్ వేరియంట్లు ధర రూ.18.49 లక్షలు

హైదరాబాద్: టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికల్స్ తన ఎస్‌యూవీ కర్వ్ మోడల్‌లో సరికొత్త ఎగ్జిక్యూటివ్ ఫీచర్లు ప్రవేశపెట్టింది. ఇందులో భాగంగా ప్రత్యేక ఇంజనీరింగ్ పద్ధతుల ద్వారా ఇంటీరియర్ స్పేస్ పెంచారు. భారతదేశంలోనే తొలిసారి పాసివ్ వెంటిలేషన్లు కలిగిన ఆర్–కంఫర్ట్ సీట్లు అందించారు. వెనుక సీట్లలో కూర్చునే వారి సౌకర్యాన్ని పెంచుతూ సెరినిటీ స్క్రీన్ సన్‌షేడ్‌లు, వెనుక ఆర్మ్ రెస్ట్‌లో ప్రత్యేక కప్ హోల్డర్‌లు జోడించారు. డ్యాష్‌బోర్డ్‌లో వైట్ కార్బన్ ఫైబర్ ఫినిష్, లలిత్‌పూర్ గ్రే రంగులోని ప్లష్ లెదరైట్ సీట్లతో క్యాబిన్‌కు ప్రీమియం లుక్‌ను అందించారు. ఇందులో ట్విన్–జోన్ క్లైమేట్ ఎయిర్ కండిషనింగ్ ఫీచర్ కూడా చేర్చారు. వాయిస్ ద్వారా కంట్రోల్ చేయగలిగే పనోరమిక్ సన్‌రూఫ్, మూడ్ లైటింగ్ ద్వారా పనిచేసే పవర్డ్ టెయిల్‌గేట్, 500 లీటర్ల సామర్థ్యం గల పెద్ద బూట్ స్పేస్ వంటి అనేక ఫీచర్లు ఇందులో ఉన్నాయి. 31.24 అంగుళాల సినిమాటిక్ టచ్‌స్క్రీన్ ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్, 9 స్పీకర్ జేబీఎల్ సౌండ్ సిస్టమ్‌లున్నాయి. కర్వ్ పెట్రోల్/డీజిల్, ఎలక్ట్రిక్ పవర్‌ట్రైన్లలో లభిస్తుంది. ఈ కారు 1.2 లీటర్ హైపీరియన్ పెట్రోల్ డైరెక్ట్ ఇంజెక్షన్, రెవొట్రాన్ పెట్రోల్ ఇంజిన్ , 1.5 లీటర్ క్రయోజెంట్ డీజిల్ ఇంజిన్ ఆప్షన్లలో లభిస్తుంది. ఇవి మాన్యువల్, ఆటోమేటిక్ గేర్‌బాక్స్ ఆప్షన్లతో వస్తాయి. లెవెల్–2 ఏడీఏఎస్ (అడ్వాన్స్‌డ్ డ్రైవర్ అసిస్టెంట్ సిస్టమ్స్)తో వస్తాయి. ఇది 5–స్టార్ భారత్ ఎన్‌సీఏపీ భద్రతా రేటింగ్‌ను పొందింది. ప్రీమియం ఎగ్జిక్యూటివ్ ఫీచర్లు జోడించినప్పటికీ, కర్వ్ ధరలు అందుబాటులోనే ఉన్నాయి. కర్వ్ అకెంప్లిష్డ్ వేరియంట్ రూ.14.55 లక్షల ప్రారంభ ధరతో లభిస్తుంది. కర్వ్ ఈవీ అకెంప్లిష్డ్, ఎంపవర్డ్ వేరియంట్లు రూ.18.49 లక్షల ప్రారంభ ధరతో లభిస్తాయి.

భారత ఉత్పత్తులకు మరింత పోటీతత్వం

- ఎంఎస్‌ఎంఈలకూ ప్రయోజనం
- ఎగుమతి ప్రోత్సాహకాలపై ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: అమెరికా టారిఫ్‌లను బలంగా ఎదుర్కొనేందుకు, ఎగుమతులను పెంచుకునేందుకు కేంద్ర కేబినెట్ రూ.45,000 కోట్ల ప్రోత్సాహకాలతో రెండు పథకాలకు ఆమోదం తెలిపింది. రూ.25,060 కోట్లతో ఎగుమతుల ప్రోత్సాహక మిషన్ (ఈపీఎం), రూ.20,000 కోట్లతో క్రెడిట్ గ్యారంటీ స్కీమ్ (సీజీఎస్‌ఈ) ఇందులో ఉన్నాయి. ఈపీఎం అన్నది భారత ఉత్పత్తుల పోటీతత్వాన్ని పెంచుతుందని, ఎంఎస్‌ఎంఈలు, మొదటిసారి ఎగుమతిదారులు, కార్మికులపై ఎక్కువగా ఆధారపడిన రంగాలకు ప్రయోజనం చేకూరుతుందని ప్రధాని మోదీ ఎక్స్ ప్లాట్‌ఫామ్‌పై ప్రకటించారు. ''ప్రపంచ మార్కెట్లో భారత్‌లో తయారీ మరింత మార్మోగుతుంది. కేంద్ర కేబినెట్ ఆమోదించిన ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ స్కీమ్ (ఈపీఎం) ఎగుమతుల పోటీతత్వాన్ని పెంచుతుంది. ఎంఎస్‌ఎంఈలు, మొదటిసారి ఎగుమతిదారులు, కార్మిక ఆధారిత రంగాలకు ప్రయోజనం లభిస్తుంది''అని పోస్ట్ చేశారు. క్రెడిట్ గ్యారంటీ స్కీమ్‌తో ఎగుమతిదారులు అంతర్జాతీయంగా మరింత పోటీపడగలరని, వ్యాపార కార్యకలాపాలను సాఫీగా నిర్వహించుకోగలరని అభిప్రాయపడ్డారు. సీజీఎస్‌ఈ పథకంతో ఎగుమతిదారులకు నగదు లభ్యత పెరుగుతుందని, ఎంఎస్‌ఎంఈలను బలోపేతం చేస్తుందని, ట్రిలియన్ డాలర్ల ఎగుమతుల లక్ష్యం సాధనను వేగవంతం చేస్తుందని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా పేర్కొన్నారు.

సవాళ్లకు పరిష్కారం..

దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న రెండు ప్రధాన సమస్యలు.. అందుబాటు ధరలకే రుణాలు, నిబంధనల సంక్లిష్టత, బ్రాండింగ్ అంతరాయాలకు కేంద్రం ప్రకటించిన పథకాలు పరిష్కారం చూపిస్తాయని సీఐఐ ఎగుమతుల కమిటీ చైర్మన్ సంజయ్ బుధియా అభిప్రాయపడ్డారు. ఎంఎస్‌ఎంఈలకు కొత్త అవకాశాలు కల్పిస్తాయన్నారు. ''రుణ లభ్యతను పెంచుతాయి. మార్కెట్ సన్నద్ధత, దేశ ఎగుమతులు బలపడతాయి. పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు అందుబాటులోకి వస్తాయి. దేశ ఎగుమతుల వృద్ధికి తాజా ప్రేరణ లభిస్తుంది''అని అప్పారెల్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ (ఏఈపీసీ) వైస్ చైర్మన్ ఎ.శక్తివేల్ అభిప్రాయపడ్డారు. రుణ సదుపాయం, నిబంధనల అమలులో సమస్యలను ఎదుర్కొనే ఎంఎస్‌ఎంఈలకు ఈ పథకాలు సాధికారత కల్పిస్తాయని ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఎక్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్ ప్రెసిడెండ్ ఎస్.సి. రల్హాన్ పేర్కొన్నారు. ఎగుమతుల రంగంలో 85 శాతం ఎంఎస్‌ఎంఈలేనని, 2047 నాటికి 100 బిలియన్ డాలర్ల ఎగుమతుల లక్ష్యం సాధ్యపడుతుందని రత్నాభరణాల ఎగుమతుల ప్రోత్సాహక మండలి పేర్కొంది.

స్థిరంగా టెక్స్‌టైల్స్ ఎగుమతులు

111 దేశాలకు మాత్రం 10 శాతం వృద్ధి

న్యూఢిల్లీ: అంతర్జాతీయంగా ఎన్నో సవాళ్లతో కూడిన వాతావరణం మధ్య దేశ టెక్స్‌టైల్ ఎగుమతులు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలల్లో (ఏప్రిల్–సెప్టెంబర్) ఫ్లాట్‌గా నమోదయ్యాయి. క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో పోల్చి చూస్తే 0.1 శాతమే పెరిగాయి. కానీ, 111 దేశాలకు మాత్రం 10 శాతం అధికంగా 8,489 మిలియన్ డాలర్ల ఎగుమతులు నమోదయ్యాయి. క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో ఈ దేశాలకు ఎగుమతులు 7,718 మిలియన్ డాలర్లుగా ఉన్నాయి. యూఏఈకి 14.5 శాతం, యూకేకి 1.5 శాతం, జపాన్‌కు 19 శాతం, జర్మనీకి 2.9 శాతం, స్పెయిన్‌కు 9 శాతం, ఫ్రాన్స్‌కు 9.2 శాతం చొప్పున ఎగుమతులు పెరిగాయి. ఈజిప్ట్‌కు 27 శాతం, సౌదీ అరేబియాకి 12.5 శాతం, హాంగ్‌కాంగ్‌కు 69 శాతం అధికంగా టెక్స్‌టైల్ ఎగుమతులు జరిగాయి. రెడీ మేడ్ గార్మెంట్స్ (ఆర్‌ఎంజీ) ఎగుమతులు 3.4 శాతం పెరగ్గా, జ్యూట్ ఎగుమతులు 5.56% అధికంగా నమోదయ్యాయి. టెక్స్‌టైల్స్ పరిశ్రమ పోటీతత్వం, మార్పుల స్వీకరణకు ఈ పనితీరు అద్దం పడుతుందని కేంద్ర టెక్స్‌టైల్స్ శాఖ పేర్కొంది.

రెండేళ్లలో బ్యాంకింగ్ ఆధునీకరణ పూర్తి

ఎస్‌బీఐ ఎండీ అశ్విని కుమార్ తివారీ వెల్లడి

సింగపూర్: అనుబంధ సంస్థ ఎస్‌బీఐ పేమెంట్స్ సర్వీసెస్‌తో పాటు తమ కోర్–బ్యాంకింగ్ మౌలిక సదుపాయాల ఆధునీకరణ ప్రక్రియను వచ్చే రెండేళ్లలో పూర్తి చేయాలని ప్రభుత్వ రంగ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఇందుకోసం నాలుగు రకాల వ్యూహాన్ని అమలు చేస్తున్నట్లు బ్యాంక్ ఎండీ (కార్పొరేట్ బ్యాంకింగ్, సబ్సిడరీస్) అశ్విని కుమార్ తివారీ తెలిపారు. హార్డ్‌వేర్‌ను అప్‌గ్రేడ్ చేసుకోవడం, యూనిక్స్ నుంచి లినక్స్‌కి మారడం, మైక్రోసర్వీసులను ప్రవేశపెట్టడం మొదలైనవి వీటిలో ఉన్నట్లు సింగపూర్ ఫిన్‌టెక్ ఫెస్టివల్‌లో పాల్గొన్న సందర్భంగా ఆయన వివరించారు. డేటా భద్రత, నియంత్రణ సంస్థ నిర్దేశిత నిబంధనలను పాటిస్తూనే కార్యకలాపాల విస్తరణకు ఉపయోగపడేలా ప్రైవేట్ క్లౌడ్ మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేసుకుంటున్నట్లు తివారీ వివరించారు. సిస్టమ్‌లు అన్నివేళలా కస్టమర్లకు అందుబాటులో ఉండేలా చూసుకుంటూనే వాటిని ఆధునీకరిస్తున్నట్లు చెప్పారు. ఫిన్‌టెక్ వ్యవస్థతో పోటీపడటం కాకుండా వాటితో కలిసి పని చేసే విధానానికి మళ్లుతున్నట్లు వివరించారు. కొత్త ఆవిష్కరణలను ప్రోత్సహించే దిశగా శాండ్‌బాక్స్, ఇన్నోవేషన్ హబ్‌లను ఎస్‌బీఐ ఏర్పాటు చేసినట్లు తివారీ చెప్పారు. ఫిన్‌టెక్‌లు తమ సొల్యూషన్స్‌ను టెస్ట్ చేసి, ఎస్‌బీఐ సిస్టమ్‌లకు అనుసంధానించేందుకు వీలుగా 300 పైగా ఏపీఐలను అందుబాటులో ఉంచినట్లు వివరించారు.

వియత్నాం స్టీల్ ఉత్పత్తులపై యాంటీ డంపింగ్ సుంకం

ఐదేళ్ల పాటు అమల్లో

న్యూఢిల్లీ: వియత్నాం నుంచి వచ్చే చౌక స్టీల్ దిగుమతులను కట్టడి చేసేందుకు కేంద్ర సర్కారు యాంటీ డంపింగ్ డ్యూటీ విధించింది. హాట్ రోల్డ్ స్టీల్ ఉత్పత్తులు టన్నుపై 121.55 డాలర్ల సుంకాన్ని ప్రకటించింది. చౌక ఉత్పత్తుల నుంచి దేశీ తయారీదారులను కాపాడేందుకు ఈ చర్య తీసుకుంది. డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ట్రేడ్ రెమిడీస్ (డీజీటీఆర్) సిఫారసు మేరకు కేంద్ర ఆర్థిక శాఖ ఇందుకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఐదేళ్ల పాటు ఇది అమల్లో ఉంటుంది. చౌక దిగుమతులపై దర్యాప్తు చేయాలన్న దేశీ పరిశ్రమ చేసిన వినతి మేరకు డీజీటీఆర్ విచారణ చేసి, యాంటీ డంపింగ్ డ్యూటీ విధింపునకు సిఫారసు చేసింది. భారత్–వియత్నాం మధ్య 2023–24లో ద్వైపాక్షిక వాణిజ్య 14.81 బిలియన్ డాలర్లుగా ఉంది. భారత్ 5.47 బిలియన్ డాలర్ల విలువ మేర ఎగుమతులు చేసింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో) 14-11-2025	
విశాఖ	595–00
చిత్తూరు	643–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	610–00
విజయవాడ	600–00
రిటైల్ ధర (డజను)	84.00
హైదరాబాద్	600–00
వరంగల్	602–00
రిటైల్ ధర	6.60

నిఫ్టీ 50 — టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
ASIANPAINT	2,874.30	3.77
HINDALCO	814	2.47
INDIGO	5,911.00	1.99
ICICIBANK	1,385.40	1.95
LT	4,005.00	1.27

నిఫ్టీ 50 — టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
ETERNAL	297.4	-3.69
TMCV	320.1	-2.84
M&M	3,699.40	-1.46
EICHERMOT	6,796.50	-1.2
TATASTEEL	176.55	-1.15

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్‌ఈ	9,917
ఎన్‌ఎస్‌ఈ	1,10,638
ఎన్‌ఎస్‌ఈ(డెరివేటివ్స్)	1,60,674
ఎఫ్‌ఐఐ	- 384
డీఐఐ	+ 3,092

ముడిచమురు... (బ్యారెల్)

	రాత్రి 11.30కు		క్రితం ముగింపు
నైమెక్స్ లైట్ స్వీట్	58.90	$	58.49
బ్రెంట్	63.18	$	62.71

ఆర్‌ఇన్‌ఫ్రా, ఆర్‌పవర్ ఉద్యోగులకు ఎసాప్స్

2,500 మందికి వర్తింపు

న్యూఢిల్లీ: రిలయన్స్ గ్రూప్ తొలిసారిగా తమ గ్రూప్‌లోని రెండు సంస్థల ఉద్యోగులకు స్టాక్ ఆప్షన్స్‌ను (ఎసాప్స్) ప్రకటించింది. రిలయన్స్ ఇన్‌ఫ్రా (ఆర్‌ఇన్‌ఫ్రా), రిలయన్స్ పవర్‌లోని 2,500 మంది ఉద్యోగులకు ఇవి లభిస్తాయని ఒక ప్రకటనలో తెలిపింది. దీని ప్రకారం రూ. 10 ముఖ విలువ గల షేరును అదే విలువకు ఉద్యోగులకు కేటాయిస్తారు. దీర్ఘకాలంగా, నమ్మకంగా కొనసాగుతున్న చాలామటుకు ఉద్యోగుల సేవలకు గుర్తింపుగా నవంబర్ 3న ఎసాప్స్ ప్రతిపాదనకు షేర్‌హోల్డర్లు ఆమోదం తెలిపినట్లు కంపెనీ వివరించింది. రిలయన్స్ గ్రూప్‌లో 28,000 మంది ఉద్యోగులు, రూ. 1,07.123 కోట్ల అసెట్స్ ఉన్నాయి.

డీహెచ్‌ఎల్ గ్రూప్ బిలియన్ యూరోల పెట్టుబడులు

2030 నాటికి ఇన్వెస్ట్ చేయాలనే ప్రణాళిక

ముంబై: అంతర్జాతీయ లాజిస్టిక్స్ కంపెనీ డీహెచ్‌ఎల్ గ్రూప్ భారత్‌లో 2030 నాటికి బిలియన్ యూరోలను (రూ.10,400 కోట్లు సుమారుగా) ఇన్వెస్ట్ చేయనున్నట్టు ప్రకటించింది. తద్వారా ఇక్కడి కస్టమర్లకు మరిత నమ్మకమైన రవాణా పరిష్కారాలను అందించనున్నట్టు పేర్కొంది. వ్యాపార వృద్ధికి భారత్‌ను కీలక మార్కెట్‌గా పరిగణిస్తున్నట్టు తెలిపింది. అంతర్జాతీయ వాణిజ్యంలో సమస్యలు నెలకొన్నప్పటికీ, భారత మార్కెట్ పట్ల విశ్వాసంతో ఉన్నట్టు పేర్కొంది. ఇక్కడి వైవిధ్యమైన, వ్యాపార అనుకూల విధానాలను ప్రస్తావించింది. బిలియన్ యూరోలను లైఫ్ సైన్సెస్, హెల్త్ కేర్, న్యూ ఎనర్జీ, ఈ–కామర్స్, డిజిటలైజేషన్‌పై వెచ్చించనున్నట్టు పేర్కొంది. బివాండిలో మొదటి హెల్త్ లాజిస్టిక్స్ హబ్, బిజ్వాసన్‌లో బ్లూడార్ట్ కోసం సమగ్ర నిర్వహణ కేంద్రం (తక్కువ ఉద్గారాలతో కూడిన), ఢిల్లీలో డీహెచ్‌ఎల్ ఎక్స్‌ప్రెస్ కోసం మొదటి ఆటోమేటిక్ సార్టింగ్ కేంద్రం, ఇండోర్‌లో ఐటీ సేవల కేంద్రం (కంపెనీకి భారత్‌లో ఐదవది), చెన్నై, ముంబైలో ఎలక్ట్రిక్ వెహికల్ అండ్ బ్యాటరీ లాజిస్టిక్స్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ఏర్పాటు చేయనున్నట్టు డీహెచ్‌ఎల్ గ్రూప్ వెల్లడించింది.

నెట్ న్యూట్రాలిటీ నిబంధనలు సడలించండి

ట్రాయ్‌కి రిలయన్స్ జియో వినతి

న్యూఢిల్లీ: 5జీ సాంకేతికత రాకతో అంతర్జాతీయంగా మార్కెట్లలో మార్పులు, టెక్నాలజీ పురోగతికి అనుగుణంగా నెట్ న్యూట్రాలిటీ నిబంధనలను సడలించాలని టెలికం రంగ నియంత్రణ సంస్థ ట్రాయ్‌ని రిలయన్స్ జియో కోరింది. దేశవ్యాప్తంగా 5జీ సేవల విస్తరణతో, గేమింగ్ కోసం తక్కువ లేటెన్సీ ఉండే విధంగా, అప్‌లోడ్స్ కోసం వేగం ఎక్కువగా ఉండేలా వివిధ అవసరాలకు తగ్గ వేగంతో ఇంటర్నెట్ లభ్యత ఉండేలా ప్రోడక్టులను రూపొందించాలనే ప్రతిపాదనలు వస్తున్నాయని వివరించింది. బ్రిటన్ నియంత్రణ సంస్థ ఆఫ్‌కామ్ కూడా ప్రత్యేక సర్వీసులు, ప్రీమియం నాణ్యత గల ఇంటర్నెట్ సర్వీసులను అందించేందుకు అనుమతిస్తోందని పేర్కొంది. ఈ నేపథ్యంలో దేశీయంగ కఠినతరమైన నిబంధనలను సడలించాలని కోరింది. జియో, ఎయిర్‌టెల్‌లాంటి ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్లు ఏ ఒక్క యాప్, వెబ్‌సైట్ లేదా సర్వీసులపై పక్షపాతం చూపకుండా అన్నింటినీ ఒకే దృష్టితో చూస్తూ, ఒకే రకమైన వేగంతో అందించాలని నెట్ న్యూట్రాలిటీ నిబంధనలు నిర్దేశిస్తున్నాయి.

ఎంఎస్‌ఎంఈల ప్రగతికి నిబంధనల అడ్డుగోడలు

- నియంత్రణల పరమైన జాప్యం
- రాష్ట్రాల స్థాయిలో సంస్కరణలు అవసరం
- అసోచామ్ నివేదిక వెల్లడి



న్యూఢిల్లీ: నిబంధనల అమలుకు అధిక వ్యయం చేయాల్సి రావడం, నియంత్రణలపరమైన జాప్యం, అనుమతులకు సింగిల్ విండో వ్యవస్థ లేకపోవడం దేశ ఎంఎస్‌ఎంఈలు వాటి పూర్తి సామర్థ్యాలను చేరుకోలేకపోవడానికి అవరోధాలుగా అసోచామ్ నివేదిక పేర్కొంది. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థలు (ఎంఎస్‌ఎంఈలు) వాటి పూర్తి సామర్థ్యం మేర రాణించేందుకు వీలుగా రాష్ట్రాల స్థాయిలో సంస్కరణలను వేగవంతం చేయాల్సిన అవసరాన్ని సూచించింది. జీఎస్‌టీ సంబంధిత అవరోధాలు, రిజిస్ట్రేషన్ ప్రక్రియ సంక్లిష్టంగా ఉండడం, రిఫండ్‌ల్లో జాప్యాలు, ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ)లో సమస్యలు, లాజిస్టిక్స్ (రవాణా), మౌలిక వసతుల పరమైన అవరోధాలు, ఇ–వే బిల్లుల్లో సమస్యలతోపాటు.. పశ్చిమబెంగాల్, ఒడిశాలో విద్యుత్ సరఫరా పరమైన సమస్యలు ఉత్పత్తి నష్టాలకు కారణమవుతున్నట్టు తెలిపింది. కంపెనీల చట్టం, భారతీయ ప్రమాణాల మండలి (బీఐఎస్) నిబంధనలు ఎంఎస్‌ఎంఈలకు భారంగా మారాయంటూ.. ప్రక్రియలు ఎంతో సంక్లిష్టంగా ఉండడం, సర్టిఫికేషన్ జారీలో జాప్యం, ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ నిబంధనల్లో అస్పష్టతలను సైతం ఎంఎస్‌ఎంఈలు రాణించడానికి అవరోధాలుగా ప్రస్తావించింది.

సింగిల్ విండో వ్యవస్థ

సకాలంలో అనుమతులు, ప్రక్రియలు పూర్తి చేసే సింగిల్ విండో వ్యవస్థ ఎంఎస్‌ఎంఈ పరిశ్రమ ముఖచిత్రాన్ని మార్చేస్తుందని, రాష్ట్రాల స్థాయిలో పెట్టుబడుల వాతావరణం మెరుగుపడుతుందని అసోచామ్ నివేదిక సూచించింది. పశ్చిమబెంగాల్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో సింగిల్ విండో వ్యవస్థను వెంటనే అమల్లోకి తీసుకురావాలని కోరింది. జాతీయ స్థాయిలోనూ చిన్న వ్యాపార సంస్థలకు నిబంధనల అమలును సమూలంగా మార్చేయాలని పేర్కొంది. చిన్న సంస్థలకు తప్పనిసరి ఆడిట్ నుంచి మినహాయింపులు కల్పించాలని, గ్రేడ్ వారీగా పెనాల్టీ వ్యవస్థ ఉండాలని సూచించింది. అనుమతులను క్రమబద్ధీకరించడం, జీఎస్‌టీ సంస్కరణలు, భూ వినియోగ మార్పిడి అనుమతులను సకాలంలో మంజూరు చేయడం, సౌకర్యవంతమైన కార్మిక చట్టాలను అమలు చేయాలని కోరింది. అలాగే మౌలిక వసతులను మెరుగుపరచాలని, సులభతర ఇ–వే బిల్లు విధానాన్ని, ప్రత్యేకమైన లాజిస్టిక్స్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించింది.

క్యూ2 ఆర్థిక ఫలితాలు

వోల్టాస్ లాభం నేలచూపు

క్యూ2లో రూ. 32 కోట్లు

న్యూఢిల్లీ: ఏసీల తయారీ, ఇంజనీరింగ్ సర్వీసుల దిగ్గజం వోల్టాస్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025–26) రెండో త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జూలై–సెప్టెంబర్(క్యూ2)లో నికర లాభం 76 శాతంపైగా క్షీణించి రూ. 32 కోట్లకు పరిమితమైంది. మందగించిన వేసవి సీజన్‌కుతోడు జీఎస్‌టీ రేట్ల సవరణలతో వినియోగదారుల కొనుగోళ్లు వాయిదా పడటం ప్రభావం చూపినట్లు టాటా గ్రూప్ కంపెనీ పేర్కొంది. గతేడాది(2024–25) ఇదే కాలంలో రూ. 133 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం 10 శాతం క్షీణించి రూ. 2,347 కోట్లను తాకింది. గత క్యూ2లో రూ. 2,619 కోట్ల అమ్మకాలు అందుకుంది. అయితే మొత్తం వ్యయాలు 7 శాతం తగ్గి రూ. 2,321 కోట్లకు చేరాయి. ఇతర ఆదాయంతో కలిసి మొత్తం టర్నోవర్ 11 శాతం నీరసించి రూ. 2,412 కోట్లకు పరిమితమైంది.

ఫలితాల నేపథ్యంలో వోల్టాస్ షేరు బీఎస్‌ఈలో 0.2 శాతం బలపడి రూ. 1,337 వద్ద ముగిసింది.

హీరో మోటోకార్ప్ లాభం స్పీడ్

క్యూ2లో రూ. 1,309 కోట్లు

న్యూఢిల్లీ: ద్విచక్ర వాహన రంగ దిగ్గజం హీరో మోటో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26) రెండో త్రైమాసికంలో ఆకర్షణీయ ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జూలై–సెప్టెంబర్(క్యూ2)లో నికర లాభం 23 శాతం జంప్‌చేసి రూ. 1,309 కోట్లను తాకింది. వాహన అమ్మకాలలో వృద్ధి ఇందుకు సహకరించింది. గతేడాది(2024–25) ఇదే కాలంలో రూ. 1,064 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 10,483 కోట్ల నుంచి రూ. 12,218 కోట్లకు ఎగసింది. వాహన అమ్మకాలు 11 శాతం పుంజుకుని 16.91 లక్షల యూనిట్లకు చేరాయి. గత క్యూ2లో 15.2 లక్షల యూనిట్లను విక్రయించింది.

హీరో మోటో షేరు బీఎస్‌ఈలో 0.4 % నీరసించి రూ. 5,507 వద్ద ముగిసింది.

ముత్తూట్ ఫైనాన్స్ బలమైన పనితీరు

87 శాతం ఎగసిన లాభం

న్యూఢిల్లీ: బంగారం తనఖా రుణ వ్యాపారంలోని ముత్తూట్ ఫైనాన్స్ సెప్టెంబర్ త్రైమాసికంలో పటిష్ట పనితీరు చూపించింది. లాభం క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూస్తే 87 శాతం ఎగసి రూ.2,345 కోట్లుగా నమోదైంది. క్రితం ఏడాది ఇదే కాలంలో లాభం రూ.1,251 కోట్లుగా ఉంది. ఆదాయం క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో ఉన్న రూ.4,126 కోట్ల నుంచి రూ.6,461 కోట్లకు వృద్ధి చెందింది. వడ్డీ ఆదాయం రూ.4,068 కోట్ల నుంచి రూ.6,304 కోట్లకు దూసుకుపోయింది. వ్యయాలు రూ.2,418 కోట్ల నుంచి రూ.3,309 కోట్లకు పెరిగాయి. కంపెనీ నిర్వహణలోని బంగారం రుణ ఆస్తుల విలువ 10 శాతం (రూ.11,723 కోట్లు) పెరిగింది. ఫలితాల

కంపెనీ షేరు ధర గురువారం 2 % లాభపడి రూ.3,391 వద్ద ముగిసింది.

ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ లాభం డౌన్

క్యూ2లో రూ. 389 కోట్లు

న్యూఢిల్లీ: అప్లయెన్సెస్, కన్జూమర్ ఎలక్ట్రానిక్స్ దిగ్గజం ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26) రెండో త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. జూలై–సెప్టెంబర్(క్యూ2)లో నికర లాభం 27 శాతంపైగా క్షీణించి రూ. 389 కోట్లకు పరిమితమైంది. గతేడాది(2024–25) ఇదే కాలంలో రూ. 536 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం మాత్రం నామమాత్ర వృద్ధితో రూ. 6,174 కోట్లను తాకింది. గత క్యూ2లో రూ. 6,114 కోట్ల అమ్మకాలు సాధించింది. అయితే మొత్తం వ్యయాలు 5 శాతం పెరిగి రూ. 5,729 కోట్లకు చేరాయి.

ఫలితాల నేపథ్యంలో కంపెనీ షేరు బీఎస్‌ఈలో 1.2 శాతం బలపడి రూ. 1,674 వద్ద ముగిసింది.

ఐషర్ మోటార్స్ లాభం జూమ్

క్యూ2లో రూ. 1,369 కోట్లు

న్యూఢిల్లీ: వాణిజ్య వాహన రంగ దిగ్గజం ఐషర్ మోటార్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26) రెండో త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జూలై–సెప్టెంబర్(క్యూ2)లో నికర లాభం 24 శాతం ఎగసి రూ. 1,369 కోట్లను తాకింది. వివిధ విభాగాల అమ్మకాలలో వృద్ధి ఇందుకు సహకరించింది. గతేడాది(2024–25) ఇదే కాలంలో రూ. 1,100 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం మరింత అధికంగా 45 శాతం జంప్‌చేసి రూ. 6,172 కోట్లకు చేరింది. గత క్యూ2లో రూ. 4,263 కోట్ల అమ్మకాలు అందుకుంది. వోల్వో గ్రూప్ భాగస్వామ్య సంస్థ వీఈ కమర్షియల్ వెహికల్స్(వీఈసీవీ) ఆదాయం 10 శాతం పుంజుకుని రూ. 6,106 కోట్లయ్యింది. ఈ విభాగం వాహన విక్రయాలు 20,774 యూనిట్ల నుంచి 21,901 యూనిట్లకు ఎగశాయి.

ఫలితాల నేపథ్యంలో కంపెనీ షేరు బీఎస్‌ఈలో 0.7 శాతం క్షీణించి రూ. 6,831 వద్ద ముగిసింది.

సహజ యామలపల్లి, ప్రార్థన, రియా భాటియా, నాన్ ప్లేయింగ్ కెప్టెన్ విశాల్ ఉప్పల్, అంకిత రైనా, శ్రీవల్లి రష్మిక

విజయోస్తు!

- నేటి నుంచి బిల్లీ జీన్ కింగ్ కప్ ప్లే ఆఫ్ టోర్నీ
- స్లొవేనియా, నెదర్లాండ్స్ జట్లతో ఆడనున్న భారత్
- సహజ, శ్రీవల్లి రష్మికలపైనే ఆశలు
- గ్రూప్ 'జి' విజేత జట్టు వచ్చే ఏడాది క్వాలిఫయర్స్‌కు అర్హత

బెంగళూరు: కొత్త చరిత్ర సృష్టించేందుకు భారత మహిళల టెన్నిస్ జట్టు సిద్ధమవుతోంది. ప్రతిష్టాత్మక బిల్లీ జీన్ కింగ్ కప్ ప్లే ఆఫ్ టోర్నీలో భారత జట్టు బరిలోకి దిగుతోంది. నేటి నుంచి మూడు రోజులపాటు ఈ మెగా టోర్నీ భారత్ వేదికగా తొలిసారి జరగనుంది. గ్రూప్ 'జి'లో ఆతిథ్య భారత్‌తోపాటు స్లొవేనియా, నెదర్లాండ్స్ జట్లున్నాయి. మూడు జట్ల మధ్య రౌండ్ రాబిన్ లీగ్ మ్యాచ్‌లు జరుగుతాయి. గ్రూప్ 'జి' విజేత జట్టు వచ్చే ఏడాది బిల్లీ జీన్ కింగ్ కప్ క్వాలిఫయర్స్‌కు అర్హత సాధిస్తుంది. మిగతా రెండు జట్లు రీజినల్ గ్రూప్–1 టోర్నీలో ఆడతాయి. ఈ ఏడాది ఏప్రిల్‌లో పుణేలో జరిగిన రీజినల్ గ్రూప్–1లో భారత జట్టు రెండో స్థానంలో నిలిచి 2021 తర్వాత రెండోసారి ప్లే ఆఫ్ మ్యాచ్‌కు అర్హత పొందింది. అయితే లాత్వియాతో జరిగిన ప్లే ఆఫ్ మ్యాచ్‌లో భారత్ 1–3తో ఓడిపోయింది. శుక్రవారం తొలి రోజు స్లొవేనియా, నెదర్లాండ్స్ జట్ల మధ్య మ్యాచ్ జరుగుతుంది. ఆ తర్వాత శనివారం స్లొవేనియాతో... ఆదివారం నెదర్లాండ్స్‌తో భారత్ ఆడుతుంది. ర్యాంకింగ్ పరంగా స్లొవేనియా, నెదర్లాండ్స్ జట్లకంటే వెనుకబడి ఉన్నప్పటికీ సొంతగడ్డపై భారత్ నుంచి అద్భుతాన్ని ఆశించవచ్చు. భారత ఆశలన్నీ సింగిల్స్ ప్లేయర్లు, హైదరాబాద్‌కు చెందిన సహజ యామలపల్లి, భమిడిపాటి శ్రీవల్లి రష్మికలపైనే ఆధారపడి ఉన్నాయి. ఆసియా ఓసియానియా గ్రూప్–1 టోర్నీలో రష్మిక విశేషంగా రాణించింది. ఆడిన ఐదు మ్యాచ్‌ల్లోనూ విజయం సాధించి భారత్‌కు ప్లే ఆఫ్ బెర్త్ దక్కడంలో తనవంతు పాత్రను పోషించింది. మరోవైపు సహజ యామలపల్లి కొన్నాళ్లుగా నిలకడగా రాణిస్తోంది. ఇటీవల మెక్సికోలో జరిగిన డబ్ల్యూటీఏ–125 టోర్నీలో 2017 యూఎస్ ఓపెన్ చాంపియన్, అమెరికా స్టార్ స్లోన్ స్టీఫెన్స్‌ను సహజ ఓడించి సంచలనం సృష్టించింది. అదే తరహా ప్రదర్శనను సహజ సొంతగడ్డపై పునరావృతం చేయాలని పట్టుదలతో ఉంది. సహజ, రష్మికలతోపాటు అంకిత రైనా, రియా భాటియా, ప్రార్థన తొంబారే భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నారు. సింగిల్స్‌లో సహజ, రష్మిక బరిలోకి దిగనుండగా... డబుల్స్‌లో అంకిత రైనా, రియా భాటియా, ప్రార్థన ఆడనున్నారు. 'మేము చరిత్ర సృష్టించాలనే అంశంపై ఎక్కువగా దృష్టి పెట్టడం లేదు. మా అత్యుత్తమ ఆటతీరు ప్రదర్శించాలనే లక్ష్యంతో ఉన్నాం. మేము ఆడాల్సిన రెండు జట్లు పటిష్టమైనవి. వారిపై ఎలా నెగ్గాలనే దానిపై ప్రణాళికలు రచించాం. వాటిని మైదానంలో అమలు చేయాలి. మా నియంత్రణలో ఉన్న వాటిపై ఆలోచిస్తాం. మా పరిధిలో లేని వాటి గురించి ఆలోచించదల్చుకోలేదు' అని భారత మహిళల జట్టు నాన్ ప్లేయింగ్ కెప్టెన్ విశాల్ ఉప్పల్ తెలిపాడు.



కోల్‌కతా నైట్‌రైడర్స్ అసిస్టెంట్ కోచ్‌గా షేన్ వాట్సన్

కోల్‌కతా: కోల్‌కతా నైట్‌రైడర్స్ (కేకేఆర్) కోచింగ్ బృందంలో ఆస్ట్రేలియా మాజీ ఆల్‌రౌండర్ షేన్ వాట్సన్ చేరాడు. వచ్చే సీజన్ కోసం అతన్ని అసిస్టెంట్ కోచ్‌గా నియమించుకున్నట్లు ఫ్రాంచైజీ వర్గాలు వెల్లడించాయి. 'వాట్సన్‌కు కేకేఆర్ కుటుంబం స్వాగతం పలుకుతోంది. ప్లేయర్‌గా, కోచ్‌గా ఈ ఆస్ట్రేలియన్‌కున్న విశేషానుభవం తమ జట్టుకు ఎంతగానో ఉపయోగపడుతుంది. ఆటగాడిగా నిరూపించుకున్న అతని కోచింగ్‌లో మా జట్టు సన్నాహాలు మరో స్థాయిలో ఉంటాయని ఆశిస్తున్నాం. అతని సేవలతో మా జట్టు ఉన్నతశిఖరాలు అధిరోహిస్తుందనే నమ్మకంతో ఉన్నాం' అని కోల్‌కతా ఫ్రాంచైజీ సీఈఓ వెంకీ మైసూర్ అన్నారు. తన నియామకం పట్ల ఆనందం వ్యక్తం చేసిన వాట్సన్... కేకేఆర్ బృందంలో చేరేందుకు ఎంతో ఉత్సాహంతో ఎదురుచూస్తున్నట్లు చెప్పాడు. కోల్‌కతా మరోసారి టైటిల్ గెలిచేందుకు తనవంతు కృషి చేస్తానన్నాడు. ఈ మాజీ ఆల్‌రౌండర్ కంగారూ తరఫున 59 టెస్టులు, 190 వన్డేలు, 58 టి20లు ఆడాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో అన్ని ఫార్మాట్లలో కలిపి 10వేల పైచిలుకు పరుగులు, 280 వికెట్లు తీశాడు. 2007, 2015 వన్డే ప్రపంచకప్ విజేత జట్టు సభ్యుడిగా ఉన్నాడు. ఐపీఎల్‌లోనూ వాట్సన్‌ది సుదీర్ఘమైన కెరీర్ అని చెప్పొచ్చు. ప్రారంభ ఐపీఎల్ సీజన్ 2008 నుంచి 2020 వరకు 12 ఏళ్ల పాటు లీగ్ క్రికెట్ ఆడాడు. రాజస్తాన్ రాయల్స్, చెన్నై సూపర్‌కింగ్స్ టైటిళ్లలోనూ భాగమయ్యాడు. రాయల్ చాలెంజర్స్ బెంగళూరుకు సైతం అతను ప్రాతినిధ్యం వహించాడు.

రుతురాజ్ శతకం

దక్షిణాఫ్రికా 'ఎ' జట్టుపై భారత్ 'ఎ' విజయం

రుతురాజ్

రాజ్‌కోట్: అనధికారిక వన్డే సిరీస్‌లో భారత్ 'ఎ' జట్టు శుభారంభం చేసింది. ఓపెనర్ రుతురాజ్ గైక్వాడ్ (129 బంతుల్లో 117; 12 ఫోర్లు) వీరోచిత శతకం సాధించడంతో ఠాకూర్ తిలక్‌వర్మ నేతృత్వంలోని భారత్ 'ఎ' జట్టు 4 వికెట్ల తేడాతో దక్షిణాఫ్రికా 'ఎ' జట్టుపై విజయం సాధించింది. టాస్ నెగ్గి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన సఫారీ జట్టును భారత సీమర్లు అర్ష్‌దీప్ సింగ్ (2/59), ప్రసిధ్ కృష్ణ (1/57) వణికించారు. దీంతో ఖాతా తెరువక ముందే రుబిన్ హెర్మన్ (0)తో పాటు తిలక్ చక్కని త్రోకు జోర్డాన్ హెర్మన్ (0) డకౌటయ్యారు. స్కోరు బోర్డులో ఒక పరుగు చేరగానే కెప్టెన్ అకెర్మన్ (0) కూడా సున్నాకే ప్రసిధ్ కృష్ణ బౌలింగ్‌లో వెనుదిరిగాడు. మరో ఓపెనర్ రివాల్డో (10)ను అర్ష్‌దీప్ బౌల్డ్ చేయడంతో 16 పరుగులకే 4 కీలక వికెట్లన్నీ కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఇలాంటి దశలో మిడిలార్డర్ బ్యాటర్లు డియాన్ ఫొరెస్టర్ (83 బంతుల్లో 77; 4 ఫోర్లు, 4 సిక్స్‌లు), డెలానో పాట్గియెటర్ (105 బంతుల్లో 90; 10 ఫోర్లు, 1 సిక్స్), జార్న్ ఫార్టుయిన్ (56 బంతుల్లో 59; 8 ఫోర్లు) అర్ధసెంచరీలతో పటిష్ట స్థితికి తీసుకెళ్లారు. హర్షిత్ రాణాకు 2 వికెట్లు దక్కాయి.

నిలకడగా ఆడి...

ఏరకంగా చూసినా కూడా 286 పరుగుల లక్ష్యం కష్టసాధ్యమైందే. విజయం అంత సులువైతే కాదు! ఇలాంటి పరిస్థితుల్లో అభిషేక్ శర్మ (25 బంతుల్లో 31; 4 ఫోర్లు, 1 సిక్స్)తో ఇన్నింగ్స్ ఆరంభించిన రుతురాజ్ గైక్వాడ్ ఓపెనింగ్ వికెట్‌కు 64 పరుగులతో చక్కని ఆరంభమిచ్చాడు. స్వల్ప వ్యవధిలో అభిషేక్‌తో పాటు రియాన్ పరాగ్ (8) నిష్క్రమించారు. మళ్లీ కెప్టెన్ తిలక్ వర్మ (58 బంతుల్లో 39; 2 ఫోర్లు) అండతో మూడో వికెట్‌కు 89 పరుగులు జోడించి పరిస్థితిని చక్కదిద్దాడు. సెంచరీ పూర్తయ్యాక 219 జట్టు స్కోరు వద్ద గైక్వాడ్ నిష్క్రమించగా, జట్టును గెలిపించే బాధ్యతను నితీశ్ కుమార్ రెడ్డి (26 బంతుల్లో 37; 3 ఫోర్లు, 1 సిక్స్), నిశాంత్ (26 బంతుల్లో 29 నాటౌట్; 3 ఫోర్లు) తీసుకున్నారు. సఫారీ బౌలర్లలో వాన్ వురెన్, ఫార్టుయిన్, బార్ట్‌మన్ తలా 2 వికెట్లు పడగొట్టారు. మూడు మ్యాచ్‌ల ఈ సిరీస్‌లో భారత్ 1–0తో ఆధిక్యంలో నిలువగా... 16న ఇక్కడే రెండో అనధికారిక వన్డే జరుగుతుంది.

స్కోరు వివరాలు

దక్షిణాఫ్రికా 'ఎ' ఇన్నింగ్స్: హెర్మన్ (సి) తిలక్ వర్మ (బి) అర్ష్‌దీప్ 0; రివాల్డో (బి) అర్ష్‌దీప్ 10; జోర్డాన్ (రనౌట్) 0; అకెర్మన్ (సి) అభిషేక్ (బి) ప్రసిధ్‌కృష్ణ 0; సినెతెంబా (స్టంప్డ్) ఇషాన్ కిషన్ (బి) నిశాంత్ 15; ఫొరెస్టర్ (సి) ఇషాన్ కిషన్ (బి) పరాగ్ 77; పాట్గియెటర్ (సి) ఇషాన్ కిషన్ (బి) నితీశ్ 90; ఫార్టుయిన్ (సి) పరాగ్ (బి) హర్షిత్ 59; వాన్ వురెన్ (నాటౌట్) 16; షెపో మొరెకి (బి) అర్ష్‌దీప్ 0; బార్ట్‌మన్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 17; **మొత్తం (50 ఓవర్లలో 9 వికెట్లకు) 285. వికెట్ల పతనం:** 1–0, 2–0, 3–1, 4–16, 5–53, 6–166, 7–253, 8–280, 9–280. **బౌలింగ్:** అర్ష్‌దీప్ 10–1–59–2, ప్రసిధ్ కృష్ణ 10–1–57–1, హర్షిత్ రాణా 10–1–49–2, నిశాంత్ 6–0–21–1, తిలక్ వర్మ 3–0–20–0, విప్రాజ్ 5–0–34–0, రియాన్ పరాగ్ 4–0–21–1, నితీశ్ కుమార్ రెడ్డి 2–0–18–1.

భారత్ 'ఎ' ఇన్నింగ్స్: రుతురాజ్ (బి) వాన్ వురెన్ 117; అభిషేక్ శర్మ (సి) రివాల్డో (బి) ఫార్టుయిన్ 31; పరాగ్ (ఎల్బీడబ్ల్యూ) (బి) వాన్ వురెన్ 8; తిలక్ వర్మ (సి) హెర్మన్ (బి) బార్ట్‌మన్ 39; ఇషాన్ కిషన్ (సి) హెర్మన్ (బి) ఫార్టుయిన్ 17; నితీశ్ కుమార్ రెడ్డి (సి) అకెర్మన్ (బి) బార్ట్‌మన్ 37; నిశాంత్ (నాటౌట్) 29; హర్షిత్ రాణా (నాటౌట్) 6; ఎక్స్‌ట్రాలు 6; **మొత్తం (49.3 ఓవర్లలో 6 వికెట్లకు) 290. వికెట్ల పతనం:** 1–64, 2–86, 3–175, 4–215, 5–219, 6–284. **బౌలింగ్:** షెపో మొరెకి 10–0–62–0, వాన్ వురెన్ 10–0–64–2, ఫార్టుయిన్ 10–1–50–2, బార్ట్‌మన్ 9.3–0–51–2, జోర్డాన్ 5–0–27–0, పాట్గియెటర్ 5–0–32–0.

పట్టుబిగించిన బంగ్లాదేశ్

నజ్ముల్

సిల్హెట్: ఐర్లాండ్‌తో జరుగుతున్న ఏకైక టెస్టులో బంగ్లాదేశ్ విజయంపై కన్నేసింది. ఓవర్‌నైట్ స్కోరు 338/1తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన బంగ్లాదేశ్ 141 ఓవర్లలో 8 వికెట్లకు 587 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. మహమూదుల్ హసన్ జాయ్ తన ఓవర్‌నైట్ స్కోరు మరో రెండు పరుగులు జోడించి 171 పరుగులవద్ద అవుటయ్యాడు. మొత్తం 286 బంతులు ఆడిన హసన్ జాయ్ 14 ఫోర్లు, 4 సిక్స్‌లు కొట్టాడు. మరో బ్యాటర్ మోమినుల్ హక్ కూడా తన ఓవర్‌నైట్ స్కోరుకు రెండు పరుగులు జతచేసి 82 పరుగులకు పెవిలియన్ చేరుకున్నాడు. వీరిద్దరు వెంటవెంటనే అవుటయ్యాక మరో ఎండ్‌లో కెప్టెన్ నజ్ముల్ హొసేన్ షాంటో (114 బంతుల్లో 100; 14 ఫోర్లు) క్రీజులో నిలదొక్కుకుని సెంచరీ నమోదు చేశాడు. వికెట్ కీపర్ లిటన్ దాస్ (66 బంతుల్లో 60; 8 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీ సాధించాడు. నజ్ముల్, లిటన్ దాస్ ఐదో వికెట్‌కు 98 పరుగులు జోడించారు. ఐర్లాండ్ బౌలర్లలో మాథ్యూ హంఫ్రేయస్ 5 వికెట్లు, బ్యారీ మెకార్తీ 2 వికెట్లు పడగొట్టారు. 301 పరుగులతో వెనుకబడి రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఐర్లాండ్ జట్టు మూడో రోజు ఆట ముగిసే సమయానికి 29 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 86 పరుగులు చేసి ఎదురీదుతోంది. ఇన్నింగ్స్ ఓటమి తప్పించుకోవాలంటే ఐర్లాండ్ మరో 215 పరుగులు సాధించాలి.

ముంబై ఇండియన్స్‌కి శార్దుల్, రూథర్‌ఫర్డ్

వేలానికి ముందు ఫ్రాంచైజీల మధ్య ట్రేడ్

శార్దూల్

రూథర్‌ఫర్డ్

న్యూఢిల్లీ: ఐదుసార్లు ఐపీఎల్ చాంపియన్ జట్టు ముంబై ఇండియన్స్ వచ్చే సీజన్ కోసం ఇప్పటి నుంచే తమ జట్టును పటిష్టం చేసుకునే పనిలో పడింది. 2026 సీజన్ కోసం నిర్వహించే ఆటగాళ్ల వేలానికి ముందు ఫ్రాంచైజీల మధ్య జరిగే ట్రేడింగ్‌లో ఇద్దరు ఆల్‌రౌండర్లు శార్దుల్ ఠాకూర్, షెర్ఫాన్ రూథర్‌ఫర్డ్‌లను కొనుగోలు చేసింది. ముంబైకి చెందిన మరాఠా ఆల్‌రౌండర్ శార్దుల్ లక్నో సూపర్ జెయింట్స్ జట్టులో ఉన్నాడు. ఈ ఏడాది జరిగిన 18వ సీజన్‌లో లక్నో జట్టు గాయపడిన మోసిన్ ఖాన్ స్థానాన్ని శార్దుల్‌తో భర్తీ చేసుకుంది. ఇందుకోసం రూ. 2 కోట్లు చెల్లించింది. శార్దుల్ ఈ సీజన్‌లో పది మ్యాచ్‌లు ఆడాడు. ఇప్పుడు ముంబై కూడా అంతే మొత్తం ఫీజుతో అతన్ని దక్కించుకుంది. గతంలో శార్దుల్ చెన్నై సూపర్‌కింగ్స్, ఢిల్లీ క్యాపిటల్స్, పంజాబ్ కింగ్స్‌లకు సైతం ఆడాడు. ఎట్టకేలకు తాజాగా సొంత జట్టు పంచన చేరాడు. ఇదే ట్రేడింగ్‌లో గుజరాత్ టైటాన్స్ ఆల్‌రౌండర్ రూథర్‌ఫర్డ్‌ను కూడా ముంబై ఇండియన్స్ కొనుగోలు చేసింది. ఇందుకోసం రూ. 2.6 కోట్లు చెల్లించేందుకు సిద్ధమైంది. వేలంలో టైటాన్స్ అదే మొత్తానికి అతన్ని కొనుక్కుంది. ఈ విండీస్ క్రికెటర్ ఐపీఎల్‌లో 23 మ్యాచ్‌లు ఆడాడు. ఢిల్లీ క్యాపిటల్స్ (2019), రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (2022)లకు ప్రాతినిధ్యం వహించాడు. గతంలో ముంబై (2020), కోల్‌కతా నైట్‌రైడర్స్ (2024) జట్లలో ఉన్నప్పటికీ తుది జట్టులో మాత్రం ఆడలేకపోయాడు.

న్యూజిలాండ్‌దే టి20 సిరీస్

చివరి మ్యాచ్‌లో విండీస్‌పై 8 వికెట్లతో విజయం • మెరిసిన టఫీ, కాన్వే, రాబిన్సన్

డ్యూనెడిన్: సిరీస్ సొంతం చేసుకోవాలంటే కచ్చితంగా గెలవాల్సిన మ్యాచ్‌లో న్యూజిలాండ్ జట్టు అదరగొట్టింది. వెస్టిండీస్‌తో గురువారం జరిగిన చివరిదైన ఐదో టి20 మ్యాచ్‌లో న్యూజిలాండ్ 8 వికెట్ల తేడాతో గెలిచింది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను మిచెల్ సాంట్నర్ సారథ్యంలోని న్యూజిలాండ్ 3–1తో హస్తగతం చేసుకుంది. టాస్ గెలిచిన న్యూజిలాండ్ ఫీల్డింగ్ ఎంచుకోగా... మొదట బ్యాటింగ్‌కు దిగిన వెస్టిండీస్ 18.4 ఓవర్లలో 140 పరుగులకే ఆలౌటైంది. రోస్టన్ ఛేజ్ (32 బంతుల్లో 38; 3 ఫోర్లు, 1 సిక్స్), రొమారియో షెఫర్డ్ (22 బంతుల్లో 36; 3 ఫోర్లు, 3 సిక్స్‌లు), జేసన్ హోల్డర్ (19 బంతుల్లో 20; 1 ఫోర్, 1 సిక్స్) మినహా ఇతర ప్లేయర్లు విఫలమయ్యారు. న్యూజిలాండ్ బౌలర్లలో జేకబ్ టఫీ 35 పరుగులిచ్చి 4 వికెట్లు తీయగా... జేమ్స్ నీషమ్‌కు 2 వికెట్లు దక్కాయి. జేమీసన్, మైకేల్ బ్రేస్‌వెల్, ఇష్ సోధి, మిచెల్ సాంట్నర్‌లకు ఒక్కో వికెట్ లభించింది. అనంతరం న్యూజిలాండ్ 15.4 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 141 పరుగులు చేసి గెలిచింది. ఓపెనర్లు టిమ్ రాబిన్సన్ (24 బంతుల్లో 45; 5 ఫోర్లు, 3 సిక్స్‌లు), డెవాన్ కాన్వే (42 బంతుల్లో 47 నాటౌట్; 4 ఫోర్లు, 1 సిక్స్) ధాటిగా ఆడి తొలి వికెట్‌కు 62 పరుగులు జోడించారు. రాబిన్సన్ అవుటయ్యాక వచ్చిన రచిన్ రవీంద్ర (16 బంతుల్లో 21; 2 ఫోర్లు, 1 సిక్స్), మార్క్ చాప్‌మన్ (13 బంతుల్లో 21 నాటౌట్; 2 సిక్స్‌లు) కూడా మెరిపించడంతో న్యూజిలాండ్ 26 బంతులు మిగిలి ఉండగానే విజయతీరాలకు చేరింది. జేకబ్ డఫీకి 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'తోపాటు 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' అవార్డు లభించింది. తొలి మ్యాచ్‌లో విండీస్ 7 పరుగులతో నెగ్గగా... రెండో మ్యాచ్‌లో న్యూజిలాండ్ 3 పరుగులతో.. మూడో మ్యాచ్‌లో 9 పరుగులతో గెలిచింది. నాలుగో మ్యాచ్ వర్షం కారణంగా రద్దయింది. రెండు జట్ల మధ్య మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ ఆదివారం క్రైస్ట్‌చర్చ్‌లో జరిగే తొలి మ్యాచ్‌తో మొదలవుతుంది.

రేపటి నుంచి తెలంగాణ మహిళల చెస్ టోర్నీ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ మహిళల చెస్ చాంపియన్‌షిప్ పోటీలు ఈనెల 15, 16వ తేదీల్లో జరగనున్నాయి. నిజాంపేట ప్రగతి నగర్‌లోని పుచ్చలపల్లి సుందరయ్య భవన్‌లో ఈ పోటీలను రెండు రోజులపాటు నిర్వహిస్తారు. ఈ టోర్నీలో ఆడాలనుకునే వారు 7337578899, 7337399299 ఫోన్ నంబర్లలో నిర్వాహకులను సంప్రదించి తమ పేర్లను నమోదు చేసుకోవాలి. ఈ టోర్నీలో పాల్గొనేందుకు ఎలాంటి వయో పరిమితి లేదు. ఈ టోర్నీలో టాప్–4లో నిలిచిన క్రీడాకారిణులు జాతీయ మహిళల చెస్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ తరఫున బరిలోకి దిగుతారని తెలంగాణ చెస్ అసోసియేషన్ (టీజీసీఏ) జనరల్ సెక్రటరీ జయచంద్ర తెలిపారు.

రోమ్‌లో వాటికన్ పవిత్ర వార్షికోత్సవంలో భాగంగా ఇటలీ సెనేట్‌లో 15వ శతాబ్దంనాటి బైబిల్‌ను ప్రదర్శించిన దృశ్యం

రోమ్‌లోని కార్టియర్ క్యాపిటలిన్ మ్యూజియంలో ప్రదర్శనకు ఉంచిన వజ్రాలు పొదిగిన 1919నాటి ప్లాటినం హారం

క్రీ.పూ.3వ శతాబ్దినాటి ఆలివ్ ఆకుల ఆకృతిలోని బంగారు ఆభరణాన్ని రోమ్‌లోని కార్టియర్ మ్యూజియంలో ప్రదర్శించిన దృశ్యం

‘గ్రీన్ హైడ్రోజన్ హబ్’గా భారత్

2030 నాటికి 5 మిలియన్ మెట్రిక్ టన్నుల వార్షిక ఉత్పత్తి లక్ష్యం

- జాతీయ గ్రీన్ హైడ్రోజన్ మిషన్‌పై కేంద్రం కీలక ప్రకటన
- రూ.8 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు వస్తాయని అంచనా
- దేశంలో తొలి పోర్ట్ ఆధారిత పైలట్ ప్రాజెక్ట్ ప్రారంభం

సాక్షి, న్యూఢిల్లీ: 2070 నాటికి ‘నెట్ జీరో’ఉద్గారాలను సాధించే దిశగా, 2047 నాటికి ‘వికసిత్ భారత్’గా నిలిచే లక్ష్యంతో భారత్ తన ఇంధన ప్రణాళికల్లో ముందడుగు వేస్తోంది. శిలాజ ఇంధనాలపై ఆధారపడటాన్ని తగ్గిస్తూ, స్వచ్ఛమైన ఇంధన ఉత్పత్తికి పెద్దపీట వేస్తోంది. ఇందులో భాగంగా పర్యావరణ హితమైన ‘గ్రీన్ హైడ్రోజన్’రంగాన్ని ప్రోత్సహించడానికి 2023లో ప్రారంభించిన జాతీయ గ్రీన్ హైడ్రోజన్ మిషన్ (ఎన్‌జీహెచ్ఎం) ద్వారా భారత్‌ను ఈ రంగంలో గ్లోబల్ హబ్‌గా మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం వేగవంతం చేసింది. 2030 నాటికి ఏటా 5 మిలియన్ మెట్రిక్ టన్నుల(ఎంఎంటీ) గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తిని సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తాజాగా ప్రకటించింది.

గ్రీన్ హైడ్రోజన్ అంటే?

సౌర, పవన విద్యుత్ వంటి పునరుత్పాదక ఇంధన వనరులను ఉపయోగించి, ‘ఎలక్ట్రోలిసిస్’ప్రక్రియ ద్వారా నీటిని హైడ్రోజన్, ఆక్సిజన్‌గా విడదీయడం ద్వారా ఉత్పత్తి అయ్యే హైడ్రోజన్‌ను గ్రీన్ హైడ్రోజన్ అంటారు. ప్రతి కిలో హైడ్రోజన్ ఉత్పత్తికి రెండు కిలోలకు మించకుండా కార్బన్ డై ఆక్సైడ్ ఉద్గారాలు ఉంటేనే దానిని ‘గ్రీన్ హైడ్రోజన్’గా ప్రభుత్వం అధికారికంగా గుర్తిస్తుంది.

మిషన్ ప్రధాన లక్ష్యాలు

గ్రీన్ హైడ్రోజన్ మిషన్ ద్వారా రూ.8 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులను ఆకర్షించవచ్చని కేంద్ర ప్రభుత్వం అంచనా వేస్తోంది. దీనివల్ల శిలాజ ఇంధనాల దిగుమతులు రూ.లక్ష కోట్లకు పైగా తగ్గుతాయని, 6 లక్షలకు పైగా ఉద్యోగాలను సృష్టించగలమని భావిస్తోంది. అంతేకాకుండా 2030 నాటికి ఏటా సుమారు 50 ఎంఎంటీ గ్రీన్‌హౌస్ వాయువుల ఉద్గారాలను నివారించవచ్చని, తద్వారా పర్యావరణానికి ఎంతో మేలు జరుగుతుందని చెబుతోంది. గ్రీన్ హైడ్రోజన్ మిషన్ కోసం 2029–2030 ఆర్థిక సంవత్సరం వరకు కేంద్రం రూ.19,744 కోట్లు కేటాయించింది. ఇందులో రూ.17,490 కోట్లను ‘స్ట్రాటజిక్ ఇంటర్వెన్షన్స్ ఫర్ గ్రీన్ హైడ్రోజన్ ట్రాన్సిషన్ (ఎస్ఐజీహెచ్‌టీ) కార్యక్రమానికి కేటాయించారు. దీనిద్వారా గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తికి కీలకమైన ఎలక్ట్రోలైజర్ల తయారీకి ఆర్థిక ప్రోత్సాహకాలను అందిస్తారు. దీంతోపాటు పైలట్ ప్రాజెక్టులకు రూ.1,466 కోట్లు, పరిశోధన–అభివృద్ధి కోసం రూ.400 కోట్లు కేటాయించారు.

రంగాలవారీగా పైలట్ ప్రాజెక్టులు

➡ ఈ మిషన్‌లో భాగంగా ఇప్పటికే పలు రంగాల్లో పైలట్ ప్రాజెక్టులు ఊపందుకున్నాయి. భారత్‌లో తొలిసారిగా పోర్ట్ ఆధారిత గ్రీన్ హైడ్రోజన్ పైలట్ ప్రాజెక్టును వి.ఓ.చిదంబరనార్ పోర్ట్‌లో (తమిళనాడు) ఈ ఏడాది సెప్టెంబర్‌లో ప్రారంభించారు. దీంతోపాటు దీనదయాళ్ (గుజరాత్), పారాదీప్(ఒడిశా) పోర్టులను కూడా గ్రీన్ హైడ్రోజన్ హబ్‌లుగా అభివృద్ధి చేస్తున్నారు.

➡ 10 వేర్వేరు మార్గాల్లో 37 ఫ్యూయల్ సెల్, హైడ్రోజన్ ఇంటర్నల్ కంబషన్ ఇంజిన్ వాహనాలతో (బస్సులు, ట్రక్కులు) మొబిలిటీ పైలట్ ప్రాజెక్టులను ప్రారంభించారు. ప్రపంచంలోనే అత్యంత ఎత్తులో (లేహ్, 3,650 మీటర్లు) గ్రీన్ హైడ్రోజన్ మొబిలిటీ ప్రాజెక్టును సైతం ఎన్‌టీపీసీ 2024 నవంబర్‌లో ప్రారంభించింది.

➡ ఉక్కు తయారీలో గ్రీన్ హైడ్రోజన్ వాడకంపై ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలతో కలిసి ఐదు పైలట్ ప్రాజెక్టులను చేపట్టారు.

➡ ఎరువుల తయారీలో శిలాజ ఇంధన ఆధారిత ఫీడ్‌స్టాక్‌లకు బదులుగా గ్రీన్ అమ్మోనియా వాడకాన్ని ప్రోత్సహిస్తున్నారు.

➡ అంతేకాకుండా ఈ రంగంలో ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడులను, నైపుణ్యాలను ఆకర్షించేందుకు భారత్ పలు దేశాలతో ఒప్పందాలు కుదుర్చుకుంటోంది. యూరోపియన్ యూనియన్(ఈయూ), యూకే, జర్మనీ(ఏ2 గ్లోబల్), సింగపూర్ వంటి దేశాలతో కలిసి ప్రమాణాలు, సాంకేతికత, మార్కెట్ల అభివృద్ధికి భారత్ కృషి చేస్తోంది.

ఎరువుల బ్లాక్ మార్కెటింగ్‌పై ఉక్కుపాదం

- దేశవ్యాప్తంగా 3.17 లక్షల దుకాణాల్లో తనిఖీలు
- 5,119 మంది డీలర్లకు షోకాజ్ నోటీసులు

సాక్షి, న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా ఎరువుల బ్లాక్ మార్కెటింగ్, అక్రమ నిల్వలను అరికట్టడమే లక్ష్యంగా ఖరీఫ్‌తోపాటు ప్రస్తుత రబీ సీజన్‌లో మొత్తం 3.17 లక్షల దుకాణాల్లో విస్తృతంగా తనిఖీలు చేసినట్లు కేంద్ర వ్యవసాయ శాఖ గురువారం వెల్లడించింది. ఎరువులను నల్లబజారుకు తరలించి, విక్రయిస్తున్న 5,119 మంది డీలర్లకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు తెలియజేసింది. 3,645 లైసెన్స్‌లను రద్దు చేయగా, దేశవ్యాప్తంగా 418 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసినట్లు వివరించింది. ఎరువుల అక్రమ నిల్వలకు సంబంధించి 2,991 షోకాజ్ నోటీసులు జారీ చేయగా, 451 లైసెన్స్‌లను రద్దు చేశామని, 92 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసినట్లు పేర్కొంది. అత్యధికంగా మహారాష్ట్రలో 28,273 చోట్ల తనిఖీలు జరగ్గా, బ్లాక్ మార్కెటింగ్‌పై 1,957 షోకాజ్ నోటీసులు జారీ చేయడంతో పాటు 2,730 లైసెన్స్‌లను రద్దు చేశారు. బిహార్, రాజస్తాన్, మహారాష్ట్ర, హరియాణా, పంజాబ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, గుజరాత్ సహా ఇతర రాష్ట్రాల్లో నాసిరకం ఎరువులకు సంబంధించి 3,544 షోకాజ్ నోటీసులు జారీ చేయగా, 1,316 లైసెన్స్ రద్దు చేశారు. ఎరువులు సక్రమంగా రైతులకు చేరేలా చర్యలు చేపట్టినట్లు వ్యవసాయ శాఖ ప్రకటించింది. డిజిటల్ డాష్‌బోర్డ్‌లతో ఎరువుల నిల్వల పర్యవేక్షణ, స్వాధీనం చేసుకున్న లేక నిల్వ చేసిన ఎరువులను సహకార సంఘాలకు వేగంగా మళ్లించడం, రైతుల నుంచి వచ్చిన ఫిర్యాదులకు త్వరితగతిన పరిష్కారించడంలో కొన్ని రాష్ట్రాల అధికారుల పనితీరును ప్రశంసించింది. చట్టబద్ధంగా, పారదర్శకంగా ఎరువుల పంపిణీకి అందరూ సహకరించాలని వ్యవసాయ శాఖ విజ్ఞప్తి చేసింది.

లాయర్లు వర్చువల్‌గా హాజరుకావొచ్చు

ఢిల్లీలో వాయుకాలుష్యం నేపథ్యంలో సుప్రీంకోర్టు జడ్జి సూచన

న్యూఢిల్లీ: వాయుకాలుష్యం అత్యంత తీవ్రస్థాయిలకు చేరుతున్న నేపథ్యంలో ఢిల్లీలోని సుప్రీంకోర్టుకు నేరుగా వచ్చి కేసులు వాదించే న్యాయవాదులకు సుప్రీంకోర్టు న్యాయమూర్తి కాస్తంత వెసులుబాటు కల్పించారు. కేసులను జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ అతుల్ ఎస్ చందూర్కర్‌ల ధర్మాసనం పరిశీలిస్తున్న సందర్భంగా జస్టిస్ నరసింహ మాట్లాడారు. ఇప్పటికే కోర్టులకు వచ్చే ఎంతో మంది న్యాయవాదులు మాస్క్‌లు పెట్టుకుని వస్తున్నారని సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ గుర్తుచేశారు. వెంటనే జస్టిస్ నరసింహ కల్పించుకున్నారు. ‘‘మాస్క్ అనేది పూర్తి రక్షణ ఇవ్వదు. వాయుకాలుష్యంతో గరళంగా మారుతున్న ఈ గాలి మన ఆరోగ్యానికి తీవ్రహాని కల్గిస్తుంది. అందుకే లాయర్లు నేరుగా రాకుండా వర్చువల్‌గా కేసులను వాదించుకోవచ్చు’’అని ఆయన సూచించారు. నవంబర్ నెల మొదలైనప్పటినుంచీ దేశ రాజధానిలో వాయు నాణ్యత సూచీ ‘అత్యంత అధ్వాన్నం’గా చూపిస్తున్న సంగతి తెల్సిందే. మంగళవారం ఢిల్లీలో ఈ సీజన్‌లోనే అత్యంత దారుణంగా వాయునాణ్యతాసూచీ(ఎయిర్‌క్వాలిటీ ఇండెక్స్–ఏక్యూఐ) 428గా నమోదైంది.

మాజీ ఎంపీల పెన్షన్ సవరణ

- దరఖాస్తులు సమర్పించని పలువురు పెన్షనర్లు
- పెరిగిన భృతికి వెంటనే దరఖాస్తు చేసుకోవాలి
- రాజ్యసభ సెక్రెటేరియట్ సూచన

సాక్షి, న్యూఢిల్లీ: మాజీ పార్లమెంట్ సభ్యులు, వారి కుటుంబ సభ్యుల పెన్షన్‌లో సవరణ చేస్తూ రాజ్యసభ సెక్రెటేరియట్ కీలక ప్రకటన జారీ చేసింది. పెరిగిన పెన్షన్ వివరాలను వెల్లడించింది. సవరించిన భృతిని పొందడానికి పలువురు మాజీ ఎంపీలు, వారి కుటుంబ సభ్యులు అవసరమైన దరఖాస్తు ఫారాలను ఇప్పటికీ సమర్పించలేదని పేర్కొంది. ఈ జాప్యం కారణంగా పెన్షన్ కేసులను ప్రాసెస్ చేయలేకపోతున్నామని, కావున అర్హులైన వారు వెంటనే స్పందించాలని సూచించింది. ఈ మేరకు గురువారం ఒక బులెటిన్ జారీ చేసింది.

పెరిగిన పెన్షన్ వివరాలు

సభ్యుల జీతభత్యాలు, పెన్షన్‌కు సంబంధించి 2025 మార్చి 24న జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్ ప్రకారం ఈ సవరణలు జరిగాయి. దీని ప్రకారం మాజీ ఎంపీగా ఎంత తక్కువ కాలం పనిచేసినా వారికి నెలకు రూ.31 వేల పెన్షన్ అందుతుంది. ఐదేళ్లు దాటిన తర్వాత అదనంగా పనిచేసిన ప్రతి సంవత్సరానికి నెలకు రూ.2,500 అదనపు భృతి లభిస్తుంది. ఈ సవరించిన పెన్షన్‌పై గరిష్ఠ పరిమితి(సీలింగ్) ఏదీ ఉండదు. ఈ మార్పులు 2024 ఏప్రిల్ 1వ తేదీ నుంచే వర్తిస్తాయని బులెటిన్‌లో స్పష్టం చేశారు.

దరఖాస్తుల జాప్యంపై ఆందోళన

పెన్షన్ సవరణ జరిగి చాలాకాలమైనా, ఇప్పటికీ పెద్ద సంఖ్యలో మాజీ ఎంపీలు, వారి కుటుంబ సభ్యులు సంబంధిత పత్రాలతో కూడిన ‘ప్రొఫార్మా’ను సమర్పించలేదని రాజ్యసభ సెక్రెటేరియట్ గుర్తించింది. పదేపదే రిమైండర్లు పంపినప్పటికీ స్పందన లేకపోవడంతో, వారి పెన్షన్ కేసుల ప్రక్రియ నిలిచిపోయిందని ఆందోళన వ్యక్తం చేసింది. పెరిగిన పెన్షన్‌ను సత్వరం ప్రాసెస్ చేసేందుకు, అర్హులైన మాజీ ఎంపీలు, వారి జీవిత భాగస్వాములు/ఆధారపడినవారు వెంటనే సంబంధిత ప్రొఫార్మాను సమర్పించాలని కోరింది.

కుట్రదారులకు అత్యంత కఠిన శిక్షలు తథ్యం

- కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా వెల్లడి

అహ్మదాబాద్: ఢిల్లీ పేలుడు ఘటన వెనుక ఉన్న అసలైన సూత్రధారులకు అత్యంత కఠిన శిక్షలు పడేలా కృషి చేస్తామని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా చెప్పారు. భవిష్యత్తులో ఇలాంటి దాడికి పాల్పడేందుకు మరొకరు సాహసించకుండా ప్రపంచానికి స్పష్టమైన సందేశం ఇవ్వాలన్నదే తమ ఉద్దేశమని తెలిపారు. గుజరాత్‌లోని మెహసానా జిల్లాలో పలు కార్యక్రమాలను అమిత్ షా గురువారం వర్చువల్‌గా ప్రారంభించారు. షెడ్యూల్ ప్రకారం ఆయన ఇక్కడ స్వయంగా పర్యటించాల్సి ఉండగా, ఢిల్లీ పేలుడు నేపథ్యంలో రద్దు చేసుకున్నారు. వర్చువల్‌గా మాట్లాడారు. ముష్కరులకు కఠిన శిక్ష పడితేనే అది మరొకరికి హెచ్చరిక అవుతుందని అన్నారు. ఢిల్లీ పేలుడు కుట్రదారులకు సాధ్యమైనంత ఎక్కువ కఠిన శిక్ష పడేలా చూస్తామని తెలిపారు. వారిని చట్టం ముందు నిలబెట్టే ప్రక్రియ కొనసాగుతోందని వెల్లడించారు. కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం గత 11 ఏళ్లుగా ఉగ్రవాదంపై పోరాడుతూనే ఉందని గుర్తుచేశారు.

మధ్యప్రదేశ్‌లోనూ పంట వ్యర్థాల దహనాలు

- 11వ తేదీన వెయ్యికి పైగా ఘటనలు
- రెండున్నర నెలల్లో 3,569 దహనాలు
- పంజాబ్ తర్వాత అత్యధిక కేసులు మధ్యప్రదేశ్‌లోనే

సాక్షి, న్యూఢిల్లీ: పొరుగున ఉన్న పంజాబ్, హరియాణా రాష్ట్రాల్లో కొనసాగుతున్న పంట వ్యర్థాల దహనాలతో దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం విపరీతంగా పెరిగిపోతుండగా, తాజాగా మధ్యప్రదేశ్‌లోనూ పంట దహనాలు పెరుగుతున్నాయి. మధ్యప్రదేశ్‌లో వరి కోతలు ఆలస్యం కావడంతో పంట దుబ్బలను కాల్చివేస్తున్నారు. ఈ నెల 11వ తేదీన ఒక్కరోజే వెయ్యికి పైగా పంట దహనాల ఘటనలు చోటుచేసుకున్నాయి. అవి ముమ్ముందు మరింత పెరుగుతాయన్న అంచనాలు మరింత ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఖరీఫ్ సీజన్ వరి కోతల తర్వాత అక్టోబర్–నవంబర్ నెలల్లో ఢిల్లీలో వాయు కాలుష్యం ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేయడానికి పంజాబ్, హరియానా రాష్ట్రాలో పంట వ్యర్థాలను కాల్చడమే ప్రధాన కారణమవుతోంది. వరి కోతకు, రబీలో గోధుమలను విత్తడానికి మధ్య సమయం తక్కువగా ఉండటంతో రైతులు పంట వ్యర్థాలను దహనం చేస్తున్నారు. దీనివల్ల పొరుగున ఉన్న ఢిల్లీలో గాలి నాణ్యత సూచీ 450–550 మార్కును దాటుతోంది. ప్రజలు శ్వాసకోశ వ్యాధులతో పాటు ఇతర అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. దీనిపై సుప్రీంకోర్టు సైతం తీవ్రంగా స్పందించింది. పంట వ్యర్థాల దహనాలను నివారించేందుకు చేపడుతున్న చర్యలను వివరించాలని రెండు రాష్ట్రాలను ఆదేశించింది. మరోవైపు మధ్యప్రదేశ్‌లోనూ దహనాలు పెరుగుతుండడం కలవరం కలిగిస్తోంది. ఈ నెల 11వ తేదీన రాష్ట్రంలో 1,052 పంట దహనాల ఘటనలు నమోదయ్యాయని, అది దేశంలోనే అత్యధికమని ఇండియన్ అగ్రికల్చరల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ డేటా వివరించింది. సెప్టెంబర్ 15 నుంచి నవంబర్ 11 మధ్య రాష్ట్రంలో మొత్తంగా 3,569 గడ్డి దహనం సంఘటనలు నమోదయ్యాయని, పంజాబ్‌లో నమోదైన 4,507 ఘటనల తర్వాత ఇదే అత్యధికమని డేటా పేర్కొంది. ఈ నేపథ్యంలో రైతులకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తూనే, మరోవైపు పంట వ్యర్థాల దహనం సంఘటనలను పూర్తిస్థాయిలో పర్యవేక్షించాలని కేంద్ర ప్రభుత్వం మధ్యప్రదేశ్ ప్రభుత్వాన్ని అప్రమత్తం చేసింది.

బై బై పెన్నీ

- అసలు విలువ కంటే తయారీ ఖర్చు ఎక్కువ కావడమే కారణం
- చివరిసారిగా 235 ప్రత్యేక నాణేల ముద్రణ

నాణేల ముద్రణను నిలిపివేసిన అమెరికా టంకశాల

వాషింగ్టన్: అమెరికాలో 232 ఏళ్ల సుదీర్ఘ ఘన చరిత్ర కలిగిన పెన్నీ(అధికారికంగా సెంట్) కథ ముగిసింది. ఫిలడెల్ఫియాలోని అమెరికన్ టంకశాల(మింట్) చివరి పెన్నీని బుధవారం మధ్యాహ్నం ముద్రించింది. ఆ తర్వాత పెన్నీల ప్రింటింగ్ శాశ్వతంగా నిలిచిపోయింది. పెన్నీల తయారీని ఆపేయడం ద్వారా 56 మిలియన్ డాలర్ల ప్రజాధనం ఆదా చేయబోతున్నట్లు కోశాధికారి బ్రాండన్ బీచ్ చెప్పారు. ఈ నాణేల తయారీని ఎందుకు నిలిపివేశారన్నది చర్చనీయాంశంగా మారింది. వాటి అసలు విలువ కంటే తయారీ ఖర్చే ఎక్కువ కావడం వల్ల ఈ నిర్ణయం తీసుకున్నట్లు అమెరికా ప్రభుత్వం వివరణ ఇచ్చింది. ఒక్కో పెన్నీ తయారీ ఖర్చు పదేళ్ల క్రితం 1.42 సెంట్లుగా ఉండేది. ఇప్పుడు అది ఏకంగా 3.69 సెంట్లకు పెరిగిపోయింది. దాంతో తయారీని ఆపేయడానికే అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మొగ్గుచూపారు. ఒక్కో నాణెంపై 2 సెంట్లకుపైగా నష్టపోవాల్సి వస్తోందని, అదంతా వృథా ఖర్చు కాదా? అని ఆయన ప్రశ్నించారు. ఇప్పటికే చాలా నష్టపోయామంటూ ఆన్‌లైన్‌లో పోస్టు చేశారు.

ఒక్కో నాణేం ధర లక్ష డాలర్లు?

అమెరికా మింట్ గణాంకాల ప్రకారం చూస్తే 2024 ఆర్థిక సంవత్సరంలో 5.61 బిలియన్ డాలర్ల విలువైన నాణేలు చలామణిలో ఉండగా, అందులో పెన్నీల వాటా 57 శాతం (3.2 బిలియన్ డాలర్లు). వెండింగ్ యంత్రాల నుంచి క్యాండీలు, చాక్లెట్లు కొనడానికి, పార్కింగ్ టికెట్లకు డబ్బులు చెల్లించడానికి సాధారణంగా పెన్నీలు ఉపయోగిస్తుంటారు. కానీ, కొన్నేళ్లుగా వీటి వాడకం తగ్గిపోయింది. నాణేలు సేకరించేవారు మాత్రం వీటిని దాచుకుంటున్నారు. కొత్త పెన్నీలను మార్కెట్‌లోకి తీసుకురావడం కొన్ని నెలల క్రితమే నిలిపివేశారు. ఒమేగా గుర్తు ఉన్న ప్రత్యేక పెన్నీలను మాత్రం చివరిసారిగా ముద్రించారు. వీటిని డిసెంబర్‌లో వేలం ద్వారా విక్రయించబోతున్నారు. ఇవి గుర్తుగా దాచుకోవడానికే ఉపయోగపడతాయి. బుధవారం ఈ రకం నాణేలను 235 వరకు ముద్రించారు. వీటిలో 232 నాణేలను వేలం వేస్తారు. ఒక్కొక్కటి లక్ష డాలర్లు(రూ.88.71 లక్షలు) పలకవచ్చని అంచనా వేస్తున్నారు. ఈ సొమ్మును టంకశాల కార్యకలాపాల కోసం వెచ్చిస్తారు. మిగతా మూడు నాణేలను ప్రజల సందర్శనార్థం ప్రదర్శనకు ఉంచుతారు. అలాగే మింట్‌లో 235 గోల్డ్ పెన్నీలు కూడా ముద్రించినట్లు సమాచారం. వీటిని ఏం చేస్తారన్నది ఇంకా తెలియరాలేదు.


చివరిగా తయారుచేసిన పెన్నీ


పెన్నీ తయారీకి వాడిన డై

పాత నాణేల చెలామణి యథాతథం

ఫిలడెల్ఫియాలో పెన్నీల తయారీ 1793లో ప్రారంభమైంది. ఇది డాలర్ విలువలో వందలో ఒక వంతు. అంటే వంద పెన్నీలు ఒక డాలర్తు అని చెప్పొచ్చు. అమెరికా కరెన్సీలో అత్యల్ప ముఖ విలువ కలిగినవి పెన్నీలే. మొదట్లో కాపర్‌తో తయారు చేసేవారు. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత జింక్, కాపర్ ఉపయోగించడం ప్రారంభించారు. ఎందుకంటే యుద్ధం వల్ల కాపర్ కొరత ఏర్పడడమే ఇందుకు కారణం. ముద్రణ ఆపినంత మాత్రాన వాటి చెలామణి ఆగిపోదు. ప్రస్తుతం సర్క్యులేషన్‌లో ఉన్న పాత పెన్నీ నాణేలను యథాతథంగా వాడుకోవచ్చు. అమెరికాలో చివరిసారిగా నాణేన్ని ఆపేసిన ఘటన 1857లో జరిగింది. అప్పట్లో హాఫ్–పెన్నీ ముద్రణను నిలిపివేశారు. అరుదైన హాఫ్–డాలర్ నాణేలు ఇప్పటికీ చెలామణిలో ఉన్నాయి.

చైతన్య బఘేల్ ఆస్తులు అటాచ్

న్యూఢిల్లీ: ఛత్తీస్‌గఢ్ లిక్కర్ స్కామ్ కేసులో కీలక పరిణామం జరిగింది. రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి భూపేశ్ బాఘేల్ కుమారుడు చైతన్య బాఘేల్‌కు చెందిన రూ.61.20 కోట్ల విలువైన ఆస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తాత్కాలికంగా అటాచ్ చేసింది. 364 నివాస ప్లాట్లు, వ్యవసాయ భూమి రూపంలో స్థిరాస్తులతోపాటు, బ్యాంకు బ్యాలెన్స్‌లు, రూ.1.24 కోట్ల విలువైన స్థిర డిపాజిట్లు రూపంలో చరాస్తులను సీజ్ చేసినట్లు ఈడీ గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. రాష్ట్రంలో 2019 నుంచి 2022 మధ్య కాలంలో మద్యం విక్రయాల వ్యవస్థలో భారీ స్థాయిలో అవకతవకలు జరిగినట్లు గుర్తించిన ఈడీ దర్యాప్తు ప్రారంభించింది. సిండికేట్‌లో ప్రధాన నిర్ణయాలన్నీ చైతన్య బఘేల్ ఆదేశాల మేరకే తీసుకున్నట్లు గుర్తించింది. ఆయనకు మద్యం సిండికేట్‌తో సంబంధాలున్నట్లు గుర్తించిన ఈడీ మనీ లాండరింగ్ నిరోధక చట్టం ప్రకారం ఈ చర్యలు తీసుకుంది. మద్యం కుంభకోణం ద్వారా వచ్చిన ఆదాయాన్ని తన రియల్ ఎస్టేట్ సంస్థ బఘేల్ డెవలపర్స్ ఆధ్వర్యంలోని ప్రాజెక్ట్ ‘విఠల్ గ్రీన్’అభివృద్ధికి ఉపయోగించారని ఆరోపించింది. జూలై 18న అరెస్టయిన చైతన్య బఘేల్ ప్రస్తుతం కస్టడీలో ఉన్నారు.

పాక్ నుంచి బెదిరింపు కాల్

బెంగాల్ ప్రతిపక్ష నేత సువేందు అధికారి వెల్లడి

కోల్‌కతా: పాకిస్తాన్ నుంచి తనకు బెదిరింపు కాల్ వచ్చిందని పశ్చిమబెంగాల్ అసెంబ్లీలో ప్రతిపక్షనాయకుడు సువేందు అధికారి ఆరోపించారు. తనకు ఇలాంటి బెదిరింపులు రావడం ఇది మొదటిసారి కాదన్నారు. ఇస్లామిక్ ఉగ్రవాదానికి బెంగాల్ స్వర్గధామంగా మారిందని, అందుకే ఇలాంటి బెదిరింపు కాల్స్ వస్తున్నాయమని ఆరోపించారు. న్యూఢిల్లీలో కేంద్ర హోంమంత్రి అమిత్ షాను కలిసిన రోజు మంగళవారం తనకు ఈ కాల్ వచ్చిందని, ఈ వివరాలను కేంద్ర హోం శాఖకు తెలియజేశానని అధికారి చెప్పారు. ‘నేను ఢిల్లీలో ఉన్న రోజే నాకు బెదిరింపు కాల్ వచ్చింది. కాల్‌చేసిన వ్యక్తి హిందీలో నేను పాకిస్తాన్ నుంచి కాల్ చేస్తున్నాను. జాగ్రత్తగా ఉండకపోతే మిమ్మల్ని పేల్చేస్తాం’అని బెదిరించారని తెలిపారు. ‘బెంగాల్‌లో ఉగ్రవాద దాడులు జరగవు. మమతా బెనర్జీ అధికారంలో ఉన్నంత కాలంలో తాము సురక్షితంగా ఉంటామని ఉగ్రవాదులకు తెలుసు. కానీ మాలాంటివారికి బెదిరింపు కాల్స్ వస్తున్నాయి. రెండు రోజుల కిందట పాకిస్తాన్ నుంచి బెదిరింపు కాల్ వచ్చింది. ఇక బంగ్లా దేశ్ నుంచి తరచూ అలాంటి కాల్స్ వస్తున్నాయి. దీని గురించి ఏజెన్సీలకు ఫిర్యాదు చేశాను.’అని వివరించారు. అయితే కాల్ సౌదీ అరేబియా దేశ కోడ్ అయిన +966 నుంచి రాగా, తాను పాకిస్తాన్ నుంచి మాట్లాడుతున్నట్లు చెప్పాడు. కాల్ చేసిన వ్యక్తి భాష గల్ఫ్‌లోని బంగ్లాదేశ్ వలస కార్మికులు మాట్లాడే హిందీకి దగ్గరగా ఉందని అధికారి చెప్పారు.

ఎయిరిండియా విమానానికి బాంబు బెదిరింపు

ఢిల్లీలో సురక్షితంగా ల్యాండింగ్

న్యూఢిల్లీ: టొరంటో నుంచి ఢిల్లీకి వస్తున్న ఎయిరిండియా విమానానికి గురువారం బాంబు బెదిరింపు వచ్చింది. ఢిల్లీకి ఇంకా నాలుగు గంటల దూరంలో గాలిలో ఉండగానే ఉదయం 11.30 గంటల సమయంలో ఢిల్లీ పోలీసులకు బెదిరింపు సందేశం అందింది. వెంటనే విమాన సిబ్బందికి భద్రతా హెచ్చరికను తెలియజేశారు. దీంతో ప్రయాణీకుల భద్రత ప్రాధాన్యతను దృష్టిలో పెట్టుకుని సిబ్బంది అన్ని భద్రతా కసరత్తులు నిర్వహించారు. నాలుగు గంటల ప్రయాణం తరువాత విమానం ఢిల్లీలో సురక్షితంగా ల్యాండ్ అయింది. మధ్యాహ్నం 3.40 గంటలకు ఢిల్లీ విమానాశ్రయంలో దిగింది. భద్రతా తనిఖీలకు ముందే ప్రయాణికులు, సిబ్బంది సురక్షితంగా విమానం దిగిపోయారు. బాంబు బెదిరింపు సమాచారం అందగానే అంచనా కమిటీని ఏర్పాటు చేశారు. అయితే ఆ బెదిరింపు నిర్దిష్టమైనది కాదని కమిటీ అంచనా వేసింది. అయితే ప్రోటోకాల్ ప్రకారం భద్రతా సిబ్బంది తప్పనిసరి భద్రతా తనిఖీల కోసం నిలిపి ఉంచారు. దేశ రాజధానిలో పేలుళ్ల తర్వాత అన్ని విమానాశ్రయాల్లో అన్ని విమానాలకు తప్పనిసరి సెకండరీ లాడర్ పాయింట్ చెకింగ్‌తో సహా మెరుగైన భద్రతా చర్యలు అమలులో ఉన్నాయి.

జైలు నుంచి విడుదలైన సురేంద్ర కోలి

నోయిడా: దేశాన్ని దిగ్భ్రాంతికి గురిచేసిన నిఠారీ వరుస హత్యల కేసులో నిందితుడు సురేంద్ర కోలి జైలు నుంచి గురువారం విడుదలయ్యారు. సుప్రీంకోర్టు నిర్దోషిగా ప్రకటించిన ఒక రోజు తర్వాత గ్రేటర్ నోయిడాలోని లుక్సర్ జిల్లా జైలు నుంచి విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు. బుధవారం సాయంత్రం 7.20 గంటల ప్రాంతంలో కోలి జైలు నుంచి బయటకు వెళ్లినట్లు జైలు సూపరింటెండెంట్ బ్రిజేష్ కుమార్ ధృవీకరించారు. అయితే జైలు దగ్గరకు అతని కుటుంబ సభ్యులెవరూ రాలేదు. జైలు బయట ఉన్న మీడియాతో మాట్లాడటానికి అతను నిరాకరించాడు. 2006లో నోయిడాలోని సెక్టార్ 31లో వ్యాపారవేత్త మోనిందర్ సింగ్ పాంధర్‌కు చెందిన బంగ్లా (ఈ–5) వెనుక ఇంటి వెనుక భాగం, కాలువల నుంచి అస్థిపంజర అవశేషాలు దొరికాయి. నిఠారీ గ్రామంలో అనేక మంది పిల్లలు, మహిళల అదృశ్యం, హత్యలు దేశవ్యాప్తంగా ఆగ్రహాన్ని రేకెత్తించాయి. స్థానికంగా భయభ్రాంతులకు గురి చేశాయి. ఈ కేసులో సహ నిందితుడైన పాంధర్ 2023 అక్టోబర్ 20న విడుదలయ్యాడు. 15 ఏళ్ల బాలికపై అత్యాచారం, హత్య కేసులో పెండింగ్‌లో ఉన్న చివరి కేసులో కోలీని ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్. గవాయ్, న్యాయమూర్తులు సూర్యకాంత్, విక్రమ్ నాథ్‌లతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం నిర్దోషిగా విడుదల చేసింది. నేరాల హేయమైన స్వభావాన్ని, బాధితుల కుటుంబాల బాధను అంగీకరిస్తూనే, ప్రాసిక్యూషన్ నేరాన్ని నిరూపించడంలో విఫలమైందని ధర్మాసనం పేర్కొంది.

17న హసీనాపై నేర ట్రిబ్యునల్ తీర్పు

ఢాకా: బంగ్లాదేశ్‌లో విద్యార్థుల సారథ్యంలో గత ఏడాది జూలైలో మొదలైన నిరసనోద్యమాన్ని ఉక్కుపాదంతో అణచివేసి మానవత్వానికి వ్యతిరేకంగా కఠిన నిర్ణయాలు తీసుకున్నారన్న ఆరోపణలపై పదవీచ్యుత మహిళా ప్రధాని షేక్ హసీనాపై అంతర్జాతీయ నేర ట్రిబ్యునల్‌లో నమోదైన కేసులో తీర్పు 17వ తేదీన వెలువడనుంది. ట్రిబ్యునల్‌లో ముగ్గురు సభ్యుల ప్యానెల్ చైర్మన్ జస్టిస్ గోలమ్ మోర్తుజా మజుందార్ ఈ తీర్పును వెలువర్చనున్నారని గురువారం ప్రత్యేక కోర్టు హాలులో చీఫ్ ప్రాసిక్యూటర్ మొహమ్మద్ తజుల్ ఇస్లామ్ చెప్పారు. గత ఏడాది దేశవ్యాప్త నిరసనలన భద్రతాబలగాల సాయంతో దారుణంగా అణచివేసేందుకు హసీనా కుట్ర పన్నారని ఆయన ఆరోపించారు. జూలై 15 నుంచి ఆగస్ట్ 15వ దాకా ఉధృతంగా కొనసాగిన ఈ ఉద్యమాన్ని జూలై విప్లవంగా పరిగణిస్తున్నారు. ఆనాటి ఉద్యమంలో కనీసం 1,400 మంది ఉద్యమకారులు చనిపోయారని ఐక్యరాజ్యసమితి హక్కుల విభాగం ఒక నివేదిక ఇవ్వడం తెల్సిందే.

వందేమాతరం పాడనన్న టీచర్ సస్పెన్షన్

అలీఘడ్: ఉత్తరప్రదేశ్‌లోని ఓ పాఠశాల అసెంబ్లీలో వందేమాతరం పాడటానికి అభ్యంతరం చెప్పిన ఉపాధ్యాయుడిని అధికారులు సస్పెండ్ చేశారు. షాపూర్ కుతుబ్ ప్రాంతంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం ఈ సంఘటన జరిగింది. ఉదయం అసెంబ్లీ సమయంలో వందేమాతరం పాటను పాడటానికి ఉపాధ్యాయుడు షంసుల్ హసన్ అభ్యంతరం వ్యక్తం చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి రాకేష్ కుమార్ సింగ్ తెలిపారు. పాఠశాల అధికారుల నుంచి లిఖితపూర్వక ఫిర్యాదు మేరకు చర్యలు తీసుకున్నారు. ఆ సమయంలో హసన్ సహోద్యోగులతో కూడా అనుచితంగా ప్రవర్తించారని విచారణలో వెల్లడైందని అధికారులు తెలిపారు. ఉత్తరప్రదేశ్ అంతటా ఉన్న అన్ని పాఠశాలలు, విద్యాసంస్థల్లో వందేమాతరం పాడటాన్ని ముఖ్యమంత్రి ఆదిత్యనాథ్ తప్పనిసరి చేశారు.

ఆంధ్రుల చరిత్ర-సంస్కృతి గ్రంథ రచయిత ఖండవల్లి

ఖండవల్లి లక్ష్మీ రంజనం ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పనిచేసిన సమయంలో తెలుగు భాషకు, తెలుగు ప్రజలకు విశేష సేవలందించారు. ఆయన ఆచార్య పదవిని చేపట్టాక ఎంఏలో సంస్కృతం లేదా ద్రావిడ భాషల్లో ఏదో ఒకటి తప్పక ఎంచుకునేలా ఏర్పాటు చేశారు. తెలుగును ద్వితీయ భాష చేయడం కోసం అకడమిక్ కౌన్సిల్‌తో పోరాడి గెలుపొందారు. విద్యార్థుల్లో తెలుగంటే మన మాతృభాష అనే భావన కలిగేలా చేశారు. విద్యార్థులతో అనేక మంది కవులపై చర్చాగోష్ఠులు నిర్వహించి, వారిలో పరిశోధనాభిరుచి పెంపొందించడానికి ప్రయత్నించారు.

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

తెలంగాణ చరిత్ర

తెలంగాణ వైతాళికులు

ఖండవల్లి లక్ష్మీ రంజనం

మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ పరిపాలనా కాలంలో తెలుగు సాహిత్యానికి, చరిత్రకు ఖండవల్లి లక్ష్మీ రంజనం విశేష సేవ చేశారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఆచార్యుడిగా పనిచేసిన ఆయన విద్యార్థుల హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించారు. కర్తవ్య నిర్వహణలో అనునిత్యం అప్రమత్తంగా ఉండేవారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో తెలుగు భాషకు ప్రముఖ స్థానం లభించడం వెనుక ఆయన విశేష కృషి దాగి ఉంది. ఖండవల్లి లక్ష్మీ రంజనం 1908లో తూర్పు గోదావరి జిల్లా కొత్తపేట తాలూకాలోని బెల్లంపూడిలో జన్మించారు. బెల్లంపూడి సమీపంలోని ఊడుమూడులో ప్రాథమిక విద్య, అమలాపురంలో రెండో ఫారంను అభ్యసించారు. ఆయన తండ్రయిన సూర్యనారాయణ శాస్త్రి వరంగల్ మట్టెవాడలోని త్రిలింగాంధ్రాయుర్వేద కళాశాలలో సంస్కృత పండితుడిగా పని చేసేవారు. దీంతో లక్ష్మీ రంజనం కూడా వరంగల్ వచ్చి హన్మకొండ హైస్కూల్‌లో మెట్రిక్యులేషన్ పూర్తి చేశారు. 1924లో నిజాం కళాశాలలో బీఏ సంస్కృతం చదివి ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు. తర్వాత సిటీ కాలేజీలో ఇంగ్లిష్ టీచర్‌గా కొంత కాలం పనిచేశారు. 1936లో ఎంఏ(తెలుగు-సంస్కృతం)లో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులై ఉస్మానియా విశ్వవిద్యాలయంలో తెలుగు లెక్చరర్‌గా చేరారు. రాయప్రోలు సుబ్బారావు పదవీ విరమణ చేశాక ఆచార్య (ప్రొఫెసర్) పీఠాన్ని అధిష్ఠించారు.

ఖండవల్లికి విద్యార్థి దశ నుంచే ఆదిరాజు వీరభద్రరావు లాంటి పరిశోధకులతో, గోలకొండ పత్రికా సంపాదకులు సురవరం ప్రతాపరెడ్డి లాంటి ప్రజా సాహిత్య సేవకులతో, లోకనంది నారాయణ లాంటి సాహిత్య పోషకులతో పరిచయం ఏర్పడింది. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో రెక్టార్ కిషన్ చంద్ లక్ష్మీ రంజనానికి సహాయ సహకారాలు అందజేశారు. కొమర్రాజు లక్ష్మణరాయ గ్రంథాలు ఖండవల్లిని విశేషంగా ప్రభావితం చేశాయి. ఖండవల్లి 1936 నుంచే సాహిత్యసేవ ప్రారంభించారు. 'తెలుగుదుక్కి' శీర్షికతో వ్యాసాలు ప్రచురించారు. త్రివేణి లాంటి ఆంగ్ల పత్రికల్లో ఆధునిక కవిత్వం గురించి అనేక వ్యాసాలు రాశారు.

హైదరాబాద్‌లోని శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయం కార్యదర్శిగా రెండేళ్లపాటు పనిచేశారు. పుస్తకాల సేకరణ, చందాల కోసం తెలంగాణ అంతటా పర్యటించారు. వర్ధంతులు, జయంతులు ఎన్నో జరిపారు. ఆంధ్ర సారస్వత పరిషత్ సభ్యులుగా పనిచేసి దాని విస్తరణకు విశేష కృషి చేశారు. 'నిజాం రాష్ట్ర గ్రంథాలయ సంఘం' కార్యదర్శిగా కూడా పనిచేశారు. కొమర్రాజు వదిలిపెట్టిన 'విజ్ఞాన సర్వస్వం' పూర్తి చేయాలనే ఉద్దేశంతో కొందరు మిత్రులతో కలిసి గ్రంథావలోకనం, విషయ సేకరణ ప్రారంభించారు. 1940ల్లో రెండో ప్రపంచ యుద్ధ సమయంలో విద్యుద్దీపాలు లేనందున ఆముదం దీపాల వెలుతురులోనే తన కృషిని కొనసాగించారు. 1944 నాటికి 'విజ్ఞాన సర్వస్వం' పూర్తి చేయాలని భావించారు. ఇందుకోసం 'మహారాష్ట్ర జ్ఞాన కోశ్'ని ఆధారంగా తీసుకున్నారు. నాలుగైదు సంపుటాల విషయ సేకరణ చేశారు.

ముద్రణకు సిద్ధమైన ఆ సంపుటాలు చోరీకి గురికావడం వల్ల విజ్ఞాన సర్వస్వాన్ని ముద్రించడం సాధ్యపడలేదు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో సంస్కృతి గురించి పాఠాలు బోధించారు. దానికోసం చేసిన అధ్యయన ఫలితంగానే ఆంధ్రుల చరిత్ర -సంస్కృతి, ఆంధ్ర సాహిత్య చరిత్ర సంగ్రహం లాంటి గొప్ప గ్రంథాలను రచించారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక 'విజ్ఞాన సర్వస్వం' ప్రచురణ కోసం ప్రభుత్వం ద్వారా తిరిగి ప్రయత్నించారు. ఆంధ్ర సారస్వత పరిషత్ వ్యవస్థాపకులు బిరుదు వెంకట శేషయ్య, లోకనంది నారాయణ అంతకు ముందే ప్రయత్నించి విఫలమయ్యారు. మిత్రులు, అభిమానులు సహాయం చేస్తారనే నమ్మకంతో 1953లో బేతన భట్ల విశ్వనాథంతో కలిసి సంగ్రహ ఆంధ్ర విజ్ఞాన కోశ సమితి సంఘాన్ని స్థాపించారు. దీనికి మిమిడి పూడి వెంకట రంగయ్య చైర్మన్‌గా వ్యవహరించారు. ఈ సంఘం ద్వారా సంగ్రహ ఆంధ్ర విజ్ఞాన కోశం నాలుగు సంపుటాలను ప్రచురించారు.

ఖండవల్లి ఆంధ్ర రచయితల సంఘానికి అధ్యక్షులుగా పనిచేసి దాని తరపున సిద్ధేశ్వర చరిత్ర, ప్రసన్న రాఘవ నాట్య ప్రబంధం, సంస్కృతంలో అహోబిల పండితీయం (ఆంధ్ర వ్యాఖ్యా సహితం) ప్రచురించారు. ఓరియంటల్ కాలేజీని స్థాపించి 1958లో బీవోఎల్, డీవోఎల్ లాంటి ప్రాచ్యపట్టాలను విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేశారు. స్వామి వివేకానంద కమిటీ హైస్కూల్‌కు కార్యదర్శిగా పనిచేసి దాని భవనాన్ని నిర్మించారు. ఖండవల్లి ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పనిచేసిన సమయంలో తెలుగు భాషకు, తెలుగు ప్రజలకు విశేష సేవలందించారు. ఆయన ఆచార్య పదవిని చేపట్టాక ఎంఏలో సంస్కృతం లేదా ద్రావిడ భాషల్లో ఏదో ఒకటి తప్పకుండా ఎంచుకునేలా ఏర్పాటు చేశారు. తెలుగును ద్వితీయ భాష చేయడం కోసం అకడమిక్ కౌన్సిల్‌తో పోరాడి విజయం సాధించారు. పీహెచ్‌డీని ప్రవేశపెట్టారు. విద్యార్థుల్లో తెలుగంటే మన మాతృభాష అనే భావన కలిగేలా చేశారు. విద్యార్థులతో అనేక మంది కవులపై చర్చాగోష్ఠులు నిర్వహించి, పరిశోధనాభిరుచి పెంపొందించేందుకు కృషి చేశారు. మహాభారతం, నాటకాలు, కవులపై సదస్సులు నిర్వహించి వాటిని గ్రంథ రూపంలో తెచ్చారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం తరపున ఆంధ్ర మహాభారతాన్ని పునర్ముద్రించారు. తెలంగాణ మాండలికాల అధ్యయనానికి పథకాన్ని ప్రవేశపెట్టారు. ఆంధ్రదేశ చారిత్రక భూగోళం (ది హిస్టారికల్ జాగ్రఫీ ఆఫ్ ఆంధ్ర) రచనకు ప్రయత్నం చేశారు.

ఇల్లిందల సరస్వతీ దేవి

ఇల్లిందల సరస్వతీ దేవి తల్లిదండ్రులు కామరాజు వెంకట లక్ష్మమ్మ, వెంకటప్పయ్య. ఈమె తండ్రి వెంకటప్పయ్య 1928లో నందిగామ తహసీల్దార్‌గా పని చేశారు. అదే సంవత్సరంలో ఇల్లిందల సీతారామరావుతో పన్నెండేళ్ల వయస్సులో సరస్వతీ దేవికి వివాహం చేశారు. అప్పుడు ఆమె రెండో ఫారం చదువుతున్నారు. ఆమె హైదరాబాద్‌లోని స్టాన్లీ గర్ల్స్ హైస్కూల్‌లో మెట్రిక్యులేషన్ వరకు చదివారు. చిన్న వయస్సులోనే తల్లి కావడంతో పై చదువులు చదవలేకపోయారు. తీరిక వేళల్లో ట్రూ స్టోరీ మేగజీన్ లాంటి కథల పత్రికలను చదివి, జిజ్ఞాసతో వాటిని అధ్యయనం చేశారు. ఆమె భర్త సీతారామారావు ఎం.సి. చేసి, ఉస్మానియా విశ్వవిద్యాలయంలో విజ్ఞానశాస్త్ర ఉపన్యాసకులుగా పని చేసేవారు. ఆయన తన భార్యను ఎంతో ప్రోత్సహించారు. సరస్వతీ దేవి తన విజ్ఞానాన్ని మహిళలు, ప్రజల సేవకు వినియోగించింది.

ఆంధ్రయువతీ మండలి స్థాపన

ఆ రోజుల్లో తెలంగాణలో మహిళల పరిస్థితి దయనీయంగా ఉండేది. ముస్లింలు చాలా ముందంజలో ఉండేవారు. కానీ హిందువుల్లోని మధ్య తరగతి మహిళలు ఎంతో వెనుకబడి ఉండేవారు. ఉన్నత తరగతి స్త్రీల సంగతి చెప్పనక్కర్లేదు. సర్వసతీ దేవి విద్యార్థి దశ నుంచే 'ఆంధ్రమహిళా సభ' కార్యకలాపాల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించేవారు. మధ్యతరగతికి చెందిన హిందూ స్త్రీల కోసం, ముఖ్యంగా తెలుగువారి ప్రగతి కోసం ప్రత్యేకంగా ఒక సంస్థను నెలకొల్పాలని ఆమె భావించారు. యల్లాప్రగడ సీతాకుమారితో కలిసి 1934లో 'ఆంధ్రయువతీ మండలి'ని హైదరాబాద్‌లో స్థాపించారు. దీనికి రంగమ్మ ఓబుల్‌రెడ్డి అధ్యక్షురాలిగా వ్యవహరించారు. ఆంధ్రయువతీ మండలిని స్థాపించాక అందులో సభ్యులను చేర్చడం కష్టమైంది. నాటి కష్టాలను సరస్వతీ దేవి తన మాటల్లో ఇలా చెప్పారు. 'సభ్యులను చేర్చుకోవడానికి బయల్దేరేవాళ్లం. ఉన్నత కుటుంబాలకు చెందిన స్త్రీలు బయటకు వచ్చేవారు కాదు. సంస్థానాల రాణులు, జాగీర్దారిణీలు మాతో ముఖాముఖిగా మాట్లాడేవారు కాదు. పరదా వెనుక లీలగా కనిపిస్తూ చెలికత్తెల ద్వారా లేదా ఆయాలతో కబురు పంపేవారు. సభ్యత్వ జాబితాలో తమ పేర్లను బిరుదులతో సహా రాయాలని పదే పదే చెప్పేవారు. యువతీ మండలికి సురవరం ప్రతాపరెడ్డి అసతోమా సద్గమయ అనే నినాదాన్ని సూచించారు. నియమావళిని బూర్గుల రామకృష్ణారావు సిద్ధం చేశారు.' ఆంధ్రయువతీ మండలి కోసం సరస్వతీ దేవి పన్నెండేళ్ల పాటు శ్రమించారు. యువతీ మండలిలో కార్యదర్శి, ఉపాధ్యక్ష పదవులను నిర్వహించారు. బూర్గుల రామకృష్ణారావు భార్య అనంత లక్ష్మీదేవి అధ్యక్షురాలిగా ఉన్న సమయంలో 'ఆంధ్రయువతీ మండలి' కోసం బర్కత్‌పురాలో పెద్ద భవంతిని నిర్మించారు. ఇల్లిందల సరస్వతీ మండలిలో శాశ్వత సభ్యురాలు. ఈమె మండలి అభివృద్ధితోపాటు, భారత సంఘ సంక్షేమాల్లో సభ్యురాలిగా, బందిఖానాలు, ఆసుపత్రుల పర్యవేక్షకురాలిగా, శిశు సంక్షేమ సంఘ సభ్యురాలిగా ఎన్నో నూతన పథకాలను సూచించారు. ఆంధ్ర సారస్వత పరిషత్ నిర్వాహక సభ్యురాలిగా, శ్రీకృష్ణదేయరాయాంధ్ర భాషానిలయ నిర్వాహక సభ్యురాలిగా కొంత కాలం పాటు పనిచేశారు. దక్షిణ భారత హిందీ ప్రచార సభ హైదరాబాద్ శాఖకు నిర్వాహక సభ్యురాలిగా, ఉపాధ్యక్షులుగా కేంద్ర గ్రంథాలయ, శిశు శాఖ సభ్యురాలిగా ఆమె విశేష కృషి చేశారు.

సరస్వతీ దేవి రచనలు

ఆమె రచించిన మొదటి కథ, మొదటి వ్యాసం 1933లో 'గోలకొండ' పత్రికలో ప్రచురితమయ్యాయి. మహిళా, శిశు జనోద్ధరణ లక్ష్యంగా హైదరాబాద్‌లోని రేడియో కేంద్రానికి వ్యాసాలు, నాటికలు, కథలు రాశారు. జీవన సామరస్యం, నారీ జగత్తు, వెలుగు బాటలు, పండుగ బహుమతి, అక్కరకు వచ్చిన చుట్టం, ముత్యాల మనసు, పండుగ బహుమతి, జాతిరత్నాలు, బాలవీరులు మొదలైనవి ఆమె రచనలు. సరస్వతీ దేవి తల్లి వెంకట లక్ష్మమ్మ బ్రహ్మ సమాజ నాయకులైన దేశిరాజు పెదబాపయ్య సోదరి. కాబట్టి సరస్వతీ దేవికి చిన్నతనం నుంచే సంస్కరణ భావాలు అలవడ్డాయి. కానీ ఆమె ఇద్దరు పిల్లలు మరణించడంతో సనాతన సంప్రదాయాల పట్ల ఆసక్తి చూపారు. 1958లో ఆంధ్రప్రదేశ్ శాసనమండలి ఏర్పాటైనప్పుడు ఆమె చేసిన సంఘ సేవకు గుర్తుగా మండలిలో సభ్యత్వం లభించింది. సరస్వతీ దేవి తన రచనల్లో వర్తమాన సమస్యలను ప్రధానంగా చర్చించేవారు. 'నీలో చాలా శక్తి దాగి ఉంది. దాన్ని ఉపయోగించి ప్రకాశించడా నికి ప్రయత్నించు. మగవారిపై కోపం వద్దు, దేన్నీ యాచించవద్దు. సంపాదించుకోవాలి' అనే సూచన లు ఆమె రచనల్లో కన్పిస్తాయి. సరస్వతీ దేవి దాదా పు మూడు దశాబ్దాల పాటు రచనలు చేశారు.

మాదిరి ప్రశ్నలు

1. ఖండవల్లి లక్ష్మీ రంజనం ఎప్పుడు జన్మించారు?
   1) 1908 2) 1925
   3) 1910 4) 1945
2. నిజాం రాష్ట్ర గ్రంథాలయ సంఘం కార్యదర్శిగా పనిచేసిందెవరు?
   1) సురవరం ప్రతాపరెడ్డి
   2) ఆదిరాజు వీరభద్రరావు
   3) కొమర్రాజు లక్ష్మణరావు
   4) ఖండవల్లి లక్ష్మీ రంజనం
3. ఆంధ్రుల చరిత్ర-సంస్కృతి, ఆంధ్ర సాహిత్య చరిత్ర సంగ్రహం గ్రంథాలు ఎవరు రచించారు?
   1) కొమర్రాజు లక్ష్మణరావు
   2) ఆదిరాజు వీరభద్రరావు
   3) ఖండవల్లి లక్ష్మీ రంజనం
   4) సురవరం ప్రతాపరెడ్డి
4. సంగ్రహ ఆంధ్ర విజ్ఞాన సర్వస్వం కోశాన్ని ఎవరు రచించారు?
   1) ఖండవల్లి లక్ష్మీ రంజనం
   2) సురవరం ప్రతాపరెడ్డి
   3) కొమర్రాజు వెంకట లక్ష్మణరావు
   4) విశ్వనాథ సత్యనారాయణ
5. హైదరాబాద్‌లో ఆంధ్రయువతీ మండలిని ఏ సంత్సరంలో స్థాపించారు?
   1) 1942 2) 1934
   3) 1936 4) 1952
6. జాతిరత్నాలు, నారీ జగత్తు, జీవన సామరస్యం లాంటి రచనలు చేసింది ఎవరు?
   1) అనంత లక్ష్మీదేవి
   2) ఇల్లిందల సరస్వతీ దేవి
   3) ఎల్లాప్రగడ సీతాకుమారి
   4) సరోజినీ నాయుడు
7. ఆంధ్రయువతీ మండలి తొలి అధ్యక్షురాలిగా పనిచేసింది ఎవరు?
   1) ఎల్లాప్రగడ సీతాకుమారి
   2) ఇల్లిందల సరస్వతీ దేవి
   3) దుర్గాబాయి దేశ్‌ముఖ్
   4) రంగమ్మ ఓబులరెడ్డి
8. 'తెలుగుదుక్కి' శీర్షికతో వ్యాసాలు ప్రచురించింది ఎవరు?
   1) ఖండవల్లి లక్ష్మీ రంజనం
   2) ఇల్లిందల సరస్వతీ దేవి
   3) కొమర్రాజు వెంకట లక్ష్మణరావు
   4) విశ్వనాథ సత్యనారాయణ

సమాధానాలు

1) 1; 2) 4; 3) 3; 4) 1;
5) 2; 6) 2; 7) 4; 8) 1.

శీతల ప్రాంతాల్లో ఉపయోగించే ఉష్ణమాపకం?



పోటీ పరీక్షల ప్రత్యేకం

భౌతిక శాస్త్రం

ఉష్ణం

ఉష్ణం ఒక శక్తి స్వరూపం. ఇది ఎల్లప్పుడూ అధిక ఉష్ణోగ్రత ఉన్న వస్తువు నుంచి అల్ప ఉష్ణోగ్రత ఉన్న వస్తువు వైపు ప్రయాణిస్తుంది.

ప్రమాణాలు: ఎర్గ్, జౌల్, కెలోరీ

- ఒక వస్తువు ఉష్ణాన్ని అధ్యయనం చేసే శాస్త్రాన్ని 'కెలోరీమెట్రీ' అంటారు.
- వస్తువు నుంచి వెలువడే ఉష్ణరాశిని కొలవడానికి బాంబ్ కెలోరీ మీటర్‌ను వాడతారు.

ఉష్ణ ప్రసారం

అధిక ఉష్ణోగ్రత ఉన్న వస్తువు నుంచి అల్ప ఉష్ణోగ్రత ఉన్న వస్తువులోకి ఉష్ణం ప్రయాణించడాన్ని ఉష్ణ ప్రసారం అంటారు. ఇది మూడు పద్ధతుల్లో జరుగుతుంది.

- ఉష్ణ వహనం
- ఉష్ణ సంవహనం
- ఉష్ణ వికిరణం

ఉష్ణ వహనం:
ఒక పదార్థం లేదా వస్తువులోని కణాలు లేదా అణువులు ఎలాంటి స్థానాంతర చలనం చెందకుండా ఉష్ణప్రసారం జరగడాన్ని ఉష్ణ వహనం అంటారు.

ఉదాహరణ: అన్ని ఘన పదార్థాలు, ద్రవస్థితిలో ఉన్న పాదరసం.

ధర్మాలు:
- ఈ ప్రక్రియలో ఉష్ణ ప్రసారం ఆలస్యంగా జరుగుతుంది.
- ఉష్ణ ప్రసారం జరుగుతున్నప్పుడు కణాలకు ఎలాంటి స్థానభ్రంశం ఉండదు.
- ఈ పద్ధతిలో ఉష్ణప్రసారం జరుగుతున్నప్పుడు యానకం ఉష్ణోగ్రత పెరుగుతుంది.

ఉష్ణ సంవహనం:
ఒక వస్తువు లేదా పదార్థంలోని అణువులు లేదా కణాల స్థానాంతర చలనం వల్ల ఉష్ణప్రసారం జరిగే పద్ధతిని ఉష్ణ సంవహనం అంటారు.

ఉదాహరణ: అన్ని ద్రవ పదార్థాలు (పాదరసం మినహా), వాయు పదార్థాలు.

ధర్మాలు:
- ఈ ప్రక్రియలో కూడా ఉష్ణ ప్రసారం ఆలస్యంగా జరుగుతుంది.
- ఈ పద్ధతిలో కణాలు స్థానాంతరం చెందుతాయి.
- యానకం ఉష్ణోగ్రత పెరుగుతుంది.

అనువర్తనాలు:
- ఉష్ణ సంవహనం సూత్రం ఆధారంగా పొగ గొట్టాలు, పరిశ్రమల్లో చిమ్నీలు, వెంటిలేటర్లు మొదలైనవి పనిచేస్తాయి.
- భూ పవనాలు, సముద్ర పవనాలు అనేవి కూడా ఉష్ణ సంవహన ధర్మం ఆధారంగా ఏర్పడతాయి. పూర్వకాలంలో తెరచాపలను ఉపయోగించి సముద్ర పవనాల సహాయంతో సరుకులను రవాణా చేసి వ్యాపారం నిర్వహించేవారు. కాబట్టి ఈ సముద్ర పవనాలను వ్యాపార పవనాలు అంటారు.

ఉష్ణ వికిరణం:
యానకంతో నిమిత్తం లేకుండా ఉష్ణ ప్రసారం జరిగే పద్ధతిని ఉష్ణ వికిరణం అంటారు.

ఉదాహరణలు:
- సూర్యుడి నుంచి బయలుదేరిన కాంతి కిరణాలు శూన్యం ద్వారా ప్రసరిస్తూ భూవాతావరణ పొరల్లోకి ప్రవేశించి భూమికి చేరతాయి.
- ఈ విశ్వంలో నక్షత్రాల మధ్య ఉష్ణప్రసారం వికిరణ పద్ధతిలో జరుగుతుంది.
- మండుతున్న జ్వాలకు కొంత దూరంలో ఉన్న వ్యక్తి ఉష్ణశక్తిని వికిరణ రూపంలో పొందుతాడు.

ధర్మాలు:
- ఇది చాలా వేగంగా జరిగే ప్రక్రియ.
- ఈ పద్ధతిలో యానకం ఉష్ణోగ్రత స్థిరంగా ఉంటుంది.

గమనిక: ఉష్ణవహనం, సంవహన ప్రక్రియల్లో ఉష్ణ ప్రసారం చాలా మెల్లగా జరుగుతుంది. కానీ వికిరణ పద్ధతిలో కాంతి వేగానికి($3\times10^8\ ms^{-1}$) సమానమైన వేగంతో ఉష్ణ ప్రసారం జరుగుతుంది.

అనువర్తనాలు:
- ఒక పాత్రలోని వేడి ద్రవాన్ని స్టీలు చెంచాతో తిప్పినప్పుడు ఆ చెంచా వేడెక్కుతుంది. దీనికి కారణం ఉష్ణ వహన ప్రక్రియ.
- ఒక రాగి పాత్ర(ఉష్ణవాహక పదార్థం)లో వేడి ద్రవాన్ని నింపి చెక్క బల్ల(ఉష్ణబంధకం)పై ఉంచినప్పుడు ఆ ద్రవం ఉష్ణాన్ని పరిసరాల్లోని గాలికి కోల్పోయి చల్లబడుతుంది. అంటే ఉష్ణ సంవహన పద్ధతి ద్వారా వేడి ద్రవం తన ఉష్ణాన్ని కోల్పోయి చల్లారుతుంది.
- ఒకవేళ ఈ వేడి పాత్రను ఇనుప బల్లపై ఉంచినప్పుడు ఉష్ణ వహనం(ఇనుప బల్ల), ఉష్ణ సంవహనం(గాలి) పద్ధతుల ద్వారా ద్రవం చల్లారుతుంది.
- భూగోళం.. ఉష్ణ వహనం, ఉష్ణసంవహనం, ఉష్ణవికిరణం పద్ధతుల్లో వేడెక్కుతుంది.

థర్మాస్ ఫ్లాస్క్(శూన్యనాళిక ఫ్లాస్క్)

థర్మాస్‌ఫ్లాస్క్‌ను సర్ జేమ్స్ డివర్ అనే శాస్త్రవేత్త కనుగొన్నాడు. దీనిలో వేర్వేరు వ్యాసాలున్న రెండు గాజు నాళాలను ఒకదానిలో మరొకదాన్ని అమరుస్తారు. ఈ గాజు నాళాల అవతలి వైపు సిల్వర్ బ్రోమైడ్ అనే రసాయన పదార్థంతో పూత పూస్తారు. ఈ రెండు నాళాల మధ్యలో శూన్యం ఉండేట్లు చేసి వీటిని ఉష్ణబంధక పదార్థమైన ప్లాస్టిక్ డబ్బాలో అమర్చుతారు.

థర్మాస్‌ఫ్లాస్క్‌లో నింపిన వేడి ద్రవం ఉష్ణ వహనం, సంవహనం, ఉష్ణ వికిరణం అనే మూడు పద్ధతుల్లో కూడా ఉష్ణాన్ని కోల్పోదు. అందువల్ల కొంత సేపటి వరకు ద్రవం వేడిగా ఉంటుంది. అనంతరం ద్రవం ఉష్ణశక్తి యాంత్రిక శక్తిగా మారి క్రమంగా చల్లబడుతుంది.

గమనిక: వస్తువు ఉష్ణాన్ని కోల్పోవడం లేదా గ్రహించడం అనేది దాని స్వభావం, ఉపరితల వైశాల్యంపై ఆధారపడి ఉంటుంది.

- బావిలోని నీటి ఉపరితల వైశాల్యం కంటే చెరువులోని నీటి ఉపరితల వైశాల్యం ఎక్కువ. అందువల్ల చెరువు గ్రహించే, కోల్పోయే ఉష్ణరాశి ఎక్కువ.
- చలి ప్రదేశంలో ఉన్న జంతువులు శరీరాన్ని ముడుచుకోవడం ద్వారా తమలోని ఉష్ణాన్ని కోల్పోకుండా కాపాడుకుంటాయి.

పదార్థాలు - రకాలు

ఉష్ణాన్ని తమ ద్వారా ప్రసారం చేసే ధర్మం ఆధారంగా పదార్థాలను రెండు రకాలుగా వర్గీకరించవచ్చు. అవి..

ఉష్ణ వాహకాలు: ఈ పదార్థాల ద్వారా ఉష్ణ ప్రసారం జరుగుతుంది.

ఉదాహరణ: లోహాల్లో అత్యుత్తమ ఉష్ణవాహక పదార్థం వెండి. తర్వాత రాగి, అల్యూమినియం, ఇనుము, పాదరసం, ఉక్కు మొదలైనవి ఉత్తమ ఉష్ణ వాహకాలు.

ఉష్ణ బంధకాలు: ఈ పదార్థాల ద్వారా ఉష్ణ ప్రసారం జరగదు.

ఉదాహరణ: అత్యుత్తమ ఉష్ణబంధక పదార్థం వజ్రం. తర్వాత ప్లాస్టిక్ వస్తువులు, రబ్బరు, చెక్కదిమ్మె, దూది, దుస్తులు, కాగితం, థర్మోకోల్ మొదలైనవి ఉత్తమ ఉష్ణ బంధకాలు.

- వంటపాత్రల తయారీకి ఉష్ణ వాహక పదార్థాలను వాడతారు. వాటి పిడుల తయారీకి మాత్రం ఉష్ణ బంధక పదార్థాలను వినియోగిస్తారు.
- నీరు, గాలి అధమ ఉష్ణ వాహకాలు.
- మంచు, మానవ శరీరం మంచి విద్యుత్ వాహకాలు. కానీ ఉష్ణం దృష్ట్యా బంధక ధర్మాన్ని ప్రదర్శిస్తాయి.

ఉష్ణోగ్రత

ఒక వస్తువు ఉష్ణ తీవ్రత(చల్లదనం లేదా వెచ్చదనం)ను ఉష్ణోగ్రత అంటారు.

ప్రమాణాలు:
- సెల్సియస్ లేదా సెంటీగ్రేడ్ (°C)
- ఫారన్‌హీట్ (F)
- కెల్విన్- K(అంతర్జాతీయ ప్రమాణం)
- రేమర్
- రాంకైన్
- ప్రస్తుతం రేమర్, రాంకైన్ ప్రమాణాలను ఉపయోగించడం లేదు.
- సెంటీగ్రేడ్, ఫారన్‌హీట్, కెల్విన్ ప్రమాణాల మధ్య సంబంధం.

$$\frac{C-0}{100}=\frac{F-32}{180}=\frac{K-273}{100}$$

ఉష్ణ మాపకాలను స్తూపాకారంలో నిర్మించడం వల్ల వాటి సున్నితత్వం పెరిగి కచ్చితమైన రీడింగ్‌లను సూచిస్తాయి.

- సెల్సియస్‌లు, ఫారన్‌హీట్‌లు ఒకదానితో ఒకటి ఏకీభవించే రీడింగ్ – 40.

$C = F = x$ అనుకుంటే

$$\frac{C-0}{100}=\frac{F-32}{180}$$

$$\frac{x}{100}=\frac{x-32}{180}$$

$10x-320=18x$

$8x = -320$

$x = -40$

సెల్సియస్, కెల్విన్‌ల మధ్య సంబంధం:

$$\frac{C-0}{100}=\frac{K-273}{100}$$

$C= K -273$

$K = (C + 273)$ Kelvins

i) మంచు ఉష్ణోగ్రతను కెల్విన్‌లలో తెలిపినప్పుడు..

$= (°C+ 273)$

$= 0°C+273= 273K$

ii) నీటి ఆవిరి ఉష్ణోగ్రత 100°C, చంద్రుడిపై పగటి సగటు ఉష్ణోగ్రత 100°C అనుకుంటే అవి కెల్విన్‌లలో..

$= 100°C+ 273= 373$ K

iii) నీటి అసంగత వ్యాకోచ ఉష్ణోగ్రత 4°C అయితే కెల్విన్‌లలో..

$= °C+273$

$= 4°C+ 273$

= 277 Kelvins

iv) ఆరోగ్యవంతుడైన మానవుడి శరీర ఉష్ణోగ్రత 37°C అయితే కెల్విన్‌లలో..

$= °C+273$

$= 37°C+ 273$

= 310 Kelvins

v) పాల పాశ్చరైజేషన్ ఉష్ణోగ్రత 67°C. ఈ విలువ కెల్విన్‌లలో..

$K= °C+273$

$K= 67°C+ 273$

K= 340 Kelvins

vi) గది ఉష్ణోగ్రత(25°C) వద్ద ఒక పాత్రలో బంధించి ఉన్న వాయువులు –273°Cకు చల్లార్చినప్పుడు ద్రవాలుగా మారి పీడనం శూన్యమవుతుంది.

–273°C కెల్విన్‌లలో..

$K= °C+273$

$K= -273 + 273$

K= 0 Kelvin (పరమశూన్య ఉష్ణోగ్రత)

ఉష్ణమాపకాలు- రకాలు

ఒక వస్తువు ఉష్ణోగ్రతను కొలవడానికి ఉష్ణ మాపకాన్ని ఉపయోగిస్తారు. దీన్ని 16వ శతాబ్దంలో గెలీలియో కనుగొన్నాడు.

ఘన పదార్థ ఉష్ణ మాపకాలు

ఘన పదార్థాలను వేడిచేసినప్పుడు అవి వ్యాకోచిస్తాయి. ఈ సూత్రం ఆధారంగా ఈ ఉష్ణ మాపకాలు పనిచేస్తాయి. అయితే భిన్నమైన ఘన పదార్థాల ఉష్ణ వ్యాకోచాలు వేర్వేరుగా ఉంటాయి. కాబట్టి ఇలాంటి ఉష్ణ మాపకాలను ఉపయోగించి వస్తువుల ఉష్ణోగ్రతలను కచ్చితంగా కొలవడం సాధ్యం కాదు. అందువల్ల ఇలాంటి మాపకాల్ని ప్రస్తుతం ఉపయోగించడం లేదు.

ద్రవ పదార్థ ఉష్ణ మాపకాలు

ద్రవ పదార్థాలను వేడి చేసినప్పుడు వాటి ఘన పరిమాణాలు వ్యాకోచిస్తాయి. ఈ సూత్రం ఆధారంగా ద్రవ పదార్థ ఉష్ణమాపకాలు పనిచేస్తాయి. వీటిలో పాదరసం, ఆల్కహాల్ లేదా నీటిని ఉపయోగిస్తారు.

- శీతల ప్రాంతాల్లో వస్తువుల ఉష్ణోగ్రతలను కొలవడానికి ఉపయోగించే ఉష్ణమాపకాన్ని క్రయోమీటర్ (Cryometer) అంటారు. సాధారణంగా వీటిలో ఆల్కహాల్ ఉష్ణమాపకాలను ఉపయోగిస్తారు.
- నీటి విశిష్టోష్ణం ఎక్కువ ఉండి, ఆలస్యంగా వేడెక్కి, ఆలస్యంగా చల్లబడే గుణాన్ని కలిగి ఉండటం వల్ల వాహనాల రేడియేటర్లలో కూలెంట్ (శీతలీకరణి)గా నీటిని ఉపయోగిస్తారు. ద్రవ పదార్థ ఉష్ణమాపకాల్లో నీటికి బదులుగా పాదరసాన్ని ఉపయోగించడానికి కారణాలు..

పాదరసం	నీరు
పాదరసం సంకోచ, వ్యాకోచాలు పరస్పరం సమానంగా ఉంటాయి.	నీటి సంకోచ, వ్యాకోచాలు సమానంగా ఉండవు.
పాదరసం.. మాపకాల గోడలకు టుకోదు.	నీటి అణువులు మాపకాల గోడలకు అంఅంటుకుంటాయి.
స్వభావరీత్యా పాదరసం వెండిలా మెరుస్తుంది. అందువల్ల రీడింగ్‌లను కచ్చితంగా గుర్తించవచ్చు.	నీటికి రంగు ఉండదు. కాబట్టి రీడింగ్‌లను కచ్చితంగా కొలవడం సాధ్యం కాదు.
అన్ని ద్రవపదార్థాలతో పోల్చినప్పుడు పాదరసం విశిష్టోష్ణం కనిష్టం. కాబట్టి ఇది త్వరగా వేడెక్కి త్వరగా చల్లబడుతుంది.	నీటి విశిష్టోష్ణం అన్ని ద్రవపదార్థాల కంటే ఎక్కువ. అందువల్ల ఆలస్యంగా వేడెక్కి, ఆలస్యంగా చల్లారుతుంది.

భారత్‌లోని మొత్తం పట్టణ జనాభా?

1901 జనాభా లెక్కల ప్రకారం భారత్ మొత్తం జనాభాలో పట్టణ జనాభా 11.4 శాతంగా ఉంది. ఇది 2001 నాటికి 28.53 శాతానికి, 2011 నాటికి 31.6 శాతానికి పెరిగింది. స్వాతంత్ర్యానంతరం దేశ స్థూల జాతీయోత్పత్తిలో వ్యవసాయ రంగ వాటా క్రమంగా తగ్గగా పారిశ్రామిక, సేవారంగాల వాటా క్రమేణా పెరుగుతూ వెళ్లింది.

1941 తర్వాత ఢిల్లీ, ముంబై, కోల్‌కతా, చెన్నై లాంటి నగరాల్లో వృద్ధి అధికమైంది. ప్రపంచ వ్యాప్తంగా సాంకేతిక పరిజ్ఞానం ప్రజలకు అందుబాటులోకి వచ్చింది. తద్వారా భారత్‌లో ఆర్థికవృద్ధి అధికమవడంతో పాటు ప్రజల జీవన ప్రమాణాలు కూడా పెరిగాయి. పబ్లిక్ రంగంలో వృద్ధి కారణంగా పట్టణ ప్రాంతాల్లో ప్రజా రవాణా, రోడ్లు, నీటిసరఫరా, విద్యుత్ లాంటి అవస్థాపన సౌకర్యాలు మెరుగయ్యాయి.

స్వాతంత్ర్యానంతరం భారత్ ప్రధానంగా పేదరికం, నిరుద్యోగం, ఆర్థిక వెనుకబాటుతనం లాంటి సమస్యలను ఎదుర్కొంది. ఆర్థికాభివృద్ధిని వేగవంతం చేయడానికి అప్పటి ప్రధాని జవహర్‌లాల్‌నెహ్రూ సైన్స్ అండ్ టెక్నాలజీ రంగానికి అధిక ప్రాధాన్యం ఇచ్చారు. ఈ క్రమంలో మిశ్రమ ఆర్థిక వ్యవస్థను అవలంబించే భారత్‌లో ప్రైవేటు రంగం అభివృద్ధి చెందింది. దీని ఫలితంగా దేశంలో పట్టణీకరణ వేగవంతమైంది.

ప్రపంచబ్యాంకు - పట్టణీకరణ

ఆర్థికవృద్ధి ప్రక్రియలో పట్టణీకరణ భాగమని ప్రపంచబ్యాంకు పేర్కొంది. భారత ఆర్థికవ్యవస్థలో పట్టణ ప్రాంతాల భాగస్వామ్యం విస్మరించలేనిది. భారత్ ఆర్థిక ఉత్పత్తిలో నగరాల వాటాను 2/3గా ప్రపంచబ్యాంకు పేర్కొంది. పెరుగుతున్న జనాభాకు ఆశ్రయం కల్పించడం, నవకల్పనలు, సాంకేతిక పరిజ్ఞానం, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ఆకర్షించటం లాంటి అంశాల్లో భారత్‌లోని నగరాల పాత్రను ప్రపంచ బ్యాంకు ప్రశంసించింది. వచ్చే రెండు దశాబ్దాల కాలంలో పట్టణ జనాభా 377 మిలియన్ల (2011లో) నుంచి 590 మిలియన్లకు చేరుకోగలదని అంచనా వేస్తున్నారు. ఆర్థిక అవసరాల కారణంగా భారత్‌లోని గ్రామీణ జనాభా పట్టణ ప్రాంతాలకు వలస వెళ్తున్నారు. దీంతో భారత్‌లోని పట్టణాలు, నగరాలు వేగంగా విస్తరిస్తున్నాయని ప్రపంచబ్యాంకు పేర్కొంది. 2050 నాటికి భారత్‌తో పాటు చైనా, ఇండోనేసియా, నైజీరియా, అమెరికాలో పట్టణ జనాభా వృద్ధి అధికంగా ఉంటుందని ప్రపంచ బ్యాంకు పేర్కొంది.

ప్రపంచ పట్టణ జనాభా

ఒక అంచనా ప్రకారం 2011-50 మధ్యకాలంలో ప్రపంచ పట్టణ జనాభా 3.6 బిలియన్ల నుంచి 6.3 బిలియన్లకు పెరగనుంది. అభివృద్ధి చెందిన, చెందుతున్న దేశాల్లో జనాభా పెరుగుదల అధికంగా ఉంది. 2020 నాటికి ఆసియాలో సగం జనాభా, 2035 మధ్యనాటికి ఆఫ్రికాలో సగం జనాభా పట్టణ ప్రాంతాల్లో నివసిస్తుందని అంచనా వేస్తున్నారు. ఈ అంచనాల ప్రకారం 2011-30 మధ్యకాలంలో ప్రపంచ పట్టణ జనాభాలో 1.4 బిలియన్ల పెరుగుదల ఉండనుంది. ఈ మొత్తంలో చైనా వాటా 279 మిలియన్లు కాగా భారత్ వాటా 218 మిలియన్లుగా ఉంది. ప్రపంచ పట్టణ జనాభా పెరుగుదలలో భారత్ వాటా 15.5 శాతానికి పైగా ఉంటుందని ఐక్యరాజ్యసమితి 2012లో తెలిపింది.

పట్టణ జనాభా పెరుగుదలకు ముఖ్య కారణాలు

1. పట్టణ ప్రాంత జనాభాలో సహజ పెరుగుదల
2. గ్రామీణ ప్రాంతాలను పట్టణ ప్రాంతాలుగా తిరిగి వర్గీకరించడం
3. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణ ప్రాంతాలకు నికర వలసలు

ఉపాధి రహిత వృద్ధి

భారత్‌లో స్థూల దేశీయోత్పత్తి వృద్ధిరేటు అధికంగా నమోదవుతోంది. అయినప్పటికీ గ్రామీణ ప్రాంతాలు ఉపాధి రహిత వృద్ధిని చవిచూశాయి. గత దశాబ్దకాలంలో స్థూల దేశీయోత్పత్తి సగటు వార్షిక వృద్ధి 5 శాతానికి పైగా నమోదైంది. అదే సమయంలో ఉపాధివృద్ధిలో పెరుగుదల స్వల్పంగా ఉంది. 2004-05 నుంచి 2009-10 మధ్య కాలంలో వ్యవసాయరంగంలో 23.3 మిలియన్లు, తయారీ రంగంలో 4.02 మిలియన్ల మంది ఉపాధిని కోల్పోయారు. ఇతర రంగాల్లో కొత్తగా 1.74 మిలియన్ల మందికి ఉపాధి అవకాశాలు లభించాయి. 1999-2000, 2009-2010 గ్రామీణ, పట్టణప్రాంతాల్లో (గ్రామీణ మహిళలు మినహా) నిరుద్యోగిత రేటులో స్వల్ప తగ్గుదల నమోదైంది. అల్ప ఉద్యోగిత రేటు పట్టణ ప్రాంతాలతో పోల్చినప్పుడు గ్రామీణ ప్రాంతాల్లోనే ఎక్కువగా ఉంది. భారత్‌లోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని నిరుద్యోగిత రేటు శ్రామిక మార్కెట్ స్థితి, ఉపాధి అవకాశాలను కచ్చితంగా స్పష్టపరచడం లేదు. 2011లో ఎన్ఎస్ఎస్ఓ నిర్వహించిన సర్వే ప్రకారం పురుషులకు సంబంధించి గ్రామీణ ప్రాంతాల్లో 10 శాతం, పట్టణ ప్రాంతాల్లో 4.9 శాతం, మహిళలకు సంబంధించి గ్రామీణ ప్రాంతాల్లో 7 శాతం, పట్టణ ప్రాంతాల్లో 4.5 శాతం మంది అదనపు పని కోసం ఆసక్తి ప్రదర్శించారు. ఈ సర్వేలో శ్రామికుల్లో అనేక మంది ప్రస్తుతం చేస్తున్న పని ద్వారా తగినంత ప్రతిఫలం లభించడం లేదని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణ ప్రాంతాలకు వలసలు పెరిగాయి. 2005-06లో భారత ప్రభుత్వం ప్రారంభించిన జవహర్‌లాల్ నెహ్రూ జాతీయ పట్టణ రెన్యువల్ మిషన్ కింద కేంద్రీకృత ప్రణాళికలో భాగంగా మూడంచెల వ్యవస్థను ప్రవేశపెట్టారు. దీంతో గ్రామీణ పట్టణ సంబంధాలు మెరుగయ్యాయి.

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ ఎకానమీ

పట్టణ జనాభా

భారత్‌లోని మొత్తం పట్టణ జనాభాలో 2011 లెక్కల ప్రకారం మహారాష్ట్రకు 13.5 శాతం, ఉత్తర ప్రదేశ్‌కు 11.8 శాతం, తమిళనాడుకు 9.3 శాతం వాటా ఉంది. 2011లో పట్టణ ప్రాంతాల్లో 377 మిలియన్ల మంది నివసించగా, ఒక మిలియన్ జనాభాకు పైగా ఉన్న నగరాల్లో 43 శాతం మంది నివసిస్తున్నారు. 2001లో మిలియన్ జనాభా ఉన్న నగరాల సంఖ్య 35 ఉండగా, 2011 నాటికి 53కు పెరిగాయి. ఉత్తరప్రదేశ్, కేరళల్లో చెరో 7 నగరాలు, మహారాష్ట్రలో ఆరు నగరాలు ఉన్నాయి. 53 పట్టణ పరిధి కలిగిన ప్రాంతాల్లో మూడు అతిపెద్ద మెగా సిటీలు (పది మిలియన్లకు పైగా జనాభా ఉన్న ప్రాంతాలు)గా గ్రేటర్ ముంబై (18.4 మిలియన్లు), ఢిల్లీ (16.3 మిలియన్లు), కోల్‌కతా (14.1 మిలియన్లు)లు నిలిచాయి. జనాభా పరంగా చెన్నై 8.7 మిలియన్లు, బెంగళూరు 8.5 మిలియన్లు కలిగి ఉన్నాయి. పది మిలియన్ జనాభాపైగా ఉన్న నగరాల్లో జనాభివృద్ధి, 2001-2011 మధ్యకాలంలో తగ్గింది. గ్రేటర్ ముంబై పట్టణ పరిధి జనాభా వృద్ధి 1991-2001 మధ్య 30.47 శాతం కాగా, 2001-2011 మధ్య 12.05 శాతంగా నమోదైంది. ఇదే కాలానికి సంబంధించి ఢిల్లీ పట్టణ పరిధి జనాభివృద్ధి 52.24 శాతం నుంచి 26.69 శాతానికి తగ్గింది. కోల్‌కతాలో 19.60 శాతం నుంచి 6.87 శాతానికి తగ్గింది.

పట్టణీకరణ పెరగడానికి కారణాలు

- పట్టణీకరణ భారతీయ సమాజంలో సాధారణ లక్షణంగా కనిపిస్తుంది. పరిశ్రమల సంఖ్యలో వృద్ధి కారణంగా నగరాల సంఖ్య పెరిగింది. పారిశ్రామికీకరణ ఫలితంగా ప్రజలు ఉపాధి కోసం పారిశ్రామిక ప్రాంతాలకు తరలి వెళ్తున్నారు. ఫలితంగా పట్టణాలు, నగరాల సంఖ్య పెరుగుతోంది. పారిశ్రామికీకరణ ఉపాధి అవకాశాలను విస్తృతపరిచింది. దీంతో పట్టణ జనాభా పెరుగుతూ వెళ్తోంది.
- సామాజిక అంశాలైన విద్య, ఆరోగ్య సౌకర్యాల అందుబాటు, తాగునీరు, పారిశుద్ధ్య సౌకర్యాల లభ్యత కారణంగా గ్రామీణ ప్రాంత ప్రజలు పట్టణ ప్రాంతాలకు తరలివెళ్తున్నారు.
- గ్రామీణ ప్రజలు జీవనోపాధి కోసం వ్యవసాయ రంగంపైనే ఆధారపడాలి. భారత వ్యవసాయ రంగం రుతుపవనాలపై ఆధారపడి ఉంది. కరవు పరిస్థితులు, ప్రకృతి వైపరీత్యాల ప్రభావంతో వలసలు పెరిగాయి.
- సాంకేతిక పరిజ్ఞానం అందుబాటుతో పాటు మెరుగైన అవస్థాపనా సౌకర్యాల అందుబాటు కారణంగా సౌకర్యవంతమైన జీవనం సాగించవచ్చనే అభిప్రాయంతో గ్రామీణ ప్రజలు పట్టణ ప్రాంతాలకు వెళ్తున్నారు.
- ఒకవైపు పట్టణాలు, నగరాల సంఖ్య పెరుగుతుంటే, మరోవైపు గ్రామీణ సమాజం పట్టణ సంస్కృతిని అలవర్చుకుంటోంది. పట్టణ ప్రజల వాణిజ్య సంస్కృతిని అవలంబించడం గ్రామీణ సమాజంలో కనిపిస్తోంది. విద్యావ్యాప్తి కారణంగా అక్షరాస్యత రేటు పెరిగి, గ్రామీణ ప్రజల్లో ఆధునికత పెరిగింది.
- ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవడం.
- మహిళల్లో ఆలోచనా పరిజ్ఞానం పెరగడం.
- ఆధునిక రవాణా, సమాచార సౌకర్యాల పెరుగుదల.
- రాజకీయాల్లో క్రియాశీలకంగా పాల్గొనడం.
- బ్యాంకులు, అనేక విత్త సంస్థలు అందుబాటులో ఉండటం.
- గ్రామీణ వినియోగదారుల్లో అవగాహన పెరగడం.
- అధునాతన వస్తు ఉత్పత్తులకు డిమాండ్.
- భారతదేశంలో ఆర్థికాభివృద్ధిని వేగవంతం చేయడంలో భాగంగా పట్టణీకరణ లక్ష్యాన్ని పదకొండో ప్రణాళికలో ఎంచుకోవడం.
- సంస్కరణల అమలు కాలంలో ప్రైవేట్‌రంగ ప్రాధాన్యం పెరగడంతో పాటు ప్రైవేట్ రంగ పెట్టుబడులు అధికంగా పట్టణ ప్రాంతాల్లో కేంద్రీకృతమవడం.
- దేశవిభజన సమయంలో ప్రజల వలస.
- సహజంగా పట్టణ జనాభా పెరగటానికి మరణరేటు తగ్గుదలతోపాటు జననాల రేటు ఎక్కువగా ఉండటం కారణమైంది.

పట్టణీకరణ ప్రభావం

- ఆర్థిక, సాంఘిక, రాజకీయ, సాంస్కృతిక, పర్యావరణ అంశాలు పట్టణీకరణపై ప్రభావం చూపుతాయి. సామాజికంగా, సాంస్కృతికంగా మీడియా పట్టణీకరణను ప్రోత్సహిస్తోంది.
- పెద్ద నగరాల్లో చెత్త పెద్ద సమస్యగా నిలిచింది. వాయు, నీటి, ధ్వని కాలుష్యం లాంటి సమస్యలు పట్టణ ప్రజల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం కలుగజేస్తాయి.
- మురికివాడలు పెరగడంతోపాటు పేదరికం, నిరక్షరాస్యత, నిరుద్యోగం పెరిగి ప్రజల జీవన ప్రమాణం కుంటుపడుతుంది.
- అధిక పట్టణీకరణ కారణంగా నేరాల రేటు పెరుగుతోంది. నేరాల రేటు పెరుగదలకు పేదరిక నిర్మూలనలో ప్రభుత్వ వైఫల్యం కారణమవుతోంది.

పట్టణీకరణ ప్రయోజనాలు

- ఆర్థికవ్యవస్థలో వృద్ధిరేటు పెరుగుదల.
- వాణిజ్య కార్యకలాపాల్లో వృద్ధి.
- సాంఘిక, సాంస్కృతిక సమన్వయం (ఇంటిగ్రేషన్).
- సమర్థమైన సేవల అందుబాటు.
- వనరుల అభిలషణీయ వినియోగం.

Which file is responsible to start MS-Word?

MS - WORD

BANK EXAMS

COMPUTER AWARENESS

1. Which is not a font style?
1) Bold 2) Superscript
3) Italic 4) Regular
5) None of above

2. What is gutter margin?
1) Margin that is added to right margin when printing
2) Margin that is added to the left margin when printing
3) Margin that is added to the outside of the page when printing
4) Margin that is added to the binding side of page when printing
5) None

3. Landscape is?
1) A font style 2) Paper Size
3) Page Layout
4) Page Orientation
5) None

4. Typeface option will come under which menu?
1) Edit 2) View 3) Format
4) Tools 5) None of above

5. Background color on a document is not visible in?
1) Web layout view
2) Print Preview
3) Reading View
4) Print Layout view 5) None

6. What is a portion of a document in which you set certain page formatting options?
1) Page Setup 2) Section
3) Page 4) Document
5) None of above

7. Which of the following is not available on the Ruler of MS Word screen?
1) Tab stop box 2) Left Indent
3) Right Indent 4) Center Indent
5) None of above

8. Gutter position can be set in following positions
1) Left & Right 2) Left & Top
3) Left & Bottom
4) Left Only 5) None of above

9. What is the Short cut key for line break?
1) CTRL + Enter
2) Alt + Enter 3) Shift + Enter
4) Space + Enter
5) None of above

10. By pressing F12, which of following will happen?
1) Save As dialog box will open
2) Save dialog box will open
3) Open dialog box will open
4) Close dialog box will open
5) None of above

11. Which key will open an Open dialogue box?
1) F12 2) Alt + F12
3) Ctrl + F12 4) Shift + F12
5) None of above

12. How will MS Word will respond in repeated word ?
1) A Green wavy line under the repeated word
2) A Red wavy line under the repeated word
3) A Blue wavy line under the repeated word
4) A pink wavy lines under the repeated word
5) None of above

13. What is the use of "All Caps" feature in MS - Word?
1) It changes all selected text into Capital Letter
2) It adds captions for selected Image
3) It shows all the image captions
4) It changes some text into Capital Letter
5) None of above

14. Which file is responsible to start MS Word?
1) Winword.exe 2) Win.exe
3) Word.exe 4) Wordwin.exe
5) None of above

15. To keep track of different editions of a document which feature we will use?
1) Editions 2) versions
3) Tracks 4) Traces
5) None of above

16. Which is not a type of margin?
1) Top 2) Left 3) Right
4) Center5) None of above

17. What will be the use of Ctrl + J?
1) Insert Image
2) Insert Hyperlink
3) Align Justify
4) Search file 5) None of above

18. What shortcut will we use to align center?
1) Ctrl + A 2) Ctrl + E
3) Ctrl + D 4) Ctrl + B
5) None of above

19. Which shortcut will we use to make text Italic?
1) Ctrl + U 2) Ctrl + T
3) Ctrl + I 4) Ctrl + P
5) None of above

20. How to use Format Painter multiple times?
1) By Click on Lock Format Painter Icon
2) Format Painter cannot be use multiple times
3) By Double Click on the Format Painter Icon
4) By Double Click on the Format Painter Icon
5) None of above

21. What is place to the left of horizontal scroll bar?
1) Indicators 2) Split buttons
3) Tab stop buttons
4) View buttons
5) None of above

22. Where can you find the horizontal split bar on MS-Word screen?
1) On the top of vertical scroll bar
2) On the bottom of vertical scroll bar
3) On the left of horizontal scroll bar
4) On the right of horizontal scroll bar Comment on this question
5) None of above

23. Tabs stop position cannot be the following alignment?
1) Decimal Alignment
2) Center Alignment
3) Bar Alignment
4) Justify Alignment
5) None of above

24. What is the use of bookmarks?
1) To correct the spellings.
2) To jump to a specific location in the document
3) To ignore spelling mistakes
4) To save alignments as it is
5) None of above

25. Which feature is used to replace straight quotes with smart quotes as you type?
1) Auto Correct as you type
2) Auto Change as you type
3) Auto Ignore as you type
4) Auto Format as you type
5) None of above

26. Ctrl + D is short cut used for?
1) Open Dialogue Box
2) Font Dialogue Box
3) Save as Dialogue Box
4) Save Dialogue Box
5) None of above

27. Ctrl + G is shortcut for?
1) Open Find and Replace Dialog box with activating Goto Tab
2) Open Find and Replace Dialog box with activating Find Tab
3) Open Find and Replace Dialog box with activating Replace Tab
4) Open Goto Dialog box
5) None of above Comment on this question

28. Ctrl + H is short cut for?
1) Open Insert Dialog box activating Insert Hyper Link Tab
2) Open Find and Replace Dialog box with activating Go to Tab
3) Open Find and Replace Dialog box with activating Find Tab
4) Open Find and Replace Dialog box with activating Replace Tab
5) None of above

29. What can be searched by find?
1) Format 2) Characters
3) Symbol 4) All of above
5) None of above

30. On which page the header or the footer is printed by default?
1) On first page
2) on last page
3) on alternate page
4) Every page 5) None of above

31. Which of these toolbars allows changing of Fonts and their sizes?
1) Standard 2) Formatting
3) Options 4) Review
5) None of above

32. To spell check which function key you will press?
1) F5 2) F6 3) F7
4) F8 5) None of above

33. How to insert a sound file in word document?
1) From insert -> sound menu option
2) From insert -> object menu option
3) From insert -> subject menu option
4) From insert -> file menu option
5) None of above

34. How many maximum number of columns can be inserted in the word document?
1) 45 2) 50 3) 55
4) 65 5) None of above

35. What is smallest and largest available font on formatting toolbar?
1) Smallest 8 and Largest 70
2) Smallest 5 and Largest 72
3) Smallest 8 and Largest 72
4) Smallest 5 and Largest 70
5) None of above

36. Why drop cap is used in document?
1) To get all first character capital
2) To get all first character small
3) To begin a paragraph with a large dropped initial capital letter
4) To begin a paragraph with a large dropped initial small letter
5) None of above

37. What is Macro?
1) Small add-on programs that are installed afterwards if you need them
2) Type of high level programming language
3) Type of low level programming language
4) Small programs created in MS-Word to automate repetitive tasks by using VBA
5) None of above

38. Which among following can be a vertical separation between columns?
1) Margin 2) Header
3) Orientation 4) Gutter
5) None of above

39. To change the typeface of a document, we will choose following menu option:
1) Edit 2) View 3) Tools
4) Format 5) None of above

40. To auto fit the width of column:
1) Double click the left border of column
2) Double click the right border of column
3) Double click the column header
4) None of above
5) All the above

41. What is the default font size of a new Word document based on Normal template?
1) 8pt 2)10pt 3) 12pt
4)14pt 5) None of above

42. Which of following line spacing is invalid?
1) Single 2) Double
3) Triple 4) Multiple
5) None of above

43. Format painter tool can be found in?
1) Options toolbar
2) Standard toolbar
3) Formatting toolbar
4) Drawing toolbar 5) None

44. Which among following is correct extension of word files?
1) xls
2) doc
3) ppt
4) dcw
5) None of above

45. You can jump to the next column by?
1) Press Alt + Down-arrow
2) Clicking with your mouse on the next column
3) Both of above
4) None of above
5) Press Alt + 5 arrow

Key

1) 2; 2) 4; 3) 4; 4) 3; 5) 2;
6) 2; 7) 4; 8) 2; 9) 3; 10) 1;
11) 3; 12) 2; 13) 1; 14) 1; 15) 2;
16) 4; 17) 3; 18) 2; 19) 3; 20) 3;
21) 4; 22) 1; 23) 4; 24) 2; 25) 4;
26) 2; 27) 1; 28) 4 ;29) 4; 30) 4;
31) 2; 32) 3; 33) 2; 34) 1; 35) 3;
36) 3; 37) 4; 38) 1; 39) 4; 40) 2;
41) 3; 42) 3; 43) 2; 44) 2; 45) 3.